

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 24

మంగళవారం 16-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




277 కాదు.. 287

సన్‌రైజర్స్ కొత్త రికార్డు.. 25 పరుగుల తేడాతో బెంగళూరుపై గెలుపు - 14లో



మార్కెట్లకు యుద్ధ భయం

సెన్సెక్స్ 845 పాయింట్ల పతనం.. రూ. 5 లక్షల కోట్ల సంపద ఆవిరి - 15లో



భారీ ప్లాన్ అనగానే భయపడొద్దు

బృహత్ ప్రణాళికలు ప్రకటించిన ప్రతిసారీ భయపడాల్సిన పనిలేదని.. దేశ సమగ్రాభి వృద్ధే లక్ష్యమని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



న్యాయవ్యవస్థను తక్కువ చేసేందుకు..

న్యాయ వ్యవస్థను చులకన చేసేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని రిటైర్డ్ జడ్జీలు ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



ప్రధాని పదవి నుంచి తప్పుకుంటా

సింగపూర్ ప్రధానిగా 2 దశాబ్దాలపాటు కొనసాగిన లీ సీయన్ లూంగ్ మే 15న బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు తెలిపారు.

వివరాలు 6లో ▸





కృష్ణా జిల్లా గుడివాడలో మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

నా సంకల్పం చెదరదు

ఎవరెన్ని కుట్రలు పన్నినా బెదరను.. గుడివాడ మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్

వాళ్లు ఈ స్థాయికి దిగజారారంటే.. వాళ్లు ఓటమిని అంగీకరించినట్లే

10లో

- ప్రజలనే శ్రీకృష్ణుడి అండ ఉన్న అర్జునుడు.. మీ బిడ్డ జగన్.. నాపై ఒక రాయి విసిరినంత మాత్రాన యుద్ధాన్ని కౌరవులు గెలిచినట్లు కాదు
- పేదలకు మంచి చేయకూడదనేదే చంద్రబాబు ఫిలాసఫీ.. ఎన్టీఆర్‌ను దింపేసి కిలో రూ.2 బియ్యం రూ.5.20 చేసింది బాబే
- ఇంగ్లిష్ మీడియం వద్దన్నది.. ప్రభుత్వ బడులను పాడుబెట్టింది చంద్రబాబే
- పేదల ఇళ్లకు అడ్డుపడి సామాజిక సమతుల్యత దెబ్బతింటుందంటూ కోర్టుకెక్కారు
- సచివాలయాలు, వలంటీర్, ఆర్బీకేలు, విలేజ్ - అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, స్కూళ్లు, మహిళా పోలీసులు, డిజిటల్ లైబ్రరీలు.. ఇవీ మీ జగన్ ఏడు వ్యవస్థలు

> "మీ బిడ్డ జగన్ మీద ఒక రాయి విసిరినంత మాత్రాన ఎన్నికల కురుక్షేత్రంలో పెత్తందారుల ఓటమిని, పేదల ప్రభుత్వం గెలుపుని ఆపలేరు. ఇలాంటి దాడులతో నా సంకల్పం చెక్కు చెదరదు. వాళ్లు ఈ స్థాయికి దిగజారారంటే.. వాళ్లు ఓటమిని అంగీకరించారని అర్థం.
> - గుడివాడ సభలో సీఎం జగన్

రెట్టించిన ఉత్సాహంతో..

'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర

బ్రహ్మరథం పట్టిన ప్రజలు

కేసరపల్లి బస నుంచి మొదలైన 15వ రోజు బస్సుయాత్ర

సీఎం జగన్ ముఖంలో ఎప్పటిలాగే అదే చిరునవ్వుతో కూడిన ఆత్మవిశ్వాసం

మళ్లీ నువ్వే సీఎం అన్నా అంటూ నినదించిన జనవాహిని

- వివరాలు 11లో

దస్తగిరి కుమ్మక్కు డ్రామాలు



- వివేకా ఆస్తి పత్రాలను దొంగిలించాల్సిన అవసరం ఎవరికి ఉంది?
- క్లూస్ టీమ్‌కు లభించిన ఐదు వేలి ముద్రలు ఎవరివి?
- ఎన్నికల్లో లబ్ధికే చంద్రబాబు, షర్మిల, సునీత ఆరోపణలు
- దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి

3లో

డ్రామా అంటున్న వాళ్లు రాయితో కొట్టించుకోగలరా?



- చంద్రబాబు, పవన్‌ను నిలదీసిన వైఎస్సార్‌సీపీ నేత సజ్జల
- పవన్ కళ్యాణ్ రాయితో దాడి చేయించుకోగలరా? కత్తితో పొడిపించుకోగలరా?
- డ్రామాలాడాల్సిన అవసరం సీఎం జగన్‌కు లేదు
- డ్రామాలాడే నైజం చంద్రబాబుదే

2లో



పా'పాల' ధూళిపాళ్ల

వలసల గడ్డపై ప్రగతి వీచిక

జాతీయ పార్టీలకు ద్రవిడ స్వప్నం

- వివరాలు I, II, III, IVలో



రాష్ట్రంలో సమృద్ధిగా 'నైరుతి' వానలు

ఐఎండీ అంచనాల్లో వెల్లడి

భారత వాతావరణ విభాగం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చల్లటి కబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతు పవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాష్ట్రంలో సాధారణానికి మించి అధికంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ వానలు పంటలకు ఎంతో మేలు చేయనున్నాయి. అన్నదాతలకు ఊరట ఇవ్వనున్నాయి. కాగా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ఆగమనం ఎప్పుడనే విషయంపై మే నెల మధ్య నాటికి స్పష్టత రానుంది.

12లో

సీఎంపై హత్యాయత్నం కేసు

దర్యాప్తు ముమ్మరం

పదునైన రాయితోనే హత్యాయత్నం

వీడియో ఫుటేజీల ద్వారా పోలీసుల నిర్ధారణ



కాల్ డేటా, వీడియో రికార్డుల విశ్లేషణ

2లో

అదుపులో 60 మంది వరకు అనుమానితులు

అన్ని కోణాల్లో విచారణ.. 10 మంది తీరు సందేహాస్పదం

ఆగంతకుడి సమాచారం చెప్పినవారికి రూ.2 లక్షల బహుమతి

సున్నిత భాగాలపై తగిలితే సీఎంకు ప్రాణాపాయం ఉండేది

త్వరలోనే నిందితుడిని పట్టుకుంటాం: పోలీస్ కమిషనర్ టి.కె.రాణా

చదువులపై విషం కక్కిన

నారా వారి కూలీ

టీచర్లపై రామోజీ తాగుబోతు రాతలు

5లో

- మద్యం దుకాణాలకు కాపలా కాశారా?
- మరుగుదొడ్లు ఊడ్చారా?.. నిరూపించగలవా రామోజీ!
- మీ రమాదేవి స్కూల్లో.. మీ నారాయణ స్కూళ్లలో ఇలాగే చేయిస్తున్నారా రామోజీ?.. గత ప్రభుత్వంలో పిల్లలకే కాదు.. టీచర్లకూ మరుగుదొడ్లు లేవు
- ఇప్పుడు ప్రతి స్కూల్లోనూ స్టాఫ్‌కు ప్రత్యేక సదుపాయాలు
- అద్భుతంగా మారిన 45 వేల ప్రభుత్వ బడులు





రఘురామ కేసులో

స్టే ఎత్తేయండి

సుప్రీంకోర్టుకు సీబీఐ అభ్యర్థన

విచారణ వాయిదా వేసిన ధర్మాసనం

2 వారాల తర్వాత విచారణ చేపడతామని స్పష్టీకరణ

12లో

సీఎంపై హత్యాయత్నం కేసు
దర్యాప్తు ముమ్మరం

త్వరలోనే నిందితుడిని పట్టుకుంటాం: పోలీస్ కమిషనర్ టి.కె.రాణా



సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడ సింగ్ నగర్ డాబాకొట్ల సెంటర్‌లో జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సింగ్ నగర్‌లోని వివేకానంద పాఠశాల ప్రాంగణం నుంచే పదునైన రాయితో హత్యాయత్నానికి పాల్పడినట్టు వీడియో ఫుటేజీల ఆధారంగా నిర్ధారించారు. డాబా కొట్ల జంక్షన్ ప్రాంతంలో సీసీ టీవీ ఫుటేజీలు, ఆ ప్రాంతంలోని పలువురి సెల్ ఫోన్లలో వీడియో రికార్డులు, హత్యాయత్నం చేసిన సమయంలో ఆ ప్రాంతంలో కాల్ డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో కీలక సమాచారాన్ని పోలీసులు రాబట్టినట్టు సమాచారం. దాని ఆధారంగా కేసు దర్యాప్తును వేగవంతం చేశారు.

రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లపై ప్రత్యేక దృష్టి

ముఖ్యమంత్రిపై హత్యాయత్నం కేసులో విజయవాడ పోలీసులు పలువురు అనుమానితులను గుర్తించారు. పోలీసు రికార్డుల ప్రకారం నేర చరితులతోపాటు ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో వీడియో ఫుటేజీలు, కాల్ డేటా ఆధారంగా దాదాపు 60 మంది వరకు అనుమానితులను మ్యాపింగ్ చేశారు. వారిని పోలీసులు పిలిపించి అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. ఆ ప్రాంతంలో మాజీ ప్రజాప్రతినిధి వర్గంలో క్రియాశీలకంగా వ్యవహరించే రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్ ముఠా సభ్యులు, ఇతర అసాంఘిక శక్తులపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు రెండు రోజుల ముందు నుంచి వారి కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. అనుమానితులు ఏయే ప్రాంతాల్లో సంచరించింది.. వారి ఫోన్ల నుంచి ఎవరెవరికి కాల్స్ చేశారు.. గ్రూప్ కాల్స్ ఏమైనా మాట్లాడారా అనే కోణాల్లో సమాచారాన్ని క్రోడీకరించారు. ఆ వివరాల ఆధారంగా అనుమానితులను పలు కోణాల్లో ప్రశ్నించారు. వారు చెప్పిన సమాధానాలను కాల్ డేటా విశ్లేషణతోపాటు ఆ ప్రాంతంలోని వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు చెప్పిన వివరాలతో సరిపోలుస్తున్నారు. ఆ విధంగా పిలిపించి విచారించిన దాదాపు 60మందిలో ఓ పదిమంది తీరు సందేహాస్పదంగా ఉన్నట్టు గుర్తించారు. వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

డాబా కొట్ల సెంటర్‌నే ఎందుకు ఎంపిక చేసుకున్నారో..

సీఎం జగన్‌పై హత్యాయత్నానికి డాబా కొట్ల జంక్షన్ ప్రాంతాన్నే ఎందుకు ఎంపిక చేసుకున్నారనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తద్వారా ఈ కేసును ఛేదించాలని భావిస్తున్నారు. వివేకానంద స్కూల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో యాత్ర సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఆగంతుకుడికి ముందే తెలుసు. ఆ స్కూల్ ప్రాంగణంలో మాటు వేసి హత్యాయత్నానికి పాల్పడిన వెంటనే మాకినేని బసవపున్నయ్య స్టేడియం నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఉండటం వల్లే డాబాకొట్ల ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నారని ఇప్పటికే పోలీసులు ఒక అంచనాకు వచ్చారు. ఆ ప్రాంతంపై ఆగంతకుడికి పూర్తి పట్టు ఉండటంతో ఆ ప్రాంతానికి లేదా ఆ సమీప ప్రాంతానికి చెందిన వ్యక్తి అయ్యుండొచ్చని భావిస్తున్నారు. ఆ ప్రాంతంలోని తన ఇంటికి లేదా తనకు ఆశ్రయం ఇచ్చేవారి ఇంటికి సులువుగా చేరుకుని పోలీసుల కళ్లు కప్పవచ్చనే ధీమా కూడా ఉండి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అందుకే సింగ్ నగర్‌తోపాటు ఆ పరిసర ప్రాంతాల్లోని రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లు, ఇతర అసాంఘిక శక్తులపై పోలీసులు దృష్టి సారించారు. వారిలో రాజకీయ పార్టీల్లో క్రియాశీలకంగా వ్యవహరించేవారు, ప్రత్యర్థి పార్టీ వర్గీయులతో ఘర్షణ పడ్డ చరిత్ర ఉన్నవారు, గంజాయి తదితర వ్యసనాలకు బానిసైనవారు.. ఇలా పలు కోణాల్లో అనుమానితులను గుర్తించి విచారించే ప్రక్రియను వేగవంతం చేశారు.

సమాచారమిస్తే రూ.2లక్షల బహుమతి

ముఖ్యమంత్రిపై హత్యాయత్నానికి పాల్పడిన ఆగంతుకుడి సమాచారం అందిస్తే రూ.2లక్షల నగదు బహుమతి అందిస్తామని విజయవాడ పోలీసులు సోమవారం ప్రకటించారు. ఆగంతకుడికి సంబంధించిన సమాచారం/వీడియో, సెల్‌ఫోన్ ఫుటేజీ అందించినా, హత్యాయత్నాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షులు ముందుకు వచ్చి సమాచారమిచ్చినా ఈ బహుమతి అందిస్తామని తెలిపారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఆగంతకుడి సమాచారాన్ని నేరుగా లేదా ఫోన్/వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చన్నారు.

సమాచారం అందించేందుకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

కంచి శ్రీనివాసరావు, డీసీపీ
9490619342

ఆర్. శ్రీహరిబాబు, ఏడీసీపీ, టాస్క్‌ఫోర్స్: 9440627089

సున్నిత భాగాల్లో తగిలి ఉంటే సీఎంకు ప్రాణాపాయం

విజయవాడ పోలీస్ కమిషనర్ రాణా

సీఎం జగన్‌కు సున్నిత భాగాల్లో రాయి తగిలి ఉంటే ప్రాణాపాయం జరిగి ఉండేదని విజయవాడ పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. దాడి చాలా బలంగా జరిగింది కాబట్టే సీఎంతోపాటు మాజీ మంత్రి వెలంపల్లికీ గాయమైందన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో రాణా సోమవారం మీడియాతో మాట్లాడారు. దాడికి సంబంధించి అన్ని ఆధారాలూ సేకరిస్తున్నామన్నారు. సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్, గంగానమ్మ గుడి మధ్య ఉన్న ఖాళీ స్థలం నుంచి ఒక వ్యక్తి రాయితో దాడి చేసినట్లు గుర్తించామన్నారు. చేతికి సరిపడినంత రాయితో ఈ దాడి చేశారని తెలిపారు. ఇందులో ఒక్కరే పాల్గొన్నారా, సమూహం ఉందా అనే అంశంపై విచారణ చేస్తున్నామన్నారు. సీఎం సెక్యూరిటీ కోసమే ఘటన జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. సీఎం పర్యటన ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్లు, నెట్‌వైర్లు ఉన్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో తొలగించామని, మరికొన్ని చోట్ల సాధ్యం కాలేదన్నారు. దర్యాప్తునకు 8 బృందాలను నియమించినట్టు తెలిపారు. 60 మందిని విచారించినట్టు వెల్లడించారు. కొందరిపై అనుమానం ఉందని, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని చెప్పారు. సీఎం పర్యటనకు 1,480 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారని, రూట్ మ్యాప్ ప్రకారం బందోబస్తులో పాల్గొన్నట్టు తెలిపారు. అందులో 40 రోప్ పార్టీలుంటే, 20 రోప్ పార్టీలు సీఎం బస్సు చుట్టూ ఏర్పాటు చేశామన్నారు.

సమగ్ర నివేదికను అందజేయండి

విజయవాడ సీపీ రాణా, ఐజీ రవిప్రకాష్‌కు సీఈవో మీనా ఆదేశం


దర్యాప్తు వివరాలను సీఈవోకు వివరిస్తున్న విజయవాడ సీపీ రాణా

సాక్షి, అమరావతి : సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం ఘటనకు సంబంధించిన కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముఖేష్‌కుమార్ మీనా నగర సీపీ కాంతిరాణా టాటా, ఐజీ రవిప్రకాష్‌ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో సోమవారం వారిద్దరితో సమావేశమై ఘటనకు సంబంధించిన పూర్వాపరాలపై సమీక్షించారు. 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో ఇలాంటి దుర్ఘటన ఎలా జరిగింది? పూర్తిస్థాయిలో బందోబస్తు ఉన్నా నిందితుడు ఎలా దాడి చేయగలిగాడు.. తదితర విషయాలపై పోలీస్ అధికారులతో మీనా సమీక్షించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే అదుపులోకి తీసుకున్న కొంతమంది నిందితుల విచారణ ఏ విధంగా సాగుతోంది? ఆ విచారణలో బయటపడిన విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసి సమగ్ర నివేదికను అందజేయాలన్నారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని.. అందుకు తగ్గట్లుగా రాష్ట్రస్థాయిలో తీసుకున్న చర్యలను మీనా వాకబు చేశారు. ఇక ఈ దుర్ఘటనకు సంబంధించిన పూర్వాపరాలు, దర్యాప్తు ప్రగతిని వీడియో విజువల్స్, ఫొటోల ద్వారా కాంతిరాణా టాటా సీఈఓకు వివరించారు.

దాడులు చేస్తే ఉన్నత పదవులిస్తామన్న లోకేశ్

వైఎస్సార్‌సీపీ నేత, ఎంపీ మిథున్‌రెడ్డి



మలికిపురం: వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు చేస్తే ఉన్నత పదవులు ఇస్తామని టీడీపీ నేతలకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రత్యేక ఆఫర్లు ఇచ్చారని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో సోమవారం జరిగిన రాజోలు నియోజకవర్గస్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీది హింసాత్మక ధోరణి అని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా సీఎం జగన్ ఎప్పుడూ అలా మాట్లాడలేదని చెప్పారు. సీఎం జగన్ సభలకు జనం పోటెత్తుతున్నారని, ఇరుకుసందుల్లో పెడుతున్నా చంద్రబాబు సభలకు జనం కరువవుతున్నారని తెలిపారు. అందుకే జగన్‌పై అక్కసుతో దాడిచేశారన్నారు. జగన్‌కు తగిలిన వస్తువు పక్కనే ఉన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కంట్లో తగిలిందంటే దాడి ఎంత ప్రణాళికాబద్ధంగా చేశారో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. జగన్‌ని హత్యచేయాలనే ఈ దాడి చేశారని, దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరగాలని పేర్కొన్నారు. జగన్‌పై దాడి నేపథ్యంలో 18న రావులపాలెంలో జరగాల్సిన సిద్ధం సభ వాయిదా పడిందని, 19న కాకినాడ రూరల్‌లో జరిగే సభకు అందరూ తరలి రావాలన్నారు. వైఎస్సార్‌సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు, జిల్లా గ్రీవెన్స్ సెల్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్ పాల్గొన్నారు.

పన్నుల సిబ్బందికి ఐసీఏఐ సహకారం

ఐసీఏఐ కార్యదర్శి జయకుమార్ భాత్రా

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): వాణిజ్య పన్నుల శాఖ సిబ్బందికి శిక్షణ, సాంకేతిక నైపుణ్యం మెరుగుదలకు ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) శిక్షణ, సలహాలు ఇచ్చేలా ఒప్పందం కుదిరిందని ఆ సంస్థ కార్యదర్శి జయకుమార్ భాత్రా చెప్పారు. వాణిజ్యపన్నుల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐసీఏఐ మధ్య రెండేళ్ల కాలానికి ఈ ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. విజయవాడలో సోమవారం జరిగిన ఐసీఏఐ, వాణిజ్యపన్నుల శాఖ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఒప్పందంలో భాగంగా వాణిజ్యపన్నుల శాఖకు సాంకేతిక సహాయం, మానవవనరుల అభివృద్ధి, పరిశోధన, విధాన నిర్ణయాల్లో సలహాలను ఇస్తున్నట్లు చెప్పారు. జీఎస్టీ చైర్మన్ సుశీల్ కుమార్ గోయల్ మాట్లాడుతూ ఐసీఏఐ మౌలిక వసతులు, సుశిక్షిత నిపుణుల సహాయ సహకారాలు పన్నులశాఖకు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్ మాట్లాడుతూ ఆడిటర్లు, పన్నులశాఖ ఉద్యోగుల ఉమ్మడి లక్ష్యం పన్ను చెల్లింపుదారులకు చట్టం పట్ల అవగాహన కల్పించి, చెల్లించాల్సిన పన్నును చెల్లించేలా చేయడమేనన్నారు. ఇప్పటికే డివిజన్, రాష్ట్రస్థాయిల్లో ట్రేడ్ అడ్వైజరీ కమిటీల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టామన్నారు. పన్ను చెల్లింపుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

డ్రామా అంటున్న వాళ్లు రాయితో కొట్టించుకోగలరా?

- చంద్రబాబు, పవన్‌ను నిలదీసిన వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల
- పవన్ కళ్యాణ్ రాయితో దాడి చేయించుకోగలరా? కత్తితో పొడిపించుకోగలరా?
- సీఎం జగన్‌కు ప్రజాదరణ గతంలో కంటే మిన్నగా పెరిగింది
- దీంతో విపక్షాలు వణుకుతున్నాయి
- ఎన్నికల తర్వాత విపక్షాలకు పుట్టగతులుండవని భయపడుతున్నాయి
- డ్రామాలాడే నైజం చంద్రబాబుదే
- అలిపిరి ఘటన తర్వాత చేతికి కట్టుతో చంద్రబాబు ఆర్నెల్లు ప్రచారం చేసుకున్నారు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిని డ్రామా అంటున్న వారెవరైనా రాయితో కొట్టించుకోగలరా అంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు. పవన్ తన అభిమానులతో రాయితో కొట్టించుకోగలరా? కత్తితో పొడిపించుకోగలరా? అని ప్రశ్నించారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం జగన్‌కు వస్తున్న ప్రజా స్పందనను చూసి టీడీపీ, ఇతర ప్రతిపక్షాలు వణికిపోతున్నాయని, ఎన్నికల తర్వాత వాటికి పుట్టగతులుండవని భయపడుతున్నాయని చెప్పారు. సజ్జల రామకృష్ణారెడ్డి సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌పై దాడి యాదృచ్ఛికంగా జరిగింది కాదని, దాని వెనుక నేపథ్యం ఉంది కాబట్టే.. ఆ దాడి చేయించింది టీడీపీనే అంటూ తాము ఆరోపించామన్నారు. ఈ వ్యవహారంలో సంబంధం లేదని టీడీపీ వివరణ ఇచ్చుకోవచ్చు లేదంటే సీబీఐ దర్యాప్తు కోరవచ్చని, విచారణ వేగంగా చేయాలని డిమాండ్‌చేయవచ్చని, అలాకాకుండా ఇది డ్రామా అనటం సరికాదని చెప్పారు. దాడి నింద తమపై పడుతుందని చంద్రబాబు భయపడుతున్నారన్న విషయం ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. సీఎం జగన్‌పై దాడి విషయంలో ప్రతిపక్షాలు ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతున్నాయని చెప్పారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి బెంబేలెత్తిపోయిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మతి లేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

విజయవాడలో సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్‌లో ఈనెల 13న రోడ్ షో నిర్వహిస్తున్న సీఎం జగన్‌పై 8.15 గంటల ప్రాంతంలో దాడి జరిగితే.. రక్తం ధారగా కారుతున్నా ఓర్చుకుని, ప్రాథమిక చికిత్స చేయించుకుని ఆ తర్వాత రెండు గంటల పాటు బస్సుయాత్రలో పాల్గొన్నారని వివరించారు. ఎక్కడా గాయం చూపుతూ ప్రజల దగ్గర సానుభూతి పొందే ప్రయత్నం చేయలేదని చెప్పారు. వైద్యుల సూచనపై ఆ తర్వాతి రోజు విశ్రాంతి తీసుకున్నారని వివరించారు. అదే దాడి చంద్రబాబుపై జరిగి ఉంటే దాన్ని తన ప్రచారానికి వాడుకునేవారని చెప్పారు. డ్రామాలాడే నైజం చంద్రబాబుదేనన్నారు. గతంలో అలిపిరి ఘటన జరిగినప్పుడు చంద్రబాబు చేతికి కట్టువేసుకుని సానుభూతి పొందేందుకు ఆర్నెల్లు ప్రచారం చేసుకున్నారని తెలిపారు. 2019లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో జగన్‌ను కత్తితో పొడిచినప్పుడు కూడా షర్ట్ రక్తంతో తడిసిపోయిందని, దాన్ని మార్చుకుని ఫ్లైట్ ఎక్కి హైదరాబాద్‌కు చేరుకుని, చికిత్స తీసుకున్నారేగానీ ఎక్కడా ఆయనకు తగిలిన గాయం గురించి మాట్లాడలేదని గుర్తు చేశారు. డ్రామా ఆడాల్సిన అవసరం సీఎం జగన్‌కు ఏమాత్రం లేదని చెప్పారు. గతంలోకంటే మిన్నగా ఆయనకు ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. అదే సమయంలో ప్రతిపక్షాలకు ఆదరణ తగ్గిపోయిందని, ఎక్కడికి వెళ్లినా దడి కట్టుకుని సమావేశాలు పెట్టుకుంటున్నారని దెప్పిపొడిచారు.


గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరుగుతున్న శ్రీ మహారుద్ర సహిత రాజ శ్యామల సహస్ర చండీ యాగ మహోత్సవంలో సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. జగన్ రెండోసారి అధికారం చేపట్టాలన్న ప్రజల ఆకాంక్ష దేవుడి కటాక్షంతో నెరవేరుతుందన్నారు.

జనాదరణ చూసి ఓర్వలేకే సీఎంపై హత్యాయత్నం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు ఆయనపై హత్యాయత్నం చేశారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. ఆయన సోమవారమిక్కడ మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుది ఓ రకమైతే.. లోకేశ్ ఇంకో రకమని ఎద్దేవా చేశారు. సానుభూతి కోసం జగన్ రాళ్ల దాడి చేయించుకున్నారని చంద్రబాబు విమర్శించడం అర్థరహితమన్నారు. సీఎం జగన్‌పై దాడిని దేశ నాయకులంతా ఖండించారని, చంద్రబాబు మాత్రం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేది జగన్ మాత్రమే..

చంద్రబాబు ఎన్‌డీఏ కన్వీనర్‌గా ఉన్నప్పుడు దేశంలోని 55 ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేశాడని, ఇప్పుడు బీజేపీతో చేతులు కలిపి స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేట్‌పరం చేయడానికి వెనుకాడడని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తొలి నుంచి వ్యతిరేకిస్తున్నది సీఎం జగనే అని, కార్మికుల ఉద్యమానికి మద్దతిస్తున్నది వైఎస్సార్‌సీపీయేనని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌ని కాపాడేది సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని తెలిపారు. 2014–19 మధ్య చంద్రబాబు ఎన్ని పరిశ్రమలు తీసుకొచ్చారో చెప్పాలన్నారు. ఈ ఐదేళ్లలో సీఎం జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో 4 పోర్టులు, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఇండస్ట్రీయల్ కారిడార్లు, ఐటీ పరిశ్రమలు, ఫిషింగ్ హార్బర్లు తీసుకువచ్చిందన్నారు.


ఓట్ల రూపంలో కూటమిపై ప్రజాదాడి

- సీఎం జగన్‌పై హత్యాయత్నం అమానుషం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

జగ్గయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై గెలవలేకపోతున్నామనే అక్కసుతో హత్యాయత్నానికి పాల్పడ్డారని, మే 13న జరిగే ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో ఓట్ల రూపంలో కూటమి నేతలపై ప్రజాదాడి జరగనుందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో సోమవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర నివాసంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు అపూర్వ ఆదరణ వస్తుండటంతో కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఓటమి భయంతోనే ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సీఎం జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడటం దారుణమని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో కృషి చేశారని, గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా చేయలేదని చెప్పారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. బీసీ విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు కూడా సీఎం జగన్ అండగా నిలుస్తున్నారని, అభివృద్ధి, పిల్లల భవిష్యత్తు కావాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఇచ్చే తీర్పుతో ప్రతిపక్షాలు చతికిలబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సీఎం జగన్ వెంటనే బీసీలు ఉన్నారని స్పష్టంచేశారు. సామినేని ఉదయభాను మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషి చేశారని, రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారని తెలిపారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా బీసీలకు చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్సీలు పోతుల సునీత, చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ 'మేమంతా సిద్ధం' సభలకు వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలకు వణుకుపుట్టి హత్యాయత్నాలు, భౌతిక దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌పై హత్యాయత్నాన్ని ఎల్లో మీడియా, సామాజిక మాధ్యమాల్లో అవహేళన చేసేలా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేబిరాణి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పిల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆ రాయి ప్రజల గుండెలపై పడినట్లే..



- సీఎం జగన్‌పై హత్యాయత్నానికి రాష్ట్రం నివ్వెరపోయింది
- అశాంతి, అల్లర్లు, హింసను ప్రోత్సహిస్తున్న చంద్రబాబు
- సింపతీ కోసం డ్రామాలాడాల్సిన దుస్థితి వైఎస్సార్‌సీపీకి లేదు
- రాజకీయ పరిజ్ఞానంలేని తిక్కలోడు పవన్‌కళ్యాణ్
- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడ నడిబొడ్డున జరిగిన హత్యాయత్నంతో రాష్ట్రం నివ్వెరపోయిందని, ఆయనపై విసిరిన రాయి తెలుగుప్రజల గుండెలపై పడినట్లేనని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌పై దాడి జరిగి ఆయన నుదిటికి బలమైన గాయం తగిలితే.. ఇది ఎన్నికల ముందు సింపతీ కోసం డ్రామా అని చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ విమర్శించడాన్ని ఖండించారు. దేశంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల్లోకెల్లా అత్యంత ప్రజాదరణ, ప్రజాబలం ఉన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఆయనకు సింపతీ అవసరమేంటని ప్రశ్నించారు. జగన్ అధికారంలో ఉన్నంతకాలం ఆర్థికంగా దెబ్బతినిపోతామని భావించి చంద్రబాబు వర్గీయులు తమ నాయకుడిపై కక్షగట్టి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. 175 స్థానాల్లో గెలుస్తామనే ప్రగాఢమైన విశ్వాసం తమకుందని చెప్పారు. కూటమి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఎద్దేవా చేశారు. జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఆయన్ని హత్యచేయడానికి చంద్రబాబు కుట్ర చేస్తున్నాడనేది వాస్తవమన్నారు. చంద్రబాబునాయుడు అధికారం లేకుంటే సహించలేడని, బతకలేడని చెప్పారు. తాను కలలుగనే అధికారం దక్కడం లేదనే కక్షతో, ఈర్ష్యతో కుట్రలు, దారుణాలకు ఒడిగడుతున్నాడని ధ్వజమెత్తారు. హింసను ప్రోత్సహిస్తూ కుట్రలు పన్నుతున్నాడన్నారు. ఈసారి తమ నాయకుడిపై రాయిగానీ, మరొకటైనా పడితే రాష్ట్ర ప్రజలు చంద్రబాబును క్షమించరని చెప్పారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో 151 గెల్చుకుని అధికారంలోకొచ్చిన ప్రజాదరణ గలిగిన తెలుగు నాయకుడు జగన్‌కు గాయం అయితే తెలుగుప్రజలకు గాయమైనట్లు కాదా.. అని ప్రశ్నించారు. జనసేన అభ్యర్థి మనోహర్ గెలిస్తే తెనాలి సర్వనాశనమేనన్నారు. రాజకీయ పరిజ్ఞానం లేని తిక్కలోడు పవన్‌కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. పవన్ ప్రసంగాలన్నీ బూతులేనన్నారు. బూతులు మాట్లాడే నేతల్ని పిఠాపురం ప్రజలు శాసనసభకు ఎందుకు పంపుతారని ప్రశ్నించారు. ఏది నాటకమో, ఏది నిజమో ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్న పవన్, చంద్రబాబుకు ఎన్నికల కౌంటింగ్ తర్వాత రాజకీయ సమాధి తప్పదని జోస్యం చెప్పారు.

క్లుప్తంగా...

నా మనవడికి ఏమైంది?

సీఎం జగన్‌పై హత్యాయత్నం తెలిసి తల్లడిల్లిపోతున్న ఓ అవ్వ



సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం విషయాన్ని తెలుసుకున్న తిరుపతి నగరం బండ్ల వీధిలో నివసిస్తున్న ఆర్‌డీ జయమ్మ అనే అవ్వ గత రెండు రోజులుగా టీవీకి అతుక్కుపోయింది. టీవీలో వస్తున్న వార్తలను చూస్తూ 'నా మనవడికి ఏమైంది? ఏం జరిగింది?' అంటూ తల్లడిల్లిపోతూ.. కుటుంబ సభ్యులతో కలిసి రోధిస్తోంది.

– సాక్షి, తిరుపతి

చంద్రబాబు వ్యాఖ్యలతోనే సీఎంపై దాడులు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు



నెల్లూరు(దర్గామిట్ట): సీఎం జగన్‌పై చంద్రబాబు కుట్రపన్ని విజయవాడలో రాళ్లతో దాడి చేయించారని, దీనికి రాష్ట్ర ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్తారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. సోమవారం నెల్లూరులోని ఇస్కాన్ సిటీలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమిని 13 సీట్లకే ప్రజలు పరిమితం చేయనున్నారని చెప్పారు. సీఎంపై చంద్రబాబు దాడికి ఉపక్రమించిన 13వ తేదీని దుర్మార్గపు రోజుగా ప్రజలు గుర్తుంచుకుంటారని తెలిపారు. దాడి ఘటనను ప్రధాని మోదీ ఖండించారని, బీజేపీతో జతకట్టిన చంద్రబాబు, పవన్‌లు ఖండించలేకపోవడమేంటని ప్రశ్నించారు. విచిత్రమైన వ్యాఖ్యలతో రాళ్లతో కొట్టండి అని, దాడులు చేయమని చెప్పింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. ఎంపీగా విజయసాయిరెడ్డి రెండు లక్షల మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు.

గెలవనన్న భయంతోనే హత్యాయత్నం

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: గెలవలేమనే ఉద్దేశంతోనే టీడీపీ అధినేత చంద్రబాబు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అండ్ కో వల్ల ముందు ముందు కూడా ప్రమాదాలు పొంచి ఉంటాయని అన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సోదరులతోపాటు మహిళలు, యువత, రైతులు, శ్రామికులు, వ్యాపారులంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. చంద్రబాబు వర్గీయులు ఎన్నికల కౌంటింగ్ వరకు ఎంతటి అఘాయిత్యానికైనా పాల్పడటానికి కుట్రలు చేస్తూనే ఉంటారని హెచ్చరించారు. అధికారం పోతుందనే బాధ, ఆందోళనతో ఎంతకైనా తెగించే రకం చంద్రబాబు అని, అతని చరిత్రే అలాంటిదనే విషయం మరిచిపోవద్దని కోరారు.

'హత్యాయత్నం'పై సమగ్ర విచారణ చేపట్టాలి

ఎంపీ మార్గాని భరత్‌రామ్ డిమాండ్



రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగితే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎగతాళి చేస్తూ చేసిన వ్యాఖ్యలు వారి నైజాన్ని బయట పెడుతున్నాయని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దాడికి పాల్పడిన వారితోపాటు, ఎవరి ప్రోద్బలంతో ఇది జరిగిందో కనుగొనాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మనసులో ఏముందో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిపోయిందని చెప్పారు. పరిణతి గల రాజకీయ నాయకునిగా ప్రధాని మోదీ.. సీఎం జగన్‌పై దాడిని తీవ్రంగా ఖండించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారని గుర్తు చేశారు. ఓ పథకం ప్రకారమే ఇది జరిగిందన్నారు. జగన్‌కు ప్రజాదరణ మెండుగా ఉందనే అక్కసుతోనే ఈ దాడికి స్కెచ్ వేశారన్నారు.

సీఎం జగన్‌పై దాడి అత్యంత హేయం

ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఖదీర్

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌పై దాడి అత్యంత హేయమైన చర్య అని ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఏపీఅధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఖదీర్ ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కులమతాలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న సీఎం జగన్‌పై హత్యాయత్నం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.



దస్తగిరి కుమ్మక్కు డ్రామాలు

మీడియాతో దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి.. ఎర్ర గంగిరెడ్డి తలుపు తీయడంతో లోపలకు వెళ్లామనడం అబద్ధం

- ఉత్తరం వైపు తలుపులు బలంగా నెట్టడంతో తాళాలు పగిలి లోపలకు చొరబడ్డారు
- వివేకా ఆస్తి పత్రాలను దొంగిలించాల్సిన అవసరం ఎవరికి ఉంది?
- క్లూస్ టీమ్‌కు లభించిన ఐదు వేలి ముద్రలు ఎవరివి?
- ఎన్నికల్లో లబ్ధికే చంద్రబాబు, షర్మిల, సునీత పదేపదే ఆరోపణలు



సాక్షి ప్రతినిధి, కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దస్తగిరి కట్టుకథ పథకం ప్రకారమే తెరపైకి వచ్చిందని ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి స్పష్టం చేశారు. వివేకా కుమార్తె డాక్టర్ సునీత ఆ కట్టుకథను నిజం చేయాలనే కుట్రతో వ్యవహరిస్తున్నారని, సీబీఐ సైతం ఆరోపణలకు తగిన ఆధారాలు సేకరించలేదన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, డాక్టర్ నర్రెడ్డి సునీత ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం పదే పదే వివేకా హత్యను ప్రస్తావిస్తున్నారని చెప్పారు. తన తండ్రి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డితో పాటు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి ప్రతిష్టకు భంగం వాటిల్లేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వివేకాను చంపినట్లు నేరం ఒప్పుకున్న దస్తగిరిని సీబీఐ విడిచిపెట్టడం వెనుక తిరకాసు ఉందన్నారు. డాక్టర్ సునీత ఆరోపణలు, సీబీఐ దర్యాప్తులో లోపాలపై సోమవారం కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ముందస్తు బెయిల్ లభించాకే అప్రూవర్‌గా..

డ్రైవర్ దస్తగిరి 2021 ఆగస్టు 25న 161 సీఆర్‌పీసీ స్టేట్‌మెంట్ ఇవ్వగా ఆగస్టు 31న మేజిస్ట్రేట్ ఎదుట 164 స్టేట్‌మెంట్ ఇచ్చాడు. దీని ప్రకారం దస్తగిరి స్వయంగా వివేకాను చంపినట్లు ఒప్పుకున్నాడని చైతన్యరెడ్డి గుర్తుచేశారు. అదే ఏడాది అక్టోబర్ 7న ముందస్తు బెయిల్ కోసం దస్తగిరి దరఖాస్తు చేసుకోగా అక్టోబర్ 22న మంజూరైంది. దస్తగిరి బెయిల్‌కు అటు సీబీఐ, ఇటు సునీత ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అప్రూవర్‌ను అరెస్టు చేస్తే కేసు పూర్తయ్యేవరకు బెయిల్ లభించే అవకాశం లేదు కాబట్టి ముందస్తు బెయిల్ లభించిన తర్వాత దస్తగిరి అప్రూవర్‌గా మారాడు. ఈ వ్యవహారం వెనుక డాక్టర్ నర్రెడ్డి సునీత, అప్పటి సీబీఐ అధికారి రాంసింగ్ ఉన్నారు.

అసలు విషయం అక్కడే ఉంది..

వివేకా హత్యకు గురైన ప్రదేశంలో క్లూస్ టీమ్‌కు లభించిన ఆధారాలు, అప్రూవర్‌గా మారిన దస్తగిరి స్టేట్‌మెంట్ పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. క్లూస్ టీమ్ ఫొటోల ప్రకారం తలుపుల సేఫ్టీ లాక్, టవర్ బోల్ట్ బద్దలైనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. దస్తగిరి మాత్రం తన వాంగ్మూలంలో ఎర్ర గంగిరెడ్డి లోపలి నుంచి తలుపు గడియ తీయడంతో తాము ఇంట్లోకి ప్రవేశించామని చెప్పాడు. అది శుద్ధ అబద్ధం. నర్రెడ్డి సునీత దంపతులు తలుపుల లాక్‌లకు మరమ్మతులు చేయించారు. సేఫ్టీలాక్, టవర్ బోల్ట్ బద్దలైన విషయాన్ని సీబీఐ దృష్టికి తీసుకెళ్లకుండా దాచిపెట్టారు. అక్కడే అసలు విషయం దాగి ఉంది. తలుపులు బద్దలు కొట్టి లోపలికి వచ్చారన్న విషయం బహిర్గతం అయితే దస్తగిరి కట్టుకథ తేలిపోతుందని జాగ్రత్త పడ్డారు. క్లూస్‌టీమ్ సేకరించిన ఐదు వేలి ముద్రలు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులవి కాదు. అవి ఎవరివో ఇప్పటికీ సీబీఐ నిగ్గు తేల్చలేదు.

పరస్పర విరుద్ధ వాంగ్మూలాలు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వివేకా హత్యకు గురయ్యారు. ఇంట్లో ఉన్న వారే హత్య చేసినట్లు నాడు తేల్చారు. ఇంటి ఉత్తరం వైపు తలుపు నుంచి ముగ్గురు బయటికి వచ్చారని, కొద్ది సేపటికి బయటకు వచ్చిన ఎర్రగంగిరెడ్డిని ఏమైందని అడగ్గా కోపంగా తోసేయడంతో కింద పడ్డానని ప్రత్యక్ష సాక్షి రంగన్న చెప్పాడు. దస్తగిరి తూర్పు వైపు ఉన్న మెయిన్ డోర్ గుండా బయటికి వచ్చినట్లు చెబుతుండగా ప్రత్యక్ష సాక్షి రంగన్న మాత్రం ఉత్తరం వైపు డోర్ నుంచి వచ్చారని చెబుతూ పరస్పర విరుద్ధంగా వాంగ్మూలాలు ఇచ్చారు.

గూగుల్ టేకౌట్ పేరిట దుష్ప్రచారం

వైఎస్ వివేకా, వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇళ్ల మధ్య 300 మీటర్లు మాత్రమే దూరం ఉంటుంది. ఒక వర్గం మీడియా హత్యకు ముందు నిందితులంతా వైఎస్ భాస్కరరెడ్డి ఇంట్లో ఉన్నట్లు గూగుల్ టేకౌట్ ద్వారా తెలిసిందంటూ ప్రచారం చేసింది. గూగుల్ టేకౌట్‌కు ప్రామాణికత లేదని సీబీఐనే వెల్లడించింది.

ఆ అవసరం ఎవరికి ఉంది?

వివేకా హత్య అనంతరం రౌండ్ సీల్ ఉన్న దస్తావేజులు తీసుకెళ్లినట్లు దస్తగిరి చెబుతున్నాడు. రౌండ్ సీళ్లు ఉన్నాయంటే అవి నోటరీ అఫిడవిట్లు లేదా వీలునామా కావచ్చు. బెంగళూరు స్థలానికి చెందిన డాక్యుమెంట్లు అన్నది శుద్ధ అబద్ధమని సీబీఐ దర్యాప్తులో తేలింది. వీలునామా దస్తావేజులు దొంగిలించాల్సిన అవసరం ఎవరికి ఉంటుంది? దీన్నిబట్టి వివేకా రెండో భార్య షమీమ్, వారసుడు షహెన్‌షా పేరుతో ఉన్న విల్లును దొంగిలించినట్లు తెలుస్తోంది. అసలు ఎర్ర గంగిరెడ్డి నేరస్తులతో కలిసి లేరని దర్యాప్తు ఆధారంగా రూఢీ అవుతోంది. అంటే దస్తగిరి వాంగ్మూలం అంతా కట్టుకథేనని స్పష్టమవుతోంది. దస్తగిరి అప్రూవర్‌గా మారడం ఒక నాటకమే. ఎర్రగంగిరెడ్డి చెప్పాడని నా తండ్రి శివశంకర్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కరరెడ్డి పేర్లను కేసులో చేర్చడం పథకంలో భాగమే. ఆ కట్టుకథ ఆధారంగా బాబు, షర్మిల, సునీత కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. కోర్టు దర్యాప్తు అధికారిని తప్పించినా కింది స్థాయి సిబ్బందిని అలాగే కొనసాగించడంతో సీబీఐ అసలు హంతకులను వదిలేసి సంబంధం లేని వ్యక్తులపై నిందలు మోపింది. సాక్ష్యాధారాలు సేకరించడంలో విఫలమైంది.

జూన్ ఒకటి నుంచి కర్నూలు కేంద్రంగా ఏపీఈఆర్‌సీ సేవలు: జస్టిస్ నాగార్జున రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు కేంద్రంగా ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ(ఏపీఈఆర్‌సీ) పనిచేస్తుందని చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కర్నూలు శివారులో నిర్మిస్తున్న ఏపీఈఆర్‌సీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఏపీఈఆర్‌సీ సభ్యులు రాంసింగ్(టెక్నికల్), రామకృష్ణారెడ్డి(ఫైనాన్స్)తో కలసి భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. మే 15 నాటికి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మే 24న భవనాన్ని ప్రారంభిస్తామన్నారు.

‘వివేకా’ కేసు.. బాబు ప్రయోజనాల కోసమే..

- షర్మిల, సునీత చేస్తున్నది న్యాయ పోరాటమా.. రాజకీయ పోరాటమా?
- రాజకీయ పోరాటమైతే కోర్టు తీర్పు వచ్చేవరకూ వేచి ఉండాలి
- చంద్రబాబుది క్రిమినల్ బ్రెయిన్
- వివేకాను ఓడించేందుకు స్పెషల్ చార్టెర్డ్ ఫ్లయిట్లు ఉపయోగించారు
- అప్పట్లో కోట్లు ఖర్చుచేసి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలను కొన్నారు
- ఈ ఎన్నికల్లో కూడా సుమారు 40 సీట్లు రూ.వందల కోట్లకు అమ్ముకున్నారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి, సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే ఉపయోగపడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రీజనల్ కో–ఆర్డినేటర్ కె. సురేష్‌బాబు, డా. చైతన్యరెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిత్యం నీచ రాజకీయాలు చేయడమే చంద్రబాబు సంస్కృతి అని, అన్ని వ్యవస్థలను ధ్వంసంచేసి తనకు అనుకూలంగా మలుచుకోవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. లక్ష్మీపార్వతిని సాకుగా చూపి ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవడమేగాక, ఆయన మరణానికి కూడా బాబు కారణమయ్యారన్నారు. ఎన్నికలొచ్చిన ప్రతిసారీ ఒక కొత్త కూటమి ఏర్పాటుచేయడం బాబుకు అలవాటుగా మారిందన్నారు. 2014లో నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో.. 2019లో లోపాయికారిగా జనసేనతో, ఇప్పుడు బీజేపీ, జనసేనతో పాటు కాంగ్రెస్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారన్నారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం ఆయన అందరి కుటుంబాల్లో చిచ్చుపెడతారన్నారు. ‘హూ కిల్డ్ బాబాయ్’ అంటూ కేసును పక్కదారి పట్టిస్తున్నారని రమేష్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. రెండు చానెళ్లు, రెండు పత్రికలైతే అదే పనిగా సీఎం జగన్, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలపై బురదజల్లుతూ తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. వైఎస్ వివేకా కేసు కోసం రూ.వందల కోట్లు ఖర్చుచేశారని, కోట్ల రూపాయలు వెచ్చించి లూథ్రా అనే ఖరీదైన న్యాయవాదిని నియమించుకున్నారన్నారు. ఇక ‘వివేకం’ అనే సినిమాలో క్యారెక్టర్లను చాలా నీచంగా చూపించడం దారుణమన్నారు.

అవినాశ్ ఎలాంటివారో షర్మిల, సునీతలకు తెలీదా?

ఇక అవినాశ్ ఎలాంటి వారో షర్మిల, సునీత ఇద్దరూ చిన్నప్పటి నుంచి చూసి ఉంటారు కదా, వారికి తెలీదా.. ఎప్పుడైనా ఆయనలో నేరప్రవృత్తి గమనించారా.. దౌర్జన్యాలు, రాజకీయ హత్యలు, ఫ్యాక్షన్ గొడవలతో ఆయనకు సంబంధం ఉందేమో గుండెలపై చేయివేసుకుని చెప్పాలన్నారు. నిష్కళంకమైన జీవితం గడుపుతున్న అవినాష్‌రెడ్డిపై దుష్ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. వైఎస్ జగన్ ప్రజాసేవ చేయాలని ఇష్టపడి రాజకీయాల్లోకి వచ్చారని.. ఏ రకమైన ఫ్యాక్షన్‌ను, గొడవలను ఆయన ప్రేరేపించలేదన్నారు. చంద్రబాబుది క్రిమినల్ బ్రెయిన్ అని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకానందరెడ్డిని ఓడించేందుకు రూ.కోట్లు ఖర్చుచేసి చార్టెర్డ్ ఫ్లయిట్‌లు పెట్టి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను కొనుగోలు చేశారని రమేష్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో సుమారు 40 సీట్లను రూ.వందల కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. కడప జిల్లాలో కూడా చాలామంది డబ్బులిచ్చి టికెట్లు కొన్నారన్నారు. మరోవైపు.. షర్మిల, సునీత న్యాయపోరాటం చేస్తున్నారో, రాజకీయ పోరాటం చేస్తున్నారో తెలుసుకోవాలన్నారు. రాజకీయ పోరాటమైతే కోర్టు తీర్పు వచ్చేవరకూ దయచేసి నోరు విప్పవద్దని ఆయన సూచించారు. ఇక చంద్రబాబు చెబుతున్న ‘సూపర్ సిక్స్’ ఒక ఫ్లాప్‌సిక్స్ అని రమేష్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. టీడీపీకి ఓటేస్తే కాంగ్రెస్, బీజేపీలకు వేసినట్లేనని తెలిపారు.

సునీతవి అర్థంలేని ఆరోపణలు

డా. చైతన్యరెడ్డి మాట్లాడుతూ.. డాక్టరేట్ పొందిన సునీత అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హత్య జరిగిన రోజు రాత్రి ఏ–1 ఎర్ర గంగిరెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి వాట్సాప్ కాల్స్ చేసుకున్నారని చెప్పడం అబద్ధమన్నారు. సీబీఐ చార్జిషీట్‌లో వాట్సాప్ చాట్‌లో ఉన్నారని చెప్పిందే తప్పా వాట్సాప్ కాల్స్ అని ఎక్కడా చెప్పలేదన్నారు. ఎన్నికల సమయం కాబట్టి వాట్సాప్‌కు మెసేజ్‌లు వస్తూ ఉంటాయని, ఫోన్ ఆన్‌చేసి ఉంచితే ఎవరి వాట్సాప్ అయినా యాక్టివ్‌లో ఉన్నట్లేనని చెప్పారు. ఇక గూగుల్ టేకౌట్‌కు శాస్త్రీయత లేదని, దాన్ని గూగుల్ కంపెనీ దానిని సర్టిఫై చేయలేదని, న్యాయమూర్తి కూడా అంగీకరించలేదన్నారు. కోర్టులో నేరం రుజువు కాకుండా ఆరోపణలు చేయడం సరికాదని షర్మిల, సునీతకు చైతన్యరెడ్డి హితవు పలికారు.

దస్తగిరితో చంద్రబాబే పిటిషన్ వేయించారు

- ఈ పిటిషన్ వెనుక రాజకీయ దురుద్దేశాలు
- వైఎస్ సునీత కూడా చంద్రబాబు ఆదేశాల మేరకే వాదనలు
- వివేకా హత్య కేసులో అవినాశ్‌ను ఇరికించేందుకు శతవిధాలా ప్రయత్నాలు
- దస్తగిరి చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవు
- అవినాశ్ బెయిల్ రద్దు కోరుతూ దస్తగిరి వేసిన పిటిషన్ కొట్టేయండి
- తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు
- తీర్పు రిజర్వు చేసిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ అప్రూవర్‌గా మారిన కిరాయి హంతకుడు దస్తగిరి పిటిషన్ వేయడం వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు దస్తగిరితో ఈ పిటిషన్ దాఖలు చేయించారని చెప్పారు. ఓ పక్క కేసు విచారణ సాగుతుండగా.. కడప నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, వైఎస్ వివేకా కూతురు.. ఇద్దరూ అవినాశ్‌ను హంతకుడిగా చిత్రీకరించేందుకు శత విధాలా ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అవినాశ్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఇదే కేసులో నిందుతుడు (ఏ–4) దస్తగిరి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. అవినాశ్‌రెడ్డి తరఫున నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ వాదనలను సమర్థిస్తూ సీబీఐ, సునీత తరఫు న్యాయవాదులు వాదించారు. అన్ని పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు.

వారివి సంబంధం లేని వాదనలు

సీబీఐ, సునీత తరఫు న్యాయవాదుల వాదనలు ఎంత మాత్రం సమర్థనీయం కాదని నిరంజన్‌రెడ్డి చెప్పారు. ‘చట్టవిరుద్ధంగా అవినాశ్‌కు బెయిల్ ఇచ్చారని చెప్పడం ఈ వాదనలతో సంబంధంలేని అంశం. ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ కోర్టు అవినాశ్‌కు బెయిల్ ఇచ్చిన తర్వాత వాటిని ఆయన ఉల్లంఘించారా లేదా అన్న దానిపైనే వాదనలు సాగాలి. ఓ సీనియర్ న్యాయవాది, మరో పీపీ అనవసర వాదనంతా వినిపించారు. న్యాయస్థానం అవినాశ్‌కు విధించిన షరతుల్లో దేన్నీ ఆయన ఉల్లంఘించలేదు. కనీ వినీ ఎరుగని విధంగా బాధితులం అని చెప్పుకుంటున్న వారు అప్రూవర్‌తో కలసి నడుస్తున్నారు. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు సంస్థలు ఇష్టం వచ్చినట్లు అప్రూవర్‌ను ప్రకటించకూడదని సుప్రీంకోర్టు హెచ్చరించినా.. దర్యాప్తు సంస్థే అతన్ని వెనుకేసుకుని వస్తోంది. వైఎస్ సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, కిరాయి హంతకుడు దస్తగిరి కూడా చంద్రబాబు చెబుతున్నట్లు వ్యవహరిస్తున్నారు. వివేకాకు రెండో భార్య ఉందని, ఆమెతో కలిగిన కుమారుడికి, సునీతకు ఆస్తి తగాదాలు ఉన్నాయన్నది వాస్తవం. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయడంలేదు. వివేకాను నరికానని చెబుతున్న వ్యక్తికే సునీత మద్దతుగా నిలవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అతని బెయిల్‌ను రద్దు చేయాలని ఆమె కోరలేదు. ఎవరు ఏ పిటిషన్ వేసినా ఇంప్లీడ్ అవుతూ అవినాశ్‌ను ఎలాగైనా ఈ కేసులో ఇరికించాలని ఆమె విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. సీబీఐ, సునీత, కిరాయి హంతకుడు ఒకే బాటలో సాగుతూ అవినాశ్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.

తప్పుడు ఆరోపణలతో దస్తగిరి పిటిషన్

‘ఇక్కడ దస్తగిరి తండ్రిపై దాడి చేశారని, జైలులో దస్తగిరిని చైతన్యరెడ్డి కలిశారని రెండు ఆరోపణలు చేస్తున్నారు. వీటికి ఒక్క ఆధారమూ లేదు. ఆరోగ్య శిబిరం నిర్వహించిన రోజు చైతన్యరెడ్డితో పాటు పదుల సంఖ్యలో వైద్యులు అక్కడికి వెళ్లారు. జైలు అధికారులంతా వారి వెంట ఉన్నారు. దస్తగిరిని చైతన్యరెడ్డి కలవడం అనేది అసాధ్యం అని జైలు అధికారులు చెబుతున్నారు. చైతన్యరెడ్డి జైలుకు రూ.20 కోట్లు తీసుకొచ్చాడని దస్తగిరి ఆరోపిస్తున్నారు. అంత మంది ఉండగా, అంత పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లడం సాధ్యం అవుతుందా? దీనికి, అవినాశ్‌కు ఏమిటి సంబంధం? అలాగే శివరాత్రి సందర్భంగా నామాల గుండు వద్ద దస్తగిరి తండ్రిపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి, ఎన్నికల్లో దస్తగిరి పోటీ చేయకూడదని బెదిరించారన్నది ఆరోపణ. ఈ కేసుకూ అవినాశ్‌కు సంబంధం ఏమిటో కూడా ఆధారం లేదు. విచిత్రమేమిటంటే.. తనపై దాడి జరిగిందని పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేయలేదు. కుమారుడు దస్తగిరి ఒకరోజు తర్వాత చేశారు. ఈ కేసు ఎఫ్ఐఆర్‌లోనూ అవినాశ్ ప్రస్తావన లేదు. రోడ్డు ప్రమాదం కారణంగా దస్తగిరి తండ్రికి, యువకులకు మధ్య వివాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తూ అవినాశ్ ముందస్తు బెయిల్ రద్దు చేయాలని కోరుతున్నారు. ఇది సమర్థనీయం కాదు. దస్తగిరి పిటిషన్‌ను కొట్టివేయాలి’ అని నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

బీజేపీతో జట్టుకట్టిన టీడీపీ వల్ల ముస్లింలకు ముప్పు

ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఖురేషి ఆందోళన



సాక్షి, అమరావతి: మతతత్వ బీజేపీతో జట్టుకట్టిన టీడీపీ వల్ల రాష్ట్రంలోని ముస్లింలకు ముప్పు తప్పదని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ముహమ్మద్ సదర్ ఉద్దీన్ ఖురేషి ఆందోళన వ్యక్తంచేశారు. బీజేపీతో టీడీపీ పొత్తు నేపథ్యంలో ఆయన సోమవారం ‘సాక్షి’తో మాట్లాడారు. బాబు 1998లో బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని వ్యతిరేకిస్తూ అప్పటి మాజీమంత్రి బషీరుద్దీన్ బాబూఖాన్ టీడీపీని వీడారని ఖురేషీ గుర్తుచేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకుని ముస్లిం వ్యతిరేక చర్యలకు పాల్పడే టీడీపీలో కొనసాగే విషయంలో ముస్లిం నేతలు పునరాలోచన చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయడంతో ముస్లింబిడ్డలు ఎంతో మంది డాక్టర్లు, ఇంజనీర్లుగా, ఉన్నత విద్యావంతులుగా ఎదిగారని తెలిపారు. ఇప్పుడు అదే 4శాతం రిజర్వేషన్లను తొలగిస్తామని బీజేపీ బాహాటంగా ప్రకటించిందని ఖురేషి గుర్తుచేశారు. ముస్లింలకు తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ విధానం ఎంత మాత్రం సరైంది కాదన్నారు. భవిష్యత్తులో బీజేపీ ప్రతిపాదించిన ఎన్ఆర్‌సీ విషయంలోను ముస్లింలను బాబు కచ్చితంగా దగా చేస్తారని ఆందోళన వ్యక్తంచేశారు. ముస్లింలకు ఇస్లామిక్ బ్యాంక్ తెస్తానని, ఇంకా అనేక హామీలు ఇచ్చి 2014లో అధికారం చేపట్టిన బాబు మేనిఫెస్టోలో చెప్పినవి అమలు చేయకపోగా, కనీసం మంత్రివర్గంలో కూడా ముస్లింలకు చోటు కల్పించలేదన్నారు. సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తున్న బీజేపీతో జతకట్టిన టీడీపీ కచ్చితంగా ముస్లిం ద్రోహి అనేది స్పష్టంగా తెలుస్తుందన్నారు. అటువంటి టీడీపీని కొందరు ముస్లిం నేతలు సమర్థించడం సిగ్గుచేటని ఖురేషి స్పష్టం చేశారు.

భూ మాఫియాలకు కేంద్రంగా రాష్ట్రం: షర్మిల



సాక్షి, చిత్తూరు/కార్వేటినగరం/బంగారుపాళ్యం/పలమనేరు/చిత్తూరు రూరల్(చిత్తూరు జిల్లా): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేపట్టిన ఏపీ న్యాయయాత్ర సోమవారం చిత్తూరు జిల్లాలోని జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటి నగరం, పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు పట్టణంలో, పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళ్యంలో సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఆరోపించారు. ఇసుక, ఎర్రచందనం దోపిడీ, గంజాయి, భూ మాఫియాలకు రాష్ట్రం కేంద్రంగా మారిందని ఆరోపించారు. బీజేపీతో చంద్రబాబు బహిరంగ ఒప్పందం చేసుకోగా, సీఎం జగన్ అంతర్గత ఒప్పందం చేసుకుని ప్రత్యేక హోదా అడ్డుకున్నారని చెప్పారు. రోడ్ షోలు, కూడలి సభలు జనంలేక వెలవెలబోయాయి. కాగా, కార్యక్రమానికి వచ్చిన వారిని ఉత్తేజపరిచేందుకు షర్మిల పలుమార్లు జై వైఎస్సార్.. అనగానే జనం నుంచి జై జగన్ అనే నినాదాలు వినిపించాయి.

బంగారుపాళ్యంలో జై జగన్ నినాదాలు

బంగారుపాళ్యం మండలంలో సోమవారం రాత్రి షర్మిల న్యాయ యాత్రలో జై జగన్ నినాదాలు హోరెత్తాయి. దీంతో షర్మిల తల దించుకుని.. వేగంగా యాత్రను ముగించుకుని వెళ్లిపోయారు.

‘వివేకా’ కేసుని లోతుగా దర్యాప్తు చేయాలి

నర్రెడ్డి సునీత డిమాండ్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుని లోతుగా దర్యాప్తు చేయాలని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత కోరారు. ఆమె సోమవారం హైదరాబాద్‌లో ‘జస్టిస్ ఫర్ వివేకా – సూత్రదారులెవరు?’ అన్న అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు పూర్తయినా కేసు కొలిక్కి రాలేదని, సీబీఐని సైతం ప్రభావితం చేసే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఆ రోజు అవినాష్‌రెడ్డి ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారో తెలియాలని, ఆయన ఫోన్ సరెండర్ చేయకపోవడానికి గల కారణాలు సైతం తెలియాలని అన్నారు. ఇతర నిందితులతో సంబంధం లేదని అవినాశ్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన ఇతర నిందితులకు చేసిన ఫోన్, వాట్సాప్ కాల్స్, పలు సందర్భాల్లో కలిసిన ఘటనల ఫొటోలు, కాల్ డేటాను ఆమె మీడియా సమావేశంలో ప్రదర్శించారు.



నీ శీలాన్ని నాశనం చేయగలిగినప్పుడు మాత్రమే
అది నీ జీవితాన్ని నాశనం చేస్తుంది. లేదంటే అది నీకు
ఏ నష్టమూ కలిగించలేదు – అంతర్గతంగా, బహిర్గతంగా!
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 16 ఏప్రిల్ 2024

కుట్రదారుల పనిబట్టాలి!

ప్రారంభమైంది మొదలు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు పోటెత్తుతున్న జనవాహినిని చూసి పుట్టగతులుండవని ఎంచిన ప్రత్యర్థులు శనివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై పన్నిన కుట్ర వెంట్రుకవాసిలో భగ్నమైంది. పైనున్న దేవుడి ఆశీస్సులూ, అశేష ఆంధ్ర ప్రజానీకం ఆశీర్వాదాలూ తనకు పుష్కలంగా వున్నాయని జగన్ తరచు చెబుతుంటారు. విజయవాడ సింగ్ నగర్‌లో గుర్తుతెలియని దుండగులు చీకటిచాటున పదునైన వస్తువును గురిచూసి ప్రయోగించినప్పుడు అదే రుజువైంది. నేరుగా కణతకు గురిపెట్టి హాని తలపెట్టాలన్న ఉన్మాదుల పన్నాగం ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ పక్కకు తిరగటంతో త్రుటిలో తప్పింది. ఎడమకన్ను పైభాగాన గాయమైంది. పక్కనే వున్న వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ సైతం ఈ దాడిలో గాయపడ్డారు. అంతక్రితం పాలనానుభవం లేని ఒక ముఖ్యమంత్రి అయిదేళ్ల అనంతరం 'మీ ఇంట్లో మంచి జరిగుంటేనే ఓటేయండి' అని అడుగుతుంటే ఇంత పెద్దయెత్తున ప్రజలు ఎదురేగి నీరాజనాలు పట్టడం బహుశా దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. అందుకే కూటమి నేతలు తట్టుకోలేకపోయారు. ఎడమవైపు కనుబొమ్మ పైభాగాన లోతుగా పడిన గాయం బాధిస్తున్నా... వాపు పూర్తిగా తగ్గకపోయినా జగన్ సోమవారం యధావిధిగా కొనసాగించిన బస్సుయాత్రకూ, గుడివాడలో నిర్వహించిన బహిరంగసభకూ మరిన్ని రెట్లు ఎక్కువగా జనవాహిని తరలిరావటం గమనించాక త్రికూటమికి, ప్రత్యేకించి టీడీపీకి తత్వం బోధపడి వుండాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్నీ, పార్టీనీ కబ్జా చేసినప్పటికన్నా చాలా ముందే చంద్రబాబు రాజకీయాలను కలుషితం చేశారు. జర్నలిస్టు పింగళి దశరథరామ్ హత్య, కాపు నాయకుడు వంగవీటి రంగాను అత్యంత దారుణంగా హతమార్చటం, ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి దుర్మరణం వగైరాల్లో బాబుపై ఆరోపణలు రావటం యాదృచ్ఛికం కాదు. కేంద్రంలో తొలి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహించిన వాజపేయి అంతటి నాయకుడే బాబు తీరుతెన్నులు గమనించి దిగ్భ్రాంతి చెందేవారని ఆ రోజుల్లో కథనాలొచ్చేవి. తెరవెనక పావులు కదపడం, జరిగింది ఒకటైతే బయటకు వేరేలా చూపటం, మంచిని తన ఖాతాలో వేసుకుని, పొరపాట్లు అవతలివారిపై రుద్దటం బాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఫలానావారిని ప్రధానిని చేశాను... ఇంకొకరిని రాష్ట్రపతిని చేశాను అని చెప్పుకోవటం ఆయనకు అలవాటైన విద్య. రాజకీయాల్లో శత్రువులుండరని, ప్రత్యర్థులు మాత్రమే వుంటారని ఇన్నేళ్ల అనుభవం తర్వాత కూడా బాబు గ్రహించలేకపోయారని ఆయన తరచుగా మాట్లాడే మాటలు, చేసే ప్రసంగాలు రుజువు చేస్తున్నాయి. కనీసం ఈ అవసాన దశలోనైనా నలుగురికీ ఆదర్శంగా వుండాలన్న ఇంగితజ్ఞానం లేకపోగా మరింత అధమస్థాయి రాజకీయాలు చేసే సినీ నటుడు పవన్ కల్యాణ్‌ను వెంటేసుకుని ఆయన ఉన్మాదిలా రెచ్చిపోతున్న తీరు అందరికీ దిగ్భ్రాంతి కలిగిస్తోంది. సరిగ్గా ముఖ్యమంత్రిపై దాడి జరగడానికి కొన్ని గంటల ముందు తాడికొండలో బాబు చేసిన ప్రసంగమే అందుకు తార్కాణం. 'ప్రతి ఒక్కరూ రాయి తీసుకుని, ఏది దొరికితే అది తీసుకుని ఆ దున్నపోతుపై దాడి చేయండి' అంటూ ఆయన రెచ్చగొట్టారు. సొంత పార్టీ కార్యకర్తలను ఇలా గూండాలుగా, హంతకులుగా మార్చాలనుకోవటం ఏ మార్కు రాజకీయమో ఆయనకు అవగతమవుతున్నట్టు లేదు. వయసు ముదిరిన ఈ దశలో బాబుకు పరిణతి రావటం అసంభవం. కనీసం చట్టమైనా దుండగులను శిక్షించగలిగితే ఇతరులకు జ్ఞానోదయమవుతుంది. 'ఆవు చేలో మేస్తే... దూడ గట్టున మేయదు' అంటారు. రాజకీయాల్లోకొచ్చి దాదాపు పదేళ్లవుతున్నా, ఒకటి కాదు– రెండు మంత్రి పదవులు వెలగబెట్టినా ఏ భాషలోనూ తప్పుల్లేకుండా పలకడంరాని లోకేష్ వంచనలో, వాచాలత్వంలో మాత్రం తండ్రిని మించారు. ఇలాంటివారంతా ప్రజాస్వామ్యం మాటున వీరంగం వేస్తుంటే అవాంఛనీయ ఉదంతాలు జరగటంలో ఆశ్చర్యమేముంది?

ఏం నేరం చేశారు జగన్? ఏ పథకం పెట్టినా దళారుల భోజ్యంగా మారే తీరును సమూలంగా మార్చారు. వాలంటీర్ల వ్యవస్థను నెలకొల్పి నేరుగా నిరుపేదల ముంగిటకే పథకాలు వెళ్లే సరికొత్త విధానం తీసుకొచ్చారు. గ్రామసచివాలయాలు ఏర్పాటుచేశారు. ఇళ్లులేని పేదలను గుర్తించి దరఖాస్తు చేయించి రూ. 10 నుంచి 15 లక్షల విలువైన ఆస్తుల్ని కట్టబెట్టారు. వాగ్దానం చేసిన నవరత్నాలే కాదు... మరిన్ని పథకాలు ప్రజలకందించారు. విద్య, వైద్యరంగాల ప్రక్షాళనకు నడుం బిగించారు. రైతుభరోసా కేంద్రాలు నెలకొల్పారు. రైతులకు అండగావున్నారు. విలేజ్ క్లినిక్‌లు, ఆరోగ్యశ్రీ తదితరాలతో జనహృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. అలాంటి నేతను దుర్భాషలతో, దుశ్చర్యలతో ప్రజలకు దూరం చేయాలని చూడటం తెలివితక్కువతనమని ఆ ముఠాకు మరో నెలరోజుల్లో అర్థమవుతుంది.

సత్సంకల్పంతో రాజకీయాలు నెరపేవారినీ, మంచి పాలన అందిస్తున్నవారినీ ప్రజలనుంచి వేరుచేయటం అసాధ్యం. మండుటెండల్ని సైతం లెక్కచేయకుండా బస్సు యాత్ర పొడవునా బడి పిల్లలు మొదలుకొని వృద్ధులవరకూ అన్ని తరాలవారూ, అన్ని వర్గాలవారూ కనబడటం జగన్ మంచి పనులకు నిదర్శనం. విజయవాడ దురంతం వెనకున్న సూత్రధారులనూ, పాత్రధారులనూ సత్వరం బంధించి, కఠినశిక్ష పడేలా చేసినప్పుడే హత్యారాజకీయాలకు అడ్డుకట్టపడుతుంది. నాయకులు బాధ్యతాయుతంగా మెలగటం నేర్చుకుంటారు.

పెత్తందారులు విసిరిన రాయి

అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ మీద ఏప్రిల్ 14న (1865) దాడి జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీద ఏప్రిల్ 13న దాడి జరిగింది. శ్వేత జాతీయుడయినప్పటికీ నల్ల జాతీయుల హక్కుల కోసం లింకన్ అలుపెరుగని పోరాటం చేశారు. పేదవాళ్ళు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ మీడియంలో చదవాలని జగన్ సంకల్పించారు. లింకన్ సమయంలోనే కాదు, ఇప్పుడు కూడా పేదలు ఆత్మగౌరవంతో తల ఎత్తి నిలబడితే పెత్తందార్లకు కడుపు మంట. లింకన్‌ను కేవలం భౌతికంగా నిర్మూలించడం కాదు, లింకన్ సమానత్వ ఎజెండాను సమాధి చేయడం అప్పటి లక్ష్యం. జగన్ మీదకు ఈ పెత్తందార్లు విసిరిన రాయి లక్ష్యం జగన్‌ను కేవలం భౌతికంగా గాయపరచడం కాదు, ప్రగతి పథంలో సాగుతున్న జగన్ ప్రయత్నాన్ని స్తంభింపజేయడం!

సమానత్వ సాధనను అడ్డుకునేందుకే...



సామాన్య

ఏప్రిల్ 13న తనను ఎన్నుకున్న ప్రజల మధ్య ప్రయాణిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మీద జరిగిన దాడి, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసింది. భౌతిక దాడులకు దిగి, ఎన్నికల రూపంలో చేయాల్సిన పోరాటాన్ని ఆయుధ పోరాటంగా మార్చిన వ్యక్తులు ఒక అనాగరిక సాంప్రదాయానికి మళ్ళీ తెరతీశారు. కేవలం ఆయనకు వున్న ప్రజాదరణ చూసి, మళ్లీ ముఖ్యమంత్రి కావచ్చునేమో అని ఓర్వలేక వారు అలా దాడి చేశారా?

అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ఇదే ఏప్రిల్ నెలలో హత్య కావించబడ్డారు. సామాన్య ప్రజలతో కలిసిపోయి వారిలో ఒకడిగా సంభాషణ చేయగల సామర్థ్యం, సాటి మనిషిపై సహానుభూతి ఆయన ప్రధాన లక్షణాలు. శ్వేత జాతీయుడయినప్పటికీ నల్ల జాతీయుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారు. అంతర్యుద్ధం తర్వాత దేశాన్ని సమానత్వం ప్రాతిపదికగా పునర్ నిర్మించాలని సంకల్పించారు. బానిసత్వ నిర్మూలన, ఆఫ్రికన్ అమెరికన్‌లకు భూమి హక్కులు, ఓటు హక్కు కల్పించడం అందులో ముఖ్యమైన అంశాలు. ఆధిపత్య శ్వేత జాతీయ దురహంకార రాష్ట్రాలు అంతర్యుద్ధం తీసుకువచ్చినా వెనకాడలేదు. 'మనుష్యులందరూ సమానంగా సృష్టించబడ్డారు' అని నినాదమిచ్చారు.

యూనియన్ విక్టరీ తరువాత శ్వేత జాతీయుల నాయకుడు రాబర్ట్ ఇ. లీ లొంగిపోయిన అయిదు రోజులకు 1865 ఏప్రిల్ 14న సాయంత్రం లింకన్ వాషింగ్టన్ డి.సి.లో నాటకం వీక్షించడానికి సతీ సమేతంగా వెళ్ళారు. జాన్ విల్కిస్ బూత్ అనే నటుడు, శ్వేతజాతి ఆధిక్యతావాది లింకన్‌ను వెనక నుండి అతి దగ్గరగా కాల్చాడు. మనుషులందరూ సమానమే అని లింకన్ చేసిన ప్రకటన, ఆయన చర్యలు, శ్వేతజాతి దురహంకారి అయిన జాన్ విల్కిస్ బూత్‌ను అలజడికి గురి చేశాయి. బానిసలు తమతో సమానంగా, ఆత్మ గౌరవంతో బతకడం అనే ఆలోచన నిద్ర లేకుండా చేసింది. లింకన్‌ను భౌతికంగా నిర్మూలిస్తే తప్ప నల్ల జాతీయులను అణిచి ఉంచలేమని అతనికీ, అతని తరపు వారికీ అనిపించింది. జాన్ విల్కిస్ బూత్ కాల్చిన తూటా లింకన్ ప్రాణాలను బలి తీసుకొంది. 1865 ఏప్రిల్ 15న లింకన్ కన్నుమూశారు.



దాడికి గురైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

బాబాసాహెబ్ అంబేడ్కర్ 'ఒక సమాజం విద్యలో సాధించిన పురోగతే ఆ సమాజపు అభివృద్ధిని నిర్ణయిస్తుంది' అంటారు. జగన్ ఆ సత్యాన్ని పట్టుకున్నారు. అందుకే తన దృష్టిని ప్రధానంగా విద్యపై కేంద్రీకరించారు. మనది 'పేదవాడు పెత్తందారుపై చేస్తున్న పోరాటం' అని నినాదం ఇచ్చారు. పేదవాళ్ళు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ మీడియంలో చదవాలని సంకల్పించారు. డబ్బున్న వాళ్ళలాగే పేదవాళ్ళు కూడా విదేశాలకు చదువుల కోసం వెళ్లొచ్చని విదేశీ విద్యకు అవకాశం కల్పించారు. గుడ్లు పెట్టడానికంటే ముందే తల్లిపక్షి గూడు కడుతుంది. ఆ జాగ్రత్త స్త్రీ సహజ లక్షణం. అది గ్రహించినవాడు కనుకనే పిల్లలకు చదువు కోసం డబ్బులిచ్చినా, ఇళ్ల స్థలాలిచ్చినా జగన్ ఆ ఇంటి తల్లికి ఇస్తున్నారు. స్త్రీ పేరిట ఇస్తున్నారు. దీనినే స్త్రీవాదం అని మేధావులు పిలుస్తారు. ఏ రోగమో రొష్టో వచ్చినపుడు ఆసాముల దగ్గర చేయి చాచకుండా ప్రభుత్వ రూపంలో ఆదుకుంటూ డబ్బున్నవాడి పక్క బెడ్డులోనే చికిత్స తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. జగన్ చేపడుతున్న ప్రతి కార్యక్రమం, పేదవాడిని పెత్తందారుల సంకెళ్ళ నుండి విడిపించేదే!

అబ్రహాం లింకన్ సమయంలోనే కాదు, ఇప్పుడు కూడా పేదలు గుండెల నిండా ఆత్మగౌరవంతో తల ఎత్తి నిలబడితే పెత్తందార్లకు కడుపు మంట. 'ఎవరయినా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా?' అని హేళనగా మాట్లాడిన చంద్రబాబు లాంటివారికి, పెత్తందార్లకు కాపు కాసే నటులకు, వారికి మద్దతునిస్తూ భౌతిక దాడులకు దిగిన అనుయాయులకు, ప్రధానంగా జగన్ సమానత్వ ఎజెండా మీదే ఆక్రోశం. ఇది కాకతాళీయమే కావొచ్చు... నటుడు జాన్ విల్కిస్ బూత్ ఏప్రిల్ 14న లింకన్ మీద తూటా పేల్చాడు. ఆంధ్ర ప్రదేశ్‌లో పెత్తందార్లు, నటులు... పేద ప్రజల నాయకుడు జగన్ మీదజుజ ఏప్రిల్ 13న రాయి విసిరారు. జాన్ విల్కిస్ బూత్ తూటా లక్ష్యం కేవలం లింకన్‌ను భౌతికంగా నిర్మూలించడం కాదు, లింకన్ సమానత్వ ఎజెండాను సమాధి చేయడం. అలాగే పేద ప్రజల పక్షపాతి జగన్ మీదకి ఈ పెత్తందార్లు విసిరిన రాయి లక్ష్యం జగన్‌ను కేవలం భౌతికంగా గాయపరచడం కాదు, ప్రగతి పథంలో సాగుతున్న జగన్ ప్రయత్నాన్ని స్తంభింపజేయడం! లింకన్ మరణం ఆఫ్రికన్ అమెరికన్ సమానత్వ ఆకాంక్షలను వంద సంవత్సరాలు ఆపగలిగింది. ఇప్పుడు ఈ పెత్తందారులు జగన్‌పై విసిరిన రాయి, మంచి చదువులు చదువుతూ అభివృద్ధి వైపు పరిగెడుతున్న ఆంధ్రప్రదేశ్‌ను ఏం చేస్తుందో చూడాలి!

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి

ఎదుర్కోలేమనే భయంతోనే...



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకుంటోంది. ఒకవైపు ఎండవేడిమి మంట పుట్టిస్తుంటే, మరోవైపు ప్రచారాల్లో భాగంగా రాజకీయ పార్టీల మాటల తూటాలు పేలుతున్నాయి. ఇది ఒక అడుగు ముందుకేసి దాడులకు తెగబడే పరిస్థితులకు చేరింది. 13వ తేదీన విజయవాడ వేదికగా సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై జరిగిన దాడి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

గత నెల 27న ఇడుపులపాయలోని తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి నుండి 'మేమంతా సిద్ధం' పేరుతో వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్ తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ నాలుగు సంవత్సరాల 10 నెలల కాలంలో తాను ఏం చేశానో ప్రజలకు వివరిస్తున్నారు. ఈ ప్రచారానికి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోంది. అంతేకాకుండా తెలుగుదేశం, జనసేన పార్టీల నుండి అనేకమంది వైసీపీలో చేరుతున్నారు. ఈ క్రమంలోనే ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మీదే రాయి వేసి ఆయన్ని అంతమొందించే ప్రయత్నం జరిగింది. దీనిని ప్రధాని మోదీ సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ముక్తకంఠంతో ఖండించారు.

చంద్రబాబు కూడా ఈ దాడిని ఖండించారు. అయితే, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అడగకుండా అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన చేసిన ట్వీట్, వెంటనే ఆ పార్టీకి చెందిన నేతలు చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. తానేమీ తక్కువ తినలేదంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలపై కూడా ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రజా ముఖ్యమంత్రి, జనం గుండెల్లో గూడు కట్టుకున్న నేతపై దాడి జరిగితే దీనిని రాజకీయం చేయడం ఏంటని అసహ్యించుకుంటున్నారు. దాడి సమయంలో తమ ప్రియతమ నేత అభివాదం చేస్తూ పక్కకు తిరగడంతో పెను ప్రాణాపాయం నుండి రక్షించుకున్నారని చెబుతున్న ప్రజలు ఆయన ఎప్పుడూ చెప్పే ఒక్క మాటను గుర్తు చేస్తున్నారు. దేవుడి దయ, ప్రజల చల్లని దీవెనలు ఉన్నంతకాలం తనకేమీ కాదన్నది ఇప్పుడు నిరూపితమైంది.

గతంలో 2019 ఎన్నికల సమయంలో విశాఖ విమానాశ్రయంలో జగన్‌పై కత్తితో దాడికి ప్రయత్నించిన ఘటనను ప్రజలు ఉటంకిస్తూ, ఘటన జరిగిన 24 గంటల్లో నిందితుణ్ణి పట్టుకోలేకపోయారని గుర్తు చేస్తున్నారు. విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి సమయంలో అక్కడ డీజీపీ హడావిడిగా ఇదంతా కేవలం సానుభూతి కోసం అంటూ ప్రెస్ మీట్ పెట్టారు. ఆయన చెప్పిన గంటకే అమరావతిలో చంద్రబాబు కూడా ప్రెస్ మీట్ పెట్టి అదే మాట చెప్పారు. అంటే దర్యాప్తు సంస్థలను ప్రభావితం చేయడం కాదా అన్నది ఇక్కడ అందరూ అడుగుతున్న ప్రశ్న.

తెలుగుదేశం పార్టీకి ఈ ఎన్నికలు చావో రేవో అన్న చందంగా మారి ఆ కంగారులో తలో మాట మాట్లాడుతున్నారనుకుంటే, పవన్ కల్యాణ్ దాడి ఘటనను డ్రామాగా చిత్రీకరిస్తూ సినిమా తరహాలో డైలాగులు చెబుతున్నారు. ప్రజలు సూటిగా ఒకటే ప్రశ్న అడుగుతున్నారు. ఇదంతా డ్రామాగా మీరే తేల్చేసినప్పుడు ఇక దీనిపై విచారణ ఎందుకు?

చంద్రబాబు రాజకీయ నైజం గురించి కూడా విస్తృతమైన చర్చ జరుగుతోంది. 1987 ప్రాంతంలో పేదల పక్షపాతి, నిస్వార్థ రాజకీయ నేత వంగవీటి మోహన రంగాను అకారణంగా పొట్టన పెట్టుకున్న ఘటనను ఇప్పుడు ప్రజలు ఉటంకిస్తుండటం నిజంగా ప్రజల్లోని రాజకీయ చైతన్యానికి నిలువెత్తు నిదర్శనం. అంతేకాకుండా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బషీర్‌బాగ్ కాల్పుల ఘటన, అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించిన ఘటన, గోదావరి పుష్కరాల్లో ప్రచార ఆర్భాటం కోసం 26 మందిని పొట్టనపెట్టుకున్న సంఘటన, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంపై, ఆయన కుటుంబంపై పరుష పదజాలం వాడుతూ కొట్టుకుంటూ ఇంటి నుండి బయటకు తీసుకొచ్చిన వైనం, గుంటూరులో చీరలు పంపిణీ చేస్తామని పిలిచి తొక్కిసలాటలో అమాయక మహిళల ప్రాణాలను బలిగొన్న అంశాలను చర్చించటం చూస్తుంటే, ఒక నేతపై ప్రజల్లో ఉండే అభిప్రాయానికి దీన్ని సూచికగా చెప్పుకోవచ్చు.

ఇదంతా చూస్తుంటే కేవలం జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల నుండి వస్తున్న అనూహ్య స్పందనే ఆయనంటే గిట్టనివారి కడుపు మంటకు కారణంగా కనిపిస్తోంది. రాజధాని ప్రాంతంలో కూడా విశేష ఆదరణ లభించడం ఈ కడుపు మంటను రెట్టింపు చేసింది. అందుకే జనాల గుండెల్లో గూడు కట్టుకున్న జగన్‌ను అంతమొందించేందుకు కుట్రకు తెరలేపినట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏపీ అధ్యక్షులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, తిథి: శు.అష్టమి సా.4.23 వరకు, తదుపరి నవమి,
నక్షత్రం: పునర్వసు ఉ.6.11 వరకు, తదుపరి పుష్యమి,
వర్జ్యం: ప.2.40 నుండి 4.21 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.15 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.48 నుండి 11.35 వరకు,
అమృతఘడియలు: రా.12.53 నుండి 2.34 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఆటే... ఆర్ట్!



ఒక షట్లర్‌కు రాకెటే పెయింట్ బ్రష్. కోర్టే క్యాన్వాస్ అవుతాయి. అది కేవలం క్రీడ కాదు ; కదలికలు, మెరుగైన వ్యూహాల మేళనం. స్వచ్ఛమైన రూపంలో ఉన్న కళ అది (జనవరి 15న వరల్డ్ ఆర్ట్ డే).

– సైనా నెహ్వాల్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

శిక్ష పడాలి!



సిడ్నీ (ఆస్ట్రేలియా)లో బిషప్ మార్ మారీ ఎమాన్యుయెల్ మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. దేవుడు ఆయన్ని పూర్తిగా కోలుకునేట్టు చేయాలి. దాడిచేసినవాడికి శిక్ష పడాలి.

– మహమ్మద్ తాహిది, ఇన్‌ఫ్లుయెన్సర్

తగ్గుతున్న జనం



'జనాభా పతనాన్ని' ఎదుర్కోనున్న తొలి దేశం గ్రీస్ కానుందని అంచనా. ఓవైపు హఠాన్మరణాలు పెరుగుతుండగా, మరోవైపు సంతాన సాఫల్య రేట్లు నిపుణులు గతంలో ఊహించినదాని కంటే కిందికి పడిపోయాయి. గుండె ఆగిపోవడం, రక్తం గడ్డకట్టడం, క్యాన్సర్ల లాంటివి యువకులను బలిగొంటున్నాయి.

– లూథర్ సైరస్, యాక్టివిస్ట్

ఇది... పెగ్గా సెస్!

అభిప్రాయం



పి. విజయబాబు

ఉండిలో అంతసేపు ఉండి వాళ్లతో విసిగి వేగి వేసారి ఇంటికి వచ్చిన చంద్రయ్యకు ఇల్లంతా హడావుడిగా కనిపించింది. రామయ్య, అచ్చయ్య, వెంకన్నలాంటి వాళ్లతో పాటు వకీళ్లు కూడా కనిపించారు. వాళ్ళ హడావిడితో పాటు సంటోడి ముఖంలో ఆందోళన చూసేసరికి ఏం అర్థం కాలేదు.

''ఏటయ్యింది?'' అడిగాడు. అయినా అంతా నిశ్శబ్దం. ఎవరి నోటి నుంచి బదులు రాలేదు. ''సెస్! అడుగుతున్నది మిమ్మల్నే. అంతా బెల్లం నోట్లో ఎట్టుకున్నట్టు మాహాడరే?'' సున్నితంగా గద్దించాడు. ''అయ్యా! అది కాస్తంత ఇబ్బందికర పరిస్థితి'' వకీలు రవీంద్ర గంభీర వదనంతో పలికాడు. ''అదేనయ్యా అదేటో సెప్తేనే కదా తెలిసేది? గౌరమ్మా ఏటైనాది? నువ్వైనా సెప్పు'' అన్నాడు దూరంగా ఉన్న భార్య వైపు చూస్తూ. ''అది ఏటంటే... మన సంటోడు ఫోన్లో మాట్లాడేదంతా ఇనేత్తున్నారంట. ఒకేపు కేసులు గట్రా ఉన్నాయి గందా? అదేదో పెగాసస్ అంట. దాంతో మన సంటోడు ఫోన్లో దూరి మొత్తం ఇనేస్తున్నారంట'' సస్పెన్స్‌కి తెరదించుతూ భార్య గౌరీ చెప్పింది.

''మీరేం కంగారు పడకండి. ఈ సంగతి ఢిల్లీకి కూడా కంప్లైంట్ చేశా'' అన్నాడు రవీంద్ర కోటు, టై సవరించుకొంటూ.

ఆ మాటకి ఉలిక్కిపడ్డాడు చంద్రయ్య. వెంటనే రామయ్య అందుకుంటూ, ''ప్రెస్ మీట్ కూడా పెట్టాం. అధికార పార్టీ కుట్రని కడిగిపారేశాం'' అన్నాడు అచ్చయ్య వైపు మెచ్చుకోలుగా చూస్తూ.

''అంతేకాదు రేపు ఆందోళన కార్యక్రమాలు కూడా ప్లాన్ చేశాం'' అచ్చయ్య ఉత్సాహంగా పలికాడు. ''ఇది దేశంలోనే అతి పెద్ద కుట్ర'' వెంకన్న ఆవేశంగా పలికాడు. ''అసలు ఈ పెగా సెస్సు...'' ఎప్పటిలాగే కాగితాలు ఏవో చూపుతూ



పొట్టాభి ఏదో చెప్పబోయాడు. చంద్రయ్యకు ఆగ్రహం తన్నుకొచ్చింది. అవ్యక్తమైన ఉద్వేగాన్ని అణచుకొంటూ ''సెస్! ఊరుకొండెహె. అంతా మీ మానాన మీరు చేసుకెళ్లి పోవడమేనా? కనీసం ముందు నాతో ఒక ముక్క సెప్పాలని తెల్దేటి? పెతివాడికి అతి ఉత్సాహం!''

చంద్రయ్య తనని తను తమాయించుకొని, ''సరే సరే. ఢిల్లీ లెవెల్ దాకా తీసుకెళ్లారన్నమాట. సర్లే ఆ తర్వాత ఎలా ముందుకు బోవాలో రేపు చర్చిద్దాం వెళ్ళండి'' అన్నాడు కూల్ గా. ''నువ్వా ఎల్లి తొంగో'' అన్నాడు సంటోడితో. ''ఏటీ అలా సిటపటలాడిపోతున్నారు. ఎండదెబ్బ కొట్టేసి నాదా?'' అన్నది గౌరీ దగ్గరకొస్తూ. ''నాక్కాదు నీ కొడుక్కి కొట్టినాది. నేను అలా కాస్త బయిటికి ఎల్తోస్తే చాలు. ఏదో ఒక పేడ తట్ట ఎట్టేస్తాడు. అవునే నాకు తెలవక అడుగుతాను. ఆడి ఫోను హ్యాకింగ్ చేసేవాడు ఎవడుంటాడు?''

''అంటే వాడి ఫోను హ్యాకింగ్ అవలేదా?'' చిరుకోపం ప్రదర్శిస్తూ అడిగింది గౌరీ. ''సెస్. మళ్లీ అదే మాట. వాడి ఫోనుతో ఎవరికి పనే? ''మరెవరికి పని?'' రెట్టించింది గౌరీ.

''ఇంకెవరికి? నాకు, నీకు, కాదంటే కోడలు పిల్లకు''

''అంటే ఏటి మీరు అనేది?'' అనుమానంగా చూస్తూ అడిగింది గౌరీ. ''మరేటుంది? నేనే చేశాను. అంతా నేనే చేశాను. ఒకేపు నేను వాడి కోసం పడరాని పాట్లు పడుతూ, నానా తిట్లు తింటూ, ఎండలో తిరుగుతూ ఉంటే, ఈడేమో ఏసీలో తొంగొని, 24 గంటలు ఫోన్‌తో కాలం గడిపేస్తుంటాడు. అసలు ఆ ఫోన్లో ఏటుందో తెలుసుకుందామని నేనే ఆ పని చేశా! తీరా ఫోన్లో సమాచారం మరి ఏటున్నదో తెలుసా?? ఫోన్ అంతా అమెరికా ఫ్రెండ్స్‌తో చాటింగ్లు, వీడి వీర గాథలు, సిగ్గీలు, జొమాటోల ఆర్డర్లు. ఈ మధ్య కాస్త ఎండలో తిరగటం మొదలెట్టిన దగ్గర నుంచి ఫోన్ అంతా సిగ్గీ ఆర్డర్లే. సిగ్గు లేకపోతే సరి. ఈ సమాచారం తెలుసుకొని ఎవరైనా ఏం చేసుకుంటారు? ఇంత హడావిడి జరుగుతున్నా బాధ్యత లేదు. ఓ ఎదవ హడావిడి తప్ప. పోనీ నాతో పాటు తిప్పుకుందాం అంటే, ఎక్కడ ఏ పేడతట్ట ఎత్తాడో అని భయం'' అంటూ అసలు సంగతి బయట పెట్టే సరికి గౌరీ అవాక్కయిపోయింది.

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

నాయకరాజుల వసంతోత్సవ హేల

సందర్భం



నాగపట్ల భక్తవత్సల రెడ్డి

మదురైలో ఏటా నిర్వహించే 'చిత్తిరై తిరువిళా' తిరణాల తెలుగు సంస్కృతికి నీరాజనం, తెలుగు వసంతోత్సవ హేలా విన్యాసం. చైత్ర శుద్ధ త్రయోదశిన జరిగే మీనాక్షీ సుందరేశ్వరుల తిరుకల్యాణ ఉత్సవం ఇది. ఏటా చిత్తిరై పౌర్ణమికి పదిరోజుల ముందు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే (12.4.2024) ఉత్సవంలో... కళ్యాణం (21.4.24), రథం లాగడం (22.4.24), కళ్ళళగర్ ఎదురుసేవ (22.4.24), అళగర్ వైగై ఒడ్డున దిగడం (23.4.24) ప్రధానమైన ఘట్టాలు. తిరు కల్యాణంలో వధూవరుల తరపున తాంబూలాలు మార్చుకోవడం, నలుగు పెట్టడం, కన్యాదానం లాంటి సంప్రదాయాలతో పాటు ఆడవారికి పసుపు, కుంకుమ, గాజులిచ్చే ఆచారం ఉంది. పుణ్య స్త్రీలు తాళి మార్చుకుంటారు.

మదురై చతురస్రాకారంలో నిర్మితం. గుడి చుట్టూ ఆడి, చిత్తిరై, ఆవణిమూల, మాసి అని తమిళ నెలల పేరుతో దిక్కునూ బట్టి కీళ్మాసి (తూర్పు మాసి), మేల్మాసి (పడమటి మాసి), వడక్కు మాసి (ఉత్తర మాసి), తెన్మాసి (దక్షిణ మాసి) వీధులు. వెళి (బైట) వీధులు ఒకప్పుడు ఎల్లలు. గుడిలో ఉత్సవం జరిగే నెలను బట్టి ఆ పేరు గల వీధిలోనే దేవుని ఊరేగింపు ఉంటుంది. మీనాక్షీ కల్యాణం చిత్తిరై నెలలో కాబట్టి చిత్తిరై వీధుల్లోనే ఊరేగింపు జరగాలి కాని మాసి వీధుల్లో జరుగుతోంది. పూర్వం మీనాక్షీ కళ్యాణం మాసి నెలలో జరిగేదనీ, నాయకరాజైన తిరుమల నాయకర్ దాన్ని చైత్ర మాసానికి మార్చి, పౌర్ణమికి ముందు జరిపించాడని అంటారు. ధ్వజారోహణం మర్నాటి నుంచి రోజూ మీనాక్షీ సుందరేశ్వరులను విడివిడిగా, పూటకొక్క వాహనం మీద ఉదయం, సాయంత్రం మాసి వీధిలో ఊరేగిస్తారు. శక్తి (పిరియావిడై), శివుడు కలిసే ఉంటారని పురాణాలు చెప్తున్నాయి కనుక సుందరేశ్వరుడు ఉండే వాహనంలో పిరియావిడై విగ్రహాన్ని కూడా ఉంచి ఊరేగిస్తారు. పెళ్లినాటి సాయంత్రం పూలపల్లకీలో



మీనాక్షి, గజవాహనంలో సుందరేశ్వరుడు – పిరియావిడైల ఊరేగింపు ఉంటుంది.

పల్లకిని పూర్తిగా మల్లెపూలతో సింగారించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. మర్నాడు పొద్దున కల్యాణం తర్వాత రెండు తేర్లు (జగన్నాథ రథాల లాగా చాలా పెద్దవి) – ఒక దానిలో మీనాక్షి, రెండో తేరులో సుందరేశ్వరుడు–పిరియావిడై ఊరేగింపు. పొడుగాటి లావు మోకులు కట్టిన ఈ రథాలను ప్రజలు లాగుతారు. మదురైలోని మీనాక్షియమ్మన్, ఇరవై కిలోమీటర్ల దూరంలోని అళగర్ కోవెలలో ఉన్న సుందరరాజ స్వామి (అళగర్ అని మరో పేరు)కి చెల్లెలు కనుక మీనాక్షి సుందరేశ్వరుల కల్యాణం చూడడం కోసం అళగర్ నుంచి కళ్ళళగర్ (దొంగ లేదా వ్యాజ) వేషం వేసుకొని, తన చెల్లెలికి కట్నకానుకలు సమర్పించడం కోసం ఊర్లు కొల్లగొట్టుకొంటూ, తేరు ఉత్సవం జరిగిన మర్నాడు మదురై చేరగా ఎదురు సేవ ఉంటుంది.

ఆ రాత్రి తల్లాకుళం (వైగై నది చేరడానికి ముందు ఉన్న ప్రాంతం)లోని ప్రసన్న వేంకటాచలపతి దేవాలయంలో బస. తెల్లవారుజామున వేషం మార్చుకొని, రాజు వేషంలో కుదిర (గుర్రం) సప్పరం గుండా వైగై తీరం వరకూ పోయి, అక్కడ సప్పరం వదిలి ఉత్తర ఒడ్డు చేరగా ఆవలి గట్టున మీనాక్షీ సుందరేశ్వరులు ఉంటారు. అది చిత్తిరై (చైత్ర) పౌర్ణమి. అప్పటికే కల్యాణం జరిగిపోయిన విషయం కూడల్ అళగర్ పెరుమాళ్ (అళగర్ తమ్ముడు, మదురైలో కోవెల ఉంది) ద్వారా దారిలో వచ్చేటపుడే విన్నా ఇపుడు ప్రత్యక్షంగా చూడగానే కోపం వచ్చి మీనాక్షీ సుందరేశ్వరులను చూడకుండానే వైగై తీరం వెంబడి వండియూర్ వెళతాడు. అక్కడ ఒక ముసల్మాన్ యువతికి అళగర్ తాను తెచ్చిన కానుకల్ని బహూకరిస్తాడు. ఇలాంటి ఘటనలతో దాదాపు తొమ్మిది రోజులు అళగర్ ప్రయాణం సాగుతుంది.

వైగై దక్షిణ ఒడ్డున మీనాక్షీ సుందరేశ్వరులకు తిరిగి పెండ్లి చేయాలన్న ప్రయత్నంలో తాళి కట్టబోయే శుభవేళ ఎవరో తుమ్ముతారు. అపశకునం అంటూ మరుసటేడు పెండ్లి జరిపిద్దామంటూ వారిని మీనాక్షీ కోవెలకు తీసుకువెళ్తారు. ఇది స్థూలంగా మదురై చిత్తిరై తిరువిళా ఉత్సవం.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్ । 94401 70703

క్లుప్తంగా...

నారెడ్కో ఏపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా సందీప్



సాక్షి, అమరావతి: నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) ఏపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా మా లక్ష్మి గ్రూపు సీఈవో సందీప్ మండవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, భీమవరం, కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధిలోని సెంట్రల్ జోన్ ఎన్నికల ప్రక్రియ సోమవారం జరిగిందని, దీనిలో కార్యవర్గం మొత్తం ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి కోనేరు రాజా ఓ ప్రకటన విడుదల చేశారు. గౌరవ చైర్మన్‌గా గద్దె రాజలింగం, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడిగా ఎం.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా సాదినేని వెంకట రమణ, కోశాధికారిగా పోట్ల వెంకట కృష్ణ, ఉపాధ్యక్షులుగా ఎం.గణేష్ కుమార్, జి.హరిప్రసాదరెడ్డి, కార్యదర్శులుగా సీహెచ్.శరత్ కుమార్, పి.రాజకుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరావు, శ్రీనివాస్ మెహర్, సురేష్, శ్రీనివాస్, కృష్ణ కిషోర్, వేణు మాధవ్, చైతన్య ఎన్నికయ్యారు. కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వీయ నియంత్రణ కలిగిన సంస్థగా స్థిరాస్తి రంగంలో నారెడ్కో పనిచేస్తోంది.

బాబూ.. ఉత్తరాంధ్రకు నువ్వు చేసిందేమిటి?

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: చంద్రబాబు ఉత్తరాంధ్రకు చేసిన మంచి ఏమిటో చెప్పాలని మంత్రి సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని మొత్తం 13 జిల్లాల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు 12, 13 స్థానాల్లో ఉన్నాయని చెప్పారు. ఆయన సోమవారం పలాసలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజలు కూడు, గూడు, గుడ్డ కోసం పోరాటాలు చేశారన్నారు. ఇప్పుడు ఇక్కడకు రాజధాని వస్తుంటే చంద్రబాబు అడ్డుపడుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. గౌతు కుటుంబ పాలనలో, చంద్రబాబు పాలనలో పలాస ఎలా ఉండేదో.. ఇప్పుడు జగనన్న పాలనలో పలాస ఎంత అభివృద్ధి చెందిందో చూడాలని కోరారు. 200 పడకల ఆస్పత్రి కట్టించామని, రూ.700 కోట్లతో మంచినీటి పథకం నిర్మించామని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తీసుకొచ్చామన్నారు. ఉద్దానాన్ని పునర్నిర్మించామని చెప్పారు. రాష్ట్రానికి వేలకోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయన్నారు. నాలుగు పోర్టులు, బల్క్‌డ్రగ్ పార్క్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు ప్రోద్బలంతోనే సీఎం వైఎస్ జగన్‌పై దాడి జరిగిందన్నారు. సీఎంపై దాడి జరగడానికి రెండు రోజుల ముందు చంద్రబాబు రెచ్చగొట్టేలా మాట్లాడారని మంత్రి గుర్తుచేశారు.

సానుభూతి కోసమే గులకరాయి డ్రామా: బొండా

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు)/ రాజమహేంద్రవరం రూరల్: సానుభూతి కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గులకరాయితో దాడి చేయించుకుని డ్రామాలు ఆడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా ఆరోపించారు. విజయవాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2019లో కోడి కత్తి డ్రామా, ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ఈ డ్రామాలో సూత్రధారులు, పాత్రధారులు వెలంపల్లి శ్రీను, కేశినేని నాని అని ఆరోపించారు. రౌడీషీటర్ వంకా శ్రీను గ్యాంగ్‌తోనే వారిద్దరూ ఈ డ్రామా ఆడించారని. వెలంపల్లి, కేశినేని సెల్‌ఫోన్ కాల్‌డేటాను పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. సీఎంపై నిజంగా దాడి జరిగిఉంటే సీబీఐతో విచారణ జరిపించాలని ఉమా డిమాండ్ చేశారు.

ఓటమి తెలిసే డ్రామా: గోరంట్ల

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోతుందని తెలిసే జగన్‌రెడ్డి గులకరాయి డ్రామాకు తెరలేపారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆరోపించారు. ఇది కోడి కత్తి జగన్ ఆడించిన గులక రాయి డ్రామా అని అన్నారు. జగన్ సభలో వేల మంది పోలీసులున్నప్పటికీ ఆయనకు రాయి సరిగ్గా కంటి మీద తగలడం వెనుక ఉన్న రహస్యం ఏమిటని బుచ్చయ్యచౌదరి ప్రశ్నించారు. సీఎం సభలో కరెంట్ పోవడం, తర్వాత గులకరాయి విసరడం అంతా బూటకమని గోరంట్ల ఆరోపించారు.

కీసరగుట్ట రామలింగేశ్వరుని సేవలో సీఎస్ జవహర్‌రెడ్డి

కీసర: తెలంగాణలో ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఉదయం తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐజీ నాగిరెడ్డితో కలిసి ఆలయానికి విచ్చేసిన సీఎస్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీరామలింగేశ్వరుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి,లడ్డూ ప్రసాదం అందజేశారు.

చదువులపై విషం కక్కిన నారా వారి కూలీ..

టీచర్లపై ఈనాడు తాగుబోతు రాతలు



సాక్షి, అమరావతి: తల్లిదండ్రుల తరువాత గురువుకు ప్రత్యేక స్థానం ఇచ్చిన సంస్కృతి మనది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ సంస్కృతిని కొనసాగిస్తూ వారికి అత్యున్నత గౌరవం ఇస్తోంది. ప్రతి అంశంలోనూ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్న గురివింద రామోజీకి ఇది మింగుడు పడలేదు. మద్యం దుకాణాల వద్ద ఉపాధ్యాయులను కాపలా పెట్టింది.. వారిచేత మరుగుదొడ్లు ఊడ్పించిందని టీచర్లను అవమానించేలా కట్టుకథ అల్లేసింది. ఈ పనులు ఎక్కడ చేయించిందో మాత్రం ఆ పత్రిక రాయదు. గత ప్రభుత్వంలో పిల్లలకే కాదు.. టీచర్లకూ మరుగుదొడ్లు లేవన్న సత్యాన్ని మరుగున పరిచింది. ఈ ప్రభుత్వ హయాంలో ప్రతి స్కూల్లో స్టాఫ్‌కు ప్రత్యేక, ఆధునిక సదుపాయాల కల్పన ఆ పత్రికకు కనబడవు. ఒకేసారి 25 వేల మంది ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించింది ఈ ప్రభుత్వమే. నాడు–నేడుతో 45 వేల ప్రభుత్వ బడులు అద్భుతంగా రూపురేఖలు మార్చుకున్నాయి. ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు, బోధనకు ఐఎఫ్‌పీ స్క్రీన్ల ఏర్పాటు జరిగాయి. వీటిని కావాలనే విస్మరించి ఆధారాలు లేని రాతలతో ఎల్లో మీడియా రెచ్చగొట్టే ప్రయత్నం చేసింది.

పాఠశాల అభివృద్ధిలో టీచర్లను భాగస్వామ్యం చేయడం తప్పేనా?

ఒకప్పటి బ్లాక్ బోర్డుల స్థానంలో ఇప్పుడు డిజిటల్ బోధన సాగుతోంది. విద్యార్థులు నేర్చుకునేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించేందుకు 2019–20 విద్యా సంవత్సరంలో 'మనబడి నాడు–నేడు' పథకానికి శ్రీకారం చుట్టింది. పాఠశాల విద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, సాంఘిక, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ, జువైనల్ వెల్ఫేర్, ఫిషరీస్, రెసిడెన్షియల్ పాఠశాలల ఆధ్వర్యంలో ఉన్న మొత్తం 44,512 స్కూళ్లను ఈ పథకం కిందకు తీసుకొచ్చింది. నిరంతర నీటి సరఫరాతో టాయిలెట్లు, శుద్ధి చేసిన తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, విద్యుదీకరణ, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, భవనాలకు పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, అదనపు తరగతి గదుల నిర్మాణం జరిగాయి. నాడు–నేడు మొదటి విడతలో రూ.3,669 కోట్లతో 15,715 పాఠశాలలు, రెండో దశలో రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలు బాగుపడ్డాయి. నాడు–నేడు పనులు చేపట్టిన అన్ని ఉన్నత పాఠశాలల్లోను ఇంటర్నెట్‌తో పాటు 62 వేల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లతో 3డీ డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 45 వేల స్మార్ట్ టీవీలతో పాఠాలతో పాటు టోఫెల్ శిక్షణ అందిస్తున్నారు. నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు బైజూస్ పాఠాలను ఉచితంగా అందిస్తున్నారు. 62 వేల డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయడం దేశ చరిత్రలో ఓ రికార్డు. ఇవన్నీ పూర్తి పారదర్శకత కొనసాగేందుకు తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుల కమిటీని ఏర్పాటు చేశారు. ఆ పాఠశాలకు ఏం అవసరమో వారే నిర్ణయించుకునే స్వేచ్ఛను ప్రభుత్వం ఉపాధ్యాయులకు అప్పగించింది. వీటిని తప్పంటోంది ఈనాడు పత్రిక. మీ రమాదేవి స్కూల్లో.. మీ నారాయణ స్కూళ్లల్లో ఇలాగే చేయిస్తున్నారా రామోజీ.

జగన్ పాలనలో	చంద్రబాబు పాలనలో
▪ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కొత్త భవనాల నుంచి మరుగుదొడ్ల వరకు సమకూరాయి. ▪ గత నాలుగేళ్లలో అర్హత కలిగిన 25 వేల మంది టీచర్లు ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. ఇందులో నాలుగేళ్ల సర్వీసు ఉన్నవారికీ అవకాశం లభించింది. ▪ నాడు–నేడుతో ప్రతి బడిలోనూ 12 రకాల సదుపాయాలు. ▪ బోధనకు డిజిటల్ స్క్రీన్లు, స్మార్ట్ టీవీలు. ▪ బడుల్లోకి కొత్త ఫర్నిచర్. ▪ మన బడికి అంతర్జాతీయ కీర్తి. ▪ కోవిడ్ కష్ట కాలంలో నెలల తరబడి పాఠశాలలు మూతబడినా ప్రతి టీచర్‌కు ఠంచన్‌గా వేతనాలు. ▪ బడిలో పాఠాలు చెప్పడం, అభివృద్ధి పనులు పర్యవేక్షించడం తప్ప ఏ ఉపాధ్యాయుడికీ అదనపు పనులు అప్పగించలేదు. ▪ మరుగుదొడ్లను ప్రతిరోజు శుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది ఉన్నారు. వారికి ప్రతినెలా వేతనాలు చెల్లించేందుకు 'టాయిలెట్ మెయింటనెన్స్ ఫండ్'ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ టాయిలెట్లు పరిశుభ్రంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించే బాధ్యత స్థానిక ఉపాధ్యాయులు తీసుకున్నారు.	▪ 2000 సంవత్సరంలో అనంతపురం జిల్లా నార్పల మండలం గూగూడులో చంద్రబాబు జన్మభూమి సమావేశం ఏర్పాటు చేసి స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని స్టేజీ మీదకు పిలిచారు. నూరు శాతం ఫలితాలు తేవాలని ఆదేశించారు. సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో సాధ్యం కాదని ఆ ప్రధానోపాధ్యాయుడు ఉన్నది ఉన్నట్టు చెప్పారు. అంతే అదే వేదికపై ఆ హెచ్‌ఎంను సస్పెండ్ చేశారు. ▪ 2003లో మంత్రిగా చేసిన నిమ్మల కిష్టప్ప గోరంట్లలో నిర్వహించిన జన్మభూమి కమిటీ సమావేశంలో టీచర్‌ను చెట్టుకు కట్టేసి కొట్టమని అనుచరులను రెచ్చగొట్టారు. ▪ మరుగుదొడ్లు లేక మహిళా టీచర్ల ఇబ్బందులు వర్ణనాతీతం. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆ అవసరం తీర్చుకునేవారు. ▪ జన్మభూమి సభ్యులే పేరెంట్స్ కమిటీల్లో చేరిపోయి పప్పు, బియ్యం ఎత్తుకెళితే అడిగినందుకు ఉపాధ్యాయులపై దౌర్జన్యాలు చేశారు. ▪ ఉపాధ్యాయులను నియమించకుండా నూరు శాతం ఫలితాలు తేవాలని ఒత్తిడి చేశారు. సాధ్యం కాదని చెబితే వెంటనే సస్పెండ్ చేసేవారు.

ఈ రాతలు టీచర్లను అవమానించడమే

గతంలో పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక ఉపాధ్యాయినులు పట్టణాలకే గాని మండల స్థాయి పాఠశాలలకు వచ్చేందుకు ఇష్టపడేవారు కాదు. బ్లాక్ బోర్డులపై రాసేందుకు సుద్దముక్క కూడా ఉండేది కాదు. ఈ ప్రభుత్వంలో పిల్లలకు, స్టాఫ్‌కు అన్ని సదుపాయాలు కల్పించింది కళ్లకు కనిపిస్తున్నాయి. తప్పుడు రాతలు రాసి టీచర్ల మనోభావాలను కించపరచడం దుర్మార్గం. ఉపాధ్యాయుల విధులు, సిబ్బంది విధులు ప్రత్యేకంగా ఉంటాయి. రాష్ట్రంలో ఎక్కడా ఏ టీచర్ కూడా మరుగుదొడ్లు కడిగింది లేదు. గతంలో ఎన్నికల విధులకు వెళ్లే ఉపాధ్యాయులు స్థానిక బడుల్లో ఉండలేక కష్టాలు పడేవారు. ఇప్పుడు రాష్ట్రంలో ఏ పాఠశాలకైనా నిర్భయంగా వెళ్లే అవకాశం ఈ ప్రభుత్వం కల్పించింది.

– గోపీకృష్ణ, ఉపాధ్యాయుడు (వైఎస్సార్‌టీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్)

ఎదుటవారిని నాశనం చేయడమే బాబు నైజం

- గాంధీ అంతటివాళ్లే సారా అమ్ముతున్నారని నమ్మించగలడు
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



సాక్షి, తిరుపతి: చంద్రబాబు పరమనీచుడు.. గాంధీ అంతటి వారినైనా దొంగసారా అమ్మిస్తున్నారని నమ్మించగలిగే వ్యక్తి.. అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. తిరుపతిలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మోసం, హత్యా రాజకీయాలతో కలగలిసి ఎదిగిన చంద్రబాబు నైజం అవతలి వాళ్లను నాశనం చేయడమేనని చెప్పారు. ఐఏఎస్ అధికారి రాఘవేంద్రరావు, తన స్నేహితుడు పింగళి దశరథరామయ్య, వంగవీటి మోహనరంగా హత్యల్లోను, అనంతపురంలో 475 మర్డర్లు జరిగితే ఒక్క శవం కూడా దొరక్కుండా కేసులు నమోదు కాకుండా చేయడంలోను చంద్రబాబు హస్తం ఉందని ఆరోపించారు. రాజారెడ్డి హత్యకేసులో నిందితులకు షెల్టర్ ఇచ్చాడని విమర్శించారు. చంద్రబాబు చేసిన తప్పుల్ని ప్రజలు మర్చిపోలేరన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై దాడి జరిగిన వెంటనే అచ్చెన్నాయుడు డ్రామా అనడం దారుణమని చెప్పారు. చంద్రబాబు జీవితం అంతా హత్యారాజకీయమేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భౌతికంగా ఉంటే తనకు రాజకీయ భవిష్యత్తు ఉండదని రెక్కీ నిర్వహించాడని, అందులో భాగంగానే విజయవాడలో రాయితో దాడి చేయించాడని మండిపడ్డారు. పవన్‌కళ్యాణ్ దుర్మార్గంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2003లో చంద్రబాబుపై అలిపిరి దాడి జరిగినప్పుడు టీ పోసే వ్యక్తి కూడా స్పందించలేదని గుర్తుచేశారు. చంద్రబాబుపై దాడి జరిగిన రోజు గాంధీ విగ్రహం దగ్గర వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. అది వైఎస్సార్ కుటుంబం గొప్పతనమన్నారు. గత దుర్మార్గాలు చూస్తే చంద్రబాబుపై దాడి జరిగినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబునాయుడు రెచ్చగొట్టడం వల్లనే సీఎం వైఎస్ జగన్‌పై దాడి జరిగిందని ఆయన చెప్పారు.

పేదల నోటికాడ కూడు లాగే సంస్కృతి బాబుది..

- సామాన్యులకు సీట్లిస్తే తట్టుకోలేని సంపన్న వర్గం
- దళిత ఆత్మీయ సమావేశంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్



మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్

మైలవరం: అధికారంలో ఉన్నన్నాళ్లు పేదలను నిలువునా ముంచిన చంద్రబాబు.. ఇప్పుడు వారి నోటికాడ కూడు కూడా లాక్కునేందుకు వెనుకాడడం లేదని బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను అక్కున చేర్చుకుని ఆకలి తీరుస్తుంటే.. పేదల పొట్ట కొట్టి పెద్దలకు పెట్టాలనే యోచనలో చంద్రబాబు నిరంతరం తలమునకలై ఉంటున్నాడని మండిపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రాంగణంలో మైలవరం సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి అధ్యక్షతన సోమవారం జరిగిన దళిత ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సురేష్ మాట్లాడుతూ.. ఒక సామాన్య వ్యక్తికి మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా సీటు కేటాయిస్తే ప్రతిపక్షంలోని సంపన్న వర్గం తట్టుకోలేకపోతున్నదన్నారు. బాపట్లలో తనను, మైలవరంలో సర్నాల తిరుపతిరావును జగన్ ఎంపిక చేసి సీట్లు కేటాయిస్తే ప్రతిపక్షంలోని ధనికవర్గం కుతకుతలాడిపోతున్నదని ధ్వజమెత్తారు. దీనిలో భాగంగానే ముఖ్యమంత్రిపై హత్యాయత్నానికి కూడా ఒడిగట్టారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనలో భాగంగా సమసమాజ నిర్మాణానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు కొనియాడారు. సామాన్యుడినైన తనను గుర్తించి జగన్ సీటు కేటాయిస్తే.. ఓర్చుకోలేని వసంత వెంకట కృష్ణప్రసాద్ తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతి రావు దుయ్యబట్టారు. నిన్నటి వరకు జగన్‌ను పొగిడిన నోటితోనే ఇప్పుడు విమర్శించడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

చంద్రబాబు సీట్లు అమ్ముకున్నాడు

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మొత్తం 10 సీట్లు వైఎస్సార్‌సీపీకే
- టీడీపీ సున్నా చుట్టుకుంటుంది
- మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జి.వీరశివారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి

వల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు డబ్బులకు సీట్లు అమ్ముకున్నాడని వైఎస్సార్ జిల్లా కమలాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జి.వీరశివారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయన్నారు. మొత్తం పదిసీట్లు వైఎస్సార్‌సీపీకే వస్తాయని, టీడీపీ సున్నా చుట్టుకుంటుందని పేర్కొన్నారు. టీడీపీ సీట్ల కేటాయింపులో ధనప్రభావం మాత్రమే పనిచేసిందన్నారు. రూ.20 కోట్లో, రూ.30 కోట్లో ఇచ్చిన వారికి, ఎన్నికల్లో ఖర్చులన్నీ తామే భరిస్తామన్నోళ్లకు మాత్రమే సీట్లు కేటాయించారని పేర్కొన్నారు. సీట్ల కేటాయింపులో చంద్రబాబు పెద్ద మొత్తంలో డబ్బులు వెనకేసుకున్నారు తప్ప ఎన్నికల్లో ఫలితాలను ఆశించలేదని చెప్పారు. డబ్బులు తీసుకుని పార్టీలో సభ్యత్వం లేని వారికి, సంబంధం లేని వ్యక్తులకు అస్తవ్యస్తంగా సీట్లు కేటాయించారన్నారు. గెలుపు గుర్రాలను, సీనియర్ నాయకులను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం డబ్బులకు ప్రాధాన్యత ఇచ్చి నిరంతరం ఓడిపోయే వారికి సీట్లు కేటాయించారని విమర్శించారు.

టీడీపీలో కొనసాగే ప్రసక్తే లేదు

మూడుసార్లు గెలిచిన తనకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నేటికీ ప్రజాదరణ ఉందని చెప్పారు. అలాంటి తనను కాదని వరుసగా నాలుగుసార్లు ఓడిపోయిన కుటుంబానికి కమలాపురం సీటు కేటాయించారన్నారు. చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడనుకున్నానని, డబ్బులకు అమ్ముడుపోయాడని తరువాత తెలిసిందని చెప్పారు. ఆత్మాభిమానం ఉన్న వ్యక్తిగా తాను విలువల్లేని టీడీపీలో కొనసాగే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. టీడీపీలోనే ఉన్న తనకు తెలియకుండా కమలాపురం టీడీపీ అభ్యర్థి తన స్వగ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్ కార్యాచరణపై తన అభిమాన నాయకులు, సానుభూతిపరులు, అనుయాయులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటానని ఆయన తెలిపారు.

బాలశౌరి, బోడె ప్రసాద్‌పై కేసు నమోదు

పెనమలూరు: ఎన్నికల ప్రచారంలో దురుసుగా ప్రవర్తించి వైఎస్సార్‌సీపీ ప్రచార ఆటోపై ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన ఘటనలో జనసేన మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, టీడీపీ పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బోడె ప్రసాద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు సోమవారం తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం యనమలకుదురులో వైఎస్సార్‌సీపీ ఆఫీస్ వద్ద ఆ పార్టీ ప్రచార ఆటో నిలిపి ఉంది. అటుగా వెళుతోన్న టీడీపీ నేతలు పత్తిపాటి వెంకటేశ్వరరావు, కమ్మిలి నాగేశ్వరరావు, వడ్డి జీవ, గంధం సురేష్ వైఎస్సార్‌సీపీ ఆఫీస్ ఎదుట బాణసంచా పేల్చి ప్రచార ఆటోకు ఉన్న ఫ్లెక్సీలను ధ్వంసం చేసి పార్టీ ఆఫీస్‌లోకి ప్రవేశించి దురుసుగా ప్రవర్తించారు. దీనికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుపడగా వారిపై దాడి చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రచార కన్వీనర్ మరీదు గురుప్రసాద్ అటుగా ర్యాలీగా వచ్చిన వల్లభనేని బాలశౌరి, బోడె ప్రసాద్‌లను నిలదీశారు. దీంతో ఆ ఇద్దరు నేతలు గురుప్రసాద్‌పై రెచ్చిపోయారు. తీవ్రస్థాయిలో తిట్లదండకం అందుకుంటూ తాము ఫ్లెక్సీలే కాదు, ఆటోను కూడా ధ్వంసం చేస్తామని, తమను ఎవరూ ఏమీ చేయలేరని బెదిరించారు. దీనిపై గురుప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..బాలశౌరి, బోడె, పత్తిపాటి వెంకటేశ్వరరావు, కమ్మిలి నాగేశ్వరరావు, వడ్డి జీవ, గంధం సురేష్, మరికొందరిపై కేసు నమోదు చేశారు.

రాయచోటి టౌన్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. అనుమతులు లేకుండా ఆదివారం రాయచోటిలో ర్యాలీని నిర్వహించారని, దీనిపై మునిసిపల్ కమిషనర్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రశాంతంగా ఎన్నికలు



అధికారులతో మాట్లాడుతున్న సీఎస్‌లు జవహర్‌రెడ్డి, శాంతి కుమారి

సాక్షి, అమరావతి: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పనిచేయాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు నిర్ణయించాయి. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అంతర్ రాష్ట్ర ఎన్నికల సంబంధిత అంశాలపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు డా.కేఎస్. జవహర్‌రెడ్డి, శాంతికుమారి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవిగుప్త, అడిషనల్ డీజీలు శివధర్‌రెడ్డి, మహేష్ భగవత్, ఏపీ అడిషనల్ డీజీ డా.శంఖబ్రత బాగ్చి, వాణిజ్య పన్నులు, ఎక్సయిజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా.రజత్‌భార్గవ తదితర అధికారులు హాజరయ్యారు.

పూర్తి స్థాయి సమన్వయంతో కృషి: ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి

ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీలో అక్రమ మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిరోధానికి ఆపరేషన్ పరివర్తన్ పేరిట చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫాలితాలనిచ్చిందని తెలిపారు. ఏపీతో ఉన్న వివిధ రాష్ట్ర సరిహద్దుల్లో పలు శాఖల ద్వారా 129 పైగా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అక్రమ మద్యం రవాణా,డబ్బు పంపిణీ,వివిధ వస్తువుల రవాణాను నియంత్రించేందుకు ఈ ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు.

చెక్‌పోస్టుల్లో మరింత అప్రమత్తం: తెలంగాణ సీఎస్ శాంతికుమారి

తెలంగాణ సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ అక్రమ మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వివిధ వస్తువుల రవాణా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేశామన్నారు. శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ఇదే రకమైన వాతావరణాన్ని పోలింగ్ పూర్తయ్యే వరకు కొనసాగేలా చర్యలు తీసుకున్నట్టు శాంతికుమారి తెలిపారు.

పవన్, బాలకృష్ణపై చర్యలు తీసుకోండి

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్, నందమూరి బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేశారు. సోమవారం సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్‌మీనాను కలిసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఆధారాలతో ఫిర్యాదు అందజేశారు. ఈ నెల 13న కదిరి బహిరంగ సభలో టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఈ నెల 14న తెనాలి నియోజకవర్గంలో జనసేన సభలో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఎన్నిక కోడ్‌కు విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనాడు దినపత్రిక ఎన్నికల నియమావళికి విరుద్ధంగా కథనాలు రాస్తోందని, దీనిపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల సంఘాన్ని కలిసిన వారిలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహరరెడ్డి తదితరులు ఉన్నారు.



సీఈవో మీనాకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భారీ ప్లాన్ అనగానే భయపడొద్దు

జాతి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు

- నా ధ్యాసంతా 2047 విజన్ మీదే
- అభివృద్ధితో దేశాన్ని పరుగులు పెట్టిస్తా
- అందరూ కొత్త సంకల్పంతో ముందడుగు వేయాలి
- ఏఎన్ఐ ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించిన ప్రధాని



ఇంటర్వ్యూ

న్యూఢిల్లీ: భారత్ కోసం బృహత్ ప్రణాళికలు ప్రకటించిన ప్రతిసారీ భయపడాల్సిన పనిలేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దు ప్రకటించిన క్షణాన దేశవ్యాప్తంగా జనంలో ఒకింత ఆందోళన, పాత నోట్ల మార్పిడిపై భయాలు నెలకొన్న ఘటనను ప్రధాని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. ఏఎన్ఐ వార్తాసంస్థతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రధాని మోదీ పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. '' పెద్ద ప్రణాళిక ఉంది అన్నంతమాత్రాన ఎవరూ భయపడాల్సిన పని లేదు. ఎవరినీ ఆందోళనకు గురిచేసేలా నా నిర్ణయాలు ఉండవు. దేశ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా నా నిర్ణయాలుంటాయి. సాధారణంగా ప్రజా సంక్షేమం కోసం అంతా చేశామని ప్రభుత్వాలు ప్రకటించుకుంటాయి. అంతా నేనే చేశానంటే నమ్మను. సవ్యపథంలో ప్రజాసంక్షేమానికి శాయశక్తులా కృషిచేస్తా. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. నా దేశం సాధించాల్సింది ఇంకా ఉంది. ప్రతి కుటుంబం కలను నెరవేర్చేది ఎలాగ అనేదే నా ఆలోచన. అందుకే గత పదేళ్లలో చేసింది ట్రైలర్ మాత్రమే అంటున్నా'' అని మోదీ చెప్పారు.

100 రోజుల ప్లాన్ ముందే సిద్ధం

'' నా ధ్యాసంతా 2047 విజన్ మీదే. గుజరాత్ ముఖ్యమంత్రిగా చాలా సంవత్సరాలుగా పనిచేసిన అనభవం ఉంది. ఆ రోజుల్లో ఎన్నికలొచ్చినపుడు ఓ 40 మంది సీనియర్ ఉన్నతాధికారులు ఎన్నికల పర్యవేక్షక విధుల్లోకి వెళ్లిపోయేవారు. అలా దాదాపు 50 రోజులు కీలక అధికారులు లేకుండా రాష్ట్రాన్ని ఎలా పరిపాలించాలి అనేదే సమస్యగా ఉండేది. తరచూ ఎన్నికలు జరిగే దేశంలో ఇలాంటి సమస్యలు అనివార్యం. వాళ్లు లేని ఆ 50 రోజులు నాకు విరామం ఇచ్చినట్లు కాదని నిర్ణయించుకున్నా. పూర్తిచేయాల్సిన పనులను ముందే వాళ్లకు పురమాయించేవాడిని. రాబోయే ప్రభుత్వం కోసమే ఈ పనులు చేయండని ఆదేశించేవాడిని. అలా 100 రోజుల ముందస్తు ప్రణాళిక పద్ధతి ఆనాడే అలవాటైంది నాకు. అదే మాదిరి ఇప్పుడూ మూడోసారి ప్రధాని అయితే తొలి 100 రోజుల్లో చేయాల్సిన పనులు, ప్రణాళికలను ముందే సిద్ధంచేసి పెట్టుకున్నా. 2047 వికసిత భారత్ కోసం చేయాల్సిన పనులపై గత రెండు సంవత్సరాలుగా కసరత్తు చేస్తున్నాం'' అని మోదీ వెల్లడించారు.

విఫల కాంగ్రెస్‌కు, సఫల కమలానికి పోటీ

'' వైఫల్యాల కాంగ్రెస్ విధానానికి, అభివృద్ధిని సాకారం చేసిన బీజేపీ విధానాలకు మధ్య పోటీ ఈ ఎన్నికలు. కాంగ్రెస్ ఐదారు దశాబ్దాలు పాలించింది. మాకు ఈ పదేళ్లే పనిచేసే అవకాశమొచ్చింది. అందులోనూ కోవిడ్ వల్ల రెండేళ్లకాలాన్ని కోల్పోయాం. ఈ ఎనిమిదేళ్లలో దేశంలో కనిపిస్తున్న అభివృద్ధిని, నాటి కాంగ్రెస్, నేటి ఎన్‌డీఏ పాలనతో పోల్చి చూడండి. అభివృద్ధి విస్తృతి, వేగాన్ని లెక్కలోకి తీసుకుని ఓటరు ఎటువైపు నిలబడాలో తేల్చుకోవాల్సిన తరుణమిది. వచ్చే ఐదేళ్లకాలంలో అభివృద్ధిని పరుగుపెట్టిస్తాం. దేశాన్ని పాలించే బాధ్యతలు మనకు అప్పగించినప్పుడు ఒక్కటే లక్ష్యం కళ్ల ముందు కదలాడుతుంది. అదే దేశ ప్రజల అభ్యున్నతి'' అని మోదీ అన్నారు. గాంధీల కుటుంబంపై మోదీ విమర్శలు ఎక్కుపెట్టారు. '' ఒక్క కుటుంబ ప్రయోజనాలే పరమావధిగా నాడు రాజకీయ సంస్కృతి కొనసాగింది. కుటుంబ పునాదులు కదలకుండా అంతా కాపుగాశారు. దేశ పునాదులను పటిష్టపరిచే సదుద్దేశంతో పనిచేస్తున్నా. నిజాయితీతో మేం చేసిన పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి'' అని అన్నారు.

తొలి 100 రోజుల్లో చేసినవే అవి..

''2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందే 100 రోజుల ప్లాన్ సిద్ధం చేశాం. గెలిచి రాగానే ఒక్క నిమిషం కూడా వృథాచేయకుండా వాటి అమలుపై దృష్టిపెట్టా. 2019లో గెలిచిన 100 రోజుల్లోపే ఆర్టికల్ 370ని రద్దుచేశా. ట్రిపుల్ తలాఖ్‌ను రద్దుచేయడంతో ముస్లిం సోదరీమణులకు స్వేచ్ఛ లభించింది. ఇది కూడా తొలి 100 రోజుల్లోనే అమలుచేశా. విశ్వాసమనేది కొండంత బలాన్ని ఇస్తుంది. భారతీయులు నా మీద పెట్టుకున్న నమ్మకం నాపై వాళ్లు ఉంచిన బాధ్యతగా భావిస్తా. భరతమాత ముద్దుబిడ్డగా నేను చేస్తున్న సేవ ఇది'' అని మోదీ వ్యాఖ్యానించారు.

20 లక్షల మంది నుంచి సలహాలు

'వచ్చే పాతికేళ్లలో దేశం ఎలాంటి అభివృద్ధి దిశలో పయనిస్తే బాగుంటుందో చెప్పాలని లక్షలాది మందిని సలహాలు అడిగా. వారి నుంచి సూచనలు స్వీకరించా. విశ్వవిద్యాలయాలు, వేర్వేరు రంగాల ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు ఇలా దాదాపు 15–20 లక్షల మంది నుంచి సలహాలు తీసుకున్నా. కృత్రిమ మేథ సాయంతో సలహాలను రంగాలవారీగా విభజించా. ప్రతి మంత్రిత్వశాఖ, డిపార్ట్‌మెంట్‌లో అంకితభావంతో పనిచేసే అధికారులకు ఈ పని అప్పగించా. ఈసారి ఐదేళ్ల ఎన్‌డీఏ హయాంలో చేయగలిగిన అభివృద్ధి ఎంత అని బేరీజువేసుకున్నా. 2047నాటికి స్వాతంత్య్రం సిద్ధించి వందేళ్లు పూర్తవుతుంది. ఇలాంటి మైలురాయిని చేరుకున్నపుడు గ్రామమైనా, దేశమైనా కొత్త సంకల్పంతో ముందడుగు వేయాలి. నా గ్రామానికి నేనే పెద్ద అయినపుడు 2047కల్లా సొంతూరుకు ఏదైనా మంచి చేయాలని అనుకుంటాను కదా. దేశవ్యాప్తంగా ఇలాంటి స్ఫూర్తి రగలాలి. వందేళ్ల స్వాతంత్య్ర ఉత్సవాలు అనేవి ప్రతి ఒక్కరికీ గొప్ప స్ఫూర్తినిస్తాయి'' అని మోదీ అన్నారు.

మే 15న పదవి నుంచి తప్పుకుంటా: లూంగ్

సింగపూర్: సింగపూర్ ప్రధానిగా దాదాపు రెండు దశాబ్దాలపాటు కొనసాగిన లీ సీయన్ లూంగ్(72) రిటైర్మెంట్ ప్రకటించారు. మే 15వ తేదీన బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు లూంగ్ సోమవారం తెలిపారు. అదే రోజున ఉప ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్(51) ప్రధానిగా బాధ్యతలు చేపడతారన్నారు. సింగపూర్ మూడో ప్రధానిగా 2004లో లూంగ్ బాధ్యతలు చేపట్టారు. ఏ దేశానికైనా నాయకత్వ మార్పిడి ఎంతో ముఖ్యమైన విషయమని ఆయన ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. సింగపూర్‌కు మరింత ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు వాంగ్ ప్రభుత్వానికి సహకారం అందించాల్సిందిగా ప్రజలను ఆయన కోరారు.

ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

వాతావరణ శాఖ అంచనా



న్యూఢిల్లీ: ఎండలు, వడగాడ్పులతో అల్లాడుతున్న వేళ భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చల్లని కబురు మోసుకొచ్చింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సమృద్ధిగా వానలు కురుస్తాయని శుభవార్త చెప్పింది. 'లా నినో' వాతావరణ పరిస్థితులు కలిసిరావడంతో దేశంలో ఈసారి సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనావేసింది. వాతావరణ శాఖ అంచనా వివరాలను కేంద్ర భూవిజ్ఞానశాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. ''దీర్ఘకాల సగటు వర్షపాతం 106 శాతం మేర పడొచ్చు. అంటే 87 సెంటీమీటర్లకు మించి నమోదు కావచ్చు. ప్రస్తుతం భూమధ్య రేఖ పసిఫిక్ ప్రాంతంలో మధ్యస్థ ఎల్‌నినో పరిస్థితులున్నాయి. ఈ ఎల్ నినో (వర్షాభావ పరిస్థితులు) నైరుతి రుతుపవనాల ప్రవేశం (జూన్) నాటికి బలహీనపడి, ద్వితీయార్థంలో లా నినో (వర్షాలకు అనుకూల) పరిస్థితులు ఏర్పడనున్నాయి. గడచిన మూడు నెల్లో ఉత్తరార్ధ గోళం, యూరేసియాలో మంచు సాధారణం కన్నా తక్కువగా ఉంది. దీంతో ఈసారి భారత్‌లో వర్షపాతం సాధారణం కన్నా ఎక్కువ నమోదు కావచ్చు'' అని పేర్కొన్నారు. దేశ సాగు విస్తీర్ణంలో 52 శాతం పంటలు వర్షాధార పంటలే. రిజర్వాయర్లు అడుగంటి తాగునీటికి సైతం జనం కష్టాలు పడుతున్న ఈ తరుణంలో వాతావరణ శాఖ ప్రకటన రైతాంగాన్ని భారీ ఊరటనిస్తోంది. అయితే వాయవ్య, తూర్పు, ఈశాన్య భారతావనిలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదుకావచ్చని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర అంచనా వేశారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లలో వర్షపాత వివరాలను ఐఎండీ వెల్లడించలేదు. గత 50 ఏళ్ల సగటున అయిన 87 సెంటీమీటర్ల వర్షపాతంలో 96 శాతం నుంచి 104 శాతాన్ని 'సాధారణ వర్షపాతం'గా ఐఎండీ గణిస్తోంది. దీర్ఘకాల సగటులో 90 శాతం కన్నా తక్కువ వర్షపాతం కురిస్తే దానిని వర్షాభావ పరిస్థితిగా లెక్కిస్తారు. 90–95 శాతం కురిస్తే దానిని సాధారణ వర్షపాతంగా, 105–110 శాతం కురిస్తే సాధారణం కన్నా ఎక్కువగా పరిగణిస్తారు. 1951–2023 కాలంలో పరిశీలిస్తే ఎల్ నినో తర్వాత వచ్చే లా నినో సందర్భాల్లో తొమ్మిదిసార్లు దేశంలో రుతుపవన కాలాల్లో సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదైంది. లా నినో సంభవించిన 22 సంవత్సరాల్లో 20 సార్లు సాధారణం/సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

రాజ్యాంగ సంస్థలు మోదీ సొత్తు కాదు

వయనాడ్ ప్రచార సభలో రాహుల్ విమర్శ

వయనాడ్/నీలగిరి: సీబీఐ, ఈడీ మొదలుకుని కేంద్ర ఎన్నికల సంఘం దాకా ప్రతి రాజ్యాంగబద్ధ సంస్థల్లోకి తమ వారిని జొప్పిస్తూ ప్రధాని మోదీ వాటిని తన సొంత ఆస్తులుగా భావిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేరళలోని సొంత ఎంపీ నియోజకవర్గం వయనాడ్‌లో ప్రచారంలో భాగంగా సోమవారం వల్లి మండలో రోడ్‌షో నిర్వహించి అక్కడి పార్టీ కార్యకర్తలు, ఓటర్లనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. '' రాజ్యాంగబద్ధ సంస్థలన్నింటనీ బీజేపీ హస్తగతం చేసుకుంటున్న తీరు మీకందరికీ అర్థమయ్యే ఉంటుంది. న్యాయవ్యవస్థ, ఎలక్షన్ కమిషన్, సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖ ఇలా ప్రతి రాజ్యాంగబద్ధ విభాగంలోనూ తమ అస్మదీయులను జొప్పించడంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ బిజీగా ఉన్నాయి. అవే రాజ్యాంగబద్ధ సంస్థల పరిరక్షణ కోసం విపక్షాల 'ఇండియా' కూటమి పాటుపడుతోంది. ఇవి ఎవరి సొంత సంస్థలుకావు. ప్రధాని మోదీ వ్యక్తిగత ఆస్తులు అస్సలు కావు. ఇవి ప్రతి ఒక్క భారతీయ పౌరుడివి. రాజ్యాంగాన్ని సవరించబోతున్నట్లు ఒక బీజేపీ ఎంపీ ఇటీవలే ప్రకటించారు. రాజ్యాంగాన్ని మార్చే అవకాశం ఆర్‌ఎస్‌ఎస్‌కు కాంగ్రెస్ పార్టీ ఇవ్వదు. రాజ్యాంగాన్ని తమకు నచ్చినట్లు మార్చేసి జాతి సమున్నత ఆశయాలను సమాధిచేయాలని చూస్తున్నారు' అని ఆరోపించారు. '' కేరళను నాగ్‌పూర్(ఆర్‌ఎస్‌ఎస్ ప్రధానకేంద్రం) పాలించకూడదు. సొంత పట్టణాలు, పల్లెల నుంచే పరిపాలన సాగాలి. కేరళ ప్రజలకు ఏం కావాలో, వాళ్లేం ఆశిస్తున్నారో ఢిల్లీ(మోదీ సర్కార్)కి ఎలా తెలుస్తుంది?'' అని ప్రశ్నించారు. ''ఎంతోకాలంగా డిమాండ్‌చేస్తున్నా సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ సర్కార్ వయనాడ్ జిల్లాలో ఇంతవరకు ఒక్క వైద్యకళాశాలను ఏర్పాటుచేయలేదు. యూడీఎఫ్ ప్రభుత్వం వస్తేగానీ కాలేజీ రాదేమో'' అని విమర్శించారు. 'ఇంతటి అందమైన ప్రదేశం వయనాడ్‌లో ఓ వారం పది రోజులు గడపమని మా అమ్మ(సోనియా)కు చెప్పా. ఆమెకు అతి ఉక్కబోత పడదు. భువిపైనే అందమైన ప్రదేశాన్ని మిస్ అవుతున్నావని గుర్తుచేశా'' అని రాహుల్ అన్నారు.



రాహుల్ హెలికాప్టర్‌లో తనిఖీలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా తమిళనాడులోని నీలగిరి ప్రాంతానికి రాహుల్ వచ్చినపుడు ఆయన ప్రయాణించిన హెలీకాప్టర్‌లో ఎన్నికల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఎలాంటి చట్టవ్యతిరేక వస్తువులు లభించలేదు.

పదేళ్ల అభివృద్ధి.. ట్రైలర్ మాత్రమే: మోదీ

త్రిసూర్/తిరువనంతపురం/తిరునల్వేలి: గత దశాబ్దాకాలంగా ఎన్‌డీఏ పాలనాకాలంలో దేశం చవిచూసిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాకారంకానుందని ఆయన ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యతనిస్తూ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప పత్రం' విడుదల చేసిన మరుసటి రోజే ప్రధాని మోదీ ఆ హామీలను పునరుద్ఘాటించారు. కేరళలోని కున్నమ్‌కులమ్, కట్టకడ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగసభల్లో మోదీ ప్రసంగించారు. రాహుల్‌గాంధీపై పరోక్ష విమర్శలు చేశారు. '' కాంగ్రెస్ యువరాజుకు ఉత్తరప్రదేశ్‌లో దశాబ్దాలుగా తమ కుటుంబ గౌరవం(అమేథీ ఎంపీ స్థానం)ను కాపాడే సత్తాలేదుగానీ కేరళకు వచ్చి ఓట్లడుగుతారు. కేరళీయుల ఓట్లడిగే ఆయన సీపీఐ(ఎం) ఏలుబడిలో కరువన్నూర్ సహకార బ్యాంక్‌లో వెలుగుచూసిన కుంభకోణంపై నోరు మెదపరెందుకు? నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా రాజకీయ విభాగం సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతు కాంగ్రెస్‌కు ఉంది. ఈ రెండింటి మధ్య చీకటి ఒప్పందం కుదిరింది. కోఆపరేటివ్ బ్యాంక్ స్కామ్‌కు పాల్పడి ప్రజాధనాన్ని లూటీ చేశారు. ఈ మోసంపై నేనే ఈడీ దర్యాప్తునకు ఆదేశించా'' అని అన్నారు.

లెఫ్ట్ ఉంటే అంతా లెఫ్ట్ అయినట్లే

''కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి, అధికార ఎల్‌డీఎఫ్ కూటములు కేరళలో అభివృద్ధికి ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. త్రిపుర, పశ్చిమబెంగాల్, కేరళ ఈ రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీ అధికారంలో ఉందీ అంటే అక్కడ అంతా పోయినట్లే(లెఫ్ట్ అయినట్లే). అక్కడ మంచి అనేదే జరగదు. పశ్చిమబెంగాల్, త్రిపురలో ఏం చేశారని, కొత్తగా కేరళకు చేయడానికి?' అంటూ ధ్వజమెత్తారు.

కచ్చతీవు ఉదంతాన్ని, 4 దశాబ్దాలు దాచారు

తమిళనాడులోని తిరునల్వేలిలో జరిగిన సభలోనూ మోదీ ప్రసంగించారు. కచ్చ తీవును శ్రీలంకకు ఇచ్చేసి కాంగ్రెస్, డీఎంకే ఈ ఉదంతాన్ని 40 ఏళ్లు దాచిపెట్టాయని మోదీ ఆరోపించారు. అక్కడ తమిళ మత్స్యకారులు తరచూ అరెస్ట్ అవుతున్నారని, ఈ పాపం ఆ పార్టీలదేనన్నారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీకి సుప్రీం నోటీస్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ సీఎం కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. ఈ నెల 24వ తేదీ లోగా సమాధానమివ్వాలని ఈడీని ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణ ఈ నెల 29వ తేదీన చేపడతామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం సోమవారం పేర్కొంది. సాధ్యమైనంత త్వరగా విచారణ చేపట్టాలన్న అభిషేక్ సింఘ్వీ వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం చట్ట విరుద్ధం కాదంటూ ఢిల్లీ హైకోర్టు ఈ నెల 9వ తేదీన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఇలా ఉండగా, ఈ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23వ తేదీ వరకు పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన 15 రోజుల కస్టడీ గడువు ముగియడంతో సోమవారం సీబీఐ, ఈడీ కేసుల ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా వర్చువల్‌గా విచారణ చేపట్టారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. ఇదే కేసులో బీఆర్‌ఎస్ నేత కె.కవిత తదితర నిందితుల కస్టడీ గడువు కూడా అదే రోజుతో ముగుస్తోందని ఆమె తెలిపారు.

న్యాయవ్యవస్థను తక్కువ చేసేందుకు ప్రయత్నాలు

సీజేఐకి రాసిన లేఖలో రిటైర్డు జడ్జీల ఆందోళన

న్యూఢిల్లీ: పథకం ప్రకారం ఒత్తిళ్లు తేవడం, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం, బహిరంగ విమర్శల ద్వారా న్యాయ వ్యవస్థను చులకన చేసేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని రిటైర్డు జడ్జీల బృందం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు రాసిన లేఖలో ఆందోళన వ్యక్తం చేసింది. వ్యక్తిగత లబ్ధి, రాజకీయ స్వార్థం కోసం జరిగే ఇటువంటి ప్రయత్నాల కారణంగా న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం తగ్గిపోయే ప్రమాదముందని వారు పేర్కొన్నారు. అయితే, ఏ పరిణామాలు తమను ఈ లేఖ రాసేందుకు ప్రేరేపించాయనే విషయాన్ని అందులో వారు ప్రస్తావించలేదు. అవినీతి కేసుల్లో కొందరు ప్రతిపక్ష నేతల అరెస్టుపై అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్న సమయంలో ఈ లేఖ రాయడం గమనార్హం. ఆరోపణలెదుర్కొంటున్న నేతలు, వారి పార్టీలు కోర్టులను ఆశ్రయించడం, న్యాయవ్యవస్థ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలను చూపుతూ బీజేపీ వారిపై ప్రత్యారోపణలు చేస్తుండటాన్ని లేఖలో వారు ప్రస్తావించారు. 'ఇటువంటి చర్యలతో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతింటోంది. జడ్జీల నిష్పాక్షికత, సచ్ఛీలత అనే సూత్రాలకు ఇవి సవాల్‌గా మారాయి. ఇటువంటి అవాంఛిత ఒత్తిడుల నుంచి న్యాయవ్యవస్థను కాపాడు కోవాల్సిన అవసరం ఉంది'అని లేఖలో పేర్కొన్నారు. నిరాధార సిద్ధాంతాలను ప్రచారం చేయడం వంటి చర్యల ద్వారా న్యాయపరమైన ఫలితాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కొన్ని సమూహాలు అనుసరిస్తున్న వ్యూహం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు నేతృత్వంలోని న్యాయవ్యవస్థను ఇటువంటి ఒత్తిళ్లకు వ్యతిరేకంగా బలోపేతం చేయాలని, న్యాయ వ్యవస్థ పవిత్రతను, స్వయంప్రతిపత్తిని పరిరక్షించాలని వారు కోరారు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా, అస్థిర రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. లేఖ రాసిన వారిలో సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జీలు జస్టిస్ దీపక్ వర్మ, జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ ఎంఆర్ షా సహా వివిధ హైకోర్టులకు చెందిన 21 మంది న్యాయమూర్తులు ఉన్నారు.

జైలు నుంచే ప్రభుత్వం నడుపుతారు: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వచ్చే వారం నుంచి జైల్లోనే ప్రతి వారం ఇద్దరేసి మంత్రులతో సమావేశమవుతారని అధికార ఆప్ రాజ్యసభ ఎంపీ సందీప్ పాఠక్ తెలిపారు. సంబంధిత మంత్రుల శాఖల్లో అభివృద్ధి పనుల తీరును ఆయన సమీక్షించి, మార్గదర్శనం చేస్తారని వివరించారు. ఒక పద్ధతి ప్రకారం జైలు నుంచే ఢిల్లీ ప్రభుత్వం పనిచేయడం మొదలవుతుందన్నారు. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సోమవారం పాఠక్‌తోపాటు పంజాబ్ సీఎం మాన్ కలిశారు.

సర్ఫరాజ్ బతికే ఉన్నాడు?

లాహోర్: 2013లో సరబ్‌జీత్ సింగ్ అనే భారతీయుడిని జైలులోనే చంపినట్లు ఆరోపణలున్న మాఫియా డాన్ అమిర్ సర్ఫరాజ్ టంబా ఇంకా బతికే ఉన్నాడని పంజాబ్ ప్రావిన్స్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. తీవ్రగాయాలతో ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడన్నారు.



ఈ ట్రాఫిక్ పోలీసు హెల్మెట్‌కు ఏసీ ఉంది. మండే ఎండలకు విరుగుడుగా దీని ఐఐఎం వడోదర విద్యార్థులు రూపొందించారు.

ఆ ఓడలోని భారత సిబ్బందితో భేటీకి ఓకే

న్యూఢిల్లీ: హోర్ముజ్ జలసంధిలో శనివారం ఇరాన్ స్వాధీనం చేసుకున్న సరుకు రవాణా నౌకలోని 17 మంది భారతీయ సిబ్బందిని కలుసుకునేందుకు మన అధికారులకు త్వరలోనే అనుమతి రానుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సైన్ అమిర్ అబ్దొల్లాహియాన్ భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌కు ఈ మేరకు హామీ ఇచ్చారు. ఆదివారం వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. నౌకలో ఉన్న 17 మంది భారతీయ సిబ్బంది భద్రతపై జై శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వీరిని వెంటనే విడుదల చేయాలని కోరారు.



ఎన్నికల విచిత్రం

ఈమె కేంద్ర మంత్రి, ఉత్తర బెంగళూరు లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి శోభా కరంద్లాజే. ఆటో నడుపుతూ సోమవారం బెంగళూరులో ఇలా ఎన్నికల ప్రచార వాహనాలను ఆమె ప్రారంభించారు

ఎలక్షన్ బీట్

రోజుకి రూ.100 కోట్లు

- రికార్డు స్థాయిలో రూ.4,650 కోట్లు పట్టివేత
- గణాంకాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మార్చి ఒకటో తేదీన ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు రోజుకు రూ.100 కోట్ల చొప్పున విలువైన సొత్తు పట్టుబడిందని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) తెలిపింది. స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.4,650 కోట్ల విలువైన సొత్తులో రూ. 395.39 కోట్ల నగదు, బంగారంతో పాటు ఇతర విలువైన లోహాల విలువ రూ. 562.10 కోట్లు, రూ.489.31 కోట్లు విలువచేసే 3.58 కోట్ల లీటర్ల మద్యం, వివిధ రూపాల్లో ఉన్న రూ.2,068.85 కోట్లు విలువ చేసే డ్రగ్స్ ఉన్నాయి. ఇక టీవీలు, ఫ్రిడ్జిలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, బహుమతుల రూపంలో ఓటర్లకు అందించేందుకు సిద్ధం చేసిన రూ.1,142.49 కోట్ల మేర విలువైన ఉచితాలను జప్తు చేసినట్లు ఈసీ తెలిపింది. మొత్తం రికవరీల్లో 45%తో మాదకద్రవ్యాలే సింహభాగంలో ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈసీ మొత్తం రికవరీల విలువ రూ.3,475 కోట్లు మాత్రమే. ఇప్పుడు తొలి విడత పోలింగ్ కూడా జరక్క ముందే ఆ రికార్డును అధిగమించడం గమనార్హం.

అగ్ర స్థానంలో రాజస్థాన్.

దేశవ్యాప్తంగా ఈసీ స్వాధీనం చేసుకున్న మొత్తం రూ. 4,658 కోట్లలో అత్యధికంగా రాజస్థాన్ నుంచి రూ. 778.52 కోట్లు ఉన్నాయి. ఆ తర్వాత రూ.605 కోట్లతో గుజరాత్ రెండో స్థానంలో ఉంది. కాగా తెలంగాణ నుంచి రూ.121.84 కోట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి రూ. 125.97 కోట్లు విలువైన రికవరీ జరిగినట్లు ఈసీ వెల్లడించింది.

బీజేపీకి అనుకూలంగా ఈసీ: మమత

కూచ్ బెహార్/అలీపూర్‌ద్వార్: ఎన్నికల కమిషన్(ఈసీ) కేంద్రంలోని బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి ఆరోపించారు. ముర్షిదాబాద్ డీఐజీని ఈసీ తొలగించడం వెనుక బీజేపీ హస్తముందన్నారు. ఎన్నికల వేళ ముర్షిదాబాద్, మాల్దాల్లో ఒక్క హింసాత్మక ఘటన జరిగినా ఈసీదే బాధ్యతని ఆమె హెచ్చరించారు. అవసరమైతే ఈసీ కార్యాలయం ఎదుట 55 రోజుల పాటు నిరశన దీక్ష చేపడతానని హెచ్చరించారు. గతంలో సింగూర్‌లో భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల తరఫున 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ దర్యాప్తు విభాగాలను కేంద్రం టీఎంసీపైకి ఉసిగొల్పుతోందని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలను జైలుకు పంపుతామంటూ బీజేపీ బెదిరిస్తోందంటూ ఆమె..'ఎలా పోరాడాలో నాకు తెలుసు, నేనేమీ పిరికిదాన్ని కాదు'అని మమత వ్యాఖ్యానించారు.

హక్కుల్ని లాగేసుకునేందుకే: ప్రియాంక

జైపూర్: ప్రజల హక్కులను లాగేసుకునేందుకే బీజేపీ నేతలు రాజ్యాంగ సవరణ గురించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. ఎవరూ ఊహించని రీతిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని కూడా ఆ పార్టీ భావిస్తోందన్నారు. ఇవి బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మధ్య జరుగుతున్న ఎన్నికలు కావు..రాజ్యాంగ పరిరక్షణకు, దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు అని ఆమె అన్నారు. గత పదేళ్ల పాలనను గురించి ప్రధాని మోదీ చెప్పే మాటల్లో డొల్లతనం కనిపిస్తోందన్నారు. రాజస్తాన్‌లోని దౌసా జిల్లా బందికుయిలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక మాట్లాడారు. బీజేపీ నాయకుల మాటల్ని కాకుండా..దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆలోచించండి అని ప్రజలకు పిలుపునిచ్చారు.

బీజేపీ రాజ్యాంగమే మార్చేస్తుంది: అఖిలేశ్

లక్నో: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 400పైగా సీట్లు దక్కిన పక్షంలో ఆపార్టీ రాజ్యాంగాన్ని మార్చివేయడంతోపాటు రిజర్వేషన్లను ఎత్తి వేస్తుందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఓటు హక్కును కూడా లాగేసుకుంటుందని అన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీలను బూచిగా చూపి కార్పొరేట్ సంస్థల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కోట్లాది రూపాయలను వసూలు చేసిందని ఆయన బీజేపీని విమర్శించారు. సోమవారం ముజఫర్‌నగర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాల కారణంగా పదేళ్లలో లక్ష మందికిపైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

'రామరాజ్యం' మొదలైంది: రాజ్‌నాథ్

కథువా(జమ్మూకశ్మీర్): దేశంలో రామరాజ్యం వేళ్లూనుకోవడం మొదలైందని, కార్యరూపం దాల్చకుండా ఆపడం ఎవరి వల్లా కాదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ప్రజలకు తమ విధుల పట్ల వాస్తమైన అవగాహన ఉండటమే రామరాజ్యమన్నారు. అటువంటి పరిస్థితులు దేశంలో ఇప్పుడిప్పుడే వాస్తవరూపం దాల్చుతున్నాయని చెప్పారు. కథువా జిల్లా బసోహ్లిలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మంత్రి మాట్లాడారు. ప్రజలు, రాజకీయ నేతల మధ్య పెరిగిన అంతరాన్ని పూడ్చేందుకే తప్ప కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికే బీజేపీ రాజకీయాలు చేయడం లేదన్నారు. సీఏఏ అమలు ఫలితంగా భారతీయ పౌరులెవరూ పౌరసత్వాన్ని కోల్పోరని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే వచ్చే ఐదేళ్లలో దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని తెలిపారు.

ఒడిశాలో కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే బహిష్కరణ

భువనేశ్వర్: క్రమశిక్షణారాహిత్యం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే కారణాలతో కాంగ్రెస్ పార్టీ ఒడిశాలో తమ సీనియర్ ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌట్రేను పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అందిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని సురేష్‌కుమార్‌ను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం ప్రకటించారు. జటానీ నియోజకవర్గం నుంచి సురేష్ కుమార్ ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి ఆయన తనయుడు మన్మథ్ రౌట్రే బిజూ జనతాదళ్ అభ్యర్థిగా భువనేశ్వర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేస్తున్నారు. కుమారుడిగా మద్దతుగా నిలుస్తున్నారని, బీజేడీ నేతలతో వేదికను పంచుకుంటున్నారని సురేష్ కుమార్‌పై ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్‌తో తనది ఐదు దశాబ్దాల అనుబంధమని, తనను బహిష్కరించినా చివరి శ్వాస వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని, బహిష్కరణపై అధిష్టానంతో మాట్లాడతానని సురేష్‌కుమార్ స్పందించారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



పుష్పాంజలి.. మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే కొడాలి నాని, అభ్యర్థులు వంశీమోహన్, ఉప్పాల రాము, పేర్ని కిట్టు తదితరులు

గుడివాడ.. జనవాడ.. మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



చరిత.. భవిత.. అప్రతిహతం

ప్రజా దళపతి జైత్రయాత్రకు కృష్ణా బ్రహ్మరథం

అన్న ఆశీర్వాదం.. రోడ్‌షోలో దగ్గరకు వచ్చిన మహిళను దీవిస్తున్న సీఎం జగన్



అన్నొచ్చాడు.. సీఎం జగన్‌కు అభివాదం చేస్తున్న మహిళలు



అభ్యర్థులు వీరే.. బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, పెనమలూరు అసెంబ్లీ అభ్యర్థి జోగి రమేష్, గుడివాడ అభ్యర్థి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), పామర్రు అభ్యర్థి కైలే అనిల్‌కుమార్, గన్నవరం అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్, అవనిగడ్డ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు, పెడన అభ్యర్థి ఉప్పాల రాము, మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టును పరిచయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



ఆనందహేల.. జగనన్నను చూసిన ఆనందంలో మహిళల కేరింతలు

ఆయన ఓ అగ్గికణం.. ఆయనే ఆశాకిరణం అంటూ జనాభిమానం పరుగులు పెట్టింది. విలువలు, విశ్వసనీయతలో శిఖరసమానమైన ప్రజాదళపతి జైత్రయాత్రకు గన్నవరం జనసంద్రమై పోటెత్తింది. కష్టాలే రానీ.. గిట్టని వాళ్ల కుట్రలే పన్ననీ.. వెన్ను చూపని ప్రజాబాంధవుడి పోరాటతత్వానికి సాహో అంటూ కిక్కిరిసిన జంక్షన్ సంఘీభావం తెలిపింది. ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఎందాకైనా అనే అభిమానధనుడి అభిమతానికి జయహో అంటూ గుడివాడ జనహోరై నినదించింది. కపట నాటకాలతో బరితెగించి కుట్రలు చేస్తున్న కౌరవ మూకను చిత్తు చేసి తమ అభిమాన నేతను మరోసారి గెలుపించుకుంటామంటూ అశేష 'కృష్ణా' జనవాహిని ప్రతినబూని ప్రతిధ్వనించింది. చిన్నారుల బోసినవ్వులు.. యువకుల కేరింతలు.. ఆడపడుచుల ప్రేమానురాగాలు.. రైతు, శ్రామికుల ఆదరాభిమానాల నడుమ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర సోమవారం అప్రతిహతంగా ముందుకు సాగింది. గుడివాడ సమీపంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగానికి ఆద్యంతం అద్భుత స్పందన లభించింది.



హైవేపై హై రేంజ్.. గన్నవరం వద్ద హైవేపై బారులు తీరిన జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం

ఆశీర్వదించండి..

బందరు పార్లమెంటు పరిధిలో పార్టీ తరఫున నిలబెడుతున్న అభ్యర్థులను సీఎం వైఎస్ జగన్ పరిచయం చేశారు. బందరు పార్లమెంట్ స్థానం నుంచి సింహాద్రి చంద్రశేఖరరావు, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టు, పెడన నుంచి ఉప్పాల రాము, పామర్రు నుంచి కైలే అనిల్ కుమార్, గన్నవరం నుంచి వంశీమోహన్, గుడివాడ నుంచి కొడాలి నాని, అవనిగడ్డ నుంచి సింహాద్రి రమేష్, పెనమలూరు నుంచి జోగి రమేష్ నిలబడుతున్నారని ప్రజలందరూ ఆశీస్సులు అందించాలని విన్నవించారు.



వైనాట్ 175.. అన్ని స్థానాల్లో విజయం తథ్యమంటూ ప్లకార్డు చూపుతున్న అభిమాని

- హత్యాయత్నం తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన సీఎం వైఎస్ జగన్
- జననేతను చూసేందుకు భారీగా తరలివచ్చిన జనం
- ఊరూవాడా మిన్నంటిన జగన్నినాదం
- గుడివాడ బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహం
- జిల్లాలో 'మేమంతా సిద్ధం' సూపర్ సక్సెస్

సాక్షి, మచిలీపట్నం: ప్రజాభిమానం పోటెత్తింది.. అభిమాన నాయకుడు తమ చెంతకు వస్తున్నాడని తెలుసుకొని ఊరూవాడ కదిలింది. కేసరపల్లి రాత్రి బస నుంచి గుడివాడ వరకు జనం నీరాజనం పలకగా.. బహిరంగ సభ ఏర్పాటు చేసిన గుడివాడ 'జన' వాడగా మారింది. జిల్లా నలుమూలల నుంచి దారులన్నీ గుడివాడ వైపు రాగా, వేల మంది జగన్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మధ్యాహ్నం 12 గంటల నుంచే సభ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. తమ బతుకులు మార్చిన సీఎం వైఎస్ జగన్‌కు పెత్తందారుల వల్ల గాయమైందని తెలుసుకున్న జనం.. జననేతను చూడాలని తహతహలాడారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా రోడ్ల వెంబడి వేచి ఉన్నారు, జనహృదయాలను హత్తుకునేలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర కృష్ణా జిల్లాలో సాగింది.

దారి పొడవునా ఘన స్వాగతం..

సీఎంకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా 15వ రోజు సోమవారం కృష్ణా జిల్లా కేసరపల్లి బస నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరారు. అక్కడి నుంచి గన్నవరం, గుడివాడ వరకు సాగింది. ప్రతి గ్రామం, స్టేజీ వద్దకు చుట్టు పక్కల పల్లెల నుంచి వేల మంది వాహనానికి ఎదురుగా నిలి చి తమ అభిమాన నాయకుడిని ఆపి ఆత్మీయంగా పలకరించారు.

హత్యాయత్నం తర్వాత తొలిసారి జనంలోకి..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 'మేమంతా సిద్ధం' ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ఇప్పటి వరకు ప్రతి చోటా జనం సందోహం.. వేల మందితో సభలు దిగ్విజయం అవుతున్నాయి. ఇది జీర్ణించుకోలేని ప్రతిపక్ష కుట్రదారులు జగన్‌పై శనివారం రాత్రి విజయవాడలో హత్యాయత్నానికి పాల్పడ్డారు. తీవ్ర గాయంతో బయటపడిన ఆయన ఒక రోజు విరామం తరువాత తిరిగి జనంలోకి వచ్చారు. దారి పొడవునా హారతులతో ఆశీర్వదించారు.

నినాదాలు... కేరింతలు..

సీఎం జగన్ బస్సు యాత్రలో అడుగడుగునా నీరాజనం.. కేరింతలతో జనం హోరెత్తించారు. సీఎం.. సీఎం.. జై జగన్.. మళ్లీ నువ్వే అంటూ కేకలు, ఈలలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. గుడివాడ సభలో మాట్లాడినంత సేపు కేకలు, ఈలలతో దద్దరిల్లింది. తాను చేసిన మంచిని, చంద్రబాబు మోసాలను జగన్ వివరించగా ప్రతిసారి ఆయన మద్దతుగా సమాధానాలు చెప్పారు. చివరకు చంద్రబాబు చీకటి పాలన మరోసారి రాకుండా సెల్ ఫోన్ టార్చ్ లైట్లు వెలిగించాలని సీఎం కోరగా ప్రతి ఒక్కరూ తమ టార్చ్ లైట్ ఆన్ చేసి ఆయనకు మద్దతుగా నిలిచారు.

గుడివాడలో ఘన స్వాగతం..

జిల్లాలో యాత్ర ముగింపు సందర్భంగా గుడివాడ శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ ప్రాంగణానికి సీఎం జగన్ సాయంత్రం 5గంటలకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఒక్క సారిగా పెద్ద ఎత్తున జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం, వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. నందివాడ మండలం పుట్టగుంట వద్ద వేద పండితులు పూర్ణకుంభం, హారతులతో స్వాగతించారు. సభా ప్రాంగణం వద్దకు చేరగానే అప్పటికే ఏర్పాటు చేసిన క్రేన్లతో భారీ గజమాలలు తోరణంలా ఉంచి వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం పలికారు. బాణసంచా కాల్చి, డీజే మోతలతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాల విద్యార్థినులు సైతం సిద్ధం లోగోలు ధరించి 'మా మంచి మామయ్య మా ఊరికి వచ్చాడని' జై జగన్ అంటూ కేరింతలు కొట్టారు. విద్యాదీవెన, వసతి దీవెన అందుకుంటున్న విద్యార్థులు, పింఛన్ లబ్ధిదారులు జననేతను కలసి కృతజ్ఞతలు తెలిపారు. జొన్నవాడకు చెందిన దారిలో ఎండలో ఉన్న సుశీలమ్మ (67) గతంలో పడిన పింఛన్ కష్టాలను తొలగించి ఇంటి వద్దకే చేర్చుతున్న మనవడు తన ఊరికి వచ్చాడని, తమ ఓటు జగన్‌కే వేస్తామని చెప్పడం పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం..

గుడివాడలో ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యింది. వేలాది మంది ప్రజలు చేరుకోవడంతో గుడివాడ వీధులు జనంతో కిక్కిరిశాయి. రహదారులు జనసంద్రమయ్యాయి. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో సుమారు పది వేల మందికి పైగా సభాస్థలికి చేరుకోలేకపోయారు. సభ ప్రాంగణం నిండిపోవడంతో జనం రోడ్లపైనే ఉండి, ఎల్‌ఈడీలు చూస్తూ సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు.

యాత్ర సాగిందిలా..

- మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం కేసరపల్లి వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరారు.
- అక్కడి నుంచి గన్నవరం, ఆత్కూరు, వీరపల్లి, హనుమాన్ జంక్షన్, పుట్టగుంట, జొన్నపాడు, నాగవరప్పాడు (గుడివాడ) వరకు సాగింది.
- మధ్యాహ్నం 3:30 గంటలకు జొన్నపాడు వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకున్నారు.
- అనంతరం 4:40కి బయలుదేరి జనార్దనపురం మీదుగా సాయంత్రం 5:05గంటలకు గుడివాడ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు.
- సభ అనంతరం హనుమాన్ జంక్షన్ జాతీయ రహదారి, గుండుగొలను మీదుగా ఏలూరు జిల్లా నారాయణపురంలో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి చేరుకున్నారు.





జయహో.. సీఎం జగన్ గెలుపొందాలని నినదిస్తున్న మహిళలు



సీఎం జగన్‌తో కరచాలనం కోసం ఎగబడుతున్న జనాలు



కాలువ గట్టు వద్ద నుంచి సీఎం జగన్ కోసం నినాదాలు చేస్తున్న జనాలు

క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు చర్యలు

కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

పామర్రు: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిబ్బంది అందరూ సంసిద్ధం కావాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్లో పీవో, ఏపీవో తదితర సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కృష్ణా జిల్లాలో 1,763 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 434 బస్సులు, 22 డీజీటీ వాహనాలు అవసరమని గుర్తించామన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు ఏర్పాటు చేయటంతో పాటు వారికి ప్రత్యేక మార్గం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని దీని కోసం అవసరమైన ఏర్పాట్లు కేంద్రాల వద్ద చేయాలని సూచించారు. శిక్షణలో తెలుసుకున్న ప్రతి అంశాన్నీ ఎన్నికల సిబ్బంది తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు. పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవి, ఏఆర్‌వో పల్లవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.76 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.2.76 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను సోమవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 19 రోజులకు గాను హుండీల ద్వారా రూ.2,76,11,524 నగదు, 478 గ్రాముల బంగారం, 4.830 కిలోల వెండి లభ్యమైంది. కానుకలు, హుండీల లెక్కింపును ఆలయ ఈవో కేఎస్ రామరావు పర్యవేక్షించగా, ఆలయ, సేవా సిబ్బంది పాల్గొన్నారు. ఈ హుండీ ద్వారా రూ.70,541 విరాళాలను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి సమర్పించారు. హుండీలలో నగదుతో పాటు వివిధ దేశాలకు చెందిన కరెన్సీని భక్తులు కానుకలుగా సమర్పించారు. యుఎస్ఏకు చెందిన 1451 డాలర్లు, ఇంగ్లాండ్‌కు చెందిన 110 పౌండ్లు, కెనడాకు చెందిన 85 డాలర్లు, యూఏఈకి చెందిన 110 దిర్హమ్స్‌లతో పాటు ఇతర దేశాలకు చెందిన కరెన్సీ లభించింది. కానుకల లెక్కింపును దేవదాయ శాఖ అధికారులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- 526 సీ-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా కావాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలు సరళి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం కార్యకలాపాలు, వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఫిర్యాదులు-వాటి పరిష్కారం, ఎన్నికల పరిశీలకులకు చేయాల్సిన ఏర్పాట్లు, ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అమలు, ఎన్నికల సిబ్బంది శిక్షణ తదితర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీ-విజిల్ ద్వారా 526 ఫిర్యాదులు పరిష్కారం....

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సీ-విజిల్ ద్వారా 526 ఫిర్యాదులురాగా అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) తదితర మార్గాల ద్వారా మొత్తం 1,331 ఫిర్యాదులు రాగా 1,303 పరిష్కార ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. మిగిలినవి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఓటరు హెల్ప్‌లైన్ (1950) ద్వారా 211 ఫిర్యాదులు రాగా 211 పరిష్కరించామని వెల్లడించారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 407 ఫిర్యాదులు రాగా వాటిలో 403 పరిష్కరించినట్లు వివరించారు. అదే విధంగా వాట్సాప్ నంబరు (9154970454) ద్వారా 31 ఫిర్యాదులు రాగా 27 , కాల్ సెంటర్ (0866-2570051) ద్వారా 22 ఫిర్యాదులు రాగా 22 పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) ద్వారా 58 ఫిర్యాదులు రాగా 48, సీఈవో మెయిల్స్ ద్వారా 13 ఫిర్యాదులు రాగా 9 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. 63 ప్రతికూల వార్తలకు సంబంధించి 57 అంశాలను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదుపైనా ప్రత్యేకంగా దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరిస్తున్నామన్నారు.

సమర్థవంతంగా ఎన్నికల నియమావళి అమలు

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థవంతంగా అమలుచేస్తున్నామని.. సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ పటిష్టంగా అమలవుతోందని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రూ. 7.06 కోట్ల విలువైన నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువులు, ఉచితాలు తదితరాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రూ. 3.16 కోట్ల నగదుతో పాటు రూ. 94.16 లక్షల విలువైన 19,583 లీటర్ల మద్యం, రూ. 12.20 లక్షల విలువైన మత్తు పదార్థాలు, రూ. 2.32 కోట్ల విలువైన 7,758 గ్రాముల విలువైన లోహాలు, రూ. 6.43 లక్షల విలువైన 132 ఉచితాలు తదితరాలను సీజ్ చేసినట్లు చెప్పారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి రూ. 1.16 కోట్ల మేర సీజర్లు జరిగినట్లు వెల్లడించారు. అదే విధంగా మైలవరం నియోజకవర్గంలో రూ. 48.59 లక్షలు, నందిగామలో రూ. 20.23 లక్షలు, తిరువూరులో రూ. 85.84 లక్షలు, విజయవాడ సెంట్రల్‌లో రూ. 2.75 కోట్లు, విజయవాడ తూర్పులో రూ. 64.26 లక్షలు, విజయవాడ పశ్చిమలో రూ. 94.81 లక్షల విలువైన సీజర్లు జరిగినట్లు వివరించారు.

బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు

జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు, మహిళాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ అధికారులతో సోమవారం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సంస్థ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని క్యాంప్ కార్యాలయం నుంచి జేసీ డాక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో బాల్యవివాహాలు నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత మూడు నెలల్లో 25 బాల్య వివాహాలు (చైల్డ్ మ్యారేజ్) నియంత్రించామని తెలిపారు. వీటిలో రెండు బాల్య వివాహాలపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టంపై అన్ని శాఖలు సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించామని వెల్లడించారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యా ర్థులు డ్రాప్ అవుట్ కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులను గుర్తించి తిరిగి స్కూల్స్‌లో రీజాయిన్ చేయించామని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి. ఉమాదేవి, డీసీపీఓ రాజేశ్వర రావు, జాన్సన్ చైల్డ్ లైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా కూచిపూడి నృత్యాలు



నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

విజయవాడ కల్చరల్: శ్రీరామనవమి సందర్భంగా ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలోని వేదికపై సోమవారం కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యుడు అజయ్‌కుమార్ శిష్యబృందం శ్రీ రాఘవం నృత్య కార్యక్రమాలు శ్రీ రామచంద్రుని వైభవాన్ని చాటాయి. శ్రీరాఘవంతో ప్రారంభించి బాలకనకమయ, రామనామము, రామాయణ శబ్దం, రామచంద్రుడితడు రఘు వీరుడు, గరడగమన రారా, రాముడు రాఘవుడు, ఇదిగో భద్రాద్రి అంశాలను ప్రదర్శించారు. నట్టువాగం శ్రీనివాస్, గాత్రం సుధా శ్రీనివాస్, మృదంగం పై శ్రీధరా చార్య, వయొలిన్‌పై చావలి శ్రీనివాస్, వేణువుపై కుమార్ బాబు సహకరించారు. సిద్ధార్థ కళాశాల విద్యార్థిని కృష్ణ సేన ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. కళాశాల విద్యార్థినులు శ్రీరామునిపై భక్తి గీతాలు ఆలపించారు. కళాపీఠం బాధ్యులు ఎన్. లలిత్ ప్రసాద్, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్ కళాకారులను సత్కరించారు.

బీసీలకు బ్యాక్ బోన్ వైఎస్సార్ సీపీ

బీసీ ఆత్మీయ సదస్సులో కృష్ణయ్య



వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కృష్ణయ్య, ఉదయభాను, ఎమ్మెల్సీలు

జగ్గయ్యపేట: బీసీలకు బ్యాక్‌బోన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. పట్టణంలోని ఎస్‌జీఎస్ కళాశాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ బీసీ ఆత్మీయ సదస్సు సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందారని చెప్పారు. చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. చంద్రబాబు ప్రజలను ఓటర్లుగా చూస్తారని జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులుగా చూస్తారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ వంటి గొప్ప నాయకుడు కావాలంటూ కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే ఉదయభానును గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీల వర్గాలతో పాటు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదేళ్లలో కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యంగా ఎన్నడూ లేని విధంగా బీసీలకు ఎంతో ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మాటల సీఎం కాదని చేతల సీఎం అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసే తాను పోలీస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు సిద్ధవాటం యానాదయ్య మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులను కించపరిచిన చంద్రబాబును రానున్న ఎన్నికలలో మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు.

నవరత్నాలతో పేదలకు మేలు...

ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ నవరత్నాల పథకాల ద్వారా నిరుపేదలకు మేలు జరిగిందన్నారు. అనంతరం ఆర్.కృష్ణయ్య, ఉదయభానును బీసీ సెల్ నాయకులు సత్కరించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి, వడ్డెర, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌లు జింకా విజయలక్ష్మీ, దేవళ్ల రేవతి, తొండమళ్ల పుల్లయ్య, పార్టీ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేబీరాణి, ముదిరాజ్ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు పిల్లి రామారావు, నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, నియోకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, ఫైనాన్స్, పూసల, మైనింగ్ కార్పోరేషన్‌ల డైరెక్టర్‌లు విజిత, కుమారి, రామారావు, విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను, నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు పెంటి శ్రీనివాసరావు, శ్రీనివాస గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు.. దేవుడు జగనన్నకు అండగా నిలిచారు

ఉప్పాల రాము, హారిక దంపతులు

పెడన: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు, దేవుడు అండగా నిలిచారని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. కేసరపల్లిలో ఏర్పాటు చేసిన బస వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాము, హారిక మాట్లాడుతూ జగనన్న భయపడే వ్యక్తి కాదని తెలిపారు. జగనన్నకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక నీచ సంస్కృతికి ప్రతిపక్షాలు పాల్పడ్డాయని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరగా కోలుకుని ప్రజల ముందుకు క్షేమంగా తిరిగి వచ్చారని తెలిపారు. మరింత జనరంజక పాలన అందించడానికి వస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు.



•వైఎస్సార్ సీపీలో చేరికలు

మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా కృష్ణా జిల్లా కేసరపల్లి నైట్ స్టే పాయింట్ వద్దకు వచ్చిన పలువురు నేతలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నాగుర్‌వలి కుమారుడు బాబులాల్, టీడీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ నజీర్ హుస్సేన్‌లు వైఎస్సార్ సీపీలో చేరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



బంగారు దుకాణంలో చోరీ



కంచికచర్ల : మండల కేంద్రంలోని ఓ బంగారం దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ రవికిరణ్ కథనం మేరకు...కంచికచర్లలో జూలూరు శేషుకుమార్‌కు చెందిన శ్రీ వాసవి జ్యూయలర్స్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి 350 గ్రాముల బంగారు నగలు, 8 కిలోల వెండి చోరీ చేశారని చెప్పారు. వాటి విలువ సుమారు రూ.14.50 లక్షలు ఉంటుందని వెల్లడించారు. షాపునకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా తీసుకెళ్లారని తెలిపారు. మచిలీపట్నం నుంచి డాగ్ స్క్వాడ్, వేలిముద్రల నిపుణులను పిలిపించి విచారణ చేపట్టామని పేర్కొన్నారు. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని తెలిపారు. పోయిన నగలు రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రైం ఏసీపీ శ్రవంతి రాయ్, నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పి.చంద్రశేఖర్, ఎస్ఐ పెండె వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఎస్ఐ-2 హేమలత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి మృతి

గుణదల(విజయవాడ తూర్పు): అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మాచవరం సీఐ గుణరామ్ తెలిపిన వివరాల ప్రకారం... చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ ప్రాంతానికి చెందిన కాట్రగంటి మౌనిక (22) మానసిక వికలాంగురాలు. తండ్రి కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగి. ఇంట్లోనే ఉంటున్న మౌనిక గత కొంత కాలంగా ఒంటరిగా తనలో తాను మాట్లాడుకుంటూ మతి స్థిమితం లేకుండా ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆఫీసు నుంచి ఇంటికి తిరిగి వచ్చిన తల్లి తలుపు కొట్టినా ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిచి చూస్తే ఉరికి వేలాడుతున్న మౌనిక కన్పించింది. 108 సహాయంతో ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్యూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫకీర్‌గూడెం, ప్రగతినగర్, శ్రీరాంనగర్, చంద్రమౌళీపురం, ఎంజీ రోడ్డు బెంజిసర్కిల్ ప్రాంతంతో పాటు మైత్రేయ వీధిలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చర్చా గోష్ఠి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఏపీ అభివృద్ధి అనే అంశంపై సోమవారం విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో చర్చా గోష్ఠి జరిగింది. ప్రధానవక్త ఏపీ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పరిగెడుతుంటే మన సమాజం మాత్రం కులం, మతం వంటి విషయాల వద్ద ఆగిపోయామని చెప్పారు. సంస్థ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, హైకోర్టు న్యాయవాది పి.రవితేజ తదితరులు పాల్గొన్నారు.

లయోల అధ్యాపకుడికి డాక్టరేట్


కోడూరు నాగకోటేశ్వరరావు

గుణదల(విజయవాడ తూర్పు): ఆంధ్ర లయోల కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకుడు కోడూరు నాగ కోటేశ్వరరావుకు డాక్టరేట్ లభించినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ తెలిపారు. సోమవారం ఆయన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ పొందిన కోటేశ్వరరావును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైమ్ రాడికల్స్ ఆఫ్ నియర్ రింగ్స్ అనే అంశంపై కోటేశ్వరరావు పరిశోధన చేసినట్లు పేర్కొన్నారు. వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో నాలుగు పరిశోధనా పత్రాలను ప్రచురించారని వివరించారు. పలు జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని ప్రతిభను చాటుకున్నారని ప్రశంసించారు. ఆయన కృషి ఫలితంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించడం ఆనందదాయకమన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కోటేశ్వరరావును అభినందించారు.

27 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ (ఎస్ఏపీ ఎస్‌డీ) కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 22 ఏళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లో డిగ్రీ చదివిన విద్యార్థులకు విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 14 వారాల కాలపరిమితి గల శిక్షణలో శని, ఆదివారాల్లో మూడు గంటల పాటు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 70935 29750 ఫోన్ నంబరులో సంప్రదించాలని సురేష్ కోరారు.

పరాశక్తి లీలలు.. అనంతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పరాశక్తి అయిన అమ్మవారి లీలలు అనంతమైనవని హరికథ కథనంలో గుంటూరుకు చెందిన డాక్టర్ సింహచల శాస్త్రి వర్ణించారు. వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గుంటూరుకు చెందిన సింహచల శాస్త్రి బృందం పరాశక్తి లీలలను హరికథగా వివరించారు. అనంతరం ఆలయ ఈవో కె.ఎస్. రామరావు సింహచల శాస్త్రి బృందానికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

ఎంజీ రోడ్డులో బొంబే జ్యూయలర్స్ షోరూమ్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మా గాంధీ రోడ్డులో బెంజిసర్కిల్ సమీపంలోని సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బొంబే జ్యూయలర్స్ షోరూమ్‌ను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. షోరూమ్‌లో పలు డిజైన్లలో గోల్డ్, డైమండ్, ప్లాటినం బంగారు ఆభరణాలు అందించనున్నట్లు నిర్వాహకులు ముఖేష్‌కుమార్ జైన్, మనీష్‌కుమార్ జైన్ తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు


17వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ 'తూర్పు' అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): నవరత్నాలతో పేదల జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని వైఎస్సార్ సీపీ 'తూర్పు' అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట 17వ డివిజన్‌లోని పలు వీధుల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నామన్నారు. వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ పథకాలన్నీ ఇంటికే చేరుతున్నాయన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98శాతం పైగా హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. మీకు మేలు జరిగితే ఓటు వేయండని అడిగే దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తెల్లవారు జామునే పింఛన్ అందాలన్నా, పిల్లల చదువులు సక్రమంగా సాగాలన్నా, ఖరీదైన వైద్యం పేదలకు అందాలన్నా వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లేసి తనను ఎమ్మెల్యేగా, కేశినేని శ్రీనివాస్(నాని)ను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


జక్కంపూడి కాలనీవాసులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జక్కంపూడి కాలనీలో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కాలనీలోని రద్దీ ప్రాంతాలతో పాటు బస్టాండ్, లంబాడీపేట సాయిరాం థియేటర్ వద్ద అవగాహన కల్పించారు. గ్యాస్ స్టౌ వినియోగంలో అనుకోకుండా ఎదురయ్యే ప్రమాదాలు, ఇంట్లో కరెంట్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదాలు ఎలా జరుగుతాయి.. ప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలనే దానిపై సూచనలు, సలహాలు అందించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపిస్తే వాటిని ఎలా నివారించవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. అపార్టుమెంట్లలో డ్రై కెమికల్ పౌడర్లు, ఫైర్ అలారంలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కర్రతో దాడికి పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లి వేపచెట్టు సెంటర్‌లో కొంత మంది యువకులు బైక్ ర్యాలీ చేశారు. ర్యాలీతో రోడ్డుపై పిల్లలకు ఇబ్బందికరంగా ఉందని విజయ్‌కుమార్ చెప్పాడు. ర్యాలీలో ఉన్న చప్పిడి శివనాగరాజు, కోటేశ్వరరావు, జిల్లాబత్తుల మహేష్, చప్పిడి రవివర్మ, ఆంజనేయులు, చిగురుపల్లి బావి, సుఖభోగి శ్యాంకుమార్ గొడవ పడ్డారు. విజయ్‌కుమార్‌పై మహేష్ కర్రతో దాడి చేయడంతో తలకు గాయమైంది. విజయ్‌కుమార్‌పై దాడి చేసే క్రమంలో కలపర్తి సత్యం, ముగ్గురాళ్ల అవినాష్, తిరుపతమ్మ అనే వారు అడ్డురాగా మహేష్‌తో పాటు మరి కొంతమంది దాడి చేశారు. బాధితుడు పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వృత్తి విద్యా కోర్సులతో స్వయం ఉపాధి


మాట్లాడుతున్న విద్యాకన్నా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకుని స్వయం ఉపాధి పొందవచ్చని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యాన సోమవారం వేసవిలో మహిళలకు నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సుల ఉచిత శిక్షణను విద్యాకన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్, మెహందీ, డెకరేటివ్ ఆర్టికల్స్, వాషింగ్ మెషిన్ లిక్విడ్స్, డిటర్జెంట్స్ మేకింగ్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటమ్, చాక్లెట్స్ మేకింగ్, న్యాచురల్ హెయిర్ ఆయిల్, షాంపు మేకింగ్‌ల్లో శిక్షణ తరగతులు మే 2వ తేదీ వరకు జరుగుతాయన్నారు. వీటిని మహిళలు వినియోగించుకోవాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల్లో జాయిన్ అయ్యి కోర్సులను నేర్చుకుని స్వయం ఉపాధి పొందడంతో పాటు మరికొంత మందికి ఉపాధి ఇవ్వవచ్చని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట పండరీపురానికి చెందిన నక్కా శేఖర్‌బాబు వెల్డింగ్ పనులు చేస్తాడు. అతను ఆదివారం కానూరులో బాలాజీ సూపర్‌మార్కెట్ వద్ద బందరు రోడ్డు దాటుతున్న సమయంలో పెనమలూరు వైపు నుంచి విజయవాడకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్సకు చేర్చారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): తీవ్రమైన ఎండలకు బాటసారులు వడదెబ్బ బారిన పడకుండా ఉండటానికి పాయకాపురం శాంతినగర్‌లోని శారద స్కూల్లో పెనుమత్స తాతారావు జ్ఞాపకార్థం స్కూల్ కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. బాటసారులు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని, వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అప్పలరాజు అన్నారు. సేవాసంఘాలను కలుపుకొని మరికొన్ని మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శారద స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బాటసారులు, ప్రయాణికులకు అందిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం కొనసాగుతోంది. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతల సహకారంతో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం దాత సాంబశివనాయుడు సహకారంతో బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచిత మజ్జిగ పంపిణీకి సహకరిస్తున్నట్లు తెలిపారు. వేసవి పూర్తయ్యే వరకూ ఈ శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

రేపు సీతారాముల కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం ఉదయం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ముత్యాలంపాడు పుర వీధుల్లో షిర్డీలో మాదిరిగా చందనోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు సీతారాముల కల్యాణం, చందనోత్సవంలో పాల్గొని సీతారాములు, బాబావారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఆలయానికి విరాళాలు



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన ఆలోకం కోటేశ్వరరావు, శివపార్వతి దంపతులు రూ.10,116 విరాళంగా ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఉపాలయం అంకమ్మ వారి ఆలయ గోపురం వెండి తాపడం తయారీకి రూ.40,116 అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

గోశాలకు వరిగడ్డి వితరణ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి గోశాలలో గోవుల కోసం తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన భక్తుడు పాలపాటి నాగయ్య రూ.15 వేల విలువైన వరిగడ్డిని అందజేశారు. గడ్డిని తన సొంత ఖర్చులతో ట్రాక్టర్‌పై తెచ్చి ఆలయ అధికారులకు అప్పగించారు. దాతకు ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్‌నాయుడు మాట్లాడుతూ దాతలు గోవుల కోసం వరిగడ్డి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేకే దాడి

- ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు ఉండకూడదు
- అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్న వైనం
- దాడిపై టీడీపీ నేతల వ్యాఖ్యలు దుర్మార్గం
- రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలి
- రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి


కస్తూరిబాయ్ పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు చేయడం జుగుప్సాకరమంటున్నారు. ప్రత్యర్థులను రాజకీయంగా ఎదుర్కోవాలేగానీ, దాడులకు పాల్పడే కుట్రలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. వేలాది మంది ప్రజలు చూస్తుండగానే దాడి చేశారంటే, ముందస్తు ప్రణాళికతోనే జరిగినట్లు తెలుస్తోందని, నిందితులతో పాటు, వారితో దాడిచేయించిన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


అన్ని వర్గాల ప్రజలు ఖండన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. నగరంలో ఎక్కడ చూసినా ఇదే విషయంపై చర్చ జరుగుతోంది. కుట్రలు, వెన్నుపోటు నాయకులకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు, ఎన్నికల కమిషన్ వెంటనే చర్యలు తీసుకోవాలంటున్నారు. దాడిపై నిరసనలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ చిల్లర రాజకీయం

సాక్షాత్తు వేలాది మంది ప్రజల సాక్షిగా ముఖ్యమంత్రిపై దాడి జరిగితే, దాన్ని కూడా టీడీపీ చిల్లర రాజకీయం చేస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. దాడులకు రెచ్చగొట్టింది చంద్రబాబు, లోకేష్ అని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వారి సోషల్ మీడియాలో హేళనగా పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కుట్ర రాజకీయాలకు కేరాఫ్ టీడీపీ అని, ఇలాంటి నీచమైన పనులు చేసేది వారేనంటున్నారు. చంద్రబాబుకు గత ఎన్నికల్లో 23 సీట్లు వచ్చాయని, ఇలాంటి పనులు చేస్తే ఈసారి అవి కూడా కష్టమేనంటున్నారు.

కుట్రలకు కేరాఫ్ టీడీపీ



కుట్రలు కుతంత్రాలకు కేరాఫ్ టీడీపీనే. గత ఎన్నికల ముందు కోడికత్తితో దాడి చేయించిన చంద్రబాబు, ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో ఉండగా రాయితో దాడి చేయించాడు. ఆ రాయి చాలా బలంగా తగిలిందని, కుట్రపూరితంగానే ముందస్తు ప్రణాళికతో దాడి చేశారు. దీని వెనుక కచ్చితంగా టీడీపీ పాత్ర ఉంది. దాడి చేసిన వారిని గుర్తించడంతో పాటు, దాని వెనుక ఉన్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి.

– యర్రంశెట్టి అంజిబాబు, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రజాకాపునాడు

దాడిపై టీడీపీ ప్రచారం దుర్మార్గం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిపై టీడీపీ చేస్తున్న ప్రచారం చాలా దుర్మార్గం. రాయి ప్రజల్లో నుంచి వచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తుంటే, టీడీపీ సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా హేళనగా పోస్టులు పెట్టడం నీచ రాజకీయాలకు నిదర్శనం. రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలేగానీ, చిల్లర రాజకీయాలకు పాల్పడకూడదు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య విలువలను మంట కలుపుతున్నాయి. ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేకే దాడులకు పాల్పడుతున్నట్లు ప్రజలు భావిస్తున్నారు.

– మునీర్ అహ్మద్ షేక్, రాష్ట్ర కన్వీనర్, ముస్లిం జేఏసీ

ఎస్ఆర్ఆర్‌లో అంతర్జాతీయ వెబినార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 'భవన నిర్మాణంలో అగ్ని రక్షణ పదార్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, అయస్కాంత సెన్సార్‌ల్లో నానో సాంకేతికత'పై అంతర్జాతీయ వెబినార్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో దక్షిణ కొరియా, దొంగువాన్ జాతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ చీదరాల రవికుమార్, గౌహతి ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.పాము, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కొల్లు ప్రతాప్ ప్రసంగించారు. కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ కళాశాల విద్య కమిషనరేట్ ప్రభుత్వ కళాశాలలో ప్రయోగాలకు ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. అందులో భాగంగా వెబినార్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి నానో సాంకేతికత ఉపయోగాలను వివరించారు. ప్రపంచంలోని సుమారు రెండు వందల మంది అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నలందలో పెయింటింగ్ కాంపిటీషన్స్


విజేతలతో ప్రిన్సిపాల్ మాదల పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): వరల్డ్ ఆర్ట్ డే పురస్కరించుకుని గాయత్రీనగర్‌లోని నలంద విద్యానికేతన్‌లో సోమవారం ఇంటర్ స్కూల్స్ పెయింటింగ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పెయింటింగ్స్, శిల్పాలు వివిధ ఫొటోలతో కూడిన చిత్ర ప్రదర్శనలను నిర్వహించారు. ఇంటర్ స్కూల్స్ పెయింటింగ్ కాంపిటీషన్స్‌లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను 3వ తరగతి నుంచి 12 వ తరగతి వరకూ మూడు గ్రూపులుగా నిర్వహించారు. గ్రూప్–ఎలో 3 నుంచి 5వ తరగతి వరకూ, గ్రూప్– బిలో 6 నుంచి 8, గ్రూప్–సి 9 నుంచి 12 తరగతి వరకూ విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్ –ఎలో కనక్ కరీర, ఐ.గీతాశ్రీ, కె.నిషిత్ విజేతలుగా నిలవగా, బి హిమిత, డి.శ్రీహిత కన్సోలేషన్‌కు ఎంపికయ్యారు. గ్రూప్ బిలో ఎంఎల్ శ్రేష్ఠ, కె.వేద సంహిత, డి.శ్రీదుర్గా నిత్య, బిజలేఖనందినిలు విజేతలుగా నిలవగా, పి.దేవశ్రీ, ఎస్.నిహార్, ఆర్నా బప్నలు కన్సోలేషన్‌లు అందుకున్నారు. గ్రూప్ సి నుంచి కె.శ్రీనిధి, ఎన్ సంహిత, జి.ఈషాపుష్ప, వ్రిది కఠారియాలు విజేతలుగా నిలవగా, ఎస్ఎస్ఎస్ వశిష్ఠ, ఎన్.జశ్వంత్, గ్రీష్మలక్ష్మి కన్సోలేషన్ గెలుపొందారు. విజేతలకు ప్రిన్సిపాల్ మాదల పద్మజ బహుమతులు అందజేశారు.

ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తం


లకిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్

మైలవరం: ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. మైలవరం తహసీల్దార్ కార్యాలయం, అనంతరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ హాలులో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పలు బృందాలతో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ సార్వత్రిక ఎన్నికలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, 26న నామినేషన్‌ల పరిశీలన, 27 నుంచి 29 వరకు ఉపసంహరణలకు గడువు ఉంటుందని తెలియజేశారు. నామినేషన్‌లు దాఖలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలు, సలహాలు, సూచనలను వివరించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు తమ విధుల్లో అలసత్వం వహిస్తే ఎన్నికల నియమావళిని అనుసరించి క్రమశిక్షణ చర్య తీసుకుంటామన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులందరూ విధిగా పోస్టల్ బ్యాలట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ గురించి అధికారులకు పలు సూచనలిచ్చారు. సమావేశంలో మైలవరం ఏసీపీ మురళీ మోహన్, తహసీల్దారు టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు నిబంధనలను పాటించాలి

పెనమలూరు: సాధారణ ఎన్నికలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నేతలు నియమ నిబంధనలు విధిగా పాటించాలని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. పెనమలూరులో తన కార్యాలయంలో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రాజకీయ పార్టీలు నియమావళిని పాటించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను అనుసరించి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. నామినేషన్ సమయంలో ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. పెనమలూరులోని తన కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. పెనమలూరు అసెంబ్లీకి సంబంధించి ఈవీఎంలు గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో భద్రపరిచామన్నారు. మే 1న తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ వద్ద రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. మే 2 నుంచి 5వ తేదీ లోపు తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ వద్ద ఈవీఎంల కమిషన్ చేస్తామని వివరించారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు చెందిన పోలింగ్ కేంద్రాల ఏజెంట్ల వివరాలు అన్ని రాజకీయ పార్టీలు వెంటనే తమ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల నియమ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, ఉప్పాడ త్రిమూర్తి, కిలారు వెంకటరత్నం, శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు


యనమలకుదురులో శ్రీరామలింగేశ్వరస్వామి

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఏక రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివార్లకు విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో ఎం.గంగాధరరావు తెలిపారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, ఉదయం 9.30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం చేస్తామన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

హజరత్తయ్య గుప్తా బహుముఖ ప్రజ్ఞాశాలి



పాయకాపురం(విజయవాడరూరల్): హజరత్తయ్య గుప్తా అన్ని రంగాల్లో విజ్ఞానం కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ గణేష్ అన్నారు. అంతర్జాతీయ వాసవీ క్లబ్ లీగల్ చైర్మన్‌గా క్లబ్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తాను ఆ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్రన్ నియమించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాజీవ్‌నగర్‌లోని వాసవీ భవన్‌లో క్లబ్ జిల్లా గవర్నర్ గణేష్, మాజీ గవర్నర్లు, క్లబ్ ప్రతినిధులు గుప్తాను సత్కరించారు. క్లబ్ జిల్లా గవర్నర్ గణేష్ మాట్లాడుతూ 2019లో క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు స్వయం ఉపాధికి సృష్టించిన శ్రేయోభిలాషి పథకం జన బాహుళ్యానికి ఉపయోగకరంగా ఉందన్నారు. అంతేకాక సరస్వతి పథకం, గోసేవ సంస్థలకు ఆయన చైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. గుప్తా మాట్లాడుతూ వాసవీ క్లబ్‌ల అంతర్జాతీయ లీగల్ చైర్మన్‌గా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రజా పాలనకు ఆద్యుడు శ్రీరాముడు

విజయవాడ కల్చరల్: ప్రజా సంక్షేమ పాలనకు ఆద్యుడు శ్రీ రామచంద్రమూర్తి అని ఆధ్యాత్మికవేత్త మురదూరి నరసింహాచార్యులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన శ్రీరామ నవమి సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నరసింహాచార్యులు శ్రీరామరాజ్యం అంశంగా ప్రసంగించారు. శ్రీరాముడు దుష్టులను శిక్షించడం, హితులను రక్షించడం, ప్రజలకు రక్షణ కల్పించడం చేశారని తెలిపారు. రాజ్యంలోని ప్రజలు ఏమనుకుంటున్నారో వేగుల ద్వారా విచారించేవాడని పేర్కొన్నారు. రామరాజ్యం సంక్షేమం దిశగా సాగిందని వివరించారు.


సభాస్థలిలో ర్యాంప్ చివరి వరకు వచ్చి కనుచూపుమేర కనబడుతున్న అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నా సంకల్పం చెదరదు

గుడివాడ మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా బెదిరే ప్రసక్తే లేదని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల గుండెల్లో నిలవడం చేతకాని వారు ఎన్ని మాటలు మాట్లాడినా లెక్క చేయబోనన్నారు. 15వరోజు బస్సుయాత్ర సందర్భంగా సోమవారం సాయంత్రం కృష్ణా జిల్లా గుడివాడ శివారు నాగవరప్పాడులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఒక్క జగన్‌పై.. పదిమంది కుట్రదారుల దాడి

గుడివాడలో ఈరోజు మహా సముద్రం కనిపిస్తోంది. ఇది జన సముద్రం. మే 13న జరగనున్న ఎన్నికల మహా సంగ్రామంలో మంచి వైపు నిలబడిన ప్రజా సముద్రం ఇది. పేదల భవిష్యత్తు కోసం.. పథకాలన్నీ కాపాడుకోవడానికి.. కొనసాగించేందుకు.. ఇంటింటి అభివృద్ధి, పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేందుకు ఆ పెత్తందారులతో యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? పేదలకు మంచి చేస్తూ 130 బటన్లు నొక్కిన మన ప్రభుత్వానికి మద్దతుగా రెండు బటన్లు ఫ్యాన్ గుర్తుపై నొక్కేందుకు, మరో వంద మందితో నొక్కించేందుకు స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారానికి మీరంతా సిద్ధమేనా? రాష్ట్ర భవిష్యత్తు, పేదల భవిష్యత్తును కాపాడుకునేందుకు జరుగుతున్న ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? సిద్ధమే అయితే మీ సెల్‌ఫోన్లలో టార్చ్‌లైట్లు వెలిగించి సంఘీభావం తెలియచేయండి. ప్రజలకు మంచి చేశానన్న ధైర్యంతో నిలబడ్డ మీ ఒక్క జగన్‌పై మోసాలే అలవాటుగా పెట్టుకున్న పదిమంది కుట్రదారులు దాడి చేస్తున్నారు.

తాటాకు చప్పుళ్లకు మీ బిడ్డ బెదరడు..

చంద్రబాబు, దత్తపుత్రుడు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, బీజేపీ, కాంగ్రెస్.. కుటిల పద్మవ్యూహంతో ఒక్కటై మీ జగన్ మీద బాణాలు సంధిస్తున్నాయి. మీకు మంచి చేసిన మీ బిడ్డ మీద, మీ సేవకుడిగా ఉన్న మీ బిడ్డ మీద ఇంతమంది దాడి చేస్తున్నారు. అయినా సరే మీ బిడ్డ అదరడు, బెదరడు. కారణం.. ప్రజలు అనే శ్రీకృష్ణుడి అండ ఉన్న అర్జునుడు మీ బిడ్డ. అర్జునుడి మీద ఓ బాణం వేసినంత మాత్రాన కురుక్షేత్రం గెలిచినట్లు కాదు. జగన్ మీద ఒక రాయి విసిరినంత మాత్రాన ఆ దుష్టచతుష్టయం, పెత్తందారుల ఓటమిని, మన పేదల ప్రభుత్వం గెలుపును ఎవరూ ఆపలేరు. ఇలాంటి దాడుల వల్ల నా సంకల్పం చెక్కుచెదరదు. వాళ్లు ఈ స్థాయికి దిగజారారంటే దాని అర్థం.. విజయానికి మనం చేరువగా ఉన్నామని, వారు దూరంగా ఉన్నారనే. తాటాకు చప్పుళ్లకు మీ బిడ్డ అదరడు, బెదరడు. మీకు సేవ చేయాలన్న సంకల్పం మరింత పెరుగుతుందే కానీ తగ్గదు.

దేవుడు... పెద్ద స్క్రిప్టు రాశాడు

నా నుదిట మీద వారు చేసిన గాయం కన్నుపై, తలపై తగలలేదంటే దాని అర్థం.. దేవుడు మీ బిడ్డ విషయంలో పెద్ద స్క్రిప్టు రాశాడనే! నా నుదిట మీద వారు చేసిన గాయం పది రోజుల్లో తగ్గిపోతుందేమో గానీ చంద్రబాబు ప్రజలకు చేసిన గాయాలను పేదలు ఎన్నడూ మరిచిపోయే పరిస్థితి ఉండదు. గాయపరచడం, మోసం చేయడం, కుట్రలు చేయడం చంద్రబాబు నైజం. ఇంటింటికి మంచి చేయడం మీ బిడ్డ నైజం.

మంచి చేయకూడదన్నదే బాబు ఫిలాసఫీ

ఈ కూటమి నాయకుడు చంద్రబాబు 30 ఏళ్ల ఫిలాసఫీని ఒక్కసారి చూస్తే పేద ప్రజలకు ఎలాంటి మంచి చేయకూడదన్నదే ఆయన సిద్ధాంతం. చంద్రబాబు ఎలాంటి వారో ఆయన నైజం చూస్తే అందరికీ తెలుస్తుంది. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వొద్దన్నదీ, తీగలపై బట్టలు ఆరేసుకోవాలన్నదీ ఈ బాబే. కిలో రెండు రూపాయలకు బియ్యం ఇవ్వొద్దని, ఎన్టీఆర్‌ను దింపేసి రూ.5.25కి పెంచేసిందీ, నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వొద్దన్నదీ ఈ బాబే. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియం వద్దన్నదీ, ప్రభుత్వ పాఠశాలలను పాడు పెట్టిందీ ఈ బాబే.

పేదల ఇళ్లకు అడ్డుపడిందెవరు?

పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే అడ్డుపడి కులాలు, సామాజిక సమతుల్యం దెబ్బతింటుందంటూ ఏకంగా కోర్టులకు వెళ్లి కేసులు వేసింది చంద్రబాబు కాదా? సీఎం గా ఉంటూ బీసీలను, ఎస్సీలను అవహేళన చేసిన వ్యక్తి ఎవరు? ఈ బాబే కదా! విడగొట్టిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా వద్దన్నది ఎవరు?.. ప్రత్యేక హోదా ఏమైనా సంజీవనా అన్నది ఎవరు? ఈ బాబే. ఆ హోదాను తాకట్టు పెట్టిందీ ఈ బాబే.

మానవత్వం, మంచితనం లేదు..

చంద్రబాబు ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పుడు ఎన్టీఆర్ పిల్లనిచ్చి చేరదీస్తే చెప్పులు వేయించి వెన్నుపోటు పొడిచింది బాబు కాదా? మళ్లీ అవసరమైతే ఎన్టీఆర్ ఫొటో బయటకు తీసి దండలు వేస్తాడు. ఇంత నీచమైన వ్యక్తి బాబే. ఆ మనిషికి మానవత్వం, మంచితనం లేదు. దొంగ వాగ్దానాలు, మోసం, కుట్రలు, దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం.. ఇదే చంద్రబాబుకు తెలిసిన నీతి.



మారిన మన గ్రామాలు...

మొట్ట మొదటిసారిగా మన గ్రామాల రూపురేఖలు మారాయి. గ్రామాల్లో విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, నాడు - నేడుతో ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మారాయి. ఏకంగా 54 వేల కొత్త నియామకాలు ప్రభుత్వ వైద్య రంగంలో చేపట్టాం. ప్రభుత్వ రంగంలో మరో 17 కొత్త మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టాం. ఇవన్నీ జరిగింది ఎప్పుడు? చేసింది ఎవరు? మీ బిడ్డ పాలనలోనే కదా! మరి చంద్రబాబు కడుపు మండదా? వైద్య ఆరోగ్య రంగంలో బాబు మార్కు ఎక్కడుంది? ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించాలి. గతంలో ఏం చెప్పారు? ఆ తరువాత చేసిందేమిటనేది తెలియచెప్పాలి.

చేపలకు కొంగను కాపలా పెట్టినట్లే

చంద్రబాబును నమ్మడం అంటే చెరువులో చేపలకు కొంగను కాపలా పెట్టడం లాంటిదే. దొంగ చేతికి తాళాలు ఇవ్వడమే. పులి నోట్లో తల పెట్టడమే. మరి మీ జగన్‌ను చూడండి. ఈ 58 నెలల కాలంలో మీరిచ్చిన అధికారంతో, దేవుడి ఆశీస్సులతో గ్రామగ్రామాన, ఇంటింటా జగన్ తెచ్చిన మార్పులు ఏమిటో మీరే చూడండి.


గుడివాడలో జరిగిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహానికి అభివాదం చేస్తున్న సీఎం జగన్

ప్రతి గ్రామంలో ఏడు వ్యవస్థలు..

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇవాళ ఏ గ్రామాన్ని తీసుకున్నా ఏకంగా ఏడు వ్యవస్థలు కనిపిస్తున్నాయి. గ్రామ/వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌లు, మహిళా పోలీసులు, కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు, నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు.. ఇలా ప్రతి గ్రామంలోనూ మీ బిడ్డ మార్కు కనిపిస్తోంది. మరి చంద్రబాబు మార్కు ఏమిటి? జన్మభూమి కమిటీలు, పచ్చ పాముల అవినీతి కాట్లు, లంచాల గాట్లు. అదే మీ బిడ్డ మార్కు చూస్తే అవినీతి, వివక్ష లేకుండా నేరుగా మీ చేతికే అందించే సేవలు కనిపిస్తాయి. ఈ తేడాను గమనించాలి. పౌర సేవల్లో మనం తెచ్చిన విప్లవాత్మక మార్పులను చూడండి. దేశ చరిత్రలో అవ్వాతాతలకు రూ.3,000 చొప్పున ప్రతి నెలా పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం ఎక్కడైనా ఉందా? ఇంటి వద్దకే రేషన్‌తోపాటు జనన, కుల ధృవీకరణ పత్రాలతో సహా 600 రకాల సేవలు ప్రతి గడపకూ అందిస్తున్నాం. ప్రతి గ్రామంలో వలంటీర్ వ్యవస్థ మన కళ్ల ముందే కనిపిస్తోంది. ఇలాంటి వ్యవస్థలను గతంలో ఎన్నడైనా చూశారా? కేవలం ఈ 58 నెలల్లోనే, మీ బిడ్డ పాలనలోనే ఈ మార్పులు మన గ్రామంలో కనిపిస్తున్నాయి. మరి చంద్రబాబు చేసిందేమిటంటే జన్మభూమి కమిటీలను తెచ్చి గ్రామాన్ని, రాష్ట్రాన్ని దోచేశాడు. మీ బిడ్డ ఆ దోపిడీని అరికట్టి ఇంటింటికి మంచి చేశాడు. రైతన్నకు చెప్పినవి ప్రతీ ఒక్కటీ చేశా. రైతన్నలకు తొలిసారిగా పెట్టుబడి కోసం రైతు భరోసా ఇస్తున్నది మీ బిడ్డ పాలనలోనే. పగటి పూట ఉచిత విద్యుత్, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రుణాలు, ఉచిత బీమా, ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్, అమూల్‌తో సహకార రంగాన్ని పటిష్టం చేసింది ఎవరంటే మీ బిడ్డ, మీ జగనే. రైతన్నలను చేయి పట్టుకుని నడిపిస్తూ ఆర్బీకే వ్యవస్థను తెచ్చిందెవరంటే అది కూడా మీ జగనే. వందేళ్ల తర్వాత 30 లక్షల ఎకరాల భూములను సర్వే చేసి సర్వ హక్కులు కల్పించింది కూడా మీ జగనే.

మనం తెచ్చిన మార్పులు చూసి..

14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా రైతన్నలకు మంచి చేయకపోగా చెడు చేసిన చంద్రబాబుకు, ఎల్లో మీడియాకు ఈ 58 నెలల్లో మనం చేసిన పనులు, పథకాలను చూస్తే కడుపు రగిలిపోకుండా ఉంటుందా? విద్యా రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంస్కరణలు తెచ్చి విద్యార్థులను, తల్లితండ్రులను ప్రోత్సహించాం. అమ్మఒడి, విద్యాకానుక, నాడు - నేడు, గోరుముద్ద, డిజిటల్ బోధన, ట్యాబ్‌లు, పెద్ద చదువులకు ఇబ్బంది పడకుండా పూర్తి ఫీజు రీయింబర్స్ అమలు చేస్తున్నాం. విద్యాదీవెన, వసతి దీవెనతోపాటు మూడో తరగతి నుంచే టోఫెల్‌ను సైతం ప్రవేశపెట్టాం. మన విద్యార్థులు ఇక్కడ నుంచే ప్రపంచ ప్రఖ్యాత విశ్వ విద్యాలయాల్లో చదువుకునేలా సరికొత్త విధానాలు మీ బిడ్డ పాలనలోనే అమలు జరుగుతున్నాయి.

చదువుల విప్లవంతో బాబుకు కడుపు మంట

మన విద్యారంగంలో ఇన్ని విప్లవాలు కళ్లెదుటే కనిపిస్తుంటే చంద్రబాబుకు కడుపు మండదా? చంద్రబాబు మార్కు చదువుల విప్లవం అంటే నారాయణ, చైతన్య కోసం బలి పెట్టిన చదువులు గుర్తుకొస్తాయి. ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లీషు మీడియం వద్దన్న ఆయన మాటలు గుర్తుకొస్తాయి. ఇక వైద్య రంగంలో ఆరోగ్యశ్రీని వెయ్యి నుంచి మూడు వేల ప్రొసీజర్లకు విస్తరించడంతో పాటు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నది మీ బిడ్డ పాలనలోనే. ఆరోగ్య ఆసరాతో ఉపాధి భృతి కూడా మీ బిడ్డ పాలనలోనే అందుతోంది.

బాబు మోసాల చిట్టా ఇదిగో

2014లోకూడా చంద్రబాబు ఇదే కూటమిగా ఏర్పడి రంగురంగుల హామీలిచ్చారు. దత్తపుత్రుడు, ప్రధాని మోదీ ఫొటోలతో రూపొందించిన మేనిఫెస్టోను ఇంటింటికీ పంపించారు. ఆ విఫల హామీల్లో ప్రధానమైనవి ఒక్కసారి పరిశీలిస్తే..

- రుణమాఫీపై మొదటి సంతకం చేస్తానన్నాడు. రూ.87,612 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయా? పొదుపు సంఘాల రుణాలు పూర్తిగా రద్దు చేస్తానన్నాడు. మరి రూ.14,205 కోట్ల రుణాలలో అక్కచెల్లెమ్మలకు ఒక్క రూపాయి అయినా మాఫీ చేశారా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చి ఒక్కరికైనా చేశాడా? ఇంటికో ఉద్యోగం లేదంటే నెలకు రూ.2000 నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల్లో నెలకు రూ.రెండు వేలు చొప్పున ఒక్కో ఇంటికి రూ.1,20,000 ఎవరికైనా ఇచ్చాడా? పక్కా ఇల్లు ఇస్తానన్న చంద్రబాబు కనీసం ఏ ఒక్కరికైనా ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చాడా? రూ.పదివేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్ లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. ఎక్కడైనా చేశాడా మరి? ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా? సింగపూర్‌ని మించి అభివృద్ధి చేసి ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి మీ గుడివాడలో కనిపిస్తోందా? ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ కొత్త హామీలతో మరోసారి మోసానికి సిద్ధమయ్యారు.

మహిళా సాధికారత..

అక్కచెల్లెమ్మల సాధికారతకు చంద్రబాబు ఓ విలన్. వాగ్దానాలతో వంచించడంలో ఆయనకున్న అనుభవం ఇంకెవరికీ లేదు. అక్కచెల్లెమ్మలకు వెన్నుపోటు పొడిచాడు. అదే మీ బిడ్డ ట్రాక్ రికార్డు చూస్తే అమ్మఒడి, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, 30 లక్షల ఇళ్ల పట్టాలు కనిపిస్తాయి. పిల్లల పెద్ద చదువులకు విద్యా దీవెన, వసతి దీవెన అంటే మీ జగన్. కల్యాణ మస్తు, షాదీ తోఫాతో అండగా నిలిచి చదువులను ప్రోత్సహిస్తున్నాం. అక్కచెల్లెమ్మలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కల్పించాం. నామినేటెడ్ పనులు, పదవుల్లో వారికి 50 శాతం రిజర్వేషన్లు కల్పించింది మీ జగనే.

మన జెండా తలెత్తుకుని ఎగురుతోంది

99 శాతం హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకున్నాం. ప్రతి ఇంటికి మంచి చేసి, మీ బిడ్డ వల్ల మీకు మంచి జరిగి ఉంటే మీరే సైనికులుగా నిలబడాలంటూ మొట్టమొదటిసారిగా ఒక ముఖ్యమంత్రి కళ్లల్లో కళ్లు పెట్టి చూసి నిజాయితీగా ఈ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి చెప్పగలుగుతున్నాడు. ప్రజలందరికీ మంచి చేసిన మన జెండా తలెత్తుకుని సగర్వంగా ఎగురుతోంది. వారి జెండా మరో నాలుగు జెండాలతో జతకట్టి కూడా ఎగరలేక కిందపడుతోంది. మీ ఓటు రాబోయే ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఎవరి పాలనలో మంచి జరిగింది? ఎవరు సీఎంగా ఉంటే మన జీవితాల్లో వెలుగులు విరబూస్తాయన్నది ప్రతీ ఒక్కరూ ఆలోచన చేయాలి. ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేస్తేనే ఈ అభివృద్ధి కొనసాగుతుందని స్టార్ క్యాంపైనర్లు ఇంటింటికీ వివరించాలి.

ఏకంగా 2.30 లక్షల ఉద్యోగాలు..

స్వయం ఉపాధితో పేదల జీవితాలు బాగుపడతాయని విశ్వసించి ఎన్నడూలేని విధంగా చేదోడు, వాహన మిత్ర, మత్స్యకార భరోసా లాంటివి తీసుకొచ్చాం. ఇలా ఏది చూసినా మీ జగనే. లా నేస్తం చూసినా గుర్తుకొచ్చేది మీ జగనే. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2019 వరకు రాష్ట్రంలో నాలుగు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఉంటే ఏకంగా 2.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చింది మీ బిడ్డ ప్రభుత్వమే. ఇవాళ నా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఉద్యోగాల్లో, నామినేటెడ్ పోస్టుల్లో పెద్ద ఎత్తున కనిపిస్తున్నారు. పరిపాలన వికేంద్రీకరణతో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. నాలుగు సీ పోర్టుల ఏర్పాటుతోపాటు 10 కొత్త ఫిషింగ్ హార్బర్లు, ఎయిర్ పోర్టుల విస్తరణ, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, ప్రణాళికాబద్ధంగా సాగునీటి ప్రాజెక్టుల పనులు చేపట్టింది మీ జగనే. తొలిసారిగా ఎంఎస్ఎంఈలకు తోడుగా నిలిచి సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు అండగా నిలబడింది మీ జగన్. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మనం వరుసగా ఏటా నంబర్‌వన్‌గా నిలిచామంటే కారణం మీ జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యలే.


అంబాపురం: చిన్నారిని ప్రేమగా ఎత్తుకుని..


కానుమోలు: సీఎం జగన్‌తో మహిళ ఆత్మీయత


కోడూరుపాడు: ప్రజలు, అభిమానులను పలకరిస్తున్న సీఎం జగన్

అందరి అవసరాలు తీర్చారు



కొడాలి నాని, గుడివాడ ఎమ్మెల్యే

'నిన్న జరగాల్సిన సిద్ధం సభ ఒక రోజు ఆలస్యమైనా సీఎం జగన్‌ను దీవించేందుకు మీరంతా ఇంత పెద్ద ఎత్తున తరలిరావడం ఆనందంగా ఉంది. ఐదేళ్ల పాలనలో స్కూలుకు వెళ్లే పిల్లల నుంచి అవ్వాతాతల వరకు ప్రతి ఒక్కరి అవసరాలను జగనన్న ప్రభుత్వం తీర్చింది. దళారులకు తావులేకుండా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా లక్షల మంది నిరుపేదల ప్రాణాలను వైఎస్సార్ కాపాడితే సీఎం జగన్ ఆ దారిలో మరో నాలుగు అడుగులు ముందుకేసి సంపూర్ణ వైద్య భరోసా కల్పిస్తున్నారు. గన్నవరం నుంచి గుడివాడ వస్తుంటే ఎంతోమంది అనారోగ్య బాధితులు ఒక్కసారి సీఎం జగన్‌కు కలిస్తే ఎంత ఖర్చయినా పరిష్కారం లభిస్తుందన్న భరోసాతో కనిపించారు. ఒక వ్యక్తిపై రాష్ట్ర ప్రజలకు ఉన్న నమ్మకం ఇదీ. వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబు మాయా కూటమి కట్టాడు. ఆయన వదిన పురందేశ్వరిని బీజేపీ అధ్యక్షురాలిని చేశాడు. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌ను పక్కన పెట్టుకున్నాడు. వీళ్లందర్నీ పెట్టుకుని కూడా సిద్ధం సభల ద్వారా వైఎస్ జగన్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక కుట్రలకు తెగించారు. భౌతికంగా తొలగించాలనే కుట్రతో శనివారం రాత్రి విజయవాడలో సీఎంపై దాడికి పురిగొల్పారు. వైఎస్ జగన్ ఎప్పుడూ చెబుతున్నట్లుగానే ఆ దేవుడు, ప్రజల ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే నుదిటి మీద బలమైన దెబ్బ తగిలినా కాపాడాడు. ప్రజల ఆశీస్సులతో 50 రోజుల్లో మరోసారి ముఖ్యమంత్రి పదవి కచ్చితంగా చేపడతారు. సీఎం జగన్ చెప్పిన మాటపై నిలబడతారు. ఓట్ల కోసం, పదవుల కోసం ఆయనతో ఒక్క చిన్న అబద్ధం కూడా చెప్పించలేం. ఐదేళ్లుగా ఆయన్ను చాలా దగ్గర నుంచి చూశాం. జగన్ కథ తేలుస్తానంటున్న చంద్రబాబుకు ఇవే ఆఖరి ఎన్నికలు. ఈ జన్మలో ఆయనకు అది సాధ్యం కాదు. ప్రజలంతా అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలి.




కలపర్రు టోల్‌ప్లాజా వద్ద బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికిన అభిమానులు, పార్టీ శ్రేణులకు సీఎం జగన్ అభివాదం

పేదల ప్రభుత్వం గెలుపును ఎవ్వరూ ఆపలేరు

- చంద్రబాబు చేసిన గాయాలను పేదలు ఎప్పటికీ మర్చిపోలేరు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

తన మీద ఒక రాయి విసిరినంత మాత్రాన పేదల ప్రభుత్వం గెలుపును ఎవ్వరూ ఆపలేరంటూ సీఎం జగన్ ధీమా వ్యక్తం చేశారు. తన సంకల్పం చెక్కు చెదరదని స్పష్టం చేశారు. చంద్రబాబు చేసిన గాయాలను పేదలు ఎప్పటికీ మర్చిపోలేరని పేర్కొన్నారు. 'మీ బిడ్డ వైఎస్ జగన్ మీద ఒక రాయి విసిరినంత మాత్రాన జరగబోయే ఎన్నికల కురుక్షేత్రంలో పెత్తందారుల ఓటమిని, పేదల ప్రభుత్వం గెలుపును ఎవ్వరూ ఆపలేరు. ఇలాంటి దాడులతో నా సంకల్పం చెక్కుచెదరదు. వాళ్లు ఈ స్థాయికి దిగజారారంటే విజయానికి మనం అత్యంత చేరువగా.. వాళ్లు చాలా దూరంగా ఉన్నారని అర్థం' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేర్కొన్నారు. 'నా నుదిటి మీద వాళ్లు చేసిన గాయం బహుశా 10 రోజుల్లో తగ్గిపోతుందేమో గానీ.. పేదలకు చంద్రబాబు చేసిన గాయాలను వాళ్లు ఎప్పటికీ మర్చిపోలేరు. గాయపర్చడం, మోసం చేయడం, కుట్రలు పన్నడం చంద్రబాబు నైజమైతే.. మీ ఇంటింటికీ మంచి చేయడం మీ బిడ్డ నైజమని చెప్పడానికి గర్వపడుతున్నా' అంటూ సీఎం జగన్ మరో ట్వీట్ చేశారు.

-సాక్షి, అమరావతి

15 వ రోజు — స్టార్ క్యాంపెయినర్లతో సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం యాత్రలో 15వ రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో..' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కొన్ని ఫొటోలను సామాజిక మాధ్యమం ఎక్స్‌లో(ట్విట్టర్)లో పోస్టు చేశారు. ఓ ముసలవ్వ అంతమంది జనంలో 'నేను జగన్‌ను చూడాలి' అంటూ మండుటెండలో అందర్నీ తోసుకుంటూ సీఎం జగన్ దగ్గరకు వచ్చింది. 'పేదోళ్లమైన మమ్మల్ని కన్న కొడుకు కన్నా ఎక్కువగా ఆదుకుంటున్నావ్. నువ్వు, నీ కుటుంబం చల్లగా ఉండాలి బిడ్డా..' అంటూ చేతులు జోడించి సీఎం జగన్‌కు నమస్కారం చేసి అక్కడున్న వారందరినీ ఆశ్చర్యపరిచింది. మిట్ట మధ్యాహ్నం మండే ఎండలో ఓ వికలాంగుడు వీల్‌చైర్‌పై వచ్చి సీఎం జగన్‌ను కలిసి 'జగనన్నా.. పేదోళ్లకు నువ్వు మనిషి రూపంలో ఉన్న దేవుడివి' అంటూ సీఎం జగన్‌ను ప్రశంసలతో ముంచెత్తి.. 'చక్కటి చిరునవ్వు నీకొక్కడికే సొంతం అన్నా' అనడంతో సీఎం జగన్ చిరునవ్వు నవ్వారు. - సాక్షి, అమరావతి









గన్నవరం: బస్సుయాత్రకు హాజరైన భారీ జనసందోహానికి సీఎం వైఎస్ జగన్ అభివాదం

రెట్టించిన ఉత్సాహంతో...

15వ రోజు 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం

- సీఎం వైఎస్ జగన్ ముఖంలో ఎప్పటిలాగే అదే చిరునవ్వుతో కూడిన ఆత్మవిశ్వాసం
- వచ్చిన ప్రతి ఒక్కరూ సీఎం జగన్ ఆరోగ్యంపైనే ఆరా
- జగన్‌పై హత్యాయత్నం చంద్రబాబు, పవన్ కుట్రేనన్న జనం
- ఎవరెన్ని కుట్రలు చేసినా 175 స్థానాలు గెలిపించుకుంటామని హామీ
- మండుటెండను సైతం లెక్కచేయక తరలివచ్చిన అవ్వాతాతలు, విద్యార్థులు
- కిలోమీటర్ల కొద్దీ బస్సుయాత్ర వెంట యువకుల బైక్ ర్యాలీ
- గన్నవరం చరిత్రలోనే కనీవినీ ఎరుగనంత జనంతో కిక్కిరిసిన కూడళ్లు
- మధ్యాహ్నం నుంచే గుడివాడ బహిరంగ సభకు పోటెత్తిన ప్రజలు
- కృష్ణాజిల్లాలో ముగించుకుని ఏలూరు జిల్లాలో ప్రవేశించిన బస్సుయాత్ర


సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర సందర్భంగా జనసంద్రంగా మారిన గన్నవరం

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

నుదిటిపై గాయం మానలేదు.. కుట్లు పచ్చి ఆరలేదు.. కంటిపైన వాపు తగ్గలేదు.. అయినా పెదాలపై చిరునవ్వు చెరగలేదు. ఆ ముఖంలో ఏ మాత్రం భయంలేదు. సడలని ఉక్కు సంకల్పంతో మరింత దృఢ నిశ్చయంతో జగన్ సోమవారం తన బస్సుయాత్రను ముందుకు దూకించారు. దాడులతో మన యాత్రను ఆపలేరని, ధైర్యంగా ముందుగు సాగుదామని కేడర్లో జోష్ నింపారు. బస్సుయాత్రలో భాగంగా ప్రతిరోజూ ఉ.9 గంటల నుంచి జగన్ సంబంధిత నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలను కలుస్తారు. అలాగే, సోమవారం ఈ కార్యక్రమానికి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆయా నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలే కాకుండా రాష్ట్రం నలుమూల నుంచి పలువురు నాయకులు తరలివచ్చారు. వారిని కలిసిన అనంతరం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కారణంగా డాక్టర్ల సూచనతో ఒకరోజు విశ్రాంతి తర్వాత కృష్ణాజిల్లా కేసరపల్లి నుంచి జగన్ 'మేమంతా సిద్ధం' 15వ రోజు బస్సుయాత్ర సోమవారం ఉదయం 10.25 నిమిషాలకు ప్రారంభమైంది. కేసరపల్లి బస ప్రాంతానికి అప్పటికే భారీగా చేరుకున్న అభిమానులు జగన్ రాకతో జై జగన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. అక్కడి నుంచి వందలాది మోటార్ బైకులు ర్యాలీగా ముందు నడవగా.. బస్సుయాత్ర గన్నవరం చేరుకుంది. మార్గమధ్యంలో తన కోసం వచ్చిన ఓ మహిళా అభిమానితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. గన్నవరం నియోజకవర్గం కొత్తపేటలో ప్రవేశించిన ముఖ్యమంత్రికి జాతీయ రహదారికి ఇరువైపులా బారులుతీరిన మహిళలు అఖండ స్వాగతం పలికారు. గన్నవరం వద్ద జాతీయ రహదారికి రెండువైపులా జనసందోహంతో నిండిపోయింది. గన్నవరం చరిత్రలోనే కనీవినీ ఎరుగనంత జనంతో కూడళ్లు ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయాయి. బస్సుపైకెక్కి వారికి అభివాదం చేస్తూ జగన్ ముందుకు సాగారు. మహిళలు జననేతకు గుమ్మడికాయలతో దిష్టితీసి హారతులిచ్చారు. జగనన్నా.. నీ ప్రాణానికి మా ప్రాణం అడ్డువేస్తామంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గాంధీబొమ్మ సెంటర్ జనసంద్రంగా మారింది. ఆపదను దాటి వచ్చిన నాయకుడికి అక్కడి ప్రజలు ప్రేమతో స్వాగతం పలికారు. జగన్‌ను చూసేందుకు పెద్దఎత్తున భవనాలపైకి స్థానికులు చేరుకున్నారు. జననేతను చూసి ఆనందంతో అభివాదం చేశారు.

స్వచ్ఛందంగా తరలివస్తున్న జనం..

ఉమామహేశ్వరం మీదుగా ముందుకు సాగిన జగన్‌ను చూసేందుకు ఇళ్లల్లో నుంచి వృద్ధులు మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. హనుమాన్ జంక్షన్ క్రాస్ మీదుగా పెరికీడుకు చేరుకున్న జగన్‌కు భారీ జనసందోహం బాణాసంచాతో స్వాగతం పలికారు. కానుమోలులో శిరీష రీహాబిలిటేషన్ సెంటర్ (ఉయ్యూరు) నిర్వాహకులు, దివ్యాంగులతో వచ్చి జగన్‌ని కలిశారు. తమ సేవలను గుర్తించి ప్రభుత్వం వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్‌ను అందించినందుకు వారు జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారితో మాట్లాడి ముందుకు సాగిన జగన్‌కు గ్రామస్తులు భారీగా వచ్చి ఘనస్వాగతం పలికారు. ఆరుగొలనులో రహదారి కిక్కిరిసిపోయేలా అభిమానులు తరలివచ్చి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఆరుగొలను ఆరోగ్యమాత ఆలయం వద్ద స్కడ్ హాట్ ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులు జగన్ మావయ్యా అంటూ ఎదురొచ్చారు. వారిని దాటి వచ్చిన జగన్‌కు పుట్టగుంటలో దారిపొడవునా ప్రజలు స్వాగతం పలికారు. పూర్ణకుంభంతో ఎదురొచ్చిన వేద పండితులు జగన్‌ను ఆశీర్వదించారు. మ.3.30 గంటలకు జగన్నాథపురం వద్ద మధ్యాహ్న భోజన విరామం తీసుకున్న సీఎం జగన్ ప్రజాభిమానాన్ని దాటుకుంటూ సా.5.38 గంటలకు గుడివాడ బహిరంగ సభకు చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచే బహిరంగ సభకు జనం పోటెత్తడంతో సభా ప్రాంగణం జన సునామీని తలపించింది. ఆ అశేష జనవాహినినుద్దేశించి జగన్ ప్రసంగించారు. సభ అనంతరం 6.40 కి బస్సుయాత్ర తిరిగి ప్రారంభమైంది. హనుమాన్ జంక్షన్ హైవే మీదుగా కలపర్రు టోల్‌ప్లాజా చేరుకుంది. ఏలూరు జిల్లా నేతలు, కార్యకర్తలు, అభిమానులు జగన్‌కు ఎదురొచ్చి గజమాలలు, డప్పులు, బాణాసంచా వెలుగులతో ఘన స్వాగతం పలికారు.

చంద్రబాబు, పవన్ కుట్ర అది..

ఇక జగన్‌పై హత్యాయత్నం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కుట్రేనని బస్సుయాత్రకు వచ్చిన ప్రతిఒక్కరూ నినదించారు. వాళ్లే వేయించారని, రాళ్లు పెట్టికొట్టండి పగోడు వస్తున్నాడు అని ఆ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రెచ్చగొట్టారని దుమ్మెత్తిపోశారు. 'రాళ్లుపెట్టి కొట్టండి అని చంద్రబాబు అన్నాడు. నీకు దమ్ముంటే గెలిపించుకో, నీకు దమ్ముంటే పథకాలివ్వు. నీ దగ్గర శక్తి ఉంటే జనం మనస్సులు గెలుచుకో. కానీ, నువ్వు ఏ ఒక్క పథకం ఇవ్వలేదు. జనానికి సున్నా చుట్టావు. నిన్నెలా నమ్ముతారు చంద్రబాబు.. అంటూ జనం సూటిగా ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు ఎవరికీ న్యాయం చేయలేదని, అన్యాయమే చేశాడని, 175 సీట్లు జగన్‌కే వస్తాయి.. చంద్రబాబుకు ఒక్క సీటు కూడా రాదని ముక్తకంఠంతో చెప్పారు.

ఏలూరు జిల్లాలో ఎగిసిన అభిమాన సంద్రం

బస్సుయాత్ర కలపర్రు టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే ఏలూరు జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు, అభిమానులు జగన్‌కు ఎదురొచ్చి గజమాలలు, డప్పులు బాణాసంచాతో జగన్‌కు ఘనస్వాగతం పలికారు. గజమాలలు ఏర్పాటుచేసి మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీశారు. పొద్దుపోయినా జాతీయ రహదారిపై జనం బారులు తీరారు. బస్సు పైకెక్కి వారందరికీ జగన్ అభివాదం చేస్తూ ఏలూరు క్రాస్ నుంచి భీమడోలు మీదుగా యాత్ర కదిలింది. కైకరం వద్ద రోడ్డు ప్రమాద ఘటనలో గాయపడ్డ వారిపట్ల సీఎం తక్షణమే స్పందించి మానవత్వం చూపారు. ఒక పోలీస్ వాహనాన్ని (కాన్వాయ్ వాహనం కాదు) బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు వెనకనుంచి ఢీకొట్టారు. సీఎం బస్సును ఆపి, ప్రమాదాన్ని చూసిన తర్వాత బాధితులకు వెంటనే వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. సీఎం కాన్వాయ్లో ఉంచిన అంబులెన్స్ ద్వారానే క్షతగాత్రులను ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. అనంతరం ముందుకు సాగిన సీఎం జగన్ చేబ్రోలు మీదుగా నారాయణపురం బస ప్రాంతానికి రాత్రి 9.55 నిమిషాలకు చేరుకున్నారు. యాత్ర మొత్తం జగన్‌ను చూసేందుకు వచ్చిన ప్రజలు మీకు తోడుగా మేమున్నామంటూ ఆశీర్వదించంతో 15వ రోజు మేమంతా సిద్ధం బస్సుయాత్ర ముగిసింది.

సూరీడు నిప్పలు చెరుగుతున్నా..

ఎర్రని సూరీడు చండ్ర నిప్పులు కురిపిస్తున్నా లెక్కచేయకుండా జగన్ బస్సుపైకి వచ్చి అందరికీ అభివాదం చేశారు. చినఅవుటపల్లి వద్దకు రాగానే అక్కడ మహిళలు జగన్‌కు ఎదురొచ్చారు. వారిని జననేత పలకరించి సమస్యలు తెలుసుకున్నారు. హైవే బైపాస్‌వల్ల జాతీయ రహదారితో కనెక్షన్ కోల్పోయిన చినవాడిపల్లికి న్యాయం చేయాలంటూ ఆ గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఉంగుటూరు మండలం పెదఅవుటపల్లికి చెందిన క్యాన్సర్ బాధితురాలు లింగంపల్లి నేలవేణి సాయం చేయమని సీఎంను కోరారు. ఆమెకు భరోసా ఇచ్చి జగన్ ముందుకు కదిలారు. మరికొంత దూరం రాగానే పెదఅవుటపల్లి క్రాస్ వద్ద తనను చూసేందుకు పరుగుపరుగున వచ్చిన ప్రజలను చూసి జగన్ బస్సును ఆపించి వారితో మాట్లాడారు. సుభాషిణి అనే మహిళ తన అన్న బాలశౌరి ఆరోగ్యంపై వినతిపత్రం అందజేశారు. ఆత్కూరులో అభిమానులు జగన్‌కు వైఎస్సార్‌సీపీ జెండాలతో స్వాగతం పలికారు. అక్కడి మహిళల సమస్యలను జగన్ అడిగి తెలుసుకున్నారు. పొట్టిపాడు టోల్‌గేట్ దాటగానే మహిళలు హైవేపై బంతిపూలతో వైఎస్సార్‌సీపీ అని రాసి స్వాగతం పలికారు. తేలప్రోలు వద్ద అభిమానుల స్వాగతాన్నందుకుని జగన్ ముందుకొచ్చారు. కోడూరుపాడు వద్ద మహిళలు, రైతులను జగన్ పలకరించారు. వీరవల్లి హైస్కూల్ బాలికలు జగన్ మావయ్యకు ఆప్యాయంగా స్వాగతం పలికారు. వారితో జగన్ కాసేపు ముచ్చటించారు.

మొదటి ఓటు జగన్ మామకే..

ఫస్ట్‌టైమ్ ఓటు వేస్తున్నాను. నాకైతే చాలా ఆసక్తిగా ఉంది. ఎందుకంటే జగన్ వంటి మంచి వ్యక్తికి ఓటు వేయడమనేది చాలా గర్వంగా ఉంది. జగన్ మామకే ఓటు వేయాలనుకుంటున్నా. మంచి పథకాలిచ్చి జనానికి మంచి చేస్తున్నారు. అందుకోసమైనా గెలిపించుకోవడానికి ఆయనకే ఓటు వేస్తా. మంచిచేసే వ్యక్తిని కావాలని కోరుకుంటాంగానీ తప్పుడు పనులు చేసేవాళ్లకు వేయం కదా. ఇంతకుముందు పాలనలో పేదోడు అయితే బాగుపడింది లేదు. ఇప్పుడు జగన్ మామ వచ్చిన తర్వాత పేదోడు అనేవాడు కాలర్ ఎగరేసుకుని తిరుగుతున్నాడు. మంచి గెలవాలి అంటే మనమంతా కలిసి గెలిపించుకోవాలి.. చెడు రాజకీయం చేయకూడదు. ఇక్కడికి వచ్చిన వాళ్లలో విద్యార్థులే ఎక్కువ.. అన్నయ్య గెలుపు కూడా విద్యార్థులతోనే మొదలవుతుంది.

– కమలాకర్, విద్యార్థి

జగనే మళ్లీ సీఎంగా రావాలి..

జగనన్న స్థలం ఇచ్చాడు.. ఇళ్లు కట్టించాడు. మగ్గం డబ్బులు కూడా ఇచ్చి ఆదుకున్నాడు. నాకు మగ్గంతో ఇంట్లో ఇరుకుగా ఉండేది. ఇల్లు ఇరుకుగా ఉండటంతో మగ్గాన్ని షెడ్డులో తెచ్చిపెట్టుకున్నాం. ఇప్పుడు మాకు బాగుంది. కాబట్టి మళ్లీ జగనన్నే సీఎంగా రావాలని కోరుకుంటున్నాం.

– బత్తూరి పద్మావతి, మంగళగిరి

టీడీపీ హయాంలో నరకయాతన

టీడీపీ ప్రభుత్వంలో చాలా యాతన పడ్డాం.. వాళ్లు వెయ్యి రూపాయల పెన్షన్‌ను కూడా సరిగ్గా ఇవ్వలేకపోయారు. మా అమ్మ ఆఫీస్ చుట్టూ తిరగలేకపోయేది. మేం వెళ్తుంటే పెన్షన్ మాకు ఇచ్చేవారు కాదు. ఆవిడే రావాలి, ఆవిడే సంతకం పెట్టాలి అని టీడీపీ వాళ్లు చాలా ఇబ్బంది పెట్టారు. ఆవిడ నడవలేని, లేవలేని మనిషి.. వాళ్ల అమ్మాయికివ్వండి అని ఎంతమంది చెప్పినా ఇవ్వలేదు. జగనన్న మాకు స్థలం ఇచ్చాడు. ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు కూడా ఇచ్చాడు. మేం ఇల్లు కట్టుకున్నాం. పెన్షన్, రేషన్ ఇంటికే వస్తోంది. ఈరోజు ఈ ఇంట్లో ఉండి తినగలుగుతున్నామంటే అంతా జగనన్న చలవే. ఇంతవరకు మమ్మల్ని అలా ఆదరించిన వాళ్లు, అలా అనుగ్రహించి చూసిన వాళ్లు, సహాయం చేసినవాళ్లంటూ ఎవరూ లేరు. నా తోడబుట్టిన వాడిలా మాకు సహాయం చేశాడు. మళ్లీ మళ్లీ జగనే రావాలని మేం కోరుకుంటున్నాం.

– కందుకూరి కల్పన, ప్రభుత్వ సంక్షేమ లబ్ధిదారు

సీఎం జగన్‌కు నేతల సంఘీభావం

యోగక్షేమాలు తెలుసుకున్న నేతలు.. పార్టీ నేతలకు ధైర్యం చెప్పిన సీఎం


సీఎం వైఎస్ జగన్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి


సీఎం వైఎస్ జగన్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్న కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన అసెంబ్లీ అభ్యర్థి ఉప్పాల రాము

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం నేపథ్యంలో సోమవారం కేసరపల్లి క్యాంపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రికి సంఘీభావం తెలిపారు. హత్యాయత్నం ఘటనపై తీవ్ర విచారం వ్యక్తంచేసి, సీఎం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావటం ఖాయమని, బస్సుయాత్రకు వస్తున్న విశేష ఆదరణ చూసి తట్టుకోలేక ఈ దారుణానికి పాల్పడ్డారని పార్టీ నేతలు ముఖ్యమంత్రితో అన్నారు. ప్రజల ఆశీర్వాదంవల్లే అదృష్టవశాత్తూ దాడి నుంచి సీఎం తప్పించుకున్నారన్నారు. ఇలాంటి దాడులు యాత్రను, వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేవని ముఖ్యమంత్రి జగన్ నేతలతో అన్నారు. దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదం ఉన్నాయని ఆయన వారితో అన్నారు. ధైర్యంగా అడుగులు ముందుకువేద్దామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరంలేదన్నారు. ఇక సీఎంను కలిసిన వారిలో మండలి చైర్మన్ మోషేన్‌రాజు, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీలు కేశినేని నాని, అయోధ్యరామిరెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, మొండితోక జగన్మోహన్‌రావు, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కైలే అనిల్‌కుమార్, వల్లభనేని వంశీ, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, కల్పలతారెడ్డి, విజయవాడ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్, మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, పెడన అభ్యర్థి ఉప్పాల రాము, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, డాక్టర్ దుట్టా రామచంద్రరావు తదితరులున్నారు.


కానుమోలు: జగనన్నతో సిస్టర్ సెల్ఫీ


హనుమాన్‌జంక్షన్: వడమాలతో సీఎం వద్దకు వచ్చిన మహిళ




కలపర్రు టోల్‌ప్లాజా: సీఎం జగన్‌కు దిష్టితీసి ఏలూరు జిల్లాలోకి స్వాగతం పలుకుతున్న మహిళలు, పూళ్ల గ్రామంలో అభిమానులకు సీఎం జగన్ అభివాదం, సీఎం జగన్ తమ గ్రామంలోకి రావడంతో ఆనందంలో నారాయణపురం వాసులు

రఘురామ కేసులో స్టే ఎత్తేయండి

సుప్రీంకోర్టుకు సీబీఐ అభ్యర్థన



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఇండ్-భారత్ పవర్ (మద్రాస్) లిమిటెడ్ బ్యాంకులను మోసం చేసిన కేసులో నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుపై దర్యాప్తు కొనసాగించడానికి వీలుగా స్టే ఎత్తేయాలని సుప్రీంకోర్టును సీబీఐ కోరింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ రఘురామ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. సీబీఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ.. ఆర్‌బీఐ సర్క్యులర్‌కు సంబంధించి క్రిమినల్ చర్యల్లో ఎఫ్ఐఆర్ కొనసాగుతోందన్నారు. దీనికి సంబంధించి తీర్పు ఉందని తెలిపారు. అయితే ఈ కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగకుండా సుప్రీంకోర్టు స్టే విధించిందని గుర్తుచేశారు. దర్యాప్తు కొనసాగించడానికి వీలుగా స్టే ఎత్తేయాలని అభ్యర్థించారు. రఘురామ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సీనియర్ న్యాయవాది అందుబాటులో లేని కారణంగా కేసును కొద్దిసేపు వాయిదా వేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం రెండు వారాల తర్వాత విచారణ చేపడతామని కేసును వాయిదా వేసింది. రూ.వందల కోట్ల బ్యాంకు రుణాల మోసం కేసులో ఇండ్-భారత్ పవర్ (మద్రాస్) లిమిటెడ్, రఘురామకృష్ణరాజు మరో 15 మందిపై సీబీఐ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఏర్పాటు చేస్తామన్న కంపెనీని నెలకొల్పకుండా.. ఇతర బ్యాంకుల్లో ఆ సొమ్ములు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి వాటిపై మళ్లీ రుణం తీసుకున్నారని సీబీఐ ఆరోపించింది.

రంగంలోకి దిగిన ఈడీ

మరోవైపు ఇండ్ - భారత్ సన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట విదేశాల నుంచి పెద్ద ఎత్తున నిధులను అక్రమంగా తరలించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. తన సంస్థ కోసమని రఘురామ 2011లో మారిషస్‌కు చెందిన స్ట్రాటజిక్ ఎనర్జీ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ అనే కంపెనీ నుంచి రూ.202 కోట్లు రుణం తీసుకున్నారు. అయితే నిధులు అందిన మరుసటి రోజే రూ.200 కోట్లను ఇండ్ - భారత్ ఎనర్జీ లిమిటెడ్ (ఉత్కళ్)కు తరలించేశారు. ఈ వ్యవహారం మొత్తం ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) దృష్టిలో పడింది. దీంతో విషయాన్ని లోతుగా పరిశీలించిన ఫెమా అధికారులు మారిషస్ కంపెనీ నుంచి రఘురామకృష్ణరాజుకు చెందిన కంపెనీ ఇండ్ -భారత్ సన్ ఎనర్జీకి రూ.202 కోట్లు అందినట్లు గుర్తించారు. అలాగే మరుసటి రోజే ఇండ్ -భారత్ ఎనర్జీ లిమిటెడ్‌కు ఈ మొత్తం బదిలీ అయినట్లు కూడా నిర్ధారించుకున్నారు. రఘురామ రాజు కంపెనీ ఫెమా నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో ఈడీ రూ.40 కోట్లు జరిమానా కూడా విధించింది.

ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన బ్యాంకులు

తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియం దివాలా ప్రక్రియకు అనుమతి కోరుతూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని ఆశ్రయించింది. ఇండ్-భారత్ థర్మల్ రూ.1,383 కోట్ల రుణాన్ని బ్యాంకులకు చెల్లించాల్సి ఉండగా, చాలాకాలంగా బకాయిలు చెల్లించడం లేదని బ్యాంకుల కన్సార్టియం ఫిర్యాదు చేసింది. రఘురామ కంపెనీ తనఖా పెట్టిన ఆస్తుల విలువ కేవలం రూ.872 కోట్లే ఉండటంతో ఈ కంపెనీ దివాలా తీసినట్లుగా భావిస్తూ దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలని కోరింది. దీంతో బ్యాంకుల వాదనతో ఏకీభవించిన ఎన్‌సీఎల్‌టీ దివాలా ప్రక్రియకు అనుమతించింది.

బ్యాంకులను నిండా ముంచిన రఘురామకృష్ణరాజు

బ్యాంకుల నుంచి రూ.వేల కోట్ల రుణాలు తీసుకొని వాటిని నిండా ముంచిన రఘురామకృష్ణరాజుపై దర్యాప్తు పూర్తి చేయడానికి సీబీఐ రంగం సిద్ధం చేస్తోంది. గతంలో సీబీఐ దర్యాప్తును ఆపాలంటూ ఆయన తెచ్చుకున్న స్టేను ఎత్తివేయాలంటూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో మరోసారి రఘురామ మోసాలు చర్చనీయాంశంగా మారాయి. ఇండ్- భారత్ థర్మల్ పవర్ లిమిటెడ్ పేరుతో ఆయన వివిధ బ్యాంకుల నుంచి సుమారు రూ.1,383 కోట్ల రుణాలను తీసుకున్నారు. ఈ మొత్తాలను కంపెనీ అవసరాలకు వినియోగించకుండా వాటిని తన వారి ఖాతాల్లోకి తరలించి బ్యాంకులను నిండా ముంచారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు, దాని అనుబంధ బ్యాంకుల నుంచి ఇండ్-భారత్ థర్మల్ పవర్ పేరిట తీసుకున్న రూ.826.17 కోట్ల రుణాన్ని పక్కకు మళ్లించడంతో పాటు వడ్డీ కూడా చెల్లించడం లేదంటూ ఆ బ్యాంకు సీబీఐని ఆశ్రయించడంతో రఘురామ మోసాలు వెలుగులోకి వచ్చాయి. తనకు తనఖాగా పెట్టిన భూముల్ని మోసపూరితంగా అమ్మేసుకోవడం, 95 శాతం బొగ్గు తరిగిపోయిందని చెప్పి దాన్ని తగలబెట్టేశారని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు చేయడంతో సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. 2020 అక్టోబర్‌లో రఘురామకృష్ణరాజుకు చెందిన ఇళ్లు, కంపెనీలు, కార్యాలయాల్లో 11 సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందాలు సోదాలు నిర్వహించాయి. వీటిలో పలు ఫైళ్లు, హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నాయి ఈ సందర్భంగా సంస్థకు చైర్మన్‌గా ఉన్న రఘురామకృష్ణరాజుతో పాటు ఆయన భార్య, కుమార్తె ఇతర డైరెక్టర్లపై సీబీఐ కేసులు నమోదు చేసింది.

రాష్ట్రంలో సమృద్ధిగా 'నైరుతి' వానలు

చల్లటి కబురు చెప్పిన వాతావరణ విభాగం • ఈ ఏడాది పంటలకు మరింత మేలు



సాక్షి, విశాఖపట్నం: భారత వాతావరణ విభాగం (ఐఎండీ) రాష్ట్ర ప్రజలకు చల్లటి కబురు చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో మంచి వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రభావంపై ఐఎండీ సోమవారం ముందస్తు అంచనాలను విడుదల చేసింది. రాష్ట్రంలో సాధారణానికి మించి అధికంగా వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఎండలు, వడగాడ్పులతో అల్లాడుతున్న ప్రజలకు ఐఎండీ చెప్పిన కబురు ఉపశమనం కలిగించింది. గత ఏడాది ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో అరకొర వర్షాలే కురిశాయి. ఫలితంగా పంటలు దెబ్బతిన్నాయి. రానున్న నైరుతి సీజన్‌లో రాష్ట్రంలో సాధారణంకంటే అధిక వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా తెలిపారు. ఈ వానలు పంటలకు ఎంతో మేలు చేయనున్నాయి. అన్నదాతలకు ఊరట ఇవ్వనున్నాయి.

నైరుతి రాకపై మే నెలలో స్పష్టత

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ఆగమనం ఎప్పుడనే విషయమై మే నెల మధ్య నాటికి స్పష్టత రానుంది. సాధారణంగా జూన్ ఒకటో తేదీ నాటికి ఈ రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. గత ఏడాది ఎనిమిది రోజులు ఆలస్యంగా జూన్ ఎనిమిదిన కేరళను తాకాయి. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాలకు నెమ్మదిగా విస్తరించాయి. దీంతో వర్షాలు సకాలంలో కురవకపోవడమే కాదు.. సమృద్ధిగాను కురవలేదు.

కొనసాగుతున్న వడగాడ్పులు

రాష్ట్రంలో వడగాడ్పులు కొనసాగుతున్నాయి. పలు చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 40–44 డిగ్రీల వరకు నమోదయ్యాయి. 38 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 75 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. రానున్న మూడురోజులు ఇవి మరింతగా ప్రభావం చూపనున్నాయి. కొన్ని జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు నమోదయ్యే అవకాశాలున్నాయి. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 43.9 డిగ్రీలు, నంద్యాల జిల్లా బనగానపల్లెలో 43.3, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 43.1, పల్నాడు జిల్లా మాచెర్ల, విజయనగరం జిల్లా రాజాంలలో 42.8, అనకాపల్లి జిల్లా గాదిరాయిలో 42.7 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంగళవారం 63 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 130 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. విజయనగరం జిల్లాలో 22, శ్రీకాకుళం 15, పార్వతీపురం మన్యం 13, అనకాపల్లి 4, అల్లూరి సీతారామరాజు 3, కాకినాడ 3, తూర్పు గోదావరి 2, ఏలూరు జిల్లాలో ఒక మండలంలో తీవ్ర వడగాడ్పులు వీస్తాయి. తూర్పు గోదావరి జిల్లాలో 17, కాకినాడ 16, శ్రీకాకుళం జిల్లాలో 14, ఏలూరు 13, అనకాపల్లి 12, అల్లూరి సీతారామరాజు 11, కోనసీమ 9, కృష్ణా 7, ఎన్టీఆర్ 7, గుంటూరు 7, విజయనగరం 5, పల్నాడు 4, విశాఖపట్నం 3, పశ్చిమ గోదావరి 3, పార్వతీపురం మన్యం జిల్లాలో 2 మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయి. బుధవారం 38 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 135 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణసంస్థ తెలిపింది.

వైఎస్సార్‌సీపీలోకి 3 వేలమంది క్రీడాకారులు

విశాఖలో మంత్రి బొత్స, నేతల సమక్షంలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన క్రీడాకారులతో బొత్స సత్యనారాయణ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నంలో సోమవారం వేలాదిమంది క్రీడాకారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆంధ్రా బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, ఏపీ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాక్సింగ్, కరాటే, కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, ప్రైవేటు ఉద్యోగులు దాదాపు మూడువేలమంది సోమవారం విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి బొత్స సత్యనారాయణ, పార్లమెంట్ పరిశీలకులు మళ్ల విజయప్రసాద్, కాయల వెంకటరెడ్డి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి, నాయకుడు డాక్టర్ బొత్స సందీప్ తదితరుల సమక్షంలో వారు పార్టీ కండువాలు కప్పుకొన్నారు. మంత్రి బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు అన్ని రంగాల్లో వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్‌పై బాబు, పవన్ వైఖరేమిటో

అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి బొత్స మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం పేరుతో ఉత్తరాంధ్రలో తిరుగుతున్న బాబు ఇక్కడి నుంచి వెళ్లేలోగా.. స్టీల్‌ప్లాంట్‌పై కూటమి వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో కూటమి ఏర్పాటు చేసుకున్న బాబు, పవన్.. దమ్ముంటే వెంటనే స్టీల్‌ప్లాంట్‌పై తమ స్టాండ్ ప్రకటించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌పై నిర్ణయం తీసుకోవాల్సింది ఎన్‌డీఏ కూటమేనని, అలాంటప్పుడు తక్షణమే ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రకటించాలని సవాల్ విసిరారు. చంద్రబాబు తన వ్యాఖ్యలతో ఉసిగొలిపిన తర్వాతే విజయవాడలో సీఎంపై దాడి జరిగిందని తెలిపారు. దాడిగురించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న పవన్‌కళ్యాణ్‌కు వ్యవస్థల గురించి ఏం తెలుసని ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ కూలీల పార్టీ

- సీఎం జగన్‌పై గులకరాయి దాడి కనికట్టే
- ప్రజలను పక్కదారి పట్టించేందుకే డ్రామా
- ఆ గులక రాయి ఏమైంది? ఎక్కడకు పోయింది?
- టీడీపీ అధినేత చంద్రబాబు



రాజాం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

రాజాం/వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ/పలాస: వైఎస్సార్‌సీపీ అంతా కూలీల పార్టీ అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ సభలకు వస్తున్న జనమంతా కూలీలేనని చెప్పారు. సోమవారం విజయనగరం జిల్లా రాజాం, శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన ప్రజాగళం సభల్లో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌పై విజయవాడలో గులకరాయి తగిలితే అదేదో పెద్ద ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని, ఇదంతా కనికట్టేనని ఆరోపించారు. ఆ గులక రాయి ఏమైందని, ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. కరెంటు పోయినపుడు తక్షణమే సీఎంను బస్సు లోపలికి తీసుకుపోవాల్సిన బాధ్యత సెక్యూరిటీ వింగ్‌కు లేదా.. ఇదంతా ఓ డ్రామా అని అన్నారు. అప్పుడు కోడి కత్తి.. ఇప్పుడు గులకరాయి.. ఇలా డ్రామాలతో అధికారంలోకి రావాలని చూస్తే ప్రజలు గమనిస్తారని అన్నారు. రాయి తగిలిన పది నిమిషాలకే జగన్ ఉన్న బస్సు వద్ద తనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారని, అది ఎలా సాధ్యమవుతుందని అన్నారు. ప్రజలను పక్కదారి పట్టించేందుకే డ్రామా ఆడారని వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ బటన్ నొక్కి అంతా ఇచ్చామని చెబుతున్నాడని, బటన్ నొక్కడం మంచంపై ఉన్న ముసలమ్మ సైతం చేస్తుందన్నారు. ఈ ఐదేళ్లలో కరెంటు చార్జీలు పెంచారని, నిత్యావసరాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి రక్తాన్ని జలగన్న పీల్చేస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలోని 8 లక్షల మంది ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని సీఎంని ఎక్కడైనా చూశామా అని అన్నారు.

అప్పలరాజును అడవికి పంపాలి

పలాస ఎమ్మెల్యే సీదిరి అప్పలరాజునుద్దేశించి నువ్వెంత.. నన్నే విమర్శిస్తావా.. ఒళ్లు దగ్గరపెట్టుకోకుంటే మేమేంటో అధికారంలో వచ్చాక చూపిస్తామంటూ హెచ్చరించారు. నల్లబొడ్లూరు కొండలన్నీ ఆక్రమించి కొల్లగొట్టారని, దీంతో అక్కడ ఉన్న ఎలుగుబంట్లు వీధుల్లోకి వస్తున్నాయని చెప్పారు. కొండలు మింగిన అప్పలరాజును అడవికి పంపించాలన్నారు.

కనిపించని కిమిడి కుటుంబం

కాగా.. టీడీపీ విజయనగరం జిల్లాకు విస్తృత సేవలందించిన కిమిడి నాగార్జున సభ వద్ద కనిపించలేదు. మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావుతో పాటు ఆయన కుటుంబీకులు కూడా చంద్రబాబు సభకు దూరంగా ఉన్నారు. జనాలను రప్పించేందుకు టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ ఆపసోపాలు పడ్డారు. రెండు సభలకు డబ్బు, మద్యాన్ని విచ్చలవిడిగా పంచిపెట్టి కొద్ది మంది జనాలను తేగలిగారు. వారు కూడా చంద్రబాబు ఊకదంపుడు ప్రసంగం వినలేక మధ్యలోనే వెళ్లిపోయారు.

జిల్లా వార్తలు

పూలన్నీ దుర్గమ్మ పూజకే..



అమ్మవారికి పుష్పార్చన సేవ చేస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎర్ర తామరలు.. ఎర్ర గన్నేరు పూలు.. సన్నజాజులు.. ఇలా పూలు అన్నీ దుర్గమ్మ పూజకే అన్నట్లు ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న వసంత నవరాత్రోత్సవాల్లో ఏడో రోజైన సోమవారం ఎర్ర తామరలు, ఎర్ర గన్నేరు పూలు, సన్నజాజులతో అమ్మవారికి అర్చన నిర్వహించారు. అర్చనకు సేకరించిన పుష్పాలతో ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఈఈ కోటేశ్వరరావు, ఆలయ సిబ్బంది సతీష్, సునీత, మరి కొంత మంది ఊరేగింపుగా వచ్చి ప్రధానాలయంలోని దుర్గమ్మ మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వివిధ పుష్పాలతో అమ్మవారికి అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది. ఈ సేవను తిలకించిన భక్తులు పులకించారు. అనంతరం భక్తులకు అమ్మవారికి సమర్పించిన పుష్పాలను పంపిణీ చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో నూతన యాగశాల

- శరవేగంగా జరుగుతున్న పనులు
- 26న ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- రూ.5 కోట్లతో నిర్మిస్తున్న దాత



యాగశాలలో పూర్తయిన పిల్లర్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నూతన యాగశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అత్యంత అద్భుతంగా, సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న ఈ యాగశాలను ఈ నెల 26వ తేదీన ప్రారంభించేందుకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభోత్సవానికి మరో పది రోజుల గడువే ఉండటంతో నిర్మాణ పనులను కార్మికులు మరింత ముమ్మరం చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాధాకృష్ణ విగ్రహం సమీపంలోని పాత లడ్డూ ప్రసాదం పోటు స్థలంలో నూతన యాగశాల నిర్మాణం జరుగుతోంది. ఈ యాగశాల నిర్మాణంతో చండీహోమం జరిపించుకునే భక్తులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. యాగశాలను రూ.5 కోట్లతో దాత సంగా నరసింహారావు నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులపై ఆలయ ఈఓ కె.ఎస్. రామరావు ప్రత్యేక దృష్టి సారించారు. నితంతరం ఆలయ ఇంజినీరింగ్, అధికారులు, స్థపతితో చర్చించి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

తీరనున్న భక్తుల ఇక్కట్లు

అమ్మవారి సన్నిధిలో నిత్యం చండీహోమం నిర్వహిస్తారు. సాధారణ రోజుల్లో సుమారు 50 మంది ఉభయదాతలు, అమావాస్య, పౌర్ణమి, దశమి, ఏకాదశి, ఇతర విశేష పర్వదినాల్లో 250 మందికి పైగా ఈ హోమంలో పాల్గొంటారు. ప్రస్తుతం మల్లేశ్వర స్వామి ఆలయానికి చేరుకునే మార్గమధ్యలోని యాగశాలలో చండీహోమం జరుగుతోంది. విశేష పర్వదినాల్లో చండీహోమం జరిపించుకునే ఉభయదాతలు యాగశాలలో కూర్చునే వీలు ఉండటంలేదు. దీంతో వారు ఆరు బయట మెట్లపై కూర్చోవాల్సి వస్తోంది. నూతన యాగశాలను 250 గజాల స్థలంలో నిర్మిస్తున్నారు. 300 మందికి పైగా ప్రత్యక్షంగా యాగాన్ని వీక్షించేలా యాగశాల నిర్మాణం జరుగుతోంది. యాగశాల చుట్టూ మరో ఆరు అడుగుల వెడల్పున వరండా నిర్మిస్తున్నారు. ఒక వేళ పర్వదినాల్లో అనుకున్న సంఖ్య కంటే అత్యధికంగా ఉభయదాతలు చండీహోమంలో పాల్గొంటే వారు వరండాలో కూర్చుని యాగాన్ని వీక్షించే అవకాశం ఉంటుంది. యాగశాల నిర్మాణ పనులను ఈఓ కె.ఎస్.రామరావు ప్రతి మూడు రోజులకు ఒక సారి పర్యవేక్షిస్తున్నారు.



నూతనంగా నిర్మిస్తున్న యాగశాల



యాగశాల నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

యాగశాల విశేషాలు ఇవీ..

- నూతన యాగశాలను 46 అడుగుల వెడల్పు, 46 అడుగుల పొడవు కొలతతో నిర్మిస్తున్నారు.
- యాగశాల లోపల భాగంగా నాలుగు అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల పొడవుతో యాగ వేదిక, 12 అడుగుల వెడల్పు, 12 అడుగుల పొడవుతో పద్మపాదం నిర్మిస్తున్నారు.
- యాగశాలకు మొత్తం 36 పిల్లర్లపై నిర్మిస్తున్నారు.
- ఇప్పటికే పిల్లర్ల నిర్మాణం పూర్తి కాగా, వాటిపై పొదికలను ఏర్పాటు చేసి బీములు అమర్చుతున్నారు.
- మూడు, నాలుగు రోజుల్లో చప్పురాయిని ఏర్పాటు చేయడంతో పనులు పూర్తవుతాయి.
- 26న యాగశాలను లాంఛనంగా ప్రారంభించి, తుది మెరుగులను ఆ తర్వాత చేపట్టే అవకాశం ఉంది.
- యాగశాల నిర్మాణానికి అవసరమైన రాతి స్తంభాలు, రాతిని నరసరావుపేట సమీపంలోని క్వారీల నుంచి సేకరించారు.
- క్వారీల వద్దే రాతి స్తంభాలు, వాటిపై విగ్రహాలను తీర్చిదిద్ది ప్రత్యేక వాహనాల్లో దేవస్థానానికి తరలిస్తున్నారు.
- మరో వారం రోజుల్లో పనులను పూర్తి చేసేలా కార్మికులు రేయింబవళ్లు కష్టపడుతున్నారు.

గ్రంథాలయాల అభివృద్ధి ప్రణాళిక కమిటీ సభ్యురాలిగా శారద



డాక్టర్ రావి శారద

భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నేతృత్వంలో ఇటీవల ఏర్పాటు చేసిన డెవలప్‌మెంట్ ప్లాన్ ఫర్ పబ్లిక్ లైబ్రరీస్ ఇన్ ఇండియా కమిటీ సభ్యురాలిగా ఏపీ గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారదను కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు కమిటీ డైరెక్టర్ జనరల్ ఆచార్య బి.వి.శర్మ తెలిపినట్లు ఏపీ గ్రంథాలయ సంఘ ఉపాధ్యక్షుడు వేములపల్లి కేశవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ రావి శారద నాలుగు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సంఘం పక్షాన వెలువడుతున్న గ్రంథాలయ సర్వస్వం మాసపత్రికకు సంపాదకురాలిగా, పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం ప్రిన్సిపాల్‌గా, సర్వోత్తమ గ్రంథాలయం సంఘ కార్యదర్శిగా రాష్ట్రంలో పౌర గ్రంథాలయ రంగం అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని వివరించారు. జాతీయ, రాష్ట్ర గ్రంథాలయ మహాసభలను అనేకం నిర్వహించడమే కాకుండా పౌర గ్రంథాలయ రంగంలో విశేష ప్రతిభతో జాతీయ స్థాయిలో తనకంటూ ఒక గుర్తింపు సాధించారని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్



మాట్లాడుతున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): సమాజంలో వివక్షకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి, పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను సోమవారం రైల్వే ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. డీఆర్‌ఎంతోపాటు ఏడీఆర్‌ఎంలు పి.ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, సీఎంఎస్ డాక్టర్ శౌరిబాల, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘ ప్రతినిధులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ.. అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగం రచించి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసిన ఆ మహనీయుడి కీర్తిప్రతిష్టలు చరిత్రలో నిలిచిపోయాయని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ఉద్యోగులు విధుల్లో చిత్తశుద్ధితో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రదర్శించిన డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకాన్ని అందరితో కలసి వీక్షించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

మాతృమరణాలు సంభవించకుండా చర్యలు



సమీక్ష చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లాలో మాతృమరణాలు జరగకుండా వైద్యులు, వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ అధ్యక్షతన మాతృ మరణాలపై సబ్ డిస్ట్రిక్ లెవెల్ కమిటీ సమీక్ష సమావేశం సోమవారం జరిగింది. జిల్లాలో మార్చి నెలలో పెదకాకాని, కుంచనపల్లి, ఎర్రబాలెం, ఆరోగ్య కేంద్రాలలో సంభవించిన మూడు మాతృమరణాలకు కారణాలను కమిటీ సభ్యులు సమీక్షించారు. అందులో ఒకటి నివారించదగినదిగాను, రెండు మరణాలు నివారించలేనివిగాను నిర్ధారించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీగా నిర్ధారణ మొదలుకొని కింది స్థాయి వైద్య సిబ్బంది తప్పనిసరిగా క్రమం తప్పకుండా నెలనెలా గర్భిణీని ఫాలో అవ్వాలని చెప్పారు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించడం, ముఖ్యంగా రక్తహీనత లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. హై రిస్క్‌గా గుర్తిస్తే ముందస్తుగా కాన్పు ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారుల ద్వారా రిఫరల్ ఆస్పత్రుల వైద్య అధికారులకు గర్భిణీని పంపించి అత్యవసరమైతే ఫోన్‌లో సమాచారం అందజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మాతృమరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమీక్షలో కమిటీ సభ్యులు డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ సునీత, డాక్టర్ ఆదిత్య ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ప్రాంగణ ఎంపికలు



కేయూలో విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అశోక్ లేలాండ్ కంపెనీ సిబ్బంది

కోనేరుసెంటర్(మచిలీపట్నం): ప్రాంగణ ఎంపికల్లో కృష్ణా విశ్వవిద్యాలయం రికార్డు సృష్టిస్తోంది. రెండు వారాల్లో నాలుగు ప్రతిష్టాత్మక సంస్థలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 200 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి ప్రత్యేక చొరవతో సోమవారం ప్రతిష్టాత్మక సంస్థలైన అశోక్ లేలాండ్, టాటా విస్ట్రన్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించి 100 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశాయి. దీంతో ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి హర్షం వ్యక్తం చేశారు. అంజనాస్ ఫౌండేషన్ సహకా రంతో ఈ ప్రాంగణ ఎంపికలు జరిగాయి. అశోక్ లేలాండ్ హెచ్‌ఆర్ విభాగం డెప్యూటీ మేనేజర్ ఎస్.శంకర్, హెచ్ ఆర్ ట్రైనీ ఎస్.సుస్మిత, టాటా విస్ట్రన్ ప్రతినిధులు బి.నవీన్, జి.భవాని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్స్ సుందర కృష్ణ, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ పి.రాంబాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం సమన్వయకర్త డాక్టర్ కిషోర్, ఇంజినీరింగ్ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ అలీ మీర్జా తదితరులు పాల్గొన్నారు.


● ప్రధాని మోదీతో పాయల్

న్యూస్‌మేకర్

నంబర్ 1 మహిళా గేమర్



● పాయల్ ధారే

ఇటీవల ప్రధాని మోదీ దేశంలో టాప్ ఫాలోయింగ్ ఉన్న ఏడుగురు గేమర్స్‌ను కలిశారు. వారిలో ఒక్కతే అమ్మాయి పాయల్ ధారే. గేమ్స్‌ను ఆడుతూ తన వ్యాఖ్యానం వినిపిస్తూ 'లైవ్ స్ట్రీమింగ్' ద్వారా 35 లక్షల మంది ఫాలోయెర్లను సంపాదించుకున్న పాయల్ పురుషుల ఆధిపత్య రంగమైన గేమింగ్‌లో తనదైన స్థానం పొందారు. పాయల్ పరిచయం.

వీడియో గేమ్స్ అనగానే మూడు విధాలైన భాగస్వాములు ప్రస్తావనకు వస్తారు. 1. గేమ్స్ ఆడేవాళ్లు 2. చలామణిలో ఉన్న గేమ్స్‌ను ఆడుతూ తమ వ్యాఖ్యానం వినిపిస్తూ (లైవ్ స్ట్రీమింగ్) వీడియోలు చేసేవారు. 3. గేమ్స్ తయారు చేసే వారు. మన దేశంలో 2014 తర్వాత సెల్‌ఫోన్‌ల అందుబాటు పెరిగాక గేమ్స్ ఆడేవాళ్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. అయితే వారితోపాటు గేమ్స్ చుట్టూ షోస్ చేసేవారి (గేమర్స్) పలుకుబడి కూడా పెరిగింది. వీరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌గా మారారు. ఇక ఒరిజినల్‌గా మన దేశంలో గేమ్స్ తయారు చేసేవారు పై రెండు వర్గాలతో పోల్చితే తక్కువ. ఇటీవల ప్రధాని మోడి గేమ్స్ ద్వారా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మారిన 7 మంది గేమర్స్‌ను న్యూఢిల్లీలో కలిసి వారితో మాటామంతి జరిపారు. తీర్థ్ మిత్ర, అనిమేష్ అగర్వాల్, అన్షు బిస్త్, నమన్ మాధుర్, మిథిలేష్, గణేష్ గంగాధర్ అనే యువ గేమర్‌లతోపాటు వీరితో పాల్గొన్న ఒకే ఒక మహిళా గేమర్ పాయల్ ధారే.

15000 మంది గేమర్స్

మన దేశంలో 15 వేల మంది గేమర్స్ ఉన్నారు. అంటే వీడియో గేమ్స్‌ను ఆడుతూ వాటిని వివరిస్తూ వాటిపై వ్యాఖ్యానం చేస్తూ ఇన్‌స్టా, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా పాపులర్ అయిన వారు. ఇలాంటి వారిలో అత్యంత ఆదరణ పొందిన వారికి లక్షల మంది ఫాలోయెర్స్ ఉంటారు. ఇదంతా గేమింగ్ కమ్యూనిటీ. గేమ్స్ చుట్టూ వీడియోలు చేసేందుకే మన దేశంలో దాదాపు 1500 స్టుడియోలు కూడా ఉన్నాయి. గేమ్స్‌ను స్వయంగా తయారు చేసే సాంకేతిక నైపుణ్యం లేని వారు కూడా ఉన్న గేమ్స్ ద్వారా పాపులర్ అవుతున్నారు. పాయల్ ధారే కూడా అలా పేరు పొందింది.

సంవత్సరానికి 5 కోట్లు

23 ఏళ్ల పాయల్ ధారేకు 'పాయల్ గేమింగ్' అనే యూట్యూబ్ చానల్ ఉంది. ఈ చానల్‌లో ఆమె వీడియో గేమ్స్ ఆడుతూ తన సరదా వ్యాఖ్యానంతో వీడియోలు చేసి పెడుతుంటుంది. మార్కెట్‌లో బాగా ట్రెండ్ అవుతున్న గేమ్స్‌ను పరిచయం చేయడం లేదా ఆడటం వల్ల, సరదా వ్యాఖ్యానం చేయడం వల్ల గేమ్స్ అంటే ఇష్టం ఉన్న యువత అంతా ఈమె వీడియోలు ఫాలో అవుతుంటారు. దానివల్ల ఆమెకు సంవత్సరానికి రూ. 5 కోట్ల ఆదాయం అందుతోందని ఒక అంచనా. ఆశ్చర్యం ఏమంటే ఇంటర్ చదివే వరకూ కూడా పాయల్‌కు సెల్‌ఫోన్ లేదు. గేమ్స్ తెలియదు.

పల్లెటూరి అమ్మాయి

పాయల్ ధారేది మధ్యప్రదేశ్‌లోని చింద్వారా అనే చిన్న పల్లె. ఫోన్ కూడా చూడని ఆ అమ్మాయి 2021లో లాక్‌డౌన్ సమయంలో గేమ్స్ గురించి తెలుసుకుంది. ఆ సంవత్సరమే తన వీడియోలు రిలీజ్ చేయసాగింది. 2023 నాటికి అంటే కేవలం రెండేళ్లలో విపరీతమైన ఫాలోయింగ్ పొందింది. 'మా అమ్మ నేను గేమింగ్‌లోకి వెళతానంటే భయపడింది. మా నాన్న ప్రోత్సహించారు. వీడియో గేమింగ్‌లో ఆడపిల్లలకు అంత సులువుగా ప్రవేశం లభించదు' అంటుంది పాయల్. ఇప్పుడు తనను చూసి కనీసం 200 మంది అమ్మాయిలు గేమింగ్‌లోకి వచ్చారని తెలిపింది.

మంచి మార్గం కోసం

'గేమ్స్‌ను తప్పించలేము. యువతకు మంచి లక్ష్యాలను ఏర్పరడానికి వీటిని మీరు ఉపయోగిస్తూ వారిని ఇన్‌ఫ్లుయెన్స్ చేయండి' అని ప్రధాని గేమర్స్‌ను కోరారు. 'మన పంచతంత్రం వంటి కథలను గేమ్స్‌కు వాడండి. పర్యావరణ సమస్యలు, స్వచ్ఛభారత్ వంటి అంశాలతో గేమ్స్ తయారు చేస్తే ఇండియన్ సంస్కృతి ఉన్న గేమ్స్ తయారు చేస్తే ఆటకు ఆట, బోధనకు బోధన సమకూరుతాయి' అని ప్రధాని అన్నారు.

చదువుకు తగిన సమయం ఇస్తూ, ఒకవేళ ఏదైనా ఉపాధి ఉంటే ఆ ఉపాధి, ఉద్యోగాల్లో ఉంటూ జీవనానికి తగు గ్యారంటీ ఉన్నప్పుడు గేమింగ్‌లోకి వచ్చి ఆ రంగంలో నిలదొక్కుకోవాలని గేమర్స్‌కు సూచించారు.

బ్యూటిప్స్

పెసరతో మెరుపు

మేనికి పెసరపిండి వాడితే చర్మకాంతి ఇనుమడిస్తుంది. పెసలలో ఉండే ప్రొటీన్లు చర్మ మృదుత్వాన్ని కాపాడతాయి.

- టీ స్పూన్ పెసరపిండిలో పచ్చిపాలు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. దీనిని ముఖానికి మాస్క్‌లా వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్ర పరుచుకోవాలి. పొడిచర్మాన్ని ఈ మాస్క్ మృదువుగా మారుస్తుంది.
- టీ స్పూన్ పెసరపిండిలో తగినంత పెరుగు కలిపి ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పొడి బారిన చర్మం మృదువుగా అవుతుంది.



ఫస్ట్ టైమ్

దేదీప్యమాన విజయం

గ్లోబల్ ఇండియన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి ఇస్తోంది దీప ఖోస్లా. వక్తగా ప్రసిద్ధ హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి ముచ్చటగా మూడోసారి ఆహ్వానం అందుకొని చరిత్ర సృష్టించింది. ఇన్‌ఫ్లుయెన్సర్, ఎంటర్‌ప్రెన్యూర్, ఫిలాంత్రపిస్ట్‌గా గుర్తింపు పొందిన దీప ఖోస్లా గెలుపు మంత్రం... ఆత్మవిశ్వాసం.

లా స్టూడెంట్ నుంచి కంటెంట్ క్రియేటర్‌గా, ఆ తరువాత ఎంటర్ ప్రెన్యూర్‌గా ప్రయాణం ప్రారంభించింది దీప ఖోస్లా. ఇన్‌స్టాగ్రామ్ కొత్తగా పరిచయం అవుతున్న కాలం అది. 'ఇన్‌ఫ్లూయెన్సర్ అంటే?' అని ప్రశ్న దగ్గరి నుంచి మొదలైన ఆమె ప్రయాణం మల్టీపుల్ బ్రాండ్ డీల్స్‌తో సక్సెస్‌ఫుల్ ఇన్‌ఫ్లుయెన్సర్ స్థాయికి చేరింది.

ఆమ్‌స్టర్ డామ్‌లోని సోషల్ మీడియా ఏజెన్సీలో ఇంటర్న్‌షిప్ చేసిన ఫస్ట్ ఇండియన్ డిజిటల్ క్రియేటర్‌గా ప్రత్యేకత సాధించింది.

ఆ తరువాత 'ఇండి వైల్డ్' (స్కిన్ కేర్ అండ్ బ్యూటీ బ్రాండ్) రూపంలో ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా అద్భుత విజయం సాధించింది.

ఆమె ప్రతి విజయంలో తల్లి సంగీత ఖోస్లా ప్రోత్సాహం ఉంది.

ఆమె ఇచ్చిన అపారమైన ధైర్యం ఉంది.

'ఇండి వైల్డ్' హెయిర్ ఆయిల్ ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుంది. బెస్ట్‌సెల్లర్‌గా నిలిచింది. తన తల్లి ఫార్ములా ఆధారంగానే ఈ హెయిర్ ఆయిల్‌ను తయారు చేశారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించడానికి కావాల్సింది?

ఆత్మవిశ్వాసం.

మరి ఆ ఆత్మవిశ్వాసం ఎక్కడి నుంచి వస్తుంది? అనే ప్రశ్నకు దీప చెప్పే జవాబు ఇది...

'ధైర్యంగా ప్రశ్నలు అడగడం నుంచే ఆత్మవిశ్వాసం వస్తుంది. వ్యాపారరంగంలోకి అడుగు పెట్టినప్పుడు నాకు పెద్దగా ఏమీ తెలియదు. అయితే 'ఓటమి' అనే భయం నన్ను ఎన్నో ప్రశ్నలు అడిగేలా, ఎన్నో కొత్త విషయాలు తెలుసుకునేలా చేసింది'

భర్తతో కలిసి 'పోస్ట్ ఫర్ చేంజ్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి ఉమెన్ ఎంపవర్‌మెంట్, జెండర్ ఈక్వాలిటీకి సంబంధించి ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది దీప.

పర్సనల్ ఐకాన్

దీప ఖోస్లాకు తల్లి సంగీత ఖోస్లా పర్సనల్ ఐకాన్. కొండంత అండ. 'నా వెనుక మా అమ్మ ఉంది' అనే ధైర్యం దీపను ముందుకు నడిపించింది. తల్లి సంగీత ఖోస్లా ఫార్ములా ఆధారంగానే తమ బ్యూటీ బ్రాండ్‌కు సంబంధించిన 'హెయిర్ ఆయిల్'ను తయారు చేశారు. సహజ పద్ధతుల్లో ఆరోగ్యంగా ఉండడం, అందంగా కనిపించడం అనేది సంగీత ఖోస్లా ఫిలాసఫీ. అమ్మ బ్యూటీ ఫిలాసఫీని అనుసరిస్తూ సహజమైన పద్ధతులలో అందంగా కనిపించే టెక్నిక్స్‌ను ఫాలో అవుతుంటుంది దీప ఖోస్లా.

'దిల్లీలో పుట్టి పెరిగాను. ఊటీ స్కూల్, యూరప్ యూనివర్శిటీలలో చదువుకున్నాను. ప్రతిష్ఠాత్మకమైన హార్వర్డ్ యూనివర్శిటీ సమావేశంలో ప్రసంగించడం నా అదృష్టంగా భావిస్తాను. నేను సాధించిన విజయాలే నన్ను అక్కడి వరకు తీసుకువెళ్లాయి. విజయం అంటే కొందరికే పరిమితమైనది కాదు. నాలాగే ఎవరైనా విజయం సాధించవచ్చు' అంటుంది దీప ఖోస్లా.


● తల్లి సంగీతతో దీప ఖోస్లా

దీప నిరంతరం స్మరించే మంత్రం... ఆత్మవిశ్వాసం.

మొటిమలతో ఇబ్బంది పడుతూ నలుగురిలో కలవడానికి ఇష్టపడని స్థితి నుంచి బయటకు తీసుకువచ్చి 'స్టార్ ఇన్‌ఫ్లుయెన్సర్'ను చేసింది ఆ ఆత్మవిశ్వాసమే. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో వాక్ చేసిన తొలి ఇండియన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చింది, నలుగురిలో మాట్లాడడానికి భయపడే స్థితి నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'బ్రిటిష్ హౌజ్ ఆఫ్ కామన్స్'లో ప్రసంగించే స్థాయికి తీసుకువెళ్లింది ఆ ఆత్మవిశ్వాసమే.

తాజాగా... హార్వర్డ్ బిజినెస్ స్కూల్ సమావేశంలో దీప ఖోస్లాపై రూపొందించిన స్ఫూర్తిదాయకమైన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. 2022లో 'డైవర్సిటీ ఇన్ ది బ్యూటీ ఇండస్ట్రీ' అంశంపై మాట్లాడడానికి హార్వర్డ్ యూనివర్శిటీ నుంచి దీపకు ఆహ్వానం అందించింది. హార్వర్డ్ బిజినెస్ స్కూల్ సమావేశంలో ప్రసంగించిన ఫస్ట్ ఇండియన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా చరిత్ర సృష్టించింది దీప ఖోస్లా.

సాగుబడి

అశ్విని కార్తె: ఏప్రిల్ 13 నుంచి

విపత్తులకు తట్టుకునే ప్రకృతి సేద్యం గొప్పేంటి?

- మిచాంగ్ తుపాను నాటి రసాయనిక, ప్రకృతి సేద్య వరి పంటలపై ఆస్ట్రేలియా శాస్త్రవేత్త డా. ఫిల్ లీ అధ్యయనం
- ప్రకృతి సేద్యంతో ఒనగూడుతున్న అద్భుత ఫలితాలను కళ్లకు కట్టిన అధ్యయన ఫలితాలు


● రసాయనాలతో సాగు చేసిన వరి పొలం మిచాంగ్ తుపానుకు నేలకొరిగింది (ఫైల్)
● ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి పొలం మిచాంగ్ తుపానుకు తట్టుకుంది (ఫైల్)

2023 డిసెంబర్ 4,5 తేదీల్లో విరుచుకుపడిన మిచాంగ్ తుపాను ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో పంటలను, ముఖ్యంగా వరి పంటను, నేలమట్టం చేసింది. అయితే, ఆ తీవ్రమైన గాలులు, వర్షాన్ని తట్టుకొని నిలబడే ఉన్నాయి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగవుతున్న వరి పొలాలు. రసాయనిక వ్యవసాయ పద్ధతిలో సాగవుతున్న వరి చేలు నేలకు వాలిపోయి, నీట మునిగి ఉంటే.. వీటి పక్కన పొలాల్లో ఉన్న ప్రకృతి వ్యవసాయ వరి పంట మాత్రం చెక్కుచెదరకుండా దర్జాగా నిలబడి ఉండటం గురించి అప్పట్లోనే వార్తా కథనాలు చదివిన విషయం చాలా మందికి గుర్తుండే ఉంటుంది. మిచాంగ్ తుపానే కాదు అంతకుముందు కూడా అనేక విపత్కర పరిస్థితుల్లోనూ ఇది స్పష్టంగా కళ్లకు కట్టిన వాస్తవం.

అయితే, ఇప్పుడు ఈ ప్రస్తావన ఎందుకంటే.. 'రీజెనరేట్ ఎర్త్' సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులైన ఆస్ట్రేలియన్ సాయిల్ మైక్రోబయాలజిస్టు డాక్టర్ ఫిల్ లీ ఈ నెల మొదటి వారంలో ఏపీలో పర్యటించారు. అనంతపురం తదితర జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు తుపానును, కరువును దీటుగా తట్టుకొని నిలబడుతూ సుభిక్షంగా, ఉత్పాదకంగా నిలవటానికి వెనుక గల శాస్త్రీయ కారణాలను డా. ఫిల్ లీ అన్వేషించారు.


● మిచాంగ్ తుపాను నాటి వరి రకాలను పరీక్షిస్తున్న డా. ఫిల్ లీ


● ప్రకృతి వ్యవసాయంలో పండించిన వరి కాండం (మైక్రోస్కోప్ చిత్రం)
● రసాయనాలతో పండించిన వరి కాండం

అనేక కోస్తా జిల్లాల్లో మిచాంగ్ తుపానుకు నేలకొరిగిన రసాయనిక వరి పొలాల్లో గడ్డికి, పక్కనే పడిపోకుండా నిలబడిన వరి పొలాల్లో గడ్డికి మధ్య ఉన్న వ్యత్యాసాలే మిటో తన వెంట తెచ్చిన అధునాతన మైక్రోస్కోప్ ద్వారా పరిశోధించారాయన. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన వరి మొక్క కాండంలో కణ నిర్మాణం రసాయనిక వ్యవసాయంలో కన్నా బలంగా, ఈనెలు తేలి ఉండటాన్ని ఆయన గుర్తించారు. 'ప్రకృతి వ్యవసాయంలో పండించిన వరి మొక్కలు చాలా బలంగా ఉన్నాయి. ఇది ప్రకృతి సేద్య బలానికి నిదర్శనం' అన్నారు డా. ఫిల్ లీ.

అదేవిధంగా, ఏప్రిల్ మొదటి వారంలో అనంతపురం జిల్లాలో పర్యటించిన ఆయన రసాయనిక, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగవుతున్న పంటలను పరిశీలించారు. ఆయా పొలాల్లో మట్టి నమూనాలను కూడా సేకరించి అధ్యయనం చేశారు.

బంతి పూలను ఏక పంటగా సాగు చేస్తున్న రసాయనిక పొలంలోని మట్టిలో జీవం తక్కువగా ఉందని గుర్తించారు. ఆ పొలం పక్కనే బంతితో పాటు 12 పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలంలోని మట్టి నమూనాలను పరిశోధించగా.. మట్టి కణాల నిర్మాణం, ఆ మట్టిలో వైవిధ్యపూరితమైన సూక్ష్మజీవరాశి ఎంతో సుసంపన్నంగా ఉన్నట్లు గుర్తించానని డా. ఫిల్ లీ వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల మట్టిలో పెరుగుతున్న జీవశక్తి, సూక్ష్మజీవరాశి వైవిధ్యత వల్లనే పంటలకు వైపరీత్యాలను తట్టుకునే శక్తి వస్తోందనడానికి విస్పష్టమైన రుజువులు దొరికాయని ఆయన తెలిపారు.

> ప్రకృతి వ్యవసాయం వల్ల మట్టిలో జీవశక్తి, సూక్ష్మజీవరాశి వైవిధ్యత పెరుగుతుంది. అందువల్లనే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి ఈ పంటలకు వస్తోందన డానికి ఇప్పుడు విస్పష్టమైన రుజువులు దొరికాయి.
>
> – డాక్టర్ ఫిల్ లీ, ఆస్ట్రేలియన్ సాయిల్ మైక్రోబయాలజిస్టు, 'రీజెనరేట్ ఎర్త్' సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు

ఈ అధ్యయనానికి సంబంధించిన వీడియోలు 'ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్' యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉన్నాయి.

తిరుపతిలో 20,21 తేదీల్లో ఆర్గానిక్ మేళా

తిరుపతి టౌన్ క్లబ్ కూడలిలోని మహతి ఆడిటోరియంలో ఏప్రిల్ 20, 21 తేదీల్లో ఉ. 10.30 గం. నుంచి రాత్రి 8 గం. వరకు స్వచ్ఛంద సంస్థ 'కనెక్ట్ 2 ఫార్మర్' ఆధ్వర్యంలో సేంద్రియ ఆహారోత్పత్తులు ప్రదర్శన, అమ్మకం మేళా జరగనుంది. రైతులు నేరుగా తమ ఆర్గానిక్ పంట ఉత్పత్తులను వినియోగదారులకు అమ్ముకోగలిగే ఏర్పాటు చేయటం.. దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు కూడా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని కనెక్ట్ 2 ఫార్మర్ వ్యవస్థాపకులు శిల్ప తెలిపారు. 20న కషాయాల తయారీపై గంగిరెడ్డి, దేశవాళీ పండ్లు/పూల మొక్కల గ్రాఫ్టింగ్‌పై జె.ఎస్. రెడ్డి శిక్షణ ఇస్తారు. కంపోస్టింగ్‌పై డా.సింధు అవగాహన కల్పిస్తారు. 21న 5 దొంతర్ల పండ్లు, కూరగాయల సాగుపై, ఇంకుడుగుంతల నిర్మాణంపై విజయరామ్ ప్రసంగిస్తారు. ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రకృతివనం ప్రసాద్ ప్రసంగిస్తారు. వివరాలకు.. 63036 06326.

భూతల్లి కన్న తల్లితో సమానమని భావించే ఈ రైతు దంపతులు తమ సొంత భూమిలో మనసుపెట్టి ఇష్టంగా వ్యవసాయం చేస్తూ ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. దీంతో వీరి పొలాలు ప్రదర్శన క్షేత్రాలుగా మారిపోయాయి. పశువులు, గొర్రెలు, కోళ్ల ఎరువులు, జీవామృతంతో పంటలు పండిస్తున్నారు. మంచి దిగుబడులతో పాటు చక్కని ఆదాయం పొందుతున్నారు.

ఏడాదికి మూడు పంటలు!


● నువ్వు చేనులో రాజేష్ రెడ్డి–భారతి దంపతులు

మిట్టపెల్లి రాజేష్ రెడ్డి, భారతి ఆదర్శ రైతు దంపతులు. చదివింది పదో తరగతే అయినా తమ 12 ఎకరాల భూమిలో మనసుపెట్టి సేంద్రియ వ్యవసాయం చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఇంటికి అవసరమైన అన్నింటినీ సేంద్రియంగా పండించుకొని తింటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. వీరిది జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్ గ్రామం.

3 కి.మీ.ల పైపులైను

ఆ రైతు దంపతులకు వ్యవసాయం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు పంచ ప్రాణాలు! వీరికి పన్నెండు ఎకరాల భూమి ఉంది. బావులే ఆధారం. 3 కి.మీ. దూరంలో వున్న ఎస్సారెస్పీ వరద కాల్వ నుంచి పైపులైన్లు వేసుకొని డ్రిప్‌తో సాగు చేస్తున్నారు.

20 ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నప్పటికీ దిగుబడులు అంతంతే కాని, ఖర్చులు మాత్రం పెరిగాయి. ఇష్టారీతిన రసాయన ఎరువులు వేయడంతో ప్రతి పంటలో పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువై, వాటికి రసాయన మందులు పిచికారీ చేసేందుకు వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. కుటుంబ ఆదాయం పిల్లల చదువుకు కూడా సరిపోయేది కాదు. ఈ నేపథ్యంలో పాలేకర్ పద్ధతిలో తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేయవచ్చని తెలుసుకొని సాగు పద్ధతిని మార్చుకున్నారు.

ఈ దంపతులు ప్రతి ఏడాదీ మూడు పంటలు పండిస్తున్నారు. మేలో తప్ప మిగతా 11 నెలలూ వీరి పొలాల్లో పంటలతో ఉంటాయి. వర్షాలతో సంబంధం లేకుండా, వ్యవసాయ బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితోనే, జూన్ రెండో వారంలోనే విత్తనాలు వేస్తుంటారు. వానాకాలం సీజన్‌లో ఆరు ఎకరాల్లో సన్న రకం వరి, రెండెకరాల్లో పసుపు, మూడెకరాల్లో మొక్కజొన్న, ఒక ఎకరంలో మిర్చి పంట సాగు చేశారు. యాసంగి సీజన్‌లో ఆరెకరాల్లో లావు రకం వరి, ఎకరంలో జొన్న, 3 ఎకరాల్లో మొక్కజొన్న, రెండెకరాల్లో నువ్వు సాగు చేస్తున్నారు.

వెద వరి.. 30 క్వింటాళ్ల దిగుబడి

వరి సాగు చేయబోయే పొలంలో జూన్‌లో మొక్కజొన్న సాగు చేసి, కంకులు కోసిన తర్వాత మొక్కజొన్న మొక్కలను రోటోవేటర్‌తో పొలంలో కలియ దున్నేస్తారు. ఆ తర్వాత, వరి నారు పోసి, నాటు వేసే బదులు, నేరుగా వెదజల్లి ఎకరానికి 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి సాధిస్తున్నారు. అలాగే, పసుపు, మొక్కజొన్న సాగు చేసే భూమిలో రెండు లారీల గొర్రెల ఎరువు, ఒక లారీ మాగిన కోళ్ల ఎరువు వేసి భూసారం పెంచుకుంటూ ఉంటారు. పంటకాలంలో ప్రతి పంటకు జీవామృతాన్ని మూడు సార్లు ఇస్తున్నారు. నాలుగు ఆవులు, మూడు గేదేలను పెంచుతున్నారు. సగటున ఎకరానికి సజ్జలు 12–15, పసుపు 30, మొక్కజొన్నలు 40–45, నువ్వులు 4–6 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు.

భారతి, రాజేష్ రెడ్డి దంపతులు తెల్లవారుఝామున 3 గంటలకే వీరి దిన చర్య ప్రారంభం అవుతుంది. ఆవులు, గేదేల నుంచి పాలు పిండి 30 మందికి పాలు పోస్తారు. ఇంట్లో వంట పనులు పూర్తి చేసుకొని ఇద్దరూ తెల్లారేసరికే పొలంలో అడుగుపెడతారు. సా. ఆరు గంటలైతే కానీ ఇంటికి రారు. ఏ ఫంక్షన్‌కు వెళ్లినా సాయంత్రం ఇంటికి రావాల్సిందే!

విలువ జోడించే అమ్మకాలు

భారతి, రాజేష్ రెడ్డి దంపతులు తాము పండించిన పంటలను విలువ జోడించి అమ్ముతూ మంచి ఆదాయం పొందుతున్నారు. సన్న వరి ధాన్యాన్ని మర ఆడించి బియ్యం క్వింటాకు రూ. 6,500కు విక్రయిస్తున్నారు. మిరపకాయలను ఎండబెట్టి కారం పొడిని కిలో రూ. 280కి వినియోగదారులకు అమ్ముతున్నారు. సజ్జలను బై బ్యాక్ పద్ధతిలో కంపెనీలకు క్వింటా రూ.7 వేలకు, పసుపును క్వింటా రూ.11 వేలకు, మొక్కజొన్నను క్వింటా రూ.2,100కు నువ్వులను క్వింటా రూ.14 వేల చొప్పున విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. తమ పిల్లలిద్దరినీ హైద్రాబాద్‌లో ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. ఫార్మ్ అండ్ రూరల్ సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో పూర్వ ఉపకులపతి దివంగత జె. రఘోత్తమరెడ్డి స్మారకోపన్యాస సభలో భారతి ఉత్తమ సేంద్రియ రైతు పురస్కారాన్ని అందుకోవటం విశేషం.

> **ఖర్చు తగ్గించే సాగు పద్ధతులతో మేలు!**
>
> మా భూమిలో రకరకాల పంటలు పండించి, ఆ పంటల్లో అధిక దిగుబడులు తీసినప్పుడు మాకు కష్టం గుర్తుకురాదు. ప్రధానంగా భూతల్లిని కాపాడేందుకు రసాయనాలను పూర్తిగా తగ్గించి, పశువులు, కోళ్ల, గొర్రెల ఎరువు వాడుతున్నాం. వ్యవసాయంతో చాలా మంది ఇబ్బందిగా ఫీలవుతుంటే, మేం మాత్రం ఇష్టంగా చేస్తున్నాం.. సంతృప్తిని, ఆదాయాన్ని పొందుతున్నాం. ప్రతి రైతు ఖర్చు తగ్గించే పద్ధతులపై దృష్టి పెట్టాలి. మేం అలాగే చేస్తున్నాం. మా పద్ధతిలోకి రావాలని తోటి రైతులను ప్రోత్సహిస్తున్నాం.
>
> – మిట్టపెల్లి భారతి, రాజేష్ రెడ్డి (9618809924, 9618111367)

– పన్నాల కమలాకర్ రెడ్డి, సాక్షి, జగిత్యాల అగ్రికల్చర్

విదిత్ గుజరాతీ విజయం

టొరంటోలో జరుగుతున్న ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు విదిత్ గుజరాతీ మరో కీలక విజయాన్ని నమోదు చేశాడు. 9వ రౌండ్‌లో హికారు నకమురా (అమెరికా)ను విదిత్ ఓడించాడు. ఈ గెలుపుతో ఓవరాల్‌గా 4.5 పాయింట్లతో విదిత్...నకమురా, కరువానాలతో కలిసి నాలుగో స్థానంలో నిలిచారు. మరో వైపు ఇద్దరు భారత ఆటగాళ్లు డి.గుకేశ్, ఆర్. ప్రజ్ఞానంద మధ్య జరిగిన గేమ్ 'డ్రా'గా ముగిసింది. తాజా ఫలితం తర్వాత గుకేశ్, నెపొమ్నియాచి 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, 4 పాయింట్లతో ప్రజ్ఞానంద తర్వాతి స్థానంలో ఉన్నాడు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి 9వ రౌండ్ గేమ్ 'డ్రా' అయింది. హోరాహోరీ పోరు తర్వాత హంపి, రష్యాకు చెందిన కటెరినా లాగ్నో తమ గేమ్‌ను సమంగా ముగించారు. హంపికి మధ్యలో విజయావకాశాలు వచ్చినా కటెరినా తెలివిగా ఆడి తప్పించుకోలిగింది. అయితే మరో భారత ప్లేయర్ ఆర్.వైశాలి...చైనాకు చెందిన జోంగి తన్ చేతిలో ఓటమిపాలైంది. ప్రస్తుతం హంపి 4 పాయింట్లతో ముజిచుక్ (ఉక్రెయిన్)తో కలిసి ఐదో స్థానంలో కొనసాగుతోంది.



277 కాదు... 287

ఐపీఎల్‌లో అత్యధిక పరుగులతో సన్‌రైజర్స్ కొత్త రికార్డు

తమ స్కోరునే బద్దలు కొట్టిన హైదరాబాద్

25 పరుగులతో బెంగళూరుపై విజయం

హెడ్ సెంచరీ... చెలరేగిన క్లాసెన్, సమద్


దినేశ్ కార్తీక్ పోరాటం వృథా

287 ఐపీఎల్‌లో ఒక టీమ్ సాధించిన అత్యధిక స్కోరు. ఇదే సీజన్‌లో తాము చేసిన 277 స్కోరును సన్‌రైజర్స్ సవరించింది. ఓవరాల్‌గా టి20ల్లో ఇది రెండో అత్యధిక స్కోరు. ఆసియా క్రీడల్లో మంగోలియాపై నేపాల్ 314 పరుగులు చేసింది.

22 సన్‌రైజర్స్ సిక్సర్లు. గతంలో బెంగళూరు కొట్టిన 21 సిక్సర్ల రికార్డు బద్దలైంది.

4 హెడ్ చేసిన సెంచరీ (39 బంతుల్లో) ఐపీఎల్‌లో నాలుగో వేగవంతమైంది. గేల్ (30), యూసుఫ్ పఠాన్ (37), మిల్లర్ (38) ముందున్నారు. సన్‌రైజర్స్ తరఫున గతంలో వార్నర్ 43 బంతుల్లో సెంచరీ చేశాడు.

549 ఒక టి20ల్లో నమోదైన అత్యధిక పరుగులతో కొత్త రికార్డు. ఇదే సీజన్‌లో హైదరాబాద్, ముంబై మధ్య 523 పరుగులు నమోదయ్యాయి.



హెడ్ సెంచరీ



క్లాసెన్

బెంగళూరు: సన్‌రైజర్స్ ఆటతీరు చిన్నస్వామి స్టేడియాన్ని పెద్ద పెద్ద రికార్డుల్లో నిలిపింది. బెంగళూరు టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగానే విధ్వంసానికి పునాది పడింది...బ్యాటింగ్ తుఫాన్‌తో హైదరాబాద్ మ్యాచ్ గెలిచింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒక సీజన్‌లో తమ రికార్డుకు '2.0' ను చూపించింది. ముంబైపై 277 రికార్డును రోజుల వ్యవధిలోనే 287 పరుగుల అత్యధిక స్కోరుతో హైదరాబాద్ జట్టు తిరగరాసింది. ఈ ఎండల్ని తట్టుకోలేని జనాలకు మెరుపుల పండగని పంచిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 25 పరుగుల తేడాతో బెంగళూరుపై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి మునుపెన్నడూ చేయని 287 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రవిస్ హెడ్ (41 బంతుల్లో 102; 9 ఫోర్లు, 8 సిక్స్‌లు) శతకం బాదగా... హెన్రిచ్ క్లాసెన్ (31 బంతుల్లో 67; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆకాశానికే చిల్లులుపడేలా సిక్స్‌లు కొట్టాడు. అనంతరం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. దినేశ్ కార్తీక్ (35 బంతుల్లో 83; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) దంచేశాడు చివరి వరకు పోరాడగా..డుప్లెసిస్ (28 బంతుల్లో 62; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించాడు.

దంచుడే... దంచుడు!

రెండో ఓవర్ నుంచే హెడ్ వీరంగం మొదలైంది. టాప్లీ ఓవర్లో 4, 6 కొట్టగా, ఫెర్గూసన్ ఐదో ఓవర్లో రెండు సిక్స్‌లతో పాటు ఓ బౌండరీ బాదాడు. దీన్ని యశ్ తదుపరి ఓవర్లోనూ రిపీట్ చేయడంతో 20 బంతుల్లో హెడ్ ఫిఫ్టీ పూర్తవగా, పవర్‌ప్లే స్కోరు 76/0. జాక్స్ ఏడో ఓవర్ వేస్తే హెడ్ వరుసగా 4, 6, 6 బాదేశాడు. తర్వాత అభిషేక్ సిక్సర్‌తో 7.1 ఓవర్లోనే సన్‌రైజర్స్ వందను దాటేసింది. తర్వాతి ఓవర్లో అభిషేక్ (22 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)ను టాప్లీ అవుట్ చేసి 108 పరుగుల ఓపెనింగ్ జోడీని విడగొట్టాడు. క్లాసెన్ క్రీజులోకి రాగా... వైశాక్ 12వ ఓవర్లో మూడు ఫోర్లతో హెడ్ 39 బంతుల్లో శతకం పూర్తి చేసుకొని కాసేపటికే అవుటయ్యాడు.

ఇక క్లాసెన్ వంతు!

అప్పటిదాకా అడపాదడపా షాట్లతో 21 పరుగులు చేసిన క్లాసెన్ బాదే బాధ్యత తను తీసుకున్నాడు. లోమ్రోర్ 9 బంతులేసిన 14వ ఓవర్లో రెండు భారీ సిక్స్‌లు కొట్టాడు. తదుపరి వైశాక్ బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ కొట్టి 23 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. టాప్లీ, ఫెర్గూసన్‌ల వరుస ఓవర్లలో ఒక్కో సిక్స్‌తో విరుచుకుపడిన క్లాసెన్‌కు ఫెర్గూసన్ చెక్‌పెట్టాడు. క్రీజులో ఉన్న మార్క్‌రమ్ (17 బంతుల్లో 32నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)కు అప్పుడే వచ్చిన సమద్ (10 బంతుల్లో 37 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) తోడయ్యాడు. వచ్చీ రాగానే టార్గెట్ తుఫాన్‌పై కదం తొక్కుతూ టాప్లీ వేసిన 19వ ఓవర్లో ఆడిన ఐదు బంతుల్ని 4, 4, 6, 6, 4లుగా బాదాడు. ఆఖరి ఓవర్లో మార్క్‌రమ్ 4, 6 కొడితే సమద్ మరో సిక్సర్ బాదాడు. 19వ ఓవర్లో 25, 20వ ఓవర్లో 21 పరుగులు హైదరాబాద్ గెలుపులో కీలకమయ్యాయి.



సమద్

బెంగళూరు తగ్గలేదు!

ఎంతకొట్టినా ఎంతకీ కరగని లక్ష్యమని బెంగళూరు బెదిరిపోలేదు. ఆఖరి దాకా తగ్గేదే లే అన్నట్లుగా సన్‌రైజర్స్ ఫీల్డర్లను చెమటలు పట్టించింది. ఓపెనర్లు కోహ్లి (20 బంతుల్లో 42; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), డుప్లెసిస్ కొండంత లక్ష్యానికి దీటైన ఆరంభం ఇచ్చారు. ఇద్దరు తొలి ఓవర్లో చెరో బౌండరీతో ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టారు. తర్వాత ఓవర్ ఓవర్‌కూ సిక్స్‌లు, ఫోర్లతో వేగాన్ని పెంచారు. భువీ నాలుగో ఓవర్లో ఇద్దరు చెరో 2 బౌండరీలతో 3.5 ఓవర్లోనే బెంగళూరు 50 దాటింది. నటరాజన్, కమిన్స్ ఓవర్లలో అవలీలగా ఫోర్లు, సిక్స్‌లు బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 78/0 స్కోరు చేసింది. కోహ్లిని మార్కండే బౌల్డ్ చేయడంతో తొలిదెబ్బ తగిలింది. మరోవైపు డుప్లెసిస్ 24 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. కానీ విల్‌జాక్స్ (7) నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో దురదృష్టవశాత్తు రనౌటవడం, పటిదార్ (9)తో పాటు డుప్లెసిస్ స్వల్పవ్యవధిలో పెవిలియన్ చేరడం జట్టును వెనుకబడేలా చేసింది. అయితే పదో ఓవర్లో క్రీజులోకి వచ్చిన దినేశ్ కార్తీక్ షాట్లతో విరుచుకుపడటంతో భారీ స్కోరు కాస్తా దిగి వస్తుండటంతో హైదరాబాద్ శిబిరం కాస్తా ఇబ్బంది పడింది. 23 బంతుల్లో కార్తీక్ ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. అయితే 12 బంతుల్లో 58 పరుగుల సమీకరణం కష్టసాధ్యం కావడంతో పాటు 19వ ఓవర్లో 6, 4 కొట్టిన కార్తీక్‌ను నటరాజన్ అవుట్ చేయడంతో పరాజయం ఖాయమైంది. 11, 12 ఓవర్లలో వరుసగా 5, 8 పరుగులే రావడం.... 15వ ఓవర్లో కమిన్స్... హిట్టర్ మహిపాల్ (11 బంతుల్లో 19; 2 సిక్స్‌లు)ను అవుట్ చేసి 6 పరుగులే ఇవ్వడం సన్‌రైజర్స్‌ను గట్టెక్కించింది. లేదంటే పరిస్థితి కచ్చితంగా మరోలా ఉండేది!



కార్తీక్

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) ఫెర్గూసన్ (బి) టాప్లీ 34; హెడ్ (సి) డుప్లెసిస్ (బి) ఫెర్గూసన్ 102; క్లాసెన్ (సి) వైశాక్ (బి) ఫెర్గూసన్ 67; మార్క్‌రమ్ నాటౌట్ 32; సమద్ నాటౌట్ 37; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 287. వికెట్ల పతనం:** 1-108, 2-165, 3-231. **బౌలింగ్:** విల్ జాక్స్ 3-0-32-0, టాప్లీ 4-0-68-1, యశ్ దయాళ్ 4-0-51-0, ఫెర్గూసన్ 4-0-52-2, వైశాక్ 4-0-64-0, మహిపాల్ 1-0-18-0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (బి) మార్కండే 42; డుప్లెసిస్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 62; జాక్స్ రనౌట్ 7; పటిదార్ (సి) నితీశ్ (బి) మార్కండే 9; సౌరవ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కమిన్స్ 0; దినేశ్ కార్తీక్ (సి) క్లాసెన్ (బి) నటరాజన్ 83; మహిపాల్ (బి) కమిన్స్ 19; అనూజ్ నాటౌట్ 25; వైశాక్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 262. వికెట్ల పతనం:** 1-80, 2-100, 3-111, 4-121, 5-122, 6-181, 7-244. **బౌలింగ్:** అభిషేక్ 1-0-10-0, భువనేశ్వర్ 4-0-60-0, షహబాజ్ 1-0-18-0, నటరాజన్ 4-0-47-1, కమిన్స్ 4-0-43-3, మార్కండే 4-0-46-2, ఉనాద్కట్ 2-0-37-0.

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా × రాజస్తాన్
వేదిక: కోల్‌కతా

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	6	5	1	10	0.767
కోల్‌కతా	5	4	1	8	1.688
చెన్నై	6	4	2	8	0.726
హైదరాబాద్	6	4	2	8	0.502
లక్నో	6	3	3	6	0.038
గుజరాత్	6	3	3	6	-0.637
పంజాబ్	6	2	4	4	-0.218
ముంబై	6	2	4	4	-0.234
ఢిల్లీ	6	2	4	4	-0.975
బెంగళూరు	7	1	6	2	-1.185

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

సినిమా

మేలో ఆ ఒక్కటీ అడక్కు



● ఫరియా అబ్దుల్లా, 'అల్లరి' నరేశ్

మండే వేసవిలో థియేటర్లలో నవ్వుల జల్లులు కురిపించేందుకు 'అల్లరి' నరేశ్ సిద్ధమయ్యారు. ఆయన హీరోగా మల్లి అంకం దర్శకత్వం వహించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మించారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమాని వేసవి సెలవులను పురస్కరించుకుని మే 3న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు సంబంధించిన థియేట్రికల్ రిలీజ్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్ ఎల్‌ఎల్‌పీ పొందింది. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. చాలా కాలంగా నన్ను పూర్తిగా ఫన్ రోల్‌లో చూడాలని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. అది ఈ సినిమాతో కుదిరింది'' అన్నారు 'అల్లరి' నరేశ్.

పొలిటికల్ కామెడీ

సాయి కుమార్ లీడ్ రోల్‌లో, వినయ్, అరుణ్, దీప్తి వర్మ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. సూర్య దర్శకత్వంలో యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని సోమవారం విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''ఇప్పటివరకు తెలుగులో చాలా తక్కువ సెటైరికల్ కాన్సెప్ట్స్ వచ్చాయి. అందులోనూ పొలిటికల్ సెటైరికల్ కామెడీ సినిమాలు చాలా తక్కువ. ఇప్పుడు అదే తరహాలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి 'లక్ష్మీ కటాక్షం' సినిమా వస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రిలో చేశాం. త్వరలోనే ట్రైలర్ రిలీజ్ చేసి, సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.



● సాయి కుమార్

ఘనంగా డైరెక్టర్ శంకర్ కుమార్తె వివాహం



● శంకర్, ఐశ్వర్య, తరుణ్, రజనీకాంత్

ప్రముఖ దర్శకుడు శంకర్ పెద్ద కుమార్తె ఐశ్వర్య వివాహం సోమవారం ఘనంగా జరిగింది. తన అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్ కార్తికేయన్‌తో ఐశ్వర్య పెళ్లి జరిపించారు శంకర్. చెన్నైలోని ఓ ప్రముఖ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలో ఇరు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు సినీ ప్రముఖులు సందడి చేశారు. శంకర్‌కి ఇద్దరు కుమార్తెలు (ఐశ్వర్య, అదితి), ఓ కుమారుడు(అర్జిత్) ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో తరుణ్-ఐశ్వర్య నిశ్చితార్థం జరగ్గా, సోమవారం వారు ఏడడుగులు వేశారు. ఈ వివాహానికి హీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్, విక్రమ్, సూర్య, కార్తీ, హీరోయిన్ నయనతార, డైరెక్టర్ విఘ్నేశ్ శివన్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇదిలా ఉంటే.. ఐశ్వర్యకు 2021లోనే దామోదర్ రోహిత్ అనే తమిళ క్రికెటర్‌తో వివాహం అయింది. అయితే కొన్ని కారణాల వల్ల ఇద్దరూ విడాకులు తీసుకున్నారు.

మీ కల కోసం బతకండి

''వాళ్లిద్దరూ ఒకరినొకరు కలుసుకునేవరకూ తమ కలను సాకారం చేసుకోవడానికి కృషి చేసే సత్తా తమకు ఉందని ఇద్దరికీ తెలియదు. ఆ ఇద్దరి ప్రేమ, వారి కలను మే 31న థియేటర్లలో చూడండి'' అంటూ 'మిస్టర్ అండ్ మిస్ మహి' మూవీ ఫస్ట్ పోస్టర్‌ని షేర్ చేశారు జాన్వీ కపూర్. స్టేడియంలో క్రికెటర్స్‌ని మహిమా, మహేంద్ర ఉత్సాహపరుస్తున్నట్లుగా ఉన్న ఈ పోస్టర్‌పై ''మీ తల్లిదండ్రుల కలను నిజం చేయడానికి కాదు.. మీ కల కోసం మీరు బతకండి'' అని రాసి ఉంది. రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్ జంటగా శరణ్ శర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ అండ్ మిస్ మహి'. ఈ చిత్రంలో మహేంద్ర పాత్రను రాజ్‌కుమార్, మహిమా పాత్రను జాన్వీ చేశారు. ఇందులో జాన్వీ కూడా క్రికెటర్‌గా కనిపిస్తారు. ఇందుకోసం ఆరు నెలల పాటు ఆమె క్రికెట్‌లో శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 19న విడుదల కావాల్సి ఉంది. కానీ, మే 31కి విడుదల చేస్తున్నట్లు రెండు రోజుల క్రితం చిత్రనిర్మాత కరణ్ జోహార్ ప్రకటించారు. చిత్రకథానాయిక జాన్వీ కపూర్ సోమవారం సినిమా పోస్టర్ షేర్ చేసి, పై విధంగా పేర్కొన్నారు. అలాగే ''మీరు నెరవేర్చుకునేవన్నీ మీ కలలే'' అంటూ రాజ్‌కుమార్ రావ్ ఇదే పోస్టర్‌ని షేర్ చేశారు.



● 'మిస్టర్ అండ్ మిస్ మహి' పోస్టర్

ఎన్టీఆర్‌తో నటించాలని ఉంది - ఊర్వశి



● ఊర్వశి, ఎన్టీఆర్

ఊర్వశి రౌతేలా.. ప్రత్యేకించి పరిచయం అక్కర్లేని పేరు. తన గ్లామర్‌తో అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్ ప్రేక్షకుల్లో.. ప్రత్యేకించి యువతలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారీ బ్యూటీ. తాజాగా ఊర్వశి రౌతేలా ఎక్స్‌లో చేసిన ఓ పోస్ట్ నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఎన్టీఆర్‌తో కలిసి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో, ఎన్టీఆర్ అభిమానుల్లో చర్చకు తెరలేపింది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న 'దేవర' సినిమాలో ఊర్వశి నటించనున్నారేమో? అనే చర్చలు జరుగుతున్నాయి. 'వార్ 2' హిందీ సినిమా చిత్రీకరణ కోసం ముంబయ్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ఆయనతో జిమ్‌లో దిగిన ఫొటోను ఊర్వశి సోషల్ మీడియాలో షేర్ చేసి.. ''ఎన్టీఆర్‌గారు మన ప్రియమైన, నిజమైన గ్లోబల్ సూపర్ స్టార్. క్రమశిక్షణ, నిజాయితీ, వినయపూర్వకంగా ఉండే వ్యక్తి. మీ దయ, ప్రోత్సాహానికి కృతజ్ఞతలు. మీ వ్యక్తిత్వం నిజంగా ప్రశంసనీయం. సమీప భవిష్యత్తులో మీతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు. ఈ పోస్ట్ చూసిన ఎన్టీఆర్ ఫ్యాన్స్ 'దేవర' చిత్రంలో ఊర్వశి రౌతేలా ప్రత్యేక పాటలో కనిపించనున్నారా? అంటూ కామెంట్లు చేస్తున్నారు. కాగా ఊర్వశి తెలుగులో 'వాల్తేరు వీరయ్య, ఏజెంట్, బ్రో, స్కంద' వంటి చిత్రాల్లో ప్రత్యేక పాటల్లో తన డ్యాన్స్‌తో అలరించారు. మరి... ఎన్టీఆర్ సినిమాలో నటించాలనే ఆసక్తి కనబరుస్తున్న ఊర్వశికి ఆ చాన్స్ వస్తుందా? అనేది చూడాలి.



సాహసోపేతమైన కథ

'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు హీరో తేజ సజ్జా. తాజాగా ఆయన కొత్త సినిమా ప్రకటన వచ్చింది. 'ఈగల్' ఫేమ్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేసింది యూనిట్. 'హను-మాన్' చిత్రంలో సాంప్రదాయ దుస్తుల్లో కనిపించిన తేజ.. కొత్త పోస్టర్‌లో స్టైలిష్ మేకోవర్‌లో కనిపించారు. ''సూపర్ యోధ సాహసోపేతమైన కథతో పాన్ ఇండియా మూవీగా ఇది తెరకెక్కనుంది. 'ఈగల్' తర్వాత కార్తీక్ ఘట్టమనేనితో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. ఈ సినిమా పూర్తి వివరాలను ఈ నెల 18న ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి.



● తేజ

భర్త డైరెక్షన్‌లో...

హాలీవుడ్‌కి చెందిన క్రేజీ కపుల్స్‌లో డేవ్ మెక్‌క్యారీ, ఎమ్మా స్టోన్ జోడీ ఒకటి. దర్శక-రచయిత, హాస్య నటుడు డేవ్, నటి ఎమ్మా దాదాపు 2016లో ప్రేమలో పడి, 2020లో పెళ్లి చేసుకున్నారు. 2021లో వీరికో పాప పుట్టింది. వ్యక్తిగత జీవితం జోష్‌గా ఉన్న నేపథ్యంలో గత నెల 10న జరిగిన ఆస్కార్ అవార్డు వేడుకలో 'పూర్ థింగ్స్' చిత్రానికి గాను ఎమ్మా స్టోన్ ఉత్తమ నటి అవార్డు అందుకున్నారు. 2016లో ఉత్తమ నటిగా 'లా లా ల్యాండ్' చిత్రానికి ఆస్కార్ అందుకున్న ఎమ్మాకి 'పూర్ థింగ్స్'తో మరో అవార్డు దక్కింది. ఈ చిత్రానికి డేవ్, ఎమ్మా కూడా నిర్మాతలు. రెండోసారి ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డు అందుకున్న ఆనందంలో ఉన్న ఎమ్మా స్టోన్‌కి మరో మంచి సినిమా ఇవ్వాలని డేవ్ మెక్‌క్యారీ ప్లాన్ చేస్తున్నారట. ఈ చిత్రానికి తానే దర్శకత్వం వహించాలని కూడా అనుకుంటున్నారట. దర్శకుడిగా డేవ్‌కి 'బ్రిగ్స్‌బీ బియర్' (2017) తొలి చిత్రం. ఆ తర్వాత మరో సినిమాకి మెగాఫోన్ పట్టలేదు. ఇప్పుడు భార్య కోసం మళ్లీ డైరెక్టర్‌గా స్టార్ట్, కెమెరా, యాక్షన్ చెప్పడానికి రెడీ అయ్యారు డేవ్.



● ఎమ్మా స్టోన్

సామాజిక అంశంతో...

'బిగ్ బాస్' ఫేమ్ అర్జున్ అంబటి, కిశోరీ దాత్రిక్ జంటగా రవిశంకర్, చైతన్యా రావు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తెప్ప సముద్రం'. సతీష్ రాపోలు దర్శకత్వంలో బేబి వైష్ణవి సమర్పణలో నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఈ మూవీలోని తొలి పాటను, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రెండో పాటను రిలీజ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య ట్రైలర్‌ని విడుదల చేశారు. ''చిన్నపిల్లల మీద జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని సామాజిక అంశాలను మా సినిమాలో ప్రస్తావించాం'' అన్నారు సతీష్ రాపోలు. ''ఈ సినిమా ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు రాఘవేంద్రగౌడ్, అర్జున్ అంబటి.



● అర్జున్, కిశోరి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	845	73,400
నిఫ్టీ ▽	247	22,272

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్డాక్	16,095	▽	80
డోజోన్స్	37,983	△	1
ఎఫ్టీఎస్ఈ 100	7,965	▽	30
డాక్స్	18,026	△	96
షాంఘై	3,057	△	38
నికాయ్	39,234	▽	291

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	72,813
బంగారం (99.5 స్వచ్ఛత)	72,521
వెండి (కిలో)	83,452

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.04	84.06
£	బ్రిటన్ పౌండ్		104.56	106.76
€	యూరో		87.82	90.16
¥	జపాన్ ఎన్ (100)		53.77	54.97
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.20	55.12
S$	సింగపూర్ డాలర్		59.26	63.40
SAR	సౌదీ రియాల్		21.37	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.84	23.58
¥	చైనా యువాన్		10.40	12.38

మార్కెట్లకు యుద్ధ భయం

- ఇరాన్ – ఇజ్రాయిల్ ఉద్రిక్తతల షాక్
- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- సెన్సెక్స్ 845 పాయింట్ల పతనం
- 22,300 దిగువకు నిఫ్టీ
- రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రికత్తలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో స్టాక్ సూచీలు సోమవారం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల అనిశ్చితి, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, మార్చిలో టోకు ద్రవ్యోల్బణం మూడు నెలల గరిష్టానికి చేరుకోవడం తదితర అంశాలు ప్రతికూల ప్రభావం చూపాయి. ఉదయం సెన్సెక్స్ 930 పాయింట్ల 73,315 వద్ద, నిఫ్టీ 180 పాయింట్లు క్షీణించి 22,339 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో సూచీలు రోజంతా నష్టాల్లో కదలాడాయి. చివరికి సెన్సెక్స్ 845 పాయింట్లు పతనమై 2 వారాల కనిష్టం దిగువన 73,400 వద్ద నిలిచింది. నిఫ్టీ 247 పాయింట్లు క్షీణించి 22,272 వద్ద స్థిరపడింది. ఒక్క ఆయిల్అండ్గ్యాస్ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫైనాన్సియల్ సర్వీసెస్, సర్వీసెస్, ఐటీ, బ్యాంకింగ్ ఇండెక్సులు మెటల్, ఆటో షేర్లు భారీ నష్టాలు చవి చూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,288 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,763 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో ఒక్క చైనా(1%) మినహా అన్ని దేశాల సూచీలు దాదాపు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో యూరప్ మార్కెట్లు కోలుకున్నాయి.

- సెన్సెక్స్ 845 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో రూ.5.18 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.394 లక్షల కోట్లకు దిగివచ్చింది. కాగా ఈ సూచీలో 30 షేర్లకు గానూ మారుతీ సుజుకీ (1%), నెస్లే (0.62%), సన్ఫార్మా(0.10%) మాత్రమే లాభపడ్డాయి.
- ఐటీ దిగ్గజం టీసీఎస్ షేరు ఒకటిన్నర శాతం నష్టపోయి రూ.3942 వద్ద నిలిచింది. క్యూ4 ఫలితాలు మెప్పించడంతో ట్రేడింగ్ ప్రారంభంలో 1.50% పెరిగి రూ.4063 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే నష్టాల మార్కెట్ ట్రేడింగ్లో భాగంగా ఈ షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.
- అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం దేశీయ ఆయిల్అండ్గ్యాస్ కంపెనీల షేర్లకు కలిసొచ్చింది. ఓఎన్జీసీ 6%, ఐజీఎల్ 2%, ఐఓఎల్, గెయిల్ 1.50% చొప్పున లాభపడ్డాయి. జీఎస్పీఎల్ 1% లాభపడ్డాయి.
- ప్రతి ఈక్విటీ షేరుకు రూ.118 ప్రత్యేక డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు ఆమోదించడంతో ఆస్టర్ డీఎం హెల్త్కేర్ షేరు 7% లాభపడి రూ.523 వద్ద నిలిచింది. ట్రేడింగ్లో 14% ఎగసి రూ.558 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది.

అంబుజా చేతికి మై హోమ్ గ్రైండింగ్

తమిళనాడులోని యూనిట్ కొనుగోలు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అంబుజా సిమెంట్స్ తాజాగా మై హోమ్ గ్రూప్నకు చెందిన సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ను కొనుగోలు చేయనుంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అదానీ గ్రూప్ సంస్థ అంబుజా వెల్లడించింది. దీనిలో భాగంగా తమిళనాడులోని ట్యూటికోరిన్లోగల 1.5 ఎంటీపీఏ గ్రైండింగ్ యూనిట్ను దాదాపు రూ. 414 కోట్లకు సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. అంతర్గత వనరుల నుంచి నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది.

బ్రోకింగ్ బిజినెస్లోకి జియో

బ్లాక్రాక్తో వెల్త్ మేనేజ్మెంట్ జేవీ ఏర్పాటు

న్యూఢిల్లీ: వెల్త్ మేనేజ్మెంట్తో పాటు బ్రోకింగ్ బిజినెస్ నిర్వహణకు వీలుగా జియో ఫైనాన్షియల్, బ్లాక్రాక్ చేతులు కలిపాయి. సమాన భాగస్వామ్యం(50: 50)తో సంయుక్త సంస్థ(జేవీ) ఏర్పాటుకు ఒప్పందంపై సంతకాలు చేసినట్లు జియో ఫైనాన్షియల్ తెలియజేసింది. తద్వారా బ్లాక్రాక్ అడ్వయిజర్స్ సింగపూర్ పీటీఈతో కలసి వెల్త్ మేనేజ్మెంట్, బ్రోకరేజీ జేవీకి తెరతీయనున్నట్లు వెల్లడించింది. ఈ జేవీ ద్వారా బ్లాక్రాక్ ఇంక్తో బంధం మరింత బలపడనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొంది. 2023 జులై26న వెల్త్మేనేజ్మెంట్ జేవీని ఏర్పాటు చేయనున్నట్లు జియో ఫైనాన్షియల్ ప్రకటించిన విషయం విదితమే.


కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-4-2024 ఫామ్ ధర...

విశాఖ	419-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	404-00
విజయవాడ	404-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

వృద్ధి, వడ్డీ రేటు మార్పులకు ఆ ఇద్దరి నుంచి ఒత్తిడి

స్వీయకథలో ప్రణబ్, చిదంబరంపై దువ్వూరి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ప్రణబ్ ముఖర్జీ, పి. చిదంబరం ఆర్థిక మంత్రులుగా పని చేసిన సమయంలో సానుకూల సెంటిమెంటు కోసం వడ్డీ రేట్లను తగ్గించాలని, వృద్ధి రేటును పెంచి చూపాలని తమపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు ఉండేవని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ స్వయం ప్రతిపత్తికి ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం గురించి ప్రభుత్వంలో కొంతైనా అవగాహన ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల 'జస్ట్ ఎ మెర్సినరీ? నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరియర్' పేరిట రాసిన స్వీయకథలో దువ్వూరి ఈ విషయాలు పేర్కొన్నారు. వడ్డీ రేట్ల విషయంలోనే కాకుండా ఇతరత్రా అంశాల్లోనూ ప్రభుత్వం నుంచి ఆర్బీఐపై ఒత్తిడి ఉండేదని ఒక అధ్యాయంలో ఆయన ప్రస్తావించారు. 'ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు జరిగిన విషయమిది. ఆర్థిక కార్యదర్శి అరవింద్ మాయారాం, ప్రధాన ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు మా అంచనాలను సవాలు చేశారు. సానుకూల సెంటిమెంటును పెంపొందించాల్సిన భారాన్ని ప్రభుత్వంతో పాటు ఆర్బీఐ కూడా పంచుకోవాల్సిన అవసరం ఉందన్న వాదనలు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలకు సెంట్రల్ బ్యాంకులు సహకరిస్తుంటే మన దగ్గర మాత్రం ఆర్బీఐ తిరుగుబాటు ధోరణిలో ఉంటోందంటూ మాయారాం వ్యాఖ్యానించారు. అయినప్పటికీ ప్రభుత్వానికి ఆర్బీఐ చీర్లీడరుగా ఉండాలన్న డిమాండ్కి నేను తలొగ్గలేదు' అని దువ్వూరి పేర్కొన్నారు.

చిదంబరం విషయానికొస్తే .. వడ్డీ రేట్లు తగ్గించాలంటూ ఆర్బీఐపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు దువ్వూరి చెప్పారు. పరిస్థితులను సమీక్షించిన మీదట తాను అంగీకరించలేదన్నారు. దీంతో కలవరానికి గురైన చిదంబరం అసాధారణ రీతిలో ఆర్బీఐపై అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కారని వివరించారు. ఏపీలోని పార్వతీపురంలో సబ్-కలెక్టరుగా కెరియర్ను ప్రారంభించిన దువ్వూరి కేంద్ర ఆర్థిక కార్యదర్శిగా, అటు పైన అంతర్జాతీయ మాంద్యం పరిస్థితుల్లో ఆర్బీఐ గవర్నర్గా కూడా పని చేసిన సంగతి తెలిసిందే.

6 నెలల్లో 5జీ సేవల విస్తరణ

- వొడాఫోన్ ఐడియా
- 18 నుంచి ఎఫ్పీవో



ముంబై: టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐ) ప్రతిపాదిత రూ. 18,000 కోట్ల ఎఫ్పీవో ద్వారా నిధులు సమీకరణ అనంతరం 6–9 నెలల్లోగా 5జీ సర్వీసులు విస్తరించే యోచనలో ఉంది. నిధుల కొరత వల్లే ఇప్పటివరకు సర్వీసులను ప్రారంభించలేకపోయామని సంస్థ సీఈవో అక్షయ ముంద్రా తెలిపారు. రాబోయే 24–30 నెలల్లో తమ మొత్తం ఆదాయంలో 5జీ వాటా 40 శాతం వరకు ఉండగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎఫ్పీవో ద్వారా సేకరించే నిధుల్లో రూ. 5,720 కోట్ల మొత్తాన్ని 5జీ సర్వీసులకు వినియోగించనున్నట్లు ముంద్రా వివరించారు. వొడా–ఐడియా ఫాలో ఆన్ ఆఫర్ (ఎఫ్పీవో) ఏప్రిల్ 18న ప్రారంభమై 22తో ముగియనుంది. ఇందుకోసం ధర శ్రేణిని షేరుకు రూ. 10–11గా నిర్ణయించారు. ఫాలో ఆన్ ఆఫర్ ద్వారా సేకరించే రూ. 18,000 కోట్లలో రూ. 15,000 కోట్ల మొత్తాన్ని 5జీ సేవల విస్తరణ, ఇతరత్రా పెట్టుబడుల కోసం వినియోగించుకోనున్నట్లు ముంద్రా వివరించారు. ప్రధానంగా కస్టమర్లు చేజారి పోకుండా చూసుకోవడం, యూజరుపై సగటు ఆదాయాన్ని (ఆర్పూ) పెంచుకోవడం, నెట్వర్క్పై పెట్టుబడులు పెట్టడం తమకు ప్రాధాన్యతాంశాలుగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. 2జీ యూజర్లు ఎక్కువగా ఉన్నందున తమ ఆర్పూ మొత్తం పరిశ్రమలోనే తక్కువగా ఉంటుందని చెప్పారు. అయితే, ప్రస్తుతం తమ 21.5 కోట్ల యూజర్లలో కేవలం 2జీనే వినియోగించే వారి సంఖ్య 42 శాతంగా ఉంటుందని, వీరంతా 4జీకి అప్గ్రేడ్ అయ్యే అవకాశాలు ఉన్నందున ఆర్పూ మెరుగుపడేందుకు ఆస్కారం ఉందన్నారు.

3 నెలల గరిష్టానికి టోకు ధరలు

మార్చిలో డబ్ల్యూపీఐ 0.53 శాతం



న్యూఢిల్లీ: దేశీయంగా టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యూపీఐ) మూడు నెలల గరిష్టానికి ఎగిసింది. కూరగాయలు, బంగాళదుంప, ఉల్లి, ముడి చమురు మొదలైన వాటి ధరల పెరుగుదల కారణంగా మార్చిలో 0.53 శాతంగా (ప్రొవిజనల్) నమోదైంది. ఫిబ్రవరిలో ఇది 0.20 శాతంగా ఉంది. గతేడాది మార్చిలో ఇది 1.41 శాతంగా నమోదైంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు మైనస్లోనే ఉన్న టోకు ధరల ఆధారిత సూచీ నవంబర్లో ప్లస్ 0.26 శాతానికి వచ్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ గణాంకాల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. రిటైల్ ద్రవ్యోల్బణం అయిదు నెలల కనిష్ట స్థాయి 4.85 శాతానికి తగ్గిన నేపథ్యంలో తాజా టోకు గణాంకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బేస్ ఎఫెక్ట్ తగ్గుతుండటంతో రాబోయే రోజుల్లో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 5.42 శాతం నుంచి 6.88 శాతానికి చేరింది. కూరగాయల ధరల పెరుగుదల మైనస్ 2.39 శాతం నుంచి 19.52 శాతానికి ఎగిసింది.

మార్చి వాణిజ్య ఎగుమతులు ఫ్లాట్

41.68 బిలియన్ డాలర్లకు చేరిక



న్యూఢిల్లీ: దేశీ వాణిజ్య ఎగుమతులు గత నెల(మార్చి)లో నామమాత్ర క్షీణతతో41.68 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ బాటలో మార్చితో ముగిసిన పూర్తి ఏడాది(2023–24)కి సైతం 3 శాతం నీరసించి 437 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. రాజకీయ, భౌగోళిక సవాళ్లు గ్లోబల్ షిప్మెంట్స్ను దెబ్బతీశాయి. మరోపక్క మార్చిలో దిగుమతులు సైతం 6 శాతం క్షీణించాయి. వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం 57.28 బిలియన్ డాలర్లను తాకాయి. దీంతో గత నెలలో వాణిజ్య లోటు 15.6 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తం దిగుమతులు 5.4 శాతం తక్కువగా 677.24 బిలియన్ డాలర్లను తాకాయి. వెరసి గతేడాదికి ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం(వాణిజ్య లోటు) 240.17 బిలియన్ డాలర్లుగా నమోదైంది. మధ్యప్రాచ్యంలో సంక్షోభం ముదురుతున్న నేపథ్యంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వాల్ తెలియజేశారు. అవసరమైనప్పుడు తగిన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

సీబీఐ కేసులో కవితకు జ్యుడీషియల్ రిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి తీహార్ జైలుకు వెళ్లారు. ఇంతకుముందు ఈడీ కేసులో ఆమె తీహార్ జైలుకు వెళ్లగా.. ఇప్పుడు సీబీఐకి సంబంధించిన కేసులో రిమాండ్ అయ్యారు. కవితకు మూడు రోజుల సీబీఐ కస్టడీ ముగియడంతో.. అధికారులు సోమవారం ఉదయం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరుపర్చారు. ఆమెను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని సీబీఐ తరపు న్యాయవాది కోర్టును కోరారు. తీహార్ జైల్లో, కస్టడీ సమయంలో కవితను విచారించినప్పుడు.. ఏమాత్రం సహకరించలేదని కోర్టుకు వివరించారు. సహ నిందితుల స్టేట్మెంట్లు, డాక్యుమెంటరీ ఆధారాలకు విరుద్ధంగా కవిత సమాధానాలు ఉన్నాయన్నారు. మహబూబ్నగర్లో ఎలాంటి భూమి లేకుండానే రూ.14 కోట్ల భూకొనుగోలు ఒప్పందం, మాగుంట శ్రీనివాసులురెడ్డి, విజయ్నాయర్లతో భేటీల గురించి ప్రశ్నిస్తే.. తగిన సమాధానాలు ఇవ్వలేదన్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాధానాలు ఇస్తున్నందున ఇకపై కవిత కస్టడీ అవసరం లేదని పేర్కొన్నారు. కానీ కవిత ప్రముఖ రాజకీయ నాయకురాలు, పలుకుబడి కలిగిన వ్యక్తి అయినందువల్ల.. ఇంకా విచారించాల్సిన సాక్షులు, సేకరించాల్సిన సాక్ష్యాలను ప్రభావితం చేసే వీలుందని, అందువల్ల ఆమెను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని కోరారు. సీబీఐ వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. కవితకు తొమ్మిదిరోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. కాగా, కోర్టు ఆవరణలో జర్నలిస్టులతో కవిత మాట్లాడటంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మానవత్వం చాటుకున్న సీఎం జగన్

- ఏలూరు జిల్లా పూళ్ల శివారు ఇందిరమ్మ కాలనీ వద్ద రోడ్డు ప్రమాదం
- యువకుడికి తీవ్ర గాయాలు
- ఘటనా స్థలిలో ఆగిన ముఖ్యమంత్రి
- బాధితుడికి సత్వర వైద్యం అందించాలని ఆదేశం
- సీఎం కాన్వాయ్లోని అంబులెన్సులో ఆశ్రం ఆస్పత్రికి యువకుడి తరలింపు
- మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు
- ప్రాణాపాయం లేదని స్పష్టీకరణ



గాయపడ్డ వ్యక్తికి అందుతున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్కుమార్ యాదవ్

ఏలూరు రూరల్/ పెదపాడు/ భీమడోలు: సీఎం వైఎస్ జగన్ మానవత్వం చాటుకున్నారు. ఏలూరు జిల్లా పూళ్ల శివారు ఇందిరమ్మ కాలనీ వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. సీఎం కాన్వాయ్ పూళ్ల నుంచి మరో పావుగంటలో వెళ్లబోతుందనగా ముందుగా వెళుతున్న ఒక పోలీస్ వాహనాన్ని (కాన్వాయ్ వాహనం కాదు) కైకరానికి చెందిన గుండు నరేష్తో పాటు మరో యువకుడు బైక్పై వెళుతూ వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో నరేష్కు తీవ్ర గాయాలయ్యాయి. కాన్వాయ్ ప్రయాణిస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదం జరిగిన విషయాన్ని పోలీస్ సిబ్బంది బస్సులో సీఎం భద్రతా సిబ్బందికి తెలియజేశారు. పూళ్ల నుంచి కాన్వాయ్ బయలుదేరి ప్రమాద స్థలానికి చేరుకోగానే సీఎం జగన్ బస్సును ఆపాల్సిందిగా ఆదేశించారు. బాధితుడికి వెంటనే వైద్య సహాయం అందించాలని అధికారులను, బస్సులో ఉన్న దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్కుమార్ను ఆదేశించారు. సీఎం కాన్వాయ్లోని అంబులెన్సు ద్వారా క్షతగాత్రుడిని ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించారు.

యువకుడికి అత్యవసర చికిత్స

సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ఆశ్రం ఆస్పత్రి వైద్యులు బాధితుడు నరేష్కు అత్యవసర చికిత్స అందించారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, సునీల్ కుమార్ యాదవ్ ఆస్పత్రిలోనే ఉండి వైద్య సేవలను పర్యవేక్షించారు. బాధితుడికి ప్రాణాపాయం లేదని.. కావాల్సిన అన్ని వైద్య సేవలు అందిస్తామని వైద్యులు తెలిపారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని అబ్బయ్యచౌదరి హామీ ఇచ్చారు. చికిత్సకు అవసరమైన ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. బాధిత కుటుంబాన్ని సీఎం జగన్ అన్ని విధాలా ఆదుకుంటారని భరోసా ఇచ్చారు.

ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం

కాగా బాధితుడి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా వైఎస్సార్సీపీ నేతలు శ్రమిస్తుంటే, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారానికి తెర తీసింది. బాధితుడు చనిపోయాడంటూ తప్పుడు ప్రచారం చేసింది. తద్వారా బాధితుడి కుటుంబాన్ని తీవ్ర మానసిక క్షోభకు గురి చేసింది.

నేను విన్నాను.. నేను ఉన్నాను

మీ సమస్యలు పరిష్కరిస్తాను.. ధైర్యంగా ఉండండి

- తనను కలిసిన బాధితులకు సీఎం వైఎస్ జగన్ భరోసా



సుభాషిణి, పెద్ద అవుటపల్లి

సాక్షి ప్రతినిధి, విజయవాడ/కంకిపాడు: 'మీ సమస్యలు అన్నీ నేను విన్నాను.. నేను ఉన్నాను.. ధైర్యంగా ఉండండి.. మీకు అండగా ఉంటా.. మీ సమస్యలను పరిష్కరిస్తా' అని సీఎం వైఎస్ జగన్ ప్రజలకు హామీ ఇచ్చారు. మేమంతా సిద్ధం బస్సుయాత్ర సోమవారం కృష్ణా జిల్లాలో సాగింది. గుడివాడలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభ వద్ద పలువురు బాధితులకు సీఎం జగన్ భరోసా ఇచ్చారు. వారి సమస్యలను స్వయంగా విని వెన్నుతట్టి ధైర్యం చెప్పారు.

మీకు ఖర్చు కాకుండా చేస్తా..

'నా బిడ్డ శ్రీవిద్యకు 12 ఏళ్లు. బ్లడ్ క్యాన్సర్తో బాధపడుతోంది.. వైద్యం చేయించండి' అని తిరువూరు మండలం పోలిశెట్టిపాడుకు చెందిన నాగేశ్వరి సీఎం వైఎస్ జగన్కు విన్నవించింది. దీంతో వైద్యానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని, మీకు ఖర్చు కాకుండా చేస్తానని సీఎం జగన్ ఆమెకు భరోసా ఇచ్చారు. దీంతో నాగేశ్వరి సంతోషం వ్యక్తం చేసింది. సీఎం మాట ఇచ్చారంటే కచ్చితంగా చేస్తారని ఆనందంతో చెప్పింది.

మీ బిడ్డకు మెరుగైన వైద్యం అందిస్తాం..

'నా నాలుగేళ్ల కొడుకు మిల్కీ శరత్కు క్యాన్సర్, కిడ్నీ సమస్య ఉంది. కిడ్నీ మార్చాలని వైద్యులు చెప్పారు. మాకు ఆర్థిక పరిస్థితి బాలేదు.. మీరే ఆదుకోవాలి' అని తిరువూరు మండలం కొమ్మిరెడ్డిపల్లికి చెందిన బిక్షాలు సీఎం వైఎస్ జగన్కు విన్నవించారు. దీంతో చలించిన సీఎం వైఎస్ జగన్ తాను చెప్పిన వైద్యుల నుంచి ఫోన్ కాల్స్ వస్తాయని, వారు చెప్పినట్లు చేస్తే బిడ్డకు మెరుగైన వైద్యం అందుతుందని భరోసా ఇచ్చారు. ఇందుకు సంబంధించి వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని తన సిబ్బందికి సీఎం ఆదేశాలు జారీ చేశారు.

సాయం అందించండి సారూ..

'నా కొడుకు కిషోర్బాబు (13)కి మతిస్థిమితం లేదు. మెదడు సంబంధ సమస్య ఉంది. బాబు సంరక్షణ చాలా కష్టంగా మారింది. ఆర్థికంగా సహకారం అందిస్తే కుటుంబాన్ని ఆదుకున్నవారు అవుతారు సార్' అని గన్నవరం నియోజకవర్గానికి చెందిన కిషోర్బాబు తండ్రి సీఎం వైఎస్ జగన్కు విన్నవించారు.

పెద్దఅవుటపల్లిలో బాధితులకు భరోసా..

కాగా అంతకుముందు బస్సుయాత్ర గన్నవరం నియోజకవర్గం పెద్ద అవుటపల్లి వద్దకు చేరుకోగానే సీఎం జగన్ అక్కడి ప్రజలతో మమేకమయ్యారు. 'మా అన్న బాలశౌరి ఎంతోకాలంగా కిడ్నీలో రాళ్లు, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. స్వయంగా మిమ్మల్ని కలిసి సమస్య చెప్పుకుందామనుకున్నాడు. రాలేని పరిస్థితిలో నేనే వచ్చాను.. వారి ఆర్థిక పరిస్థితి కూడా బాలేదు.. ఆదుకోండి' అంటూ సీఎం జగన్కు పెద్ద అవుటపల్లికి చెందిన సుభాషిణి విజ్ఞప్తి చేసింది. సీఎం జగన్ ఆమెను ఓదార్చి కోరుకున్న ఆస్పత్రి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీతో సుభాషిణి సంతోషం వ్యక్తం చేసింది.



కోడూరుపాడు: జగన్ మామతో చిన్నారుల సెల్ఫీ



కానుమోలు-పుట్టగుంట: సీఎం జగన్ను చూసిన సంతోషంతో వృద్ధురాలు...

వైఎస్సార్సీపీలోకి టీడీపీ, కాంగ్రెస్, బీసీవై, ప్రజా సంఘాల నేతలు

సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన శ్రీశైలం, నందిగామ, పెనమలూరు, మైలవరం, విజయవాడకు చెందిన నేతలు

సాక్షి, అమరావతి: టీడీపీ, కాంగ్రెస్ పార్టీ, బీసీవై, ప్రజా సంఘాలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు సోమవారం వైఎస్సార్సీపీలో చేరారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా కేసరపల్లి నైట్ స్టే పాయింట్ వద్దకు వచ్చిన సీఎం జగన్ సమక్షంలో శ్రీశైలం, నందిగామ, పెనమలూరు, మైలవరం, విజయవాడకు చెందిన టీడీపీ, కాంగ్రెస్, బీసీవై, ప్రజా సంఘాల నేతలు పార్టీలో చేరారు. వీరందరికీ సీఎం జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

- ▲ నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ నేత, ఉమ్మడి రాష్ట్రంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ అహ్మద్ హుస్సేన్, టీడీపీ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ ముస్తఫా మొమిన్, కర్నూలు జిల్లా తాలిమీ బోర్డు అధ్యక్షుడు ముఫ్తీ నూర్ మహమ్మద్, మహమ్మద్ ఇలియాస్లు వైఎస్సార్సీపీలో చేరారు. సీఎం జగన్కు విజయం సిద్ధించాలని, ఎలాంటి ఆటంకాలు రాకూడదని ముఫ్తీ నూర్ మహమ్మద్ ఈ సందర్భంగా దువా చేశారు.
- ▲ నందిగామ నియోజకవర్గం నుంచి నందిగామ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ కీలక నేత చిరుమామిళ్ల శ్రీనివాసరావు(అలియాస్ బుజ్జి), నందిగామ పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వడ్డెలి శ్రీనివాసరావు, నందిగామ మున్సిపల్ టీడీపీ కీలక నేత వై.రామారావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి గోడపాటి బాబూరావులు వైఎస్సార్సీపీలో చేరారు.
- ▲ ఎన్టీఆర్ జిల్లా టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, టీడీపీ సీనియర్ నేతలు డాక్టర్ షేక్ హసీనా, కొమ్ము విజయరాజులు వైఎస్సార్సీపీలో చేరారు.
- ▲ పెనమలూరు నియోజకవర్గ టీడీపీ, బీసీవై పార్టీలు, ప్రజా సంఘాల నుంచి కీలక నేతలు వైఎస్సార్సీపీలో చేరారు. చలసాని స్మిత(చలసాని పండు కుమార్తె), దేవినేని గౌతమ్ దంపతులు, పెనమలూరు నియోజకవర్గం బీసీవై పార్టీ నుంచి ఉమావల్లియాదవ్, మాదిగ హక్కుల కమిటీ ఫౌండర్ గురివిందపల్లి చిట్టిబాబుమాదిగ తదితరులు పార్టీలో చేరారు.
- ▲ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, 40వ వార్డు టీడీపీ నేత, ప్రొఫెషనల్ వింగ్ జోనల్ కోఆర్డినేటర్ వెలగలేటి భార్గవరాయుడు, ఎన్టీఆర్ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ జనరల్ సెక్రటరీ వసీం అక్రం, డివిజన్ అధ్యక్షుడు నీలం మనోజ్, ఎస్సీ విభాగం నేత అవినాష్, బీసీవై పార్టీ స్టేట్ కన్వీనర్ పట్టబోయిన శివరామకృష్ణయాదవ్, ఆలిండియా యాదవ మహాసభ స్టేట్ ప్రెసిడెంట్ అంబటి నాగయ్యయాదవ్, బెజవాడ బార్ అసోసియేషన్ ట్రెజరర్ బి.వెంకటేశ్వర్లు యాదవ్, యూత్ లీడర్ గోగుల విజయ్కుమార్, ఆటోనగర్ టింబర్ మర్చెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.నాగయ్య యాదవ్, బి.అశోక్ యాదవ్, మార్కాపురం టీడీటీ యూత్ కన్వీనర్ భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, టింబర్ మర్చెంట్స్ అసోసియేషన్ సభ్యుడు చప్పిడి మల్లేశ్వరయాదవ్లు వైఎస్సార్సీపీలో చేరారు.
- ▲ మైలవరం నియోజకవర్గం నుంచి మద్దిలపర్వ గ్రామానికి చెందిన బీసీ నేత టి.వెంకటరమణ, రెడ్డిగూడెం మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, తెలుగు యువత విభాగం నేత పి.సురేష్కుమార్రెడ్డిలు వైఎస్సార్సీపీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ కేశినేని నాని, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్కుమార్లున్నారు.

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..

- నారాయణపురం నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభం
- ఉండి శివారులో భోజన విరామం
- సాయంత్రం భీమవరం బైపాస్ రోడ్ గ్రంథి వెంకటేశ్వరరావు జూనియర్ కాలేజ్ వద్ద సభ



సాక్షి, అమరావతి: వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర 16వ రోజైన మంగళవారం(ఏప్రిల్ 16) షెడ్యూల్ను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం సోమవారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా సీఎం జగన్ సోమవారం రాత్రి బస చేసిన నారాయణపురం దగ్గర నుంచి మంగళవారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. నిడమర్రు, గణపవరం మీదుగా ఉండి చేరుకుంటారు. ఉండి శివారులో సీఎం జగన్ భోజన విరామం తీసుకుంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి భీమవరం బైపాస్ రోడ్ గ్రంథి వెంకటేశ్వరరావు జూనియర్ కాలేజ్ వద్ద సాయంత్రం 3.30 గంటలకు బహిరంగ సభలో పాల్గొని సీఎం జగన్ ప్రసంగిస్తారు. సభ అనంతరం పిప్పర, పెరవలి, సిద్ధాంతం క్రాస్ మీదుగా ఈతకోట శివారులో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం చేరుకుంటారు.

కృష్ణా జిల్లా సిద్ధమా?

సాక్షి, అమరావతి : మేమంతా సిద్ధం బస్సు యాత్ర సోమవారం కృష్ణా జిల్లాలో సాగుతోంది. ఈ సందర్భంగా 'కృష్ణా జిల్లా సిద్ధమా?' అంటూ సీఎం వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు. ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో మేమంతా సిద్ధమంటూ సీఎం జగన్తో కలిసి బస్సు యాత్రలో పాల్గొన్నారు. వైఎస్సార్సీపీ జెండాలు రెపరెపలాడాయి. అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. బస్సు యాత్ర ప్రారంభం నుంచి రాత్రి బస చేసే ప్రాంతం వరకూ ప్రజలు రోడ్డుకు ఇరువైపులా పోటెత్తారు.

క్లుప్తంగా...

ఈ-సెట్‌కు 35వేల దరఖాస్తులు

సాక్షి, అమరావతి: ఏపీలో 2024–25 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో సెకండియర్‌లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈ–సెట్ 2024కు 35,038 దరఖాస్తులు అందాయి. ఈనెల 22వరకు రూ.500, 29 వరకు రూ.2వేలు, మే 5వ తేదీ వరకు రూ.5వేల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఉన్నత విద్యా మండలి అవకాశం కల్పిస్తోంది. మే 8వ తేదీన ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తొలి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటలకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. 25, 26, 27 తేదీల్లో దరఖాస్తుల్లో తప్పుల సవరణ చేసుకోవచ్చని సూచిస్తోంది.

జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఏపీకి పతకాలు



స్కేటింగ్‌లో పతకాలు సాధించిన ఏపీ విద్యార్థులు

సాక్షి, అమరావతి: జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు రెండు పతకాలు సాధించారు. బాలుర అండర్–11 స్కేటింగ్ విభాగంలో రజతం, అండర్–14 విభాగంలో కాంస్య పతకంతో పాటు బాలికల విభాగంలో మరో కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. నాలుగు రోజులుగా మధ్యప్రదేశ్‌లోని సాత్నాలో 67వ జాతీయ స్కూల్ గేమ్స్ జరుగుతున్నాయి. సోమవారం స్కేటింగ్ విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పసలపూడి హేమవర్ధన్ అండర్–11 విభాగంలో రజిత పతకం, రాజమహేంద్రవరానికి చెందిన అన్నిపి మహిత్ సాయి కౌశిక్ అండర్–14 విభాగంలో కాంస్య పతకం, బాలికల విభాగంలో రాజమండ్రికి చెందిన కెల్లా భవ్యశ్రీ కాంస్య పతకం సాధించినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. విజేతలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు అభినందించినట్టు పేర్కొన్నారు.

మేనిఫెస్టోలో అన్ని వర్గాలకు సముచిత స్థానం: పురందేశ్వరి



రాజమహేంద్రవరం సిటీ: దేశంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సంకల్పపత్ర పేరిట బీజేపీ మేనిఫెస్టో రూపొందించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ ఎన్నికల కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. గతంలో మాదిరిగా కాకుండా దేశవ్యాప్తంగా కోటిమంది అభిప్రాయాలు, సలహాలు తీసుకుని, వాటన్నింటినీ క్రోడీకరించి మేనిఫెస్టో సిద్ధం చేశామన్నారు. తయారీ రంగాన్ని అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు ఎక్కువగా పెరుగుతాయనే ఉద్దేశంతో.. ఆ దిశగా ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. జమిలి ఎన్నికలకు బీజేపీ కట్టుబడి ఉందని పురందేశ్వరి స్పష్టం చేశారు.

ఏపీ ఈఏపీసెట్‌కు దరఖాస్తుల వెల్లువ

సోమవారం నాటికి 3.46 లక్షల మంది దరఖాస్తు

- అపరాధ రుసుముతో 12 వరకు గడువు
- దీంతో దరఖాస్తులు మరిన్ని పెరిగే అవకాశం
- 7 నుంచి వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు
- మే 16 నుంచి 22 వరకు ప్రవేశ పరీక్షలు
- జగనన్న విద్యా, వసతి దీవెనలతో ఉన్నత విద్యపై పెరుగుతున్న ఆసక్తి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంస్కరణల వల్లే అంటున్న విద్యావేత్తలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీసెట్–2024కి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం వరకు 3,46,324 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజనీరింగ్ విభాగంలో 2,62,981 మంది, అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో 82,258 మంది ఉన్నారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్–ఫార్మా విభాగాలకు కలిపి మరో 1,085 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ స్థాయిలో ఎప్పుడూ దరఖాస్తులు రాలేదు. గతేడాదితో పోలిస్తే ఇప్పటివరకు దాదాపు 8 వేలకు పైగా దరఖాస్తులు అదనంగా వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంలో సుమారు 24 వేలకు పైగా అధికంగా దరఖాస్తులు అందాయి. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు, రూ.1,000తో మే 5 వరకు, రూ.5 వేలతో మే 10 వరకు, రూ.10 వేలతో మే 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరగొచ్చని చెబుతున్నారు. దరఖాస్తుల్లో తప్పుల సవరణలకు మే 4 నుంచి 6 వరకు గ్రీవెన్స్‌ను నిర్వహించనున్నారు.

మే 16 నుంచి ఈఏపీసెట్

ఏపీ ఈఏపీసెట్‌ను మే 16 నుంచి నిర్వహించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో మే 16, 17 తేదీల్లో, ఇంజనీరింగ్ విభాగంలో మే 18 నుంచి 22 వరకు ప్రవేశపరీక్షలు నిర్వహించడానికి ఉన్నత విద్యా మండలి ఏర్పాట్లు చేస్తోంది. సంబంధిత తేదీల్లో రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తొలి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలను నిర్వహిస్తారు. హాల్‌టికెట్లను మే 7 నాటికి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

ప్రభుత్వ చర్యలతోనే దరఖాస్తుల పెరుగుదల..

ఉన్నత విద్యారంగంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు, అనేక సంక్షేమ పథకాల వల్లే ఈఏపీసెట్‌కు దరఖాస్తులు పెరుగుతున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రూ.35 వేల వరకు మాత్రమే ఫీజురీయింబర్స్‌మెంట్ ఉండేది. అది కూడా అరకొరగా కొంతమందికే అందేది. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా కళాశాల ఫీజు ఎంత ఉన్నా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. అంతేకాకుండా విద్యార్థుల వసతి, భోజన ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన పథకం కింద రూ.20 వేల వరకు సహాయాన్ని అందిస్తోంది. మరోవైపు విద్యార్థులు అత్యున్నత నైపుణ్యాలు సంతరించుకునేలా పరిశ్రమల అనుసంధానంతో వారికి ఇంటర్న్‌షిప్, శిక్షణ కార్యక్రమాలను చేపడుతోంది. వీటన్నిటి ఫలితంగా గత విద్యా సంవత్సరంలో ఒక్క సాంకేతిక విద్యారంగంలోనే 1.20 లక్షలకు పైగా విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అత్యుత్తమ ప్యాకేజీలతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ఈఏపీసెట్‌కు దరఖాస్తులు ఇలా..

సంవత్సరం	దరఖాస్తులు
2015-16	2,55,413
2016-17	2,85,755
2017-18	2,78,803
2018-19	2,74,920
2019-20	2,82,705
2020-21	2,73,588
2021-22	2,60,406
2022-23	3,01,113
2023-24	3,38,739
2024-25	3,46,324

(ఏప్రిల్ 15 వరకు)

ప్రైవేట్ వర్సిటీల్లోనూ పేదలకు సీట్లు..

గత రెండేళ్లుగా ఈఏపీసెట్‌కు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఓవైపు కళాశాలల ఫీజులు ఎంత ఉన్నా పూర్తిగా ప్రభుత్వమే ఫీజురీయింబర్స్‌మెంట్ కింద భరిస్తోంది. ఇంకోవైపు ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లోనే కాకుండా విట్, ఎస్‌ఆర్‌ఎం లాంటి ప్రైవేట్ వర్సిటీల్లోని సీట్లను కూడా ఈఏపీసెట్‌లో ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు ప్రభుత్వం కేటాయిస్తోంది. విట్, ఎస్ఆర్ఎంల్లో 35 శాతం సీట్లను ప్రభుత్వం తన కోటాలో భర్తీ చేస్తోంది. ఈ వర్సిటీల్లో చేరాలంటే ఒక్కో విద్యార్థి ఏడాదికి రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు వెచ్చించాల్సిందే. అలాంటిది పేద విద్యార్థులపై నయాపైసా భారం లేకుండా ప్రభుత్వమే ఈ సంస్థల్లోనూ ఫీజులు భరిస్తోంది. దీంతో ఈఏపీసెట్‌కు పెద్ద ఎత్తున దరఖాస్తులు అందుతున్నాయి.



'మీ ఓటే.. మీ భవిష్యత్తు'

తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు సోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన సైకత శిల్పం అందర్నీ ఆకట్టుకుంటోంది. సోమవారం అంతర్జాతీయ ఆర్ట్ డే సందర్భంగా.. ప్రస్తుత ఎన్నికలను పురస్కరించుకుని 'మీ ఓటే.. మీ భవిష్యత్తు' అంటూ ఈ సైకత శిల్పం రూపొందించారు. దీనిపై ఇండియా మ్యాప్, మువ్వన్నెల జెండాతో పాటు 'యువర్ ఓట్ ఈజ్ యువర్ ఫ్యూచర్.. తప్పకుండా ఓటు వేయండి' అనే అక్షరాలను రాశారు. ఈ సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. -రంగంపేట

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్!

- ఝాన్సీ నుంచి విజయవాడకు 1.20లక్షల పాఠ్యపుస్తకాలు
- జూన్ 12కు ముందే విద్యార్థులకు పంపిణీ
- టెక్ట్స్ బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి



పాఠ్యపుస్తకాల గోదాము వద్ద పూజలు చేస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): పాఠశాల పునఃప్రారంభం నాటికి ప్రతి విద్యార్థి చేతిలో పాఠ్యపుస్తకం ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని టెక్స్ట్‌బుక్స్ డైరెక్టర్ కె. రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ పట్టణం నుంచి ఎన్టీఆర్ జిల్లా విజయవాడ, ఆటోనగర్‌లోని పాఠ్యపుస్తకాల గోదాముకు సోమవారం 1.20 లక్షల పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గోదాముల వద్ద రవీంద్రనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ 2024–25కు సంబంధించి 1నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు పాఠ్యపుస్తకాలు వచ్చాయని తెలిపారు. ఐదేళ్ల నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం సకాలంలో పాఠ్యపుస్తకాలు ఇస్తోందని చెప్పారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని పాఠశాలలు అన్నింటికీ సకాలంలో పాఠ్యపుస్తకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పుస్తకాల పంపిణీ విషయంలో ఎక్కడా లోపం లేకుండా ప్రతి విద్యార్థికి అందేలా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లాకు 13,94,918, కృష్ణాజిల్లాకు 13,04,663 పాఠ్యపుస్తకాలు అవసరమని వివరించారు. సోమవారం 1.20లక్షల పుస్తకాలు వచ్చాయని, మిగిలిన 25,79,581 పాఠ్యపుస్తకాలు మే నాటికి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆటోనగర్ పాఠ్యపుస్తకాల గోదాము మేనేజరు ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీడీఎం అమలులో ఏపీ ఆదర్శనీయం



మాట్లాడుతున్న రాష్ట్ర నోడల్ అధికారి బి.వి. రావు

సాక్షి, అమరావతి: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) అమలులో ఏపీ గణనీయమైన విజయాన్ని సాధించిందని ఆ కార్యక్రమం రాష్ట్ర నోడల్ అధికారి బి.వి. రావు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. డీఎంఈ పరిధిలోని ఫార్మాసిస్టులు, నర్సులు, మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి రెండు రోజుల పాటు ఏబీడీఎంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన మంగళగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వైపు వేగంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది ఇందుకోసం కృషి చేయాలన్నారు. రెండు రోజుల పాటు మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ అనంతరం, వీరి ద్వారా జిల్లా స్థాయిల్లో మిగిలిన సిబ్బందికి శిక్షణలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వెంకట రవికిరణ్, సెకండరీ హెల్త్ ఏబీడీఎం నోడల్ అధికారి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను చేర్చుకోవడంలో అలసత్వం వద్దు

- ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పెన్) తప్పనిసరి
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ ఆదేశం
- పాఠశాలల మార్గదర్శకాలు విడుదల

సాక్షి, అమరావతి: పాఠశాలల్లో విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేయడం, ఇతర పాఠశాలలకు బదిలీ చేయడం వంటి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ ఆదేశించారు. రికార్డ్ షీట్, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, ఇతర సర్టిఫికెట్ల కోసం పట్టుబట్టకుండా పాఠశాలల్లో ప్రవేశం కల్పించాలని ఆర్జేడీలు, డీఈవోలకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇకపై విద్యార్థుల బదిలీలు ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారానే జరుగుతాయని, అందుకు ఎలాంటి పత్రాలు అవసరం లేదన్నారు. విద్యార్థిని ఒకటో తరగతిలో చేర్చుకునేటప్పుడు అన్ని పత్రాలను డిజిటల్ రూపంలో ఉంచడంతో పాటు చైల్డ్ ఐడీ నమోదుకు ఆధార్ నంబర్ ఆధారంగా పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) వస్తుందన్నారు. ఒకటో తరగతిలో చేరేటప్పుడే ప్రతి విద్యార్థికి డిజిలాకర్ వస్తుందని, అందులోనే అన్ని పత్రాలు ఉంటాయన్నారు.

ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పెన్)

2024–25 విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతిలో చేరే వారికి మినహా మిగతా విద్యార్థులందరికీ 'శాశ్వత విద్యా సంఖ్య' (పెన్) ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తులపై పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలి

రాష్ట్రంలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల ప్రారంభ అనుమతి, గుర్తింపు, గుర్తింపు పునరుద్ధరణపై వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తులపై సకాలంలో పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆర్జేడీలు, డీఈవోలను ఆదేశించారు. ఇకపై ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు స్వీకరించిన తేదీనుంచి ఎంఈవో/డీవైఈవో 30 రోజుల్లోపు, డీఈవో, ఆర్జేడీ కార్యాలయాల్లో ఏడు రోజుల్లోపు ప్రతిపాదనలు ప్రాసెస్ చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఏ అధికారైనా చర్యలు తీసుకోవడంలో విఫలమైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

23న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

- అదేరోజు పేరెంట్స్, టీచర్స్ సమావేశం
- పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్



సాక్షి, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసే నాటికి (ఏప్రిల్ 23) వార్షిక పరీక్షల ప్రోగ్రెస్ రిపోర్ట్ కార్డును విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది విద్యా సంవత్సరం చివరి రోజున తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల (పేరెంట్స్ కమిటీ) సమావేశాలు విజయవంతంగా జరిగాయని, ఈ ఏడాదీ అలాగే జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చివరిరోజు సమావేశం ఉందని, తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలన్న విషయాన్ని ఒకరోజు ముందే వారికి గుర్తు చేయాల్సిన బాధ్యత క్లాస్ టీచర్లదే అని ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సైన్స్, సోషల్ పుస్తకాలు చదివేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలని, ఆ బాధ్యత వాళ్లదేనన్నారు. దీనివల్ల వారికి సబ్జెక్టుపై అవగాహనతో పాటు బైలింగ్వల్ పుస్తకాలతో ఇంగ్లిష్‌పై పూర్తి పట్టు సాధిస్తారని వివరించారు. గతేడాది విద్యార్థులను తమ పుస్తకాలను తిరిగి పాఠశాలల్లో అప్పజెప్పడాన్ని తాను ప్రత్యక్షంగా పరిశీలించానని, ఇది సరైన పద్ధతి కాదని ప్రవీణ్ ప్రకాశ్ పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలు విద్యార్థుల సొంతమని, మరుసటి ఏడాదికి అవి రిఫరెన్స్‌గా ఉంటాయని తెలిపారు. కచ్చితంగా విద్యార్థులు ఆయా పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదివేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాలల్లో లైబ్రరీ ఏర్పాటు పేరుతో పుస్తకాలను వెనక్కి తీసుకోకూడదన్న సందేశాన్ని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు చేరవేయాలని డీఈవోలను ఆదేశించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 2024
జైత్రయాత్ర
మంగళవారం
ఏప్రిల్, 16

గుసగుస

బాబుకు గృహస్థాశ్రమమే!

చంద్రబాబుకు మరో ఐదేళ్లు గృహస్థాశ్రమం తప్పదట. జ్యోతిష్యులు, న్యూమరాలజీ నిపుణులు దీన్నే ఉద్ఘాటిస్తున్నారు. బాబు జాతక రీత్యా ఐదేళ్లు అధికారంలో ఉంటే.. తర్వాతి పదేళ్లు ప్రతిపక్షంలో ఉండాల్సిందేనట. దీనికి వారు చెప్పున్న మాటలతోపాటు, లాజిక్కులు పరిశీలిస్తే నిజమే కదా! అనిపిస్తున్నాయి. తొలిసారిగా చంద్రబాబు 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, గద్దెనెక్కారు. 1999 ఎన్నికల్లో ఎన్డీయేతో కలిసి గెలుపొందారు. తర్వాత 2004, 2009 ఎన్నికల్లో చతికిలపడి, పదేళ్ల విరామం ఇచ్చారు. మళ్లీ 2014లో బూటకపు హామీలు, అనైతిక పొత్తులతో గద్దెనెక్కారు. 2019లో చరిత్ర ఎరుగని దారుణ ఓటమి చవిచూశారు. దీంతో పదేళ్ల విరామం పాటించే బాబుకు 2024లో కూడా భంగపాటు తప్పదని జ్యోతిష్యులు, న్యూమరాలజీ నిపుణుల ఉవాచ.



కూటమి తాటతీస్తారు

జీకామ్‌లో ఫిజిక్స్.. ఎందుకుండదు? ఉంటది.. ఉంటది. ఈ మాటలు వింటే చాలు.. పేరు చెప్పనక్కర్లేదు. పలు పార్టీలు మారి టీడీపీలో చేరిన జలీల్‌ఖాన్‌కు పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న బీజేపీ నేత సుజనా చౌదరి కోసం ప్రచారంలో దిగారు. తాజాగా విజయవాడ పశ్చిమలో నిర్వహించిన కూటమి విస్తృత స్థాయి సమావేశంలో సుజనా, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని కోసం మాట్లాడుతుండగా వారిద్దరూ గుసగుసలాడుకుంటున్నారు. దీంతో చిర్రెత్తిన జలీల్ 'హలో ఎంపీగారు, ఎమ్మెల్యే గారు.. మీటింగండీ ఇది.. రహస్యాలుంటే ఇంటికెళ్లి మాట్లాడుకోండ'ంటూ చురకంటించారు. అంతటితో ఆగకుండా 'ముస్లింలు, కాపులు వచ్చారు.. తిక్కలేస్తే తాటతీస్తారంటూ'.. కూటమి పొత్తులపై ఆ రెండు సామాజిక వర్గాల వ్యతిరేకతను బయటపెట్టారని పార్టీ శ్రేణులు గుసగుసలుపోతున్నాయి.

సీటు 'చిర్రి'గిపోతోంది

పోలవరంలో జనసేన నేత చిర్రి బాలరాజు బాధ పగవాడికీ్కూడా రాకూడదని ఆయన అనుచరులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా టీడీపీని కాపాడుకుంటూ వచ్చిన బొరగం శ్రీనివాసుల్ని కాదని కూటమి పొత్తుల్లో ఈ సీటును జనసేనకు కేటాయించారు. కాంగ్రెస్ సీనియర్ నేత కరాటం రాంబాబు దన్నుగా ఉండి చిర్రికి సీటు ఇప్పించారట. ఆయనకు సీటు ఖరారైనప్పటి నుంచి టీడీపీ వర్గం సైలెంటయిపోయింది. సీటు మార్చాలని అధిష్టానానికి పదేపదే విన్నవిస్తున్నారు. ఇక్కడ బీజేపీ ప్రభావం కూడా నామమాత్రమే. జనసేన యూత్ మినహా మరెవరూ బాలరాజుకు కలిసి రావట్లేదు. దీంతో చిర్రికి సీటు చిరగడం ఖాయమని టీడీపీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయట.



ఉండి టికెట్‌పై రూ.2 కోట్ల బెట్టింగ్

గోదావరి జిల్లాల్లో బెట్టింగ్‌కు కాదేదీ అనర్హం. కోడి పందేల నుంచి క్రికెట్, రాజకీయాల వరకు ప్రతీదీ జూదమే. తాజాగా ఉండి అసెంబ్లీ టీడీపీ టికెట్‌పై జరిగిన బెట్టింగ్ హాట్ టాపిక్‌గా మారింది. ఉండి ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన కలవపూడి శివకు కాకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు(రాంబాబు)కు చంద్రబాబు టికెట్ ప్రకటించారు. దీంతో కలవపూడి 'శివ'తాండవం ఆడేశారు. తనకు దక్కని టికెట్ రాంబాబుకు దక్కడంతో రెబల్‌గా బరిలో దిగి, అతన్ని ఓడించి తీరతానని చెప్తున్నారు. అయితే ఉండి టికెట్ రాంబాబుకూ దక్కదని శివ అనుయాయులు కొత్తగా ప్రచారానికి తెరలేపారు. అది కూడా కనుమూరు రఘురామకృష్ణరాజు పేరు పరిశీలనకు రాకముందే ఈ సీటుపై బెట్టింగ్‌లు జరిగాయి. కలవపూడి శివకు బలమైన ఫాలోవర్, ఉండికి చెందిన పశువుల వ్యాపారి ఒకరు రాంబాబుకూ సీటు దక్కదని రూ.2 కోట్లు పందెం కాశాడట. తాజాగా రఘురామ పేరును ఉండి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించనున్నట్లు బలమైన సంకేతాలు రావడంతో ఈ రూ.2 కోట్ల బెట్టింగ్ విషయంపై జోరుగా చర్చ జరుగుతోంది. దీంతో సరిసర్లే.. శివకు టికెట్ రాకపోయినా ఆయన అనుచరుడికి బెట్టింగ్ సొమ్ము వస్తుందని.. జోకులు పేలుతున్నాయి.

పొత్తు చిత్తే!

చంద్రబాబు, పవన్, పురందేశ్వరి సైసై.. స్థానిక నేతలు నైనై

- సీట్ల కేటాయింపును తప్పు పడుతున్న మూడు పార్టీల శ్రేణులు
- చంద్రబాబు, పవన కళ్యాణ్‌లు తమను మోసం చేశారని సీట్లు రాని నేతల ఆవేదన
- అన్ని నియోజకవర్గాల్లోనూ మూడు పార్టీలు కలవడం కల్లే
- బీజేపీ, జనసేన శ్రేణులు టీడీపీ సభలకు దూరం
- జనసేన, బీజేపీ పోటీలో ఉన్న చోట ముఖం చాటేస్తున్న టీడీపీ నేతలు
- తెనాలిలో పవన్ కళ్యాణ్ సభకు దూరంగా ఆలపాటి రాజా
- బాలకృష్ణ యాత్రలో కనిపించని బీజేపీ, జనసేన నేతలు
- ఆ ముగ్గురి ఆరాటమే తప్ప క్షేత్ర స్థాయిలో అమలు కాని పొత్తు
- ఇలాగైతే ఓట్ల బదిలీ సాధ్యం కాదంటున్న విశ్లేషకులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ఓట్ల బదిలీ జరిగే అవకాశాలు కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదు. పేరుకు మాత్రమే ఈ మూడు పార్టీలు పొత్తు పెట్టుకున్నప్పటికీ.. నేతలు, కార్యకర్తల మధ్య ఏ దశలోనూ పొసగడం లేదు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పిఠాపురంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పోటీ చేస్తున్నా, టీడీపీ పూర్తిగా సహకరించడం లేదు. అక్కడ టీడీపీ ఇన్‌ఛార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ.. క్యాడర్ ఎవరూ జనసేనకు సహకరించకుండా కట్టడి చేసి తానొక్కడే పవన్ కళ్యాణ్ వద్దకు వెళుతూ ఆయన కోసం పని చేస్తున్నట్లు బిల్డప్ ఇస్తున్నారు. కింది స్థాయిలో టీడీపీ క్యాడర్ కూడా జనసేన పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉంది. తమ సీటును తాడూ బొంగరం లేని పార్టీ ఎగరేసుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీటును అన్యాయంగా జనసేనకు వదిలేసి సిగ్గు లేకుండా తిరుగుతున్నారని ఇటీవల వర్మను ఒక గ్రామంలో టీడీపీ కార్యకర్తలు నిలదీసి వెళ్లగొట్టారు. కోనసీమ జిల్లాలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు పి.గన్నవరం, అమలాపురంలో సంయుక్తంగా నిర్వహించిన సభలకు జనం రాలేదు. రావులపాలెంలో నిర్వహించిన సభకు 3 వేల మంది కూడా రాలేదు.

కూటమి తొలి సభే తుస్సు: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఫిబ్రవరి 28న జరిగిన కూటమి తొలి సభే తుస్సుమంది. ఆ సభకు 6 లక్షల మంది జనం వస్తారని

-మిగతా IIలో

చంద్రబాబు కాళ్లబేరం.. బీజేపీ నేతలతో తిట్లు తిని పవన్ కళ్యాణ్‌లు కుదుర్చుకున్న పొత్తు కింది స్థాయిలో ఎక్కడా పొసగడం లేదు. వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక కలిసిన మూడు పార్టీలకు జనంలోనే కాదు ఆయా పార్టీల్లోనూ నిరాదరణే ఎదురవుతోంది. ఆ పార్టీల అగ్ర నేతల హడావుడే తప్ప, కింది స్థాయిలో ఎక్కడా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలిసి పని చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

సీట్లు దక్కని నేతలు తమ నియోజకవర్గాల్లో కూటమి తరఫున పని చేసేందుకు ఏమాత్రం ఇష్టపడడం లేదు. చంద్రబాబు సభలు పెట్టినా, వారు ఆ ఛాయలకూ్కడా వెళ్లడం లేదు. ఆయన విశాఖలో ఎన్నికల ప్రచారం నిర్వహించినా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి దూరంగా ఉన్నారు. తెనాలిలో పవన్ కళ్యాణ్ నిర్వహించిన సభకు అక్కడి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆలపాటి రాజా డుమ్మా కొట్టారు.

చంద్రబాబు సభల్లో చాలా చోట్ల బీజేపీ, జనసేన నాయకులను వేదికపైకి రానివ్వడం లేదు. ఆ పార్టీల అభ్యర్థులు ఉన్నచోట మొక్కుబడిగా పిలుస్తున్నా మిగిలిన నియోజకవర్గాల్లో వారిని దరిదాపుల్లోకి సైతం రానీయడం లేదు. టీడీపీ అభ్యర్థులున్న చోట్ల బీజేపీ, జనసేన నాయకులను పట్టించుకోవడంలేదు.

అనంతపురం జిల్లాలో బాలకృష్ణ చేపట్టిన యాత్రలో జనసేన, బీజేపీ జాడే కనిపించడం లేదు. మరో వైపు చంద్రబాబు ఒక్కడే నిర్వహిస్తున్న సభలతోపాటు పవన్ కళ్యాణ్, పురందేశ్వరి కలిసి నిర్వహిస్తున్న కూటమి సభలు కూడా అట్టర్‌ఫ్లాప్ అవుతున్నాయి. ఆ సభలకు జనం రావడం గగనమవుతోంది. దీంతో చంద్రబాబు ఒక్కడే వచ్చినా, కూటమిగా వచ్చినా ప్రయోజనం మాత్రం శూన్యమేనని ఇట్టే తెలుస్తోంది.

నాయకులే కలవనప్పుడు ఇక ఆ పార్టీల మధ్య ఓట్ల బదిలీ ఎలా జరుగుతుందన్నది విశ్లేషకులు ప్రశ్న.

భూ'దండు' పాళ్యం బ్యాచ్-2

మాయోపాయాలు.. బెదిరింపులు



రాజధాని కుట్రలో బడుగులే సమిధలు
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద రైతుల భూములపై పచ్చదండు కన్ను



చంద్రబాబు అల్లిన 'రాజధాని ఫైల్స్' డ్రామాలో ట్విస్టుల మీద ట్విస్టులు.. కుట్రల మీద కుట్రలు.. పదేళ్ల అధికారానికి మొహం వాచి.. ఒక్క దెబ్బకు వేల కోట్లు ఎలా కొల్లగొట్టాలో పచ్చ దండు పన్నాగం ఈ డ్రామాకే హైలైట్. రాజధానిగా రోజుకో పేరు తెరపైకి తెచ్చి రియల్టర్లు, సామాన్యులకు నిజంగానే సినిమా చూపించారు. అసలు రాజధాని ఎక్కడో తన పరివారం చెవిలో బాబు ముందే ఊదేయడంతో అమరావతి ప్రాంతంలో పచ్చదండు వాలి గద్దల్లా భూములు తన్నుకెళ్లింది. ఇతర ప్రాంతాల్లో భూములు కొన్న రియల్టర్లు, సామాన్యులు ఘొల్లుమంటే.. బాబు అనుచరగణం పండుగ చేసుకుంది.

విభజనతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన చంద్రబాబు.. రావడమే రాజధాని పాటందుకున్నారు. సింగపూర్‌ను తలదన్నేలా రాజధానిని కట్టేస్తాను.. బడుగుల బతుకుల్ని బాగుచేస్తానంటే నిజమనుకున్నారు. తెరవెనుక ఆ బడుగుల భూములపై కన్నేసిన చంద్రబాబు పన్నాగాన్ని వారు పసిగట్టలేకపోయారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలు తేరుకునేలోపు వారి అసైన్డ్ భూముల్ని బినామీల రూపంలో గద్దల్లా తన్నుకుపోయారు. కుట్రలను పక్కాగా అమలు చేయడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబు భూదాహానికి బలయ్యింది నిరుపేద రైతులే..

రూ.3,737.30 కోట్ల విలువైన 617.70 ఎకరాల భూ దోపిడీ
సమిధలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే

సాక్షి, అమరావతి : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటే చులకన భావన అడుగడుగునా జీర్ణించుకున్న చంద్రబాబు కన్ను వాళ్ల భూములపై పడింది. కేటగిరీ 1 నుంచి 4 కింద వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతుల అసైన్డ్ భూములను అడ్డగోలుగా కాజేయడానికి చట్టాన్ని తన చుట్టంగా మలచుకుని కోర్టులను కూడా బురిడీ కొట్టించారు. రాజధానిలో 617.70 ఎకరాల అసైన్డ్ భూ దోపిడీలో రూ.3,737.30 కోట్లను స్వాహా చేసి దేశ చరిత్రలోనే అతిపెద్ద భూకుంభకోణానికి పాల్పడ్డారు. అసైన్డ్ భూముల పరిరక్షణ కోసం చేసిన అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టాన్ని ఉల్లంఘించి భూముల్ని చెరబట్టారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల భూముల దోపిడీకి రోడ్ మ్యాప్ ముందుగానే సిద్ధం చేసుకున్నారు. భూసమీకరణ ప్యాకేజీని నిర్ణయిస్తూ 2015, జనవరి 1న జీవో నెంబరు 1 జారీ చేశారు. అందులో అమరావతిలో ప్రైవేటు భూములకే భూసమీకరణ ప్యాకేజీ ఇస్తామని, అసైన్డ్ భూములకు ప్యాకేజీ లేదని ముందుగా సిద్ధం చేసుకున్న ప్లాన్‌ను బయటపెట్టారు. అప్పుడే చంద్రబాబు, నారాయణ బినామీలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వారి ఏజెంట్లు రంగంలోకి దూకారు. తమకు అసైన్డ్ భూములు విక్రయిస్తే ఎంతో కొంత డబ్బులొస్తాయని, లేదంటే భూములు కోల్పోతారని భయపెట్టారు. దీంతో ఆందోళనకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద రైతులు ఎకరా కేవలం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకే అసైన్డ్ భూములను బాబు బినామీలకు సేల్ డీడ్ ద్వారా విక్రయించారు. అనంతరం వాటిని ఆరు కేటగిరీలుగా విభజిస్తూ భూసమీకరణ ప్యాకేజీ ప్రకటిస్తూ 2016 ఫిబ్రవరి 17న జీవో నెంబరు 41 జారీ చేశారు. వాటికి భారీ ప్యాకేజీ దక్కేలా చూసుకున్నారు. రాజధానిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ పేద రైతులకు స్థానం లేకుండా చేశారు.

-మిగతా IIలో

617.70 ఎకరాల అసైన్డ్ భూములు కొల్లగొట్టేందుకు కుట్రలు

అసైన్డ్ భూములకు ప్యాకేజీ లేదంటూ పేద రైతులను బెదిరించి భూదందా

కుట్రతో రూ.**3,737** కోట్ల విలువైన అసైన్డ్ భూములు బినామీల పేరిట బాబు స్వాహా


ఎవరికీ చెందని ప్రభుత్వ భూములూ హాంఫట్..

328 ఎకరాలు కొల్లగొట్టిన ఎల్లో గ్యాంగ్

522 మంది బినామీల పేరిట చంద్రబాబు, నారాయణల పరం

భూసమీకరణ ప్యాకేజీ కింద వాటి విలువ రూ.**760.25** కోట్లు

పా'పాల' ధూళిపాళ్ల



అవినీతి అనకొండ..

ఆధ్యాత్మిక తరంగాలతో పులకించే పొన్నూరును అవినీతి 'ధూళి' కమ్మేసింది. వరుసగా ఐదుసార్లు ప్రజా ప్రతినిధిగా గెలిపించిన అక్కడి ప్రజలను అడ్డంగా దోచుకున్నారు. ఇసుక, గ్రావెల్, మెటల్ దేన్నీ వదల్లేదు. 'సంగం డెయిరీ'ని సొంత ఆస్తిలా మార్చుకున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన సొంత పార్టీ వారిపైనా దాడులకు తెగబడ్డారు. నియోజకవర్గాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఎమ్మెల్యే కిలారి రోశయ్యపై శ్వేతపత్రం అంటూ హంగామా సృష్టిస్తున్నారు. ఇదీ పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అవినీతి చిట్టా.

-వివరాలు IIలో

పిఠాపురం: ఫలితం ఏదైనా వర్మకు వేదనే

అనుమానపు చూపులు



- గెలిస్తే తన బలమంటూ పవన్ గొప్పలు
- ఓడితే మాజీ ఎమ్మెల్యే వెన్నుపోటని ముద్ర
- ఏం జరిగినా వర్మకు రాజకీయ సమాధే..
- క్యాడర్‌తో మమేకం కాని జనసేనాధిపతి
- కొందరు నచ్చజెప్పగా రోజుకు 200 మందితో సెల్ఫీలకు సమ్మతి
- ఇప్పుడే ఇలాగుంటే రేపటి మాటేమిటంటున్న స్థానికులు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ పడుతున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గెలుపు ఓటముల సంగతి ఎలా ఉన్నా.. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మకు రాజకీయంగా సమాధే అనే అభిప్రాయం ఆయన అనుచరవర్గం నుంచే వినిపిస్తోంది. ఒకవేళ విజయం సాధిస్తే అదంతా తన బలమేనని పవన్ గొప్పలు పోవడం గ్యారంటీ. ఓటమి పాలైతే వర్మ వెన్నుపోటు పొడిచారనే నెపం నెట్టేస్తారు. ఫలితం ఏదైనా తమ నాయకునికి రాజకీయ భవిష్యత్తు శూన్యంగా కనిపిస్తోందని వర్మ వర్గీయులు బలంగా భావిస్తున్నారు. ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి పవన్, వర్మల మధ్య సఖ్యత వీధుల్లో మాత్రమే కనిపిస్తోందని, అంతర్గతంగా ఎన్నెన్నో ఉన్నాయని జనసేన నాయకులు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ 2019లో గాజువాక, భీమవరం నియోజకవర్గాల నుంచి పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులైన టీసీ నాగిరెడ్డి (గాజువాక) చేతిలో 16,753 ఓట్లు, గ్రంధి శ్రీనివాస్ (భీమవరం) చేతిలో 8,357 ఓట్ల తేడాతో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. తాజా ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చేయబోతున్నట్లు చివరి నిమిషం వరకు కలరింగ్ ఇచ్చారు. టీడీపీ, బీజేపీలతో కలిసి జనసేన ఉమ్మడిగా ఎన్నికలకు వెళుతుండటం, తన సామాజిక వర్గీయులైన కాపు ఓటర్లు అధికంగా ఉన్నందున పవన్ పిఠాపురం అసెంబ్లీ స్థానాన్ని

-మిగతా IIలో

జనం మెచ్చిన నేత జగన్

అలుపెరగని యోధుడు, జనం మెచ్చిన నాయకుడు జగన్. రాజకీయ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేనన్ని, కనీ వినీ ఎరుగని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే నాయకుడు జగన్. ఈ రాజకీయ యుద్ధంలో జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేక, మూడు పార్టీలు కలిసి కూటమి కట్టాయంటే ఇదే వైఎస్సార్‌సీపీ విజయానికి తొలి మెట్టు. జగనన్నను సీఎంగా గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు. ప్రజాస్వామ్యంలో మనకున్న అమూల్యమైన ఓటు హక్కుతో ప్రజా నాయకుడు జగన్‌ను గెలిపించుకుందాం.

- మునగల శశికళ, స్కూల్ అసిస్టెంట్(సోషల్), గుడివాడ, కృష్ణాజిల్లా

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను 73867 92224 నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

మహిళల్ని పట్టించుకునే వారికే పట్టం

మహిళా సంక్షేమానికి చేయూతనిస్తున్న ప్రభుత్వాన్నే గెలిపించుకోవాలి. ఓటు అనే ఆయుధం ద్వారా సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్న పాలకుడికి పట్టం కడితే మరింత పురోగతి సాధ్యమవుతుంది. సీఎం జగన్ పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా సంక్షేమానికి, రక్షణకు, స్వయం సమృద్ధికి బలమైన పునాదులు వేశారు. దిశ లాంటి చట్టాలతో మహిళలకు రక్షణ కల్పిస్తున్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే ప్రభుత్వాన్నే మళ్లీ మళ్లీ ఎన్నుకోవాలి. ఓటు ఒక సామాజిక బాధ్యత. ప్రలోభాలకు లొంగకుండా సంక్షేమానికి బాటలు వేసిన ప్రభుత్వానికి పట్టం కడదాం.

- అడపా ఈశ్వరి, కాట్రేనికోన, ముమ్మిడివరం, కోనసీమ జిల్లా

'పాల' ధూళిపాళ్ల



అవినీతి అనకొండ

- దౌర్జన్యాలకు కేరాఫ్.. ధూళిపాళ్ల నరేంద్ర
- గ్రావెల్, ఇసుక తవ్వకాలతో అడ్డగోలుగా దోపిడీ
- సంగం డెయిరీని సొంత ఆస్తిగా మార్చేసిన నేత
- దాని ప్రాంగణంలో తండ్రి పేరుతో ఆస్పత్రి నిర్మాణం
- దేవదాయ భూముల్నీ వదల్లేదు
- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడంలో దిట్ట
- సుద్దపల్లి చెరువును క్వారీగా మార్చేందుకు యత్నం
- తిరగబడిన స్థానికులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు
- ఆయన కబ్జాలకు గజగజలాడిన పొన్నూరు నియోజకవర్గం

సాక్షి ప్రతినిధి, గుంటూరు:

నరేంద్ర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో క్వారీలు, రీచ్‌ల్లో అక్రమాలకు పాల్పడి కోట్లు దండుకున్నారు. తుళ్లూరు మండలం అనంతవరం పంచాయతీ పరిధిలో మెటల్ సరఫరాకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే వాటిని అడ్డం పెట్టుకుని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి కాసులు కాజేశారు. తుళ్లూరు మండలం లింగాయపాలెం, పెనుమాక సహా వివిధ ప్రాంతాల్లో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాల్లో ఈయన సోదరులే కీలకం. ఇసుక రీచ్‌లపైనే ఆయన సుమారు రూ.500 కోట్లు సంపాదించారంటే ఆయన అవినీతి ఏ స్థాయిదో అర్థమవుతుంది. కొలనుకొండలో అటవీశాఖ భూమిలో ఒక వ్యక్తి మైనింగ్ కోసం అనుమతులు తీసుకుంటే ఆయన్ను బెదిరించి లాభాల్లో 40 శాతం వాటా దక్కించుకున్నారు. తర్వాత కొన్ని రోజులకు క్వారీ మొత్తాన్నీ కొట్టేశారు. ఆత్మకూరు చెరువులో 80 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకుంటున్న లీజుదారుడిని బెదిరించి దాన్నీ కబళించారు. గుంటూరు నుంచి తెనాలి మధ్య జరుగుతున్న రైల్వే డబ్లింగ్ వర్క్ పనులకు గ్రావెల్ తరలించే కాంట్రాక్టు దక్కించుకుని చేబ్రోలు మండలంలోని శేకూరు, చేబ్రోలు చెరువుల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. వడ్లమూడి, చేబ్రోలు, శేకూరు గ్రామాల్లో ఎమ్మెల్యే సోదరుడు, అతని బినామీలు కలిపి అక్రమ క్వారీయింగ్ చేశారు. చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లిలో 25 ఎకరాల పెద్ద చెరువును క్వారీగా మార్చడానికి చేసిన ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకుంటే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారు.

సంగం ఆస్తులు స్వాహా..

పాడి రైతుల కష్టార్జితంతో ఏర్పాటు చేసిన సంగం డెయిరీ ఆస్తులను ధూళిపాళ్ల స్వాహా చేసేశారు. నిబంధనలకు విరుద్ధంగా డెయిరీ ప్రాంగణంలో తన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పేరుతో హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ నిర్మించారు.

చేబ్రోలు మండలం వడ్లమూడిలో 1977లో స్థాపించిన గుంటూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (సంగం డెయిరీ) మొదట్లో 1964 సహకార చట్టం ప్రకారం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగింది. తరువాత 1995లో చంద్రబాబు హయాంలో మ్యాక్స్ చట్టంలోకి వచ్చిన తరువాత కొంతమేర ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించారు. ఈ చట్ట ప్రకారం గుత్తాధిపత్యం పాలకవర్గం అజమాయిషీలో ఉండేది.

2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక కంపెనీ యాక్ట్‌లోకి మార్చారు. అప్పటి నుంచి నరేంద్ర తన చేతుల్లోకి తీసుకుని ఆయనే చైర్మన్‌గా కొనసాగుతున్నారు. 1994లో తన తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి పది ఎకరాల డెయిరీ స్థలాన్ని ట్రస్టుకు బదలాయించారు.

విలువైన భూములూ హాంఫట్...

అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజధాని ప్రాంతంలో రూ. కోట్లు విలువైన పోరంబోకు భూములను అడ్డగోలుగా ఆక్రమించేశారు. పెదకాకాని మండలం నంబూరు వాగు పోరంబోకు భూములను తమ బంధువు పేరుతో ఆక్రమించారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి రెండు, మూడు చేతులు మార్చినట్లుగా డాక్యుమెంటు నంబర్లు 2638, 2639, 2640లలో 3.89 ఎకరాల భూమిని తమ బినామీదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించారు. పొన్నూరు దేవదాయ శాఖ భూముల్ని ఆక్రమించి తన తండ్రి పేరుతో కాలనీలు ఏర్పాటు చేశారు. కేవలం తమ సామాజికవర్గం ఉండే ప్రాంతాలు తప్ప మిగిలిన ప్రాంతాల అభివృద్ధిని పట్టించుకోలేదు. 2019 లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే రోశయ్య నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతుంటే ఏం చేయాలో పాలుపోక ఆయనపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు.

కల్యాణ మండపం నిర్వహణతో కాసుల వేట

పొన్నూరు నియోజకవర్గం చింతలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో పాడి రైతులు తమ సంఘం నిధులతో రోడ్డుపక్కన 30 సెంట్ల స్థలం కొన్నారు. ఈ స్థలంలో ధూళిపాళ్ల తన తండ్రి పేరుతో కల్యాణ మండపాన్ని 2003లో నిర్మించారు. ఆ సమయంలో నలుగురు ఎంపీలు ఈ కల్యాణ మండప నిర్మాణానికి వారి ఎంపీ నిధులు కింద రూ. 23 కోట్లు మంజూరు చేశారు. సాధారణంగా ఎంపీ, ఎమ్మెల్యే నిధుల ద్వారా నిర్మించిన ఏ నిర్మాణాలైనా పంచాయతీ, మున్సిపాలిటీ ఆధీనంలోనే ఉండాలి. కల్యాణ మండపానికి నరేంద్ర తల్లి చైర్మన్‌గా వ్యవహరిస్తూ భారీగా అద్దెలు వసూలు చేస్తున్నారు.

→ సంగం డెయిరీలో జరిగిన అవకతవకలపై క్రైం నెంబర్- 02/ RCO& GNT& ACB/2021తో 408, 409, 418, 420, 465, 471, 120-బి రెడ్‌విత్ 34 ఐపీసీ, సెక్షన్ 13 (1) (c)(d) ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ ప్రకారం ఏసీబీ కేసు నమోదు చేసింది. పొన్నూరు నియోజకవర్గ చింతలపూడి గ్రామంలో ఆయన స్వగృహంలో ఉండగా ఏసీబీ ధూళిపాళ్ల నరేంద్రను అరెస్ట్ చేసింది.

→ సంగం డెయిరీలో పాలవిక్రయాలపై 14% బోనస్ చెల్లించాలని కోరిన పాడి రైతులపై

ఏసీబీ కేసులో అరెస్ట్

దాడి చేసినందుకు చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో 15-11-2023న ఎఫ్ఐఆర్ నెంబర్ 286/2023తో ధూళిపాళ్లపై 143,147,148, 427,324,384,506,109,307 r/w149 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదైంది. దీనిలో ఆయన 14వ ముద్దాయిగా ఉన్నారు.

→ పెదకాకాని శివాలయంలో మాంసాహారం వంటకాలపై టీడీపీ ఆందోళన చేపట్టింది. ఈఓ కార్యాలయం వద్ద ధూళిపాళ్ల నరేంద్ర బైఠాయించి నిరసన తెలిపారు. ఈ నిరసనపై దేవదాయ శాఖ సిబ్బంది ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా వచ్చి ఆందోళనలకు దిగారని ఈవో ధూళిపాళ్ల నరేంద్రపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

→ కర్ఫ్యూ, కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించి సంగం డెయిరీకి చెందిన 20 మందితో కలిసి హోటల్లో మీటింగ్ నిర్వహించినందుకు గుంటూరు ఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మాయోపాయాలు, బెదిరింపులు

▶ మొదటి పేజీ తరువాయి

అధికారుల అభ్యంతరాలూ బేఖాతరు

అసైన్డ్ భూములకు ప్యాకేజీ ప్రకటించడానికి వీల్లేదు. 1954కు ముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులకు పంపిణీ చేసిన భూములు మాత్రమే ఇతరులకు విక్రయించుకోవచ్చు. ఆ విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారులతో పాటు అడ్వకేట్ జనరల్ సైతం గుర్తిస్తూ భూసమీకరణ ప్యాకేజీని వ్యతిరేకించారు. ఉన్నతాధికారులు తాము చెప్పినట్లు చేయాల్సిందేనని చంద్రబాబు, నారాయణ హుకుం జారీ చేశారు.

కోర్టుల్ని బురిడీ కొట్టించి..

అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు చంద్రబాబు ఏకంగా కోర్టునే మోసం చేశారు. అమరావతి పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో అసైన్డ్ భూముల రికార్డులను చంద్రబాబు, నారాయణ మాయం చేశారు. 1954 తరువాత భూపంపిణీ రికార్డులు ఏమీ లేవని కోర్టుకు నివేదిక ఇచ్చారు. 1954 తరువాత చాలాసార్లు పేదలకు అసైన్డ్ భూములు పంపిణీ చేశారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో 2004-05లో అసైన్డ్ భూములు పంపిణీ చేశారు. ఆ రికార్డులు మాయం చేశారు. అసైన్డ్ భూముల్లో 1954 తరువాత పంపిణీ చేసిన భూము లు ఉన్నాయన్న విషయం సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. ఇలా 617.70 ఎకరాల అసైన్డ్ భూములు చంద్రబాబు, నారాయణలు బినామీల పేరిట దోపిడీ చేశారు. ఈ భూములకు ప్యాకేజీ ద్వారా వారి గ్యాంగ్ ఏకంగా రూ.3,737.30 కోట్లు కొల్లగొట్టింది.

పచ్చ కుట్ర బట్టబయలు

ప్రభుత్వ అసైన్డ్ భూముల కేటగిరీ 5, 6లో చూపించిన 522 మంది రైతుల్లో ఒక్కరూ అసలు అమరావతి గ్రామాల్లోనే లేరన్న నిజం సిట్ దర్యాప్తులో బృందాన్ని నివ్వెరపరిచింది. కేవలం భూసమీకరణ ప్యాకేజీ కింద రాజధానిలో అత్యంత విలువైన స్థలాలను కొల్లగొట్టేందుకే చంద్రబాబు ముఠా ఈ పన్నాగానికి పాల్పడిందన్నది ఆధారాలతో సహా తేటతెల్లమయింది.

ప్రభుత్వ భూములకు ఎసరు

ప్రభుత్వ అసైన్డ్ భూములను దర్జాగా దోచేశారు. 29 గ్రామాల పరిధిలోని ప్రభుత్వ స్థలాలు తమ బినామీలైన ప్రైవేటు వ్యక్తుల అనుభవంలో ఉన్నాయని తప్పుడు రికార్డులు సృష్టించి వాటిని గుప్పిట పట్టారు. ఏకంగా 328 ఎకరాల ప్రభుత్వ భూమిని 522 మంది బినామీల పేరిట చూపిస్తూ హస్తగతం చేసుకున్నారు. భూసమీకరణ ప్యాకేజీలో రూ.760.25 కోట్లు కొల్లగొట్టారు. ప్రభుత్వ భూములన్నీ గుర్తు తెలియని వ్యక్తుల ఆధీనంలో ఉన్నట్టుగా రికార్డుల్లో చూపించారు. అందుకోసం అసైన్డ్ భూముల జాబితాను 5, 6 కేటగిరీలుగా పేర్కొన్నారు. అన్యాక్రాంతమైనప్పటికీ అభ్యంతరాలు లేని భూములను కేటగిరీ 5గా, అన్యాక్రాంతమైన, అభ్యంతరాలు ఉన్న భూములను కేటగిరీ 6గా చూపిస్తూ జీవో 41 జారీ చేశారు. కేటగిరీ 5లో 237.60 ఎకరాలు గుర్తించారు. ఆ భూములన్నీ 295 మంది ఆధీనంలో ఉన్నట్టుగా చూపించారు. కేటగిరీ-6లో 90.52 ఎకరాలు చూపి అవి 227 మంది స్వాధీనంలో ఉన్నట్టు కనికట్టు చేశారు. వాస్తవానికి అవి ఎవరి ఆధీనంలోనూ లేవు.

పొత్తు చిత్తే!



ప్రచారం చేయాలని బండారును ఆదేశిస్తున్న బాబు

▶ మొదటి పేజీ తరువాయి

హంగామా చేసినా, వచ్చింది వేలల్లోనే. కార్యకర్తల కోసం కేటాయించిన గ్యాలరీల్లో సభ ప్రారంభం నుంచి చివరి వరకు సగం పైగా ఖాళీగానే ఉండిపోయాయి. ఈ నెల 5న నరసాపురం, పాలకొల్లుల్లో చంద్రబాబు నిర్వహించిన కూటమి సభలు పేలవంగా జరిగాయి. పాలకొల్లు సభలో చంద్రబాబు జనసేన రాష్ట్ర నేత బన్నీ వాసును ప్రచార రథం ఎక్కనీయక పోవడంతో ఆయన అలిగి వెళ్లిపోయారు.

తణుకులో బాబు, పవన్‌ల నిలదీత

ఈ నెల 10వ తేదీన తణుకులో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను జనసేన పార్టీల నేతలు అడ్డుకుని నిలదీశారు. ఆశించిన స్థాయిలో జనం రాకపోగా, నిలదీతతో ఇద్దరు నేతలు ఖంగుతిన్నారు. తనకు ప్రకటించిన సీటును టీడీపీకి వదిలేశారని ఆగ్రహంతో ఉన్న జనసేన ఇన్‌చార్జి ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు సభకు గైర్హాజరవ్వగా ఆయన అనుచరులు సభా వేదిక వద్దకు చేరుకుని ప్లకార్డులతో నిరసన తెలిపారు. అక్కడే టీడీపీ, జనసేన కార్యకర్తలు తోపులాటకు దిగారు. గుంటూరు జిల్లా తాడికొండలో చంద్రబాబు నిర్వహించిన సభలో జనసేన నాయకులను ప్రచార వాహనంపైకి ఎక్కించి బీజేపీ నేతలను పక్కకు తోసివేశారు. తెనాలిలో పవన్‌కళ్యాణ్ సభకు అక్కడి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆలపాటి రాజా డుమ్మా కొట్టి నాదెండ్ల మనోహర్ కోసం తాను పని చేసేది లేదని చెప్పకనే చెప్పారు.

ప్రధాని మోదీ వచ్చిన సభే విఫలం

గత నెల 17వ తేదీన చిలకలూరిపేటలో ప్రధాని మోదీ హాజరైన కూటమి సభ విఫలమవడం పొత్తు పరిస్థితిని తేటతెల్లం చేస్తోంది. ఎంత ప్రయత్నించినా జనం అనుకున్న స్థాయిలో రాకపోగా సభను నిర్వహించడంలో టీడీపీ నేతలు విఫలమవడంతో అడుగడుగునా అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో మోదీ.. టీడీపీ నేతలపై అసహనం వ్యక్తం చేశారు. ఈ నెల 6న చంద్రబాబు క్రోసూరు, సత్తెనపల్లిలో చేపట్టిన ప్రజాగళం సభల్లో జనసేన, బీజేపీ నేతలు కనిపించలేదు. సత్తెనపల్లి సభ జనం లేక అట్టర్‌ఫ్లాప్ అయ్యింది.

టీడీపీ తీరుపై జనసేన, బీజేపీ నేతల ఆగ్రహం

బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు మూడు ప్రజాగళం సభలు జరగ్గా ఒక్కటీ విజయవంతం కాలేదు. బాపట్ల, వేమూరు, రేపల్లెలో జరిగిన సభలకు జనం కరువయ్యారు. ఆ సభలకు జనసేన, బీజేపీ నేతలు ఒకరిద్దరిని ప్రచార వాహనం పైకి పిలవడమే తప్ప కార్యకర్తలు ఎక్కడా కనిపించ లేదు. టీడీపీ తమకు సభల గురించి చెప్పడం లేదని, అస్సలు తమను పట్టించుకోవడం లేదని జనసేన, బీజేపీ నేతలు వాపోతున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో గత నెల 31న జరిగిన చంద్రబాబు సభలో పెట్టిన ఫ్లెక్సీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పేరు లేకపోవడంతో ఆ పార్టీ నేతలు గొడవకు దిగారు.

అంతటా అదే తీరు

- ఉమ్మడి విశాఖ జిల్లా గాజువాకలో ఈ నెల 14న చంద్రబాబు నిర్వహించిన సభకు బీజేపీ నేతలు హాజరు కాలేదు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి సహా జిల్లా నాయకులెవ్వరూ హాజరవకపోవడం చర్చనీయాంశమైంది. కూటమి పార్టీల నాయకుల జాడ కూడా కనిపించలేదు. చంద్రబాబు పర్యటనకు పెందుర్తి సీటు దక్కని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి దూరంగా ఉన్నారు. చివర్లో చంద్రబాబు ఆయన్ను పిలిపించుకుని మాట్లాడినా బండారు శాంతించలేదు.
- తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో చంద్రబాబు సభలు ఆశించిన స్థాయిలో జరగలేదని టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. కొవ్వూరులో జరిగిన సభలో కూటమి నాయకులు కనిపించలేదు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో జరిగిన సభకు బీజేపీ, జనసేన నేతలు వెళ్లలేదు. ఈ నెల 10వ తేదీన నిడదవోలులో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హాజరైన సభకు జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్‌ను ప్రచార వాహనంపైకి పిలిచి ఆ సీటును త్యాగం చేసిన టీడీపీ నేత బూరుగుపల్లి శేషారావును మాత్రం పట్టించుకోలేదు. దీంతో శేషారావు అనుచరులు గొడవకు దిగారు.
- నెల్లూరు జిల్లా కావలిలో గత నెల 29న చంద్రబాబు.. బీజేపీ, జనసేనలతో కలిసి నిర్వహించిన బహిరంగ సభ జనం లేక వెలవెలబోయింది. జనం లేకపోవడంతో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన సభ నాలుగు గంటలు ఆలస్యంగా జరిగింది. అప్పటి వరకు చంద్రబాబు బస్సులోనే ఉండిపోయారు. ఈ నెల 29న ఉదయగిరిలో జరిగిన సభకు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు గైర్హాజరయ్యారు.
- కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గత నెల 31న చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన సభకు టీడీపీ అభ్యర్థి జయ నాగేశ్వరరెడ్డి.. బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఎవ్వరినీ ఆహ్వానించలేదు. కర్నూలులోనూ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్.. కూటమి పార్టీలను పట్టించుకోకుండా ఒంటరిగానే ప్రచారం నిర్వహిస్తున్నారు.
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూటమి సమావేశాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. స్వయంగా చంద్రబాబు, బాలకృష్ణ ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నా.. బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎక్కడా కనిపించడం లేదు. గత నెల 28న చంద్రబాబు రాప్తాడులో నిర్వహించిన సభలో బీజేపీ ఊసే లేదు. శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రం సభలోనూ బీజేపీ వాళ్లు ఎవరూ లేరు. తమకు ఆహ్వానం లేదని స్థానిక జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేసి, సభకు దూరంగా ఉన్నారు.

అనుమానపు చూపులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎంచుకుని పోటీకి దిగారు. ఇక్కడి నుంచి 2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 47,080 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఎస్‌వీఎస్ఎన్ వర్మ 2019లో టీడీపీ తరఫున పోటీ చేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పెండెం దొరబాబు చేతిలో 14,992 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న వర్మను పొత్తుల మాటున పక్కకు నెట్టి పవన్ కళ్యాణ్ సీటు చేజిక్కించుకున్నారు.

మాటపై నిలబడతారా?

అసెంబ్లీ సీటు చేజారడంతో జనసేనకు సహకరించే ప్రసక్తే లేదని, అనుయాయుల సహకారంతో మళ్లీ ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగుతానని బీరాలు పోయిన వర్మతో బాబు మంతనాలు జరిపి.. పవన్‌కు సహకరించేందుకు సమ్మతింపజేసిన సంగతి విదితమే. అన్యమనస్కంగానే ప్రచారంలోకి దిగిన తమ నేతతో ఎనలేని సఖ్యతను నటిస్తూ ఎన్నికల వరకూ సర్వం నీ చేతుల మీదుగానే సాగాలని అభిలషిస్తున్నట్లుగా పవన్ పోకడలు ఉంటున్నాయని వర్మ అనుచరగణం అంటోంది. వాస్తవంగా జనసేన, టీడీపీ వ్యవహారాలు ఆ దిశగా లేవనేది క్షేత్ర స్థాయిలో పరిశీలకుల విశ్లేషణ. మరోవైపు మిత్రపక్షంలోని బీజేపీది పిఠాపురంలో నామమాత్రపు పాత్రేనని అంటున్నారు. ఈ పరిస్థితిలో వర్మ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. పవన్ గెలుపు ఓటముల్లో ఏదైనా సరే తనకు సంకట స్థితేనని ఈ మాజీ ఎమ్మెల్యే తన ముఖ్య అనుయాయుల వద్ద వాపోతున్నట్లు సమాచారం. పవన్‌ది మాటపై నిలబడే తత్వం కాదని అనేక అంశాల్లో ఇప్పటికే నిర్ధారణయ్యింది. నాగిని నృత్యంలా ఆయన నాలుక ఎన్ని వంకర్లయినా తిరుగుతుంది. అవసరానికి వాడుకుని ఎన్నికలయ్యాక తూచ్.. నీకూ నాకూ చెల్లు అనడన్న గ్యారంటీ ఏమిటి? అనే ప్రశ్నను విజయవాడలో టీడీపీ ముఖ్య నాయకుని వద్ద వర్మ వ్యక్తం చేశారు.

తర్వాత పిఠాపురం వైపు చూస్తారా?

ఎన్నికలయ్యాక పవన్ పిఠాపురం వైపు చూస్తారా అనే అనుమానాలు జనసేనతో పాటు టీడీపీ క్యాడర్‌లోనూ లేకపోలేదు. 2019 ఎన్నికల్లో ఓడిన తర్వాత రెండు పర్యాయాలు మాత్రమే ఆయన గాజువాక వచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన నిరసనకు సంఘీభావం తెలిపేందుకు ఓసారి, పార్టీ నాయకులతో సమావేశానికి మరోసారి వచ్చారు. భీమవరానికి కూడా అంతే. పార్టీ నాయకులతో సమావేశానికి ఓ రోజు, వారాహి యాత్రలో భాగంగా మూడు రోజులు ఉంటానని చెప్పి, రెండు రోజులకు పరిమితమయ్యారు. నామమాత్రంగా పార్టీ సమావేశం కానిచ్చేసిన పవన్.. తక్కిన సమయాన్ని బ్రో సినిమా ట్రైలర్ డబ్బింగ్ పనికి వినియోగించుకున్నారు. 2023లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన జనసేన అధినేత.. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో 2024 ఫిబ్రవరి 21న ముఖ్య నాయకులను కలుసుకునేందుకు మరోమారు వచ్చారు.

పోటీ అంత సేఫ్ ఏమీ కాదు

పోటీకి పిఠాపురాన్ని ఎంచుకున్నప్పటికీ అదంత సేఫ్ సీటేమీ కాదనే అనుమానాలు పవన్ వర్గంలో లేకపోలేదు. ఇదివరకే సొంత జిల్లాలోని భీమవరం నుంచి పవన్ ఓటమి చెందగా, ఆయన సోదరుడు చిరంజీవి సైతం సొంత నియోజకవర్గమైన పాలకొల్లులో బి.ఉషారాణి చేతిలో పరాభవం చవిచూశారు. మరో సోదరుడైన నాగబాబు సైతం నరసాపురం లోక్‌సభ అభ్యర్థిగా ఓడారు. వీటన్నింటినీ పరిశీలిస్తే గోదావరి జిల్లాలు కొణిదెల కుటుంబానికి సానుకూలం కాదనేది రాజకీయ పరిశీలకుల విశ్లేషణ. కాగా, పవన్ కళ్యాణ్ ధోరణికి పిఠాపురం నియోజకవర్గం ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. సినిమా యాక్టర్, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన పవన్‌ను కలవాలనుకునే వారికి ఏమాత్రం సాధ్యపడటం లేదు. ఈ విషయమై కొందరు నచ్చజెప్పగా ముందుగా నిర్ణయించిన వారిలో రోజుకు 200 మందికి సెల్ఫీలు దిగే అవకాశం ఇస్తానని సెలవిచ్చారట. అదీ ఆయన నెల రోజుల పాటు నియోజకవర్గంలో నిలకడగా ఉన్న పక్షంలో 6000 మందిని కలుసుకోగలరన్న మాట. లేదంటే అదీ లేదు. ఇప్పుడే ఇలాగైతే ఎన్నికల తర్వాత తమ పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గీత.. పక్కా లోకల్

పవన్‌కు పోటీదారైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీత విద్యాభ్యాసం అనంతరం టీడీపీలో చురుకుగా ఉంటూ జెడ్పీ చైర్‌పర్సన్‌గా, రాజ్యసభ సభ్యురాలిగా, ఎమ్మెల్యే (ప్రజారాజ్యం)గా, లోక్‌సభ సభ్యురాలిగా పిఠాపురం నియోజకవర్గంలో విస్తృత పరిచయాలు కలిగి ఉన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వంగా గీతను 'మా అమ్మాయి' అని చెప్పుకునేంతగా అందుబాటులో ఉంటూ కలిసిపోతారని, ఆమెతో పోటీ పడటం అంత సులువు కాదని టీడీపీ, జనసేన పార్టీల ముఖ్యులు వ్యాఖ్యానిస్తున్నారు.

చిత్రం సాక్షిగా

• రామలింగాపురం కళకళ



రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం



రూ.40 లక్షలతో నిర్మితమైన బహుళ ప్రయోజన సౌకర్య గోదాము



చీపురుపల్లి మండలం రామలింగాపురంలో రూ.43.6 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



రామలింగాపురం గ్రామం నుంచి శ్మశానవాటికకు వెళ్లేందుకు రూ.4 లక్షలతో వేసిన సీసీ రోడ్డు

విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామంలో రూ.1.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి జనానికి అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలనా కాలంలో ఒక్కో పల్లె ప్రగతి పనులతో ముందుకు సాగుతూ తన స్వరూపాన్ని మార్చుకుంటోంది. ఈ పనులకు శంకుస్థాపనలు చేస్తున్న సమయంలో 'ఇలాంటివి ఎన్ని చూడలేదని గత పాలకులను చూసిన ఈ ప్రాంతవాసులు పెదవివిరిచారు. కానీ శంకుస్థాపన తరువాత ఒక్కో పని చురుకుగా జరిగి పూర్తవడంతో తొలుత తేలికగా తీసుకున్న ఆ జనమే 'జయహో' అని ప్రశంసించడం ప్రారంభించారు. వీటిద్వారా ప్రజల సమస్యలు పరిష్కారానికి ప్రాధాన్యమివ్వడంతో బాధితుల మదిలో ధీమా వ్యక్తమవుతోంది.

- చీపురుపల్లి



రామలింగాపురం గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు ఫీడర్ ఛానల్‌పై రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన వంతెన



రూ.20.80 లక్షలతో వెల్నెస్ సెంటర్

ఇదిగో నవరత్నాల వెలుగులు

నాడు బతుకు భయం.. నేడు కొండంత ధైర్యం..

నాటి టీడీపీ.. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కలిగిన లబ్ధి(రూ.ల్లో)		
పథకం	టీడీపీ పాలనలో	వైఎస్సార్‌సీపీ పాలనలో
రుణమాఫీ	0	2,624
పింఛన్	0	2,02,750
సున్నా వడ్డీ	0	1,963
దివ్యాంగ పింఛన్లు	0	2,16,000
ఇంటి స్థలం విలువ	0	1,50,000
నిర్మాణం విలువ	0	1,80,000
మొత్తం	0	7,53,337

అర్చకత్వం వారి వృత్తి. గ్రామంలో ఉన్న శివాలయాన్నే నమ్ముకుని ఓ కుటుంబం జీవిస్తోంది. సొంత భూమి లేదు. కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే శక్తి లేదు. ఆలయానికి చెందిన రెండెకరాల భూమి వేరేవారి ఆధీనంలో ఉంది. దానిపై వచ్చే ఆదాయం అంతంతమాత్రమే. దేవాలయానికి వచ్చే భక్తులు ఇచ్చిన దక్షిణలతోనే వారి కుటుంబపోషణ సాగుతోంది. దీనికి తోడు పుట్టిన కొడుకు, కూతురు ఇద్దరూ బధిరులే. ఇద్దరిలో కొడుక్కు అతికష్టమ్మీద పెళ్లి చేసినా... కూతురుకు పెళ్లికాక జీవితాంతం తమతోనే గడపాల్సి వస్తోంది. ఆదుకోవాల్సిన గత ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఆ కుటుంబాన్ని ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులనుంచి గట్టెక్కించింది. ఇదీ శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామానికి చెందిన వారణాసి కుమార స్వామి, శ్యామలాంబ కుటుంబ గాథ.

అడగకుండానే.. అన్నీ ఇచ్చిన జగనన్న ప్రభుత్వం



2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పరిస్థితులన్నీ చక్కబడ్డాయి. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది. ఏదో రకంగా ఏడాది పొడవునా ప్రభుత్వం నుంచి సహాయం అందుతోంది. ఇంటి ఇల్లాలు శ్యామలాంబకు వైఎస్సార్ ఆసరా(రుణ మాఫీ), వైఎస్సార్ సున్నా వడ్డీ, కుమార స్వామికి పింఛన్, కొడుకు, కూతురుకు దివ్యాంగ పింఛన్లు, కొడుకు చంద్రశేఖర్ కుట్టు పని నేర్చుకోవడంతో మెషీన్ ఉన్నందున జగనన్న చేదోడు అందుతున్నాయి. అతని భార్య పేరున కాలనీలో ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం అందింది. ఇప్పుడు పనులు పురోగతిలో ఉన్నాయి. వారి పిల్లలు బడికి వెళ్తున్నందున అమ్మ ఒడి నిధులు జమవుతున్నాయి. తమకు ఎలాంటి కష్టం వచ్చినా ఈ ప్రభుత్వం ఆదుకోగలదన్న నమ్మకం ఏర్పడింది. ఇప్పుడు ఆ కుటుంబం ఎంతో దర్జాగా బతికేస్తోంది. -బూర్జ

సుస్థిర ఆర్థిక వ్యవస్థకు దోహదం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాల వల్ల ప్రతీ కుటుంబంలోనూ ఆర్థిక సమస్యలు పరిష్కారం అయ్యాయి. రైతులకు వైఎస్సార్ రైతుభరోసా వల్ల వ్యవసాయం కోసం అప్పు చేయాల్సిన బాధ తప్పింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వల్ల నిరుపేదలకు వైద్యం ఉచితంగా అందుతోంది. పిల్లల చదువు తల్లి దండ్రులకు భారం కాకుండా అమ్మ ఒడి, బతుకుపై భరోసా కల్పించేందుకు పింఛన్లు అందుతున్నాయి. ఈ ఆర్థిక సహాయం వల్ల రాష్ట్రంలో సుస్థిర ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతోంది.

– కె.కె.కామేశ్వరరావునాయుడు, ఎకనమిక్స్ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బూర్జ



శరవేగంగా సాగుతున్న భోగాపురం ఎయిర్‌పోర్టు రన్‌వే పనులు

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మారిన ఉమ్మడి విజయనగరం జిల్లా దశ
- ప్రపంచ స్థాయి సౌకర్యాలతో సిద్ధమవుతోన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- ప్రజల దశాబ్దాల కల ప్రభుత్వ మెడికల్ కాలేజీ సాకారం
- మన్యానికి మకుటంలా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం
- శరవేగంగా సిద్ధమవుతోన్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి

వలసల గడ్డపై... ప్రగతి వీచిక

'గిరి'జన ప్రగతికి దిక్సూచి...

ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ) సొంత భవనాల నిర్మాణ పనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది ఆగస్టు 25న భూమి పూజ చేశారు. గజపతినగరం నియోజకవర్గంలోని మర్రివలస గ్రామ సరిహద్దులో దీన్ని నిర్మిస్తున్నారు. సీటీయూఏపీ కోసం ఏపీ బడ్జెట్‌లో రూ.834.83 కోట్లు కేటాయించారు. 519.03 ఎకరాల్లో నిర్మాణం పూర్తి చేయడానికి 42 నెలలు లక్ష్యంగా పెట్టుకున్నారు. మౌలిక వసతుల కల్పనకు రూ.23.60 కోట్లు ఇచ్చారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాక్షి, పార్వతీపురం మన్యం: వలసలకు, వెనుకబాటుతనానికి నిలువెత్తు సాక్ష్యం ఉమ్మడి విజయనగరం జిల్లా. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఈ ప్రాంత దశా దిశా మారిపోతోంది. రాష్ట్రానికి పరిపాలనా రాజధాని కానున్న విశాఖ నగరానికి చేరువగా ఉండటం, భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా జరగడం, విశాఖపట్నం-రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తి కావడం విజయనగరానికి వరంలా మారాయి.

అభివృద్ధికి రాచబాట గ్రీన్‌ఫీల్డ్ హైవే...

అటు రాష్ట్ర పరిపాలనా రాజధాని కానున్న విశాఖ నగరాన్ని ఇటు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌ను అనుసంధానం చేస్తూ విజయనగరం జిల్లా మీదుగా ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే సాకారమవుతోంది. రామభద్రపురం, మెంటాడ, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, జామి, ఎల్.కోట, కొత్తవలస మండలాల మీదుగా వెళ్లే దీని పొడవు: 75.03 కిమీ. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.3,778 కోట్లు వెచ్చిస్తోంది.

రూ.500 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, 519 ఎకరాల సువిశాల సుందర ప్రదేశంలో నిర్మిస్తున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, విశ్వవిద్యాలయంగా మారిన జేఎన్‌టీయూ-జీవీ... ఇవన్నీ విజయనగరం జిల్లాకు కలికితురాయి కానున్నాయి.

ప్రజల కల... ప్రభుత్వ వైద్య కళాశాల!

విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం. దాన్ని సాకారం చేస్తానని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలబెట్టుకున్నారు. శంకుస్థాపన చేసిన ఆయనే రూ.500 కోట్లతో భవనాల నిర్మాణం శరవేగంగా పూర్తిచేసి గత ఏడాది సెప్టెంబరు 15న ప్రారంభోత్సవం కూడా చేయడం విశేషం. దీంతో ప్రజలు అత్యవసర వైద్యానికి, సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణుల కోసం విశాఖపట్నం వరకూ పరుగులుపెట్టాల్సిన పరిస్థితి తప్పింది. 500 పడకలు అందుబాటులోకి వచ్చాయి. 150 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించారు. : 222 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.



విజయనగరంలో నిర్మితమైన మెడికల్ కళాశాల



ఆధునికంగా రూపుదిద్దుకున్న నేషనల్ హైవే

'వైభోగా'పురం...

- గత ఏడాది మే 3న భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి భూమి పూజ జరిగింది. దాదాపు రూ.4,500 కోట్లతో జీఎంఆర్ గ్రూప్ పీపీపీ విధానంలో నిర్మాణం చేపట్టింది. 2025 నాటికి మొదటి దశ పూర్తి కానుంది. తొలి దశలో 60 లక్షల మంది ప్రయాణికులకు సరిపోయేలా సౌకర్యాలు.
- ఏడాదికి 4 కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యం.
- ఇంటర్నేషనల్, డొమెస్టిక్ కార్గో టెర్మినల్ కూడా అందుబాటులోకి వస్తుంది.
- భీమిలి బీచ్ కారిడార్ కార్యరూపం దాల్చితే ఈ ప్రాంతంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ నెట్‌వర్క్ పెరగడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశం ఏర్పడుతుంది.
- విమానాశ్రయంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆరు లక్షల మందికి ఉపాధి కలుగుతుంది.
- విమానాశ్రయం నిర్మాణానికి సేకరించిన భూమి 2203.26 ఎకరాలు
- భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.835.48 కోట్లు
- 404 నిర్వాసిత కుటుంబాలకు రూ.67.04 కోట్లతో టౌన్‌షిప్‌ల నిర్మాణం.

గంగపుత్రులకు వరం ఫిషింగ్ జెట్టీ...

పూసపాటిరేగ మండలం చింతపల్లి తీరంలో ఫిషింగ్ జెట్టీ నిర్మాణానికి గత ఏడాది మే 3వ తేదీన భూమి పూజ జరిగింది. అంచనా వ్యయం: రూ.23.74 కోట్లు. కేటాయించిన నిధులు: రూ.25 కోట్లు. 6 ఎకరాల్లో నిర్మించనున్న ఈ జెట్టీ వల్ల 5,053 మత్స్యకార కుటుంబాలకు ప్రత్యక్షంగా, మరో 4 వేల కుటుంబాలకు పరోక్షంగా ప్రయోజనం చేకూరుతుంది.

మన్యంలో ఇదిగో సంక్షేమాభివృద్ధి

- రూ.100 కోట్లతో సమీకృత కలెక్టర్ కార్యాలయం
- జిల్లా కేంద్రంలో రూ.600 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, పార్వతీపురం, సీతంపేటల్లో రూ.50 కోట్ల చొప్పున మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం. సాలూరులో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ శాశ్వత భవనాల నిర్మాణ పనులు.
- అమ్మ ఒడి పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.126 కోట్ల చొప్పున జమ.
- జగనన్న విద్యాదీవెన కింద రూ.23.42 కోట్లు..
- జగనన్న వసతి దీవెన ద్వారా రూ.15.84 కోట్లు.
- జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాల్లో భాగంగా ముగ్గురికి రూ.లక్ష చొప్పున సాయం.
- పింఛన్ కానుక కింద నెలకు రూ.37 కోట్లు పంపిణీ.
- వైఎస్సార్ ఆసరా కింద రూ.378 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.147 కోట్లు, వైఎస్సార్ కల్యాణమస్తు కింద రూ.11.84 కోట్లు, జగనన్న తోడు కింద రూ.7.59 కోట్లు చొప్పున లబ్ధి కలిగింది.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

- పీఎంజీఎస్‌వై, ఆర్‌సీతఈపీఎల్‌డబ్ల్యూ గ్రాంట్ల కింద 1,008 రహదారి పనులు రూ.1,260 కోట్లతో జరుగుతున్నాయి.
- 190 4జీ సెల్ టవర్లకు 77 పూర్తయ్యాయి.
- 58 రహదారులకు అటవీ అనుమతులు మంజూరు.
- సీతంపేటలో గిరిజన మ్యూజియం, జగతిపల్లి, అడాలి వ్యూ పాయింట్‌ల వద్ద పర్యాటక పనులు రూ.1.40 కోట్లతో, గుమ్మలక్ష్మీపురం మండలం ఎస్.కె.పాడులో ఎకో టూరిజం ప్రాజెక్టు పనులు రూ.1.80 కోట్లతో చేపడుతున్నారు.

మీ ఆరోగ్యానికి పూచీ మాది

- ప్రజారోగ్య రక్షణలో అగ్రగామిగా ఏపీ ప్రభుత్వం
- కుయ్..కుయ్..అంటూ అంబులెన్స్ పరుగులు
- పెద్ద రాష్ట్రమైన యూపీలో 988 అంబులెన్స్‌లతోనే సేవలు
- తక్కువ జనాభా ఉన్న ఇక్కడ 768 అంబులెన్స్‌లు
- కర్ణాటక, తమిళనాడు, గుజరాత్‌లలోనూ అరకొరే
- 2,204 వాహనాలతో సేవలందిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వం
- 768 అంబులెన్స్‌లు, 936 ఎంఎంయూలు, 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు
- 'ఫ్యామిలీ డాక్టర్'లో 3 కోట్లకు పైగా సేవలందించిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: ప్రజారోగ్య పరిరక్షణ వ్యవస్థలో అంబులెన్స్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. స్వతహాగా వైద్యుడైన మాజీ సీఎం వైఎస్సార్ ఆ విషయాన్ని గుర్తించి ఉమ్మడి రాష్ట్రంలో 108 అంబులెన్స్, గ్రామీణ వైద్య సేవల కోసం 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ) వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఇంత గొప్ప వ్యవస్థ 2014-19 మధ్య బాబు పాలనలో నిర్వీర్యమైంది. తర్వాత ప్రజారోగ్యం పట్ల చిత్తశుద్ధి కలిగిన సీఎం వైఎస్ జగన్ గడిచిన ఐదేళ్ల పాలనలో 108, 104 వ్యవస్థకు పూర్వ వైభవం తెచ్చారు. వైఎస్సార్ కన్నా మరో రెండడుగులు ముందుకు వేసి దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దారు. 108 అంబులెన్స్‌లు 768, ఎంఎంయూలు 936, వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు 500 చొప్పున అందుబాటులోకి తెచ్చి వైద్య పరంగా సేవలందించారు. మొత్తంగా 2,204 వాహనాల ద్వారా ప్రభుత్వ రంగంలో దేశంలోనే అతిపెద్ద వ్యవస్థను నెలకొల్పారు.

దేశంలో అగ్రస్థానంలో ఏపీ

దేశంలో అతిపెద్ద **రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో** సుమారు 2**5 కోట్లకుపైగా** ప్రజలకు 988 అం**బులెన్స్‌లు** ఉన్నాయి. యూపీ **కంటే** ఐదు రెట్లు తక్కువ జనాభా ఉన్న ఏపీలో 768 అంబులెన్స్‌లు సేవలందిస్తున్నారు. ఏపీ కంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, గుజరాత్‌లో తక్కువ సంఖ్యలో **అంబులెన్స్‌లు** ఉండటం గమనార్హ**ం. ఏపీలో** సగటున 64,306 మందికి ఒక అంబులెన్స్ ఉంది. తెలంగాణలో **75,524 మందికి, కర్ణాటకలో 85,929 మందికి, యూపీలో 2,00,200 మందికి, గుజరాత్‌లో 1,15,000** మందికి, అస్సాంలో 1,15,000 మందికి తమిళనాడులో 1,18,000 మందికి ఒకటి చొప్పున అంబులెన్స్‌లు ఉన్నాయి.



గిరిజన ప్రాంతాలకు సేవల విస్తరణ

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 108 అంబులెన్స్‌లు 336 లే ఉన్నాయి. అంటే అప్పట్లో 679 మండలాలు (ప్రస్తుతం 686) ఉంటే మండలానికి ఒక అంబులెన్స్ కూడా లేదు. దీంతో సీఎం జగన్ 2020 జూలై1న 412 కొత్త 108 అంబులెన్స్‌లు ప్రారంభించారు. 26 నియోనాటల్ అంబులెన్స్ సేవలు తీసుకొచ్చారు. దీంతో అంబులెన్స్‌ల సంఖ్య 748కు పెరిగింది. దీనికి రూ.96.5 కోట్లు ఖర్చు చేశారు. 2022 అక్టోబర్‌లో అదనంగా మరో 20 అంబులెన్స్‌లు గిరిజన ప్రాంతాల్లో చేర్చారు. దీనికి రూ.4.76 కోట్లు వెచ్చించారు. ఈ క్రమంలో 108 అంబులెన్స్‌ల సంఖ్య 768కి చేరింది. 2023లో 2.5 లక్షల కిలో మీటర్లు తిరిగిన పాత వాహనాలను తొలగించి 146 కొత్త అంబులెన్స్‌లు కొనుగోలు చేసింది. ఇందుకు రూ.34.79 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి నెలా 108 అంబులెన్స్‌ల నిర్వహణ కోసం రూ.14.39 కోట్లు వెచ్చిస్తోంది. అంటే ఏడాదికి రూ.172.68 కోట్లు కేవలం 108 అంబులెన్స్‌ల నిర్వహణ కోసం కేటాయిస్తోంది. ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ కోసం ఏడాదికి రూ.15.88 కోట్లు ఖర్చు చేస్తోంది. రోజుకు సగటున 3 వేలకు పైగా అత్యవసర కేసుల్లో అంబులెన్స్‌లు సేవల్లో ఉన్నాయి. 2020 జూలై నుంచి 43 లక్షల మంది ప్రాణాలను 108 అంబులెన్స్‌లు కాపాడాయి.



పల్లె చెంతకే వైద్యులు

వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కార్యక్రమం కింద 500 వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. బాబు పాలనలో ఒక వాహనంలోనే ఆస్పత్రుల నుంచి ఇద్దరు, ముగ్గురు బాలింతలను ఇళ్లకు తరలించేవారు. ఈ ప్రభుత్వంలో విశాలమైన ఎకో మోడల్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చి ఏసీ వాహనంలో ఒక బాలింతను, ఆమె సహాయకులను మాత్రమే ఇంటి వరకూ సురక్షితంగా చేరుస్తున్నారు. గతంలో ఒక ట్రిప్పునకు కేవలం రూ. 499 మాత్రమే ఖర్చు చేస్తుండగా, ప్రస్తుతం రూ.895 ఖర్చు చేస్తున్నారు. 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 4 లక్షల మందికిపైగా బాలింతలు, గర్భిణులు ఈ సేవలను పొందారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పల్లె ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ప్రతీ పీహెచ్‌సీ వైద్యుడు నెలలో రెండుసార్లు పల్లెలకు 104 ఎంఎంయూలతో పాటు వెళుతున్నారు. అన్ని పల్లెలను నెలలో రెండుసార్లు సందర్శించేందుకు వీలుగా 936 ఎంఎంయూలను సమకూర్చారు. ఈ విధానంలో 2022 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 3 కోట్లకు పైగా వైద్య సేవలను ప్రభుత్వం అందించింది.

మీకు తెలుసా?



నేను పుట్టి 42 ఏళ్లు

42 ఏళ్లు ఏంటా..! నేను ఎవరా అనుకుంటున్నారా.. నేను మీకు సుపరిచితమే. త్వరలో రాబోయే ఓట్ల పండగలో హడావుడి అంతా నాదే. ఓట్ల పండగకి, నాకు సంబంధం ఏంటా అనుకుంటున్నారా..!? చెప్తా వినండి.

నా పేరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం). నేను పుట్టక ముందు 1952లో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. ఈ పద్ధతిలో ఓట్ల లెక్కింపు ఆలస్యం అయ్యేది. టెక్నాలజీ పెరగడంతో ఎన్నికల కమిషన్ తొలిసారిగా 1982లో నన్ను పుట్టించింది. నేను వచ్చాక ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు సులువుగా మారింది.


- 1982-83 ఉప ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో నన్ను వినియోగించారు.
- 1984 ఆగస్టులో సుప్రీంకోర్టు నన్ను వినియోగించరాదంది.
- 1988 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 81-ఏను ప్రజా ప్రాతినిధ్య చట్టంలో చేర్చగా, సుప్రీంకోర్టు సరేనంది.
- 1990లో సాంకేతిక నిపుణుల కమిటీ నన్ను సిఫారసు చేయగా, 1998లో ఆమోదించారు.
- 1999-2004 మధ్య వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో నన్ను పూర్తిస్థాయిలో వాడారు.

ఇది అండి నా కథ. మరి వచ్చే ఓట్ల పండగలో నన్ను సరిగా ఉపయోగించండి. మరిచిపోకండి.



రాష్ట్రపతి, ప్రధానిని అందించిన నంద్యాల

కర్నూలు జిల్లాలోని నంద్యాల నియోజకవర్గానికో ప్రత్యేకత ఉంది. రాష్ట్రపతి, ప్రధాన మంత్రిని అందించిన ఘనత ఈ సెగ్మెంట్ దక్కించుకుంది. రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, ప్రధాని పీవీ నరసింహారావు నంద్యాల నుంచి విజయం సాధించారు. రాష్ట్రపతిగా ఎన్నిక కావడానికంటే ముందు.. 1977లో జరిగిన ఎన్నికల్లో ఏపీలోని మొత్తం 41 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా జనతా పార్టీ తరఫున 'నీలం' ఒక్కరే గెలిచి రికార్డు సృష్టించారు. 1991లో ప్రధానిగా పీవీ నరసింహారావు ఎన్నికవడంతో నంద్యాల ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి పీవీ కోసం రాజీనామా చేశారు. ఇక్కడినుంచి పీవీ రెండుసార్లు విజయం సాధించారు.



ప్రజారోగ్యానికి పూర్తి భరోసా

- 2019కు ముందు ప్రభుత్వాస్పత్రుల్లో దారుణమైన పరిస్థితులు
- సరిపడా వైద్యులు, నర్సులు లేక ఆయాలే ప్రసవాలు చేసిన దుస్థితి
- సీఎం జగన్ వచ్చాక పెద్ద ఎత్తున పోస్టుల భర్తీతో మెరుగుపడ్డ వైద్య సేవలు
- కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో వైద్య రంగ విస్తరణకు అవకాశం
- ఆరోగ్యశ్రీ బలోపేతంతో నిరుపేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం
- ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్యమంత్రి చలవే
- ఆస్పత్రులకు పుష్కలంగా మందులు, సర్జికల్స్, వైద్య పరికరాలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో వైద్య విద్య మాజీ అదనపు సంచాలకులు డాక్టర్ విఠల్‌రావు





సాక్షి, అమరావతి:

గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య రంగంలో సమూల మార్పులు వచ్చాయని వైద్యవిద్య పూర్వపు అదనపు సంచాలకులు (ఏడీఎంఈ) డాక్టర్ నత్తా శ్రీనివాస విఠల్‌రావు చెప్పారు. 2019కు ముందు ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితులు ఎంతో అధ్వానంగా ఉండేవని, అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఆస్పత్రులు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నుంచి ఏడీఎంఈ వరకూ వివిధ హోదాల్లో 35 ఏళ్ల పాటు వైద్య శాఖలో పనిచేసిన తాను ఎన్నడూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వడం చూడలేదన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా లేకుండా పెద్ద ఎత్తున నియామకాలు, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ బలోపేతం, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజారోగ్యానికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ రంగంలో వచ్చిన మార్పులు, వాటి ఫలితంగా మెరుగుపడిన వైద్య సేవలు తదితర అంశాలపై విఠల్‌రావు తన అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అప్పట్లో ప్రసవాలకు ఆయాలే దిక్కు..

2019కు ముందు వరకూ ప్రభుత్వాస్పత్రుల్లో ఎంతో దారుణమైన పరిస్థితులను మేం చూశాం. తీవ్రమైన మానవ వనరుల కొరత ఉండేది. పిల్లల వైద్య విభాగంతో పాటు, అన్ని చోట్ల ఇదే పరిస్థితి ఉండేది. విజయవాడ జీజీహెచ్‌లో పిల్లల వైద్య విభాగంలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ (విభాగాధిపతి)గా పనిచేశాను. వైద్య పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వానికి ఎన్ని ప్రతిపాదనలు పంపినా అప్పట్లో పట్టించుకునే వారు కాదు. ఉన్నతాధికారులను ఎప్పుడు అడిగినా ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రావాల్సి ఉందనే సమాధానాలే మాకు ఎదురయ్యేవి. అప్పట్లో ఆస్పత్రిలో దారుణమైన పరిస్థితులకు ఒక ఉదాహరణ చెబుతా.. విజయవాడ జీజీహెచ్ గైనిక్ విభాగంలో పేషెంట్ లోడ్ విపరీతంగా ఉంటుంది. ఇంతటి కీలకమైన విభాగంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు సరిపడా ఉండేవారు కాదు. ఒక్కోసారి లేబర్ రూమ్‌లో ఒక స్టాఫ్ నర్సు, మిగిలిన నాలుగైదు వార్డులకు ఒక స్టాఫ్ నర్సు ఉండాల్సి వచ్చేది. వైద్యులు సరిపడా లేకపోవడంతో ఏఎన్‌ఎంలు, ఆయాలే ప్రసవాలు చేసేవారు.

అడిగిన పోస్టు లేదనకుండా భర్తీ..

2019 తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితులు సమూలంగా మారడానికి ప్రధాన కారణం సిబ్బంది కొరత సమస్య పరిష్కారం కావడం. ప్రభుత్వాస్పత్రిలో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా 'జీరో వేకెన్సీ' పాలసీని తెచ్చి 2019కి ముందు వరకూ ఖాళీగా ఉన్న పోస్టులతో పాటు, పెరిగిన రోగుల తాకిడికి అనుగుణంగా కొత్త విభాగాల ఏర్పాటు, పెద్ద ఎత్తున పోస్టులు మంజూరు చేసి ఈ ప్రభుత్వం భర్తీ చేసింది. వైద్యుల నుంచి క్లాస్‌ఫోర్ ఉద్యోగుల వరకూ ఏ విభాగంలో అయినాసరే అడిగిన పోస్టు కాదనకుండా భర్తీ చేశారు. ఇప్పుడు వార్డులు, ఆపరేషన్ థియేటర్లలో ఎక్కడికక్కడ సరిపడా వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. రోగులకు వైద్యసేవల కల్పన మెరుగుపడింది. అంతేకాదు.. మందులు, సర్జికల్స్, వైద్య పరికరాలు పుష్కలంగా ఆస్పత్రులకు సమకూర్చారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి ప్రస్తుత ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఒకప్పుడు పీజీ సీట్ల కోసం ఎన్‌ఎంసీకి దరఖాస్తు చేస్తే వసతులలేమి కారణంగా మంజూరయ్యేది కాదు. ఇప్పుడు పూర్తిస్థాయిలో పోస్టుల భర్తీ, అన్ని రకాల వసతుల కల్పన వల్ల గణనీయంగా పీజీ సీట్లు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పెరిగాయి.

ప్రజలకు తప్పిన వ్యయ ప్రయాసలు..

దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలను మన రాష్ట్రంలోనే అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎంబీబీఎస్, స్పెషలిస్ట్ వైద్యులే ప్రజల వద్దకు వెళ్లి సేవలందిస్తున్నారు. ఇది ప్రజారోగ్య రంగంలో ఒక విప్లవం అనే చెప్పొచ్చు. పల్లెల్లో రైతులు, కూలిపనులు చేసుకునే నిరుపేదలు తమకేదైనా చిన్న ఆరోగ్య సమస్య వస్తే ఒక రోజంతా ఉపాధిని వదులుకుని వ్యయ ప్రయాసలతో ఆస్పత్రులకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారు. వైద్యులే గ్రామాలకు వెళ్తుండడంతో చాలావరకు జబ్బులు ప్రాథమిక దశలోనే గుర్తించడంతోపాటు సకాలంలో వైద్య సేవలందుతున్నాయి. ఇప్పుడు ప్రజలకు చాలా వరకూ ఆస్పత్రులకు వెళ్లే అవసరాలు తప్పాయి. అంతేకాక.. ఈ ప్రభుత్వంలోనే ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఈవెనింగ్ క్లినిక్‌లు కూడా ప్రవేశపెట్టారు. ఈ విధానంతో ప్రజలకు చాలా మేలు చేకూరుతోంది. ఎందుకంటే సాధారణంగా పెద్దాస్పత్రులకు దూర ప్రాంతాల నుంచి బాధితులు వస్తుంటారు. వారికి ఉదయం ఓపీ చూసిన వైద్యుడు ఏవైనా పరీక్షలకు సిఫారసు చేస్తే ఆ ఫలితాలు సాయంత్రానికి వస్తాయి. ఈవెనింగ్ క్లినిక్‌కు హాజరయ్యే వైద్యులు ఫలితాలను విశ్లేషించి మందులు ఇవ్వడం లేదా వార్డులో అడ్మిట్ చేయడం వంటివి చేస్తున్నారు.

దక్షిణాదిన జాతీయ పార్టీలకు కొరకరాని కొయ్యగా నిలుస్తున్న రాష్ట్రాల్లో ప్రధానమైనది తమిళనాడు! 50 ఏళ్లకు పైగా ఇక్కడ ప్రాంతీయ పార్టీలదే హవా. తమిళులు కూడా సినీ గ్లామర్, ప్రాంతీయ సమస్యలు, అంశాలకే ప్రాధాన్యమిస్తారు. కానీ 39 లోక్‌సభ స్థానాలతో సీట్లపరంగా దేశంలో ఐదో అతి పెద్ద రాష్ట్రమైన తమిళనాడును పక్కనపెట్టే పరిస్థితి లేదు. దాంతో కాంగ్రెస్, బీజేపీ ఇక్కడి ప్రాంతీయ పార్టీతో పొత్తులు పెట్టుకోక తప్పడం లేదు. ఈసారి మాత్రం రాష్ట్రంలో బీజేపీ గట్టిగా ఉనికిని చాటే ప్రయత్నాల్లో ఉంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

జాతీయ పార్టీలకు... ద్రవిడ స్వప్నం!

తమిళనాట హోరాహోరీ

- ఎలాగైనా పాగా వేసే ప్రయత్నాల్లో బీజేపీ
- కాంగ్రెస్-డీఎంకే వైపే సర్వేల మొగ్గు
- నామమాత్రంగా మారిన అన్నాడీఎంకే



స్టేట్ స్కాన్

చెరిగిపోని సిరాచుక్క



చూపుడువేలిపై సిరా చుక్క.. ఓటేశామని చెప్పేందుకు తిరుగులేని గుర్తు. పోలింగ్ బూత్ నుంచి బయటికి రాగానే చూపుడువేలిపై సిరా చుక్కను చూపిస్తూ ఫొటో తీసుకుని సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటాం. ఆ ఇంకు కథ ఆసక్తికరం.

ప్రపంచవ్యాప్తంగా..

మన దేశంలో 1962 లోక్‌సభ ఎన్నికల నుంచి సిరా చుక్క వాడకం మొదలైంది. నాటినుంచి నేటి దాకా కర్ణాటక ప్రభుత్వ సంస్థ మైసూర్ పెయింట్స్ దీన్ని సరఫరా చేస్తోంది. 30 పై చిలుకు దేశాలకు ఈ ఇంకును ఎగుమతి చేస్తోంది కూడా.


ఇదీ ప్రత్యేకత...

- ఓటేసినట్లు రుజువుగా ఓటరు ఎడమ చూపుడు వేలిపై సిరా గుర్తు పెడతారు. చూపుడు వేలు లేకుంటే ఎడమ చేతిలోని ఇతర వేలిపై వేస్తారు. ఎడమ చేయే లేకుంటే కుడిచేతి వేళ్లలో దేనికైనా వేస్తారు. రెండు చేతులు లేకుంటే? ఎడమ లేదా కుడి చేయి చివరి భాగాలకు సిరా గుర్తు వేయాలని ఈసీ చెబుతోంది.
- సిరా చుక్కలో సిల్వర్ నైట్రేట్ ఉంటుంది. ఇది రుద్దిన 40 సెకన్లలోపే ఆరిపోతుంది. చర్మంతో చర్య జరిపి బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. దాంతో త్వరగా చెరగదు. ఇంకు గుర్తు సాధారణంగా చర్మంపై మూడు రోజుల దాకా ఉంటుంది. గోరుపై మాత్రం వారాల పాటు ఉంటుంది.
- 5.1 మిల్లీలీటర్ల సీసాలోని ఇంకుతో సుమారు 700 మందికి గుర్తు వేయవచ్చు. ఈ లోక్‌సభ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం 26 లక్షల ఇంకు బాటిళ్లు ఆర్డర్ చేసింది.
- మామూలుగా ఎన్నికల్లోనే వాడే ఈ ఇంకును ఇతరత్రా వాడేందుకు ఒకేసారి ఈసీ అనుమతించింది. అదెప్పుడంటే.. కరోనా వ్యాప్తి సమయంలో. కోవిడ్ బారిన పడి క్వారెంటైన్లో ఉన్నవారిని గుర్తించడానికి పలు రాష్ట్రాలు ఈ ఇంకును ఉపయోగించాయి.

- సాక్షి, ఎలక్షన్ డెస్క్

ఇండియా కూటమిదే హవా?

ఒకప్పుడు కరుణానిధి డీఎంకే, జయలలిత అన్నాడీఎంకేలకు కంచుకోటైన నిలిచిన తమిళనాట వారి తదనంతరం పరిస్థితులు మారుతున్నాయి. అన్నాడీఎంకే వంటి ప్రధాన ప్రాంతీయ పార్టీ బలహీనపడటంతో ఆ రాజకీయ శూన్యతను భర్తీ చేసి ఈ కీలక దక్షిణాది రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. కాంగ్రెస్ కూడా ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా పాలక డీఎంకేతో జట్టుకట్టింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన యూపీఏ కూటమి ఎన్డీఏను మట్టికరిపించింది. ఏకంగా 38 సీట్లను ఎగరేసుకు పోయింది. స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే 23 స్థానాల్లో పోటీ చేసి 23 సీట్లు చేజిక్కించుకుంది. కాంగ్రెస్ 9 స్థానాలకు 8 దక్కించుకుంది. సీపీఐ, సీపీఎం చెరో రెండు, ఇతర చిన్న పార్టీలు ఒక్కో సీటు గెలుచుకున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో జయలలిత సారథ్యంలో 37 స్థానాలు కొల్లగొట్టిన అన్నాడీఎంకే 2019లో బీజేపీతో కలిసి ఎన్డీఏ కూటమిగా పోటీ చేసి బొక్కబోర్లా పడింది. 21 స్థానాల్లో పోటీ చేసి కేవలం ఒక్క సీటు గెలుచు కుంది. బీజేపీ, పీఎంకే, డీఎండీకే, టీఎంసీ (ఎం) ఖాతా కూడా తెరవలేదు. ఈసారి ఇండియా కూటమి నుంచి డీఎంకే 21, కాంగ్రెస్ 9, సీపీఐ, సీపీఎం, వీసీకే రెండేసి స్థానాల్లో, ఎండీఎంకే, ఐయూఎంఎల్ చెరో చోట పోటీ చేస్తున్నాయి. ఒక స్వతంత్రుడు డీఎంకే మద్దతుతో ఆ పార్టీ గుర్తుపై పోటీ చేస్తున్నారు.



అవినీతి వర్సిటీకి చాన్సలర్ మోదీ

దేశంలో అత్యంత అవినీతిమయమైన పార్టీ బీజేపీయే. అవినీతి పేరుతో యూనివర్సిటీ పెడితే దానికి మోదీయే చాన్సలర్ అవుతారు. ఆ అర్హతలన్నీ ఆయనకే ఉన్నాయి.

- చెన్నై రోడ్‌షోలో సీఎం స్టాలిన్

బీజేపీ పాగా వేసేనా?

ద్రవిడ రాజ్యంలో పాగా వేయాలని తహతహలాడుతున్న కమలనాథులకు అన్నాడీఎంకే దూరమవడంతో ఈసారి ఆదిలోనే షాక్ తగిలింది. దాంతో చిన్నాచితకా పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. 20 స్థానాల్లో పోటీ చేస్తోంది. జీకే వాసన్ నేతృత్వంలోని తమిళ మానిల కాంగ్రెస్ (ఎం)కు 3, ఎస్.రాందాస్‌కు చెందిన పట్టాలి మక్కల్ కచ్చికి 10, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)కు 2 సీట్లు కేటాయించింది. మరో 4 చోట్ల కూటమిలోని ఇతర పక్షాలు కమలం గుర్తుపై పోటీ చేయనున్నాయి. అన్నాడీఎంకే బహిష్కృత నేత పన్నీర్‌సెల్వంకు బీజేపీ మొండిచేయి చూపింది. ప్రధాని మోదీ తమిళనాట సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. అయోధ్య, డీఎంకే అవినీతి, కుటుంబ పాలనను ప్రచారాస్త్రాలుగా మలచడంతో పాటు తమిళ భాషకు పెద్దపీట వేస్తామంటూ పదేపదే ప్రకటిస్తున్నారు. దివంగత విజయకాంత్ పార్టీ డీఎండీకే (5 సీట్లు), మరో రెండు పార్టీలతో (చెరో సీటు) అన్నాడీఎంకే కలిసి పోటీ చేస్తోంది. 32 చోట్ల ఆ పార్టీ బరిలో ఉంది.

అన్నామలై... బీజేపీ తురుపుముక్క

బీజేపీకి తమిళనాట ఎట్టకేలకు కె.అన్నామలై రూపంలో ఫైర్‌బ్రాండ్ నాయకుడు దొరికారు. 2021లో 36 ఏళ్ల అతి చిన్న వయసులో పార్టీ పగ్గాలు అందుకుని శరవేగంగా కీలక నేతగా ఎదిగారు. 'సింగమ్ అన్న'గా పేరొందిన ఈ మాజీ ఐపీఎస్ మొత్తం పాదయాత్రతో క్రేజ్ సంపాదించారు. డీఎంకే అవినీతిని ఎండగట్టడంతో పాటు హిందుత్వ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. దూకుడు, వాగ్ధాటితో బీజేపీకి జోష్ తెచ్చారు. కోయంబత్తూరు నుంచి బరిలో ఉన్నారు.



రాజధానిని నాగపూర్‌కు ఎలా మారుస్తారు? అర్థంపర్థముందా? కమల్ పిచ్చాసుపత్రికి వెళ్లి చెక్ చేయించుకుంటే మంచిది. డీఎంకే ప్రాపకం, రాజ్యసభ స్థానం కోసమే ఆయన పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు


- కోయంబత్తూరు ర్యాలీలో అన్నామలై

ఐదుగురు 'సినీ' సీఎంలు

తమిళ రాజకీయాలకు, సినిమాలకు బ్రిటిష్ కాలం నుండీ విడదీయరాని బంధం! నాటి ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) నుండి తాజాగా విజయ్ దాకా వెండితెరపై ఓ వెలుగు వెలిగి రాజకీయాల్లోకి వచ్చినవారే. సినీ పరిశ్రమ నుంచి తమిళనాట ఐదుగురు ముఖ్యమంత్రులయ్యారు. ద్రవిడ సిద్ధాంతాలను సినిమాల్లో చొప్పించిన వారిలో రాష్ట్ర తొలి ద్రవిడ సీఎం సీఎన్ అన్నాదురై ముందుంటారు. ఇక కవిగా, స్క్రీన్‌ప్లే, సంభాషణ రచయితగా పేరొందిన ఎం.కరుణానిధి, అన్నాడీఎంకే వ్యవస్థాపకుడైన తమిళ సినీ దిగ్గజం ఎంజీఆర్ కూడా ముఖ్యమంత్రులయ్యారు. ఎంజీఆర్ మరణానంతరం అతి స్వల్పకాలం పాటు సీఎంగా చేసిన ఆయన భార్య జానకీ రామచంద్రన్ కూడా సినీ నటే. అనంతరం ఎంజీఆర్ వారసురాలైన స్టార్ హీరోయిన్ జయలలిత సీఎంగా చెరగని ముద్ర వేశారు. తర్వాతి తరంలో విజయకాంత్ (ఎండీఎంకే), కమల్‌హాసన్ (మక్కల్ నీది మయం) పార్టీలు పెట్టినా రాణించలేదు. కమల్ ఈసారి ఇండియా కూటమికి మద్దతు తెలిపారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ పార్టీ పెట్టినంత పని చేసి చివరికి విరమించుకున్నారు. తాజాగా సూపర్‌స్టార్ విజయ్ కూడా తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీ పెట్టారు. 2026 అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతామని ప్రకటించారు. హీరో విశాల్ కూడా పార్టీ పెడతానని ప్రకటించారు.


ఇండియా కూటమికే సర్వేల మొగ్గు

తమిళనాట ఇండియా కూటమి మళ్లీ క్లీన్ స్వీప్ చేస్తుందని ఎన్నికల సర్వేలు చెబుతున్నాయి. బీజేపీకి ఓట్ల శాతం భారీగా పెరుగుతుందని, నాలుగైదు స్థానాలూ వస్తాయని మరో సర్వే అంటోంది.



అవినీతికి మారుపేరు డీఎంకే. దానిపై తొలి కాపీరైట్ ఆ పార్టీదే. అదో ఫ్యామిలీ కంపెనీ. రాష్ట్రాన్ని లూటీ చేస్తోంది. భాష, కులం, మతం, విశ్వాసం అంటూ విద్వేష, విభజన రాజకీయాలు చేస్తోంది. కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలో డీఎంకే వంటి కుటుంబ పార్టీలు అవినీతిపరులకు కొమ్ముకాస్తున్నాయి. కచ్చతీవు దీవిని 1974లో శ్రీలంకకు ధారాదత్తం చేసింది ఈ రెండు పార్టీలే.

- వెల్లూరు సభలో ప్రధాని మోదీ



ఎన్డీఏ ఈసారి అధికారంలోకి వస్తే దేశ రాజధానిని నాగపూర్‌కు మార్చేస్తుంది. త్రివర్ణ పతాకాన్ని కూడా కాషాయ జెండాగా మార్చాలని చూస్తున్నారు. గుజరాత్ మోడల్ కంటే ద్రవిడ మోడల్ చాలా గొప్పది. మేం దాన్నే అనుసరిస్తాం.

- డీఎంకే తరఫున ప్రచారంలో కమల్ హాసన్



పోలింగ్ తేదీ: ఏప్రిల్ 19


కాంగ్రెస్ కోటకు బీటలు

తండ్రి నెహ్రూ వారసురాలిగా 1966లో ప్రధాని పీఠమెక్కిన ఇందిరాగాంధీ సరిగ్గా ఏడాది తిరిగే సరికి ప్రజాతీర్పు కోరాల్సిన పరిస్థితి! రాజకీయాల్లో ముక్కుపచ్చలారకపోయినా తొలిసారి ప్రజామోదం పొందడంలో ఆమె సక్సెసయ్యారు. కానీ సొంత పార్టీలో అసంతృప్తిని చల్లార్చలేకపోయారు. ధరల పెరుగుదల, మందగించిన వృద్ధి, ఉపాధి కల్పన వంటి సమస్యలకు తోడు పార్టీని కూడా చక్కదిద్దుకోవాల్సిన క్లిష్ట పరిస్థితి! చివరికి సొంత పార్టీయే బయటకు గెంటినా తట్టుకుని నిలవడమే గాక విపక్షాల మద్దతుతో అధికారాన్ని నిలబెట్టుకుని సంకీర్ణ శకానికి తెర తీశారు ఇందిర. ఇలా 1967-70 నాలుగో లోక్‌సభ ఎన్నో సంక్షోభాలకు సాక్షిగా నిలిచింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇందిరపై తిరుగుబాటు
పార్టీనుంచి బహిష్కరణ!

- డీఎంకే, సీపీఐ దన్నుతో నిలిచిన ప్రభుత్వం
- సంచలనాలకు వేదికైన నాలుగో లోక్‌సభ
- దేశవ్యాప్తంగా బలపడ్డ ప్రాంతీయ పార్టీలు



గతం

• కామరాజ్

ఇందిర బహిష్కరణ



1969 నవంబర్ 12వ తేదీకి చరిత్రలో ప్రత్యేకత ఉంది. అదే రోజున ప్రధాని ఇందిరను కాంగ్రెస్ నుంచి బహిష్కరించారు! పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారని, వ్యక్తి ఆరాధనకు కేంద్రంగా మారారనే ఆరోపణలపై కాంగ్రెస్‌లోని ఇందిర వ్యతిరేక వర్గమైన ×సిండికేట్‌ ఈ చర్య తీసుకుంది. హిందీయేతర నాయకులతో, ముఖ్యంగా దక్షిణాది నేతలతో కూడిన ఈ వర్గంలో కీలక నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.నిజలింగప్ప తీసుకున్న ఈ సంచలన నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. సిండికేట్ వర్గానికి కామరాజ్ నాయకత్వం వహించారు. ఈ చర్యతో కాంగ్రెస్ రెండు ముక్కలైంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని 705 మందిలో 446 మంది ఇందిర వెంట నడిచారు. ఆమె సారథ్యంలో కాంగ్రెస్ (ఆర్), సిండికేట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ (ఓ)గా పార్టీ చీలిపోయింది. లోక్‌సభలో మెజారిటీ కోల్పోయినా సీపీఎం, డీఎంకే, సీపీఐ దన్నుతో ఇందిర సర్కారు మనుగడ సాగించింది.

చివరి జమిలి ఎన్నికలు

లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలపై ఇప్పుడు దేశంలో పెద్ద చర్చే నడుస్తోంది. కానీ మనకిదేమీ కొత్త కాదు. 1967 దాకా వరుసగా నాలుగు పర్యాయాలు దేశమంతటా ఇదే విధానంలో ఎన్నికలు జరిగాయి. కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌కు దీటైన ప్రతిపక్షం లేకపోవడంతో అక్కడా, ఇక్కడా పూర్తి పదవీకాలం పాటు ఆ పార్టీ ప్రభుత్వాలే రాజ్యమేలాయి. నెహ్రూ మరణానంతరం కాంగ్రెస్ కోటకు బీటలు మొదలయ్యాయి. ఇందిర సారథ్యంలో పార్టీ అస్మదీయ, తస్మదీయ వర్గాలుగా విడిపోయింది. దాంతో 1967 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం బాగా తగ్గిపోయింది. కేవలం 283 స్థానాలకే పరిమితమైంది. ఓట్ల శాతం కూడా 44.72 నుంచి 40కి తగ్గింది. ఏకంగా ఏడుగురు కేంద్ర మంత్రులు ఓటమి పాలయ్యారు. స్వతంత్ర పార్టీ ఏకంగా 44 చోట్ల గెలిచి లోక్‌సభలో అతి పెద్ద విపక్షంగా నిలిచింది. అఖిల భారతీయ జన్ సంఘ్ కూడా ఏకంగా 21 సీట్లు అదనంగా నెగ్గి బలాన్ని 35కు పెంచుకుంది. ప్రజా సోషలిస్ట్ పార్టీ 13 సీట్లకు పరిమితమైంది. 1964లో దాన్నుంచి చీలి జార్జ్ ఫెర్నాండెజ్ నేతృత్వంలో పుట్టుకొచ్చిన సంయుక్త సోషలిస్ట్ పార్టీ 23 సీట్లు గెలిచింది. సీపీఐ ఆరు సీట్లు కోల్పోయి 23కు పరిమితమైంది. సీపీఐ నుంచి ఆవిర్భవించిన సీపీఎం 19 చోట్ల గెలిచింది.

నాలుగో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 520)

పార్టీ	సీట్లు
కాంగ్రెస్	283
స్వతంత్ర పార్టీ	44
భారతీయ జన్ సంఘ్	35
డీఎంకే	25
సంయుక్త సోషలిస్ట్ పార్టీ	23
సీపీఐ	23
సీపీఎం	19
ప్రజా సోషలిస్ట్ పార్టీ	13
ఇతరులు	20
స్వతంత్రులు	35

9 రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు

లోక్‌సభతో పాటే జరిగిన అసెంబ్లీ ఎన్నికల విషయానికొస్తే సగం రాష్ట్రాల్లోనే కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ దక్కింది. యూపీలో ఎన్నికలైన నెల రోజులకే చరణ్‌సింగ్ కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల మద్దతుతో తాను సీఎంగా కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నుంచి నేతల బహిష్కరణలు, రాజీనామాలు ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి దారితీశాయి. పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశాల్లో కాంగ్రెస్ మాజీలు వేరుకుంపటి పెట్టుకుని ఆ పార్టీని ఢీకొట్టారు. ఏకంగా 9 రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి! తమిళనాట డీఎంకే అధికారంలోకి వచ్చి ఈ ఘనత సాధించిన తొలి ప్రాంతీయ పార్టీగా నిలిచింది. మిగతా 8 రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాలు కొలువుదీరాయి.

ఎన్నెన్నో విశేషాలు...

- 1967 లోక్‌సభ ఎన్నికల్లో 61.1 శాతం ఓటింగ్ పోలైంది. మన దేశంలో అప్పటిదాకా నమోదైన గరిష్ఠ పోలింగ్ ఇదే.
- ఐదేళ్ల కాలం పూర్తి చేసుకోని తొలి లోక్‌సభ కూడా ఇదే. 1970 డిసెంబర్లో 15 నెలల ముందే రద్దయింది.
- రెండు వరుస యుద్ధాలు, రెండేళ్లు వరుసగా వానలు మొహం చాటేయడంతో పంటల దిగుబడి 20 శాతానికి పైనే తగ్గి ఆహార ధాన్యాలు అడుగంటాయి.
- దిగుమతులకు చెల్లింపుల సామర్థ్యం మరింత క్షీణించింది. ఆహారం కోసం అమెరికా రుణ సాయం తీసుకోవాల్సి వచ్చింది.
- స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా డాలర్‌తో రూపాయి విలువను ఎన్నికల ముందు 4.76 నుంచి 7.5కి తగ్గించారు.
- హరిత విప్లవం ఊపందుకోవడంతో 1971 కల్లా పంటల దిగుబడి 35 శాతం పెరిగింది.
- రాష్ట్రాల సంఖ్య 27కు పెరిగింది. దాంతో లోక్‌సభ స్థానాలు 494 నుంచి 520కి పెరిగాయి.

వివాదాలకు కేరాఫ్
ఫైర్‌బ్రాండ్ మహువా



చిన్న కుక్క పిల్ల కస్టడీకోసం మాజీ సహచరునితో కావచ్చు.. పార్లమెంటులో ఏకంగా ప్రధాని మోదీతో కావచ్చు... మహువా మొయిత్రా అంటేనే పోరాటం. తెలివైన వ్యక్తి. ఆధునికంగా, ఆకర్షణీయంగా ఉంటారు. ఎక్కడ తప్పు జరిగినా ప్రశ్నిస్తారు. పార్లమెంటులో బలమైన స్వరం. ఎంపీగా ఎన్నికైన నాటినుంచే మోదీ ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారారు. ఆ క్రమంలో ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువయ్యారు. అంతే వివాదాస్పద రీతిలో నోటుకు ప్రశ్నల కేసులో లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు కూడా.

పరిచయం

కాంగ్రెస్‌లో మొదలై...

దాదాపు 15 ఏళ్ల క్రితం 'ఆమ్ ఆద్మీ కా సిపాహీ' ప్రచారానికి నాటి కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఎంపిక చేసిన యువజన కాంగ్రెస్ నాయకురాలిగా తొలిసారిగా మీడియా దృష్టిని ఆకర్షించారు మహువా. 1974 అక్టోబర్ 12న అస్సాంలోని కచార్ జిల్లా లాబాక్‌లో జన్మించిన ఆమె అమెరికాలోని మసాచుసెట్స్‌లో మౌంట్ హోలియోక్ కాలేజీలో పై చదువులు చదివారు. అమెరికన్ మల్టీ నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జేపీ మోర్గాన్‌లో బ్యాంకర్‌గా న్యూయార్క్‌లో, లండన్‌లో పని చేశారు. 2009లో ఉద్యోగం వదిలి భారత రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తొలుత కాంగ్రెస్‌లో చేరినా 2010లో తృణమూల్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 2016 పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కరీంపూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అసెంబ్లీలో ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. 2019లో కృష్ణానగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అక్కడా అదే వాగ్ధాటి కొనసాగించారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో ప్రధాని మోదీ సంబంధం గురించి పదేపదే సభలో ప్రశ్నలు లేవనెత్తారు. ఈసారీ కృష్ణానగర్ నుంచే పోటీ చేస్తున్నారు...

'కుక్కపిల్ల కస్టడీ' తో సీటుకే ఎసరు...

పెంపుడు కుక్కపిల్ల కస్టడీ వ్యవహారం పార్లమెంటు నుంచి మొయిత్రా బహిష్కరణకు దారితీసింది. మాజీ సహచరుడు జై అనంత్ దెహద్రాయ్ నుంచి తమ పెంపుడు కుక్కపిల్ల కస్టడీ కోరుతూ కోర్టుకెక్కారు. ప్రతిగా అదానీని టార్గెట్ చేస్తూ ప్రశ్నలడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుంచి మొయిత్రా భారీగా లంచం, బహుమతులు తీసుకుంటున్నారంటూ సీబీఐకి ఫిర్యాదు చేశారు. వ్యవహారం పార్లమెంటు ఎథిక్స్ కమిటీ విచారణ దాకా వెళ్లింది. పార్లమెంట్ లాగిన్ ఐడీని ఇతరులతో పంచుకున్నందుకు ఆమెను దోషిగా తేల్చి 2023 డిసెంబర్ 8న లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు.

కొత్త రోల్ మోడల్స్ కావాలి..

ఖరీదైన బూట్లు, బ్రాండెడ్ బ్యాగులు కొనడానికి తనకు లంచాలు అవసరం లేదంటూ ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టారు మొయిత్రా. తనపై ఆరోపణలను భారత రాజకీయాల్లో ఇమిడి ఉన్న స్త్రీ ద్వేషంలో భాగంగా అభివర్ణించారు. ''నేను ప్రగతిశీల కుటుంబంనుంచి వచ్చాను. భారతీయ స్త్రీ ఇలాగే ఉండాలనే మూస పద్ధతిలో పెరగలేదు. తృణమూల్ ఓ మహిళ సారథ్యంలో ఉంది. మమత మహిళలను ప్రోత్సహిస్తారు. అందుకే ఆ పార్టీలో చేరా. పార్లమెంటులో సగం మంది మహిళా ఎంపీలు టీఎంసీ వాళ్లే. ఎందుకంటే బెంగాల్‌లో స్త్రీలను శక్తిగా భావిస్తాం. మెదడున్న, గా చదువుకున్న, ఆర్థిక అవగాహన, ఆత్మవిశ్వాసమున్న స్త్రీని సగటు భారతీయ పురుషుడు, నాయకుడు ఎదుర్కోలేడు'' అంటూ కుండబద్దలు కొడతారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళలకు సరికొత్త రోల్ మోడల్స్ అవసరమంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్